పండిలేవగలేక పడినారు కొందరు
మొదటి కన్నము లేక మూర్ఛనొంద్రి
తవుడు పిడ్కెడు బుక్కి తండ్లాడి కొందరు
నీళ్లతో ప్రాణము నిలుపుకొనిరి
కన్నపు దొంగలు కలవర పెట్టిరి
ఉన్న సంసారాలు సన్నమయ్యె
ఎడ్లుగొడ్లును బర్లు ఎనుబోతులన్నియు
మేతలేకను గూలె భూతలమున
కరవుగత్తరలచే కడుబీదజనులకు
ఉన్నకంచము ముంతలూసిపాయె
భీకరంబైనట్టి బిరుదు గల్గినవారు
భిక్ష మెత్తుకునిరి బిడియపడక

తే.గీ. ధరణిలోన జగితియాల పురమునందు
వాంఛతో జెప్పె పద్యంబు వైశ్యుడిట్లు
రచన కవనంబు జైశెట్టి రాజయాఖ్యు
సిద్ధ సద్భక్త చరణాబ్జ సేవకుండు

సీ॥మా॥ నరులు హేవాళంబినామ వత్సరమున
తగని కష్టములకు తడబడ్డైరి
కరువుచే కొందరు కడుపెండి సగమైరి
మారి దగిలి కొంత మరణమైరి
గొడ్లుజచ్చుట కొంత గోలుకోకుండిరి
అప్పు బుట్టక కొందరదిలినారు
మానంబు ప్రాణంబు మరి దక్కకుంటైరి
పిరికితో కొందరు బీరిపొయిరి
కరుణించి జైశెట్టి కవి రాజయాఖ్యుని
మరియు రక్షించుమా మదనవైరి

తే.గీ. దండి కఠినంబు దినమిది ధరణియందు
సర్వకాలంబు రక్షించు సాక్షిరూప ।
పుడమిలోపల జగ్యాల పురనివాస ।
ప్రజల శ్రమలన్ని దప్పించు పార్వతీశ ।



## మూసీవరదలు - మహబూబ్‌పాషా సహాయక చర్యలు (క్రీ.శ. 1908)

మూసీనది వరదలు క్రీ.శ. 1908 సెప్టెంబర్ 28 మంగళవారము రోజున హైదరాబాద్ నగరములో బీభత్సము సృష్టించి అపార జన ధననష్టము కలిగించాయి. 20వేల ఇండ్లు కొట్టుకొని పోయాయి. వేలమంది ప్రాణములు గోల్పోయారు. నదికి ఇరువైపుల ఒడ్డులందు కూలిన ఇండ్లు తప్ప ఏమి మిగల్లేదు. అన్ని చోటులందు మనుష్యుల జంతువుల మృతదేహములు పడిఉన్నాయి. అనేక వేలమంది నిరాశ్రయులైనారు. ఒకే రోజున 17 అంగుళముల వర్షము కురిసింది. అఫ్జల్‌గంజ్ బాజార్లన్నియు పదకొండు అడుగుల ఎత్తు వరకు నీటితో నిండినాయి. ఇండ్లన్నియు నీటితో మునిగిపోయాయి. వరద బాధితులకు ఉచిత భోజన సౌకర్యమును కలిపించుటకై పది కేంద్రము లేర్పాటు చేయబడ్డాయి. నవాబు మహబూబ్‌పాషా మరియు అతని ప్రధానమంత్రి మహారాజాసర్‌కిషన్ ప్రసాద్ స్వయముగా వరద తాకిడి ప్రాంతములందు పర్యటించి సత్వర సహాయకచర్యలు తీసుకొన్నారు. వరద బాధితులకు శిబిరము లేర్పరచుటకై నవాబు తన రాజభవన ద్వారములను తెరపించాడు. 40 వేల మంది నిరాశ్రయులకు రోజు మూడు పూటల భోజనము చాలా రోజుల మట్టుకు ఉచితముగా పెట్టించాడు. మూసీనదిని ముచుకుందనది యని గూడా వ్యవహరించేవారు. జగిత్యాల ఆదికవి జైశెట్టి రాజయ్య "ముచికుందనది ప్రళయ తాండవము" అను శీర్షికన రచించిన అనేక గేయములలోని కొన్నింటిని పాఠకుల ముందుంచడమైనది. ఈ వరదలు క్రీ.శ. 1908 (1317 Fasli) సెప్టెంబర్‌లో సంభవించెననియు, ఏడవనిజాంను బాబూ సాహెబు, హుజూరు అను పదములతో సంబోధించుచు అతడు వరదబాధితులను నిరాశ్రయులను తన కన్న బిడ్డలవలె ఆదుకొనెనని సమకాలీన కవి జైశెట్టి రాజయ్య (1842–1921) తన గేయములలో పేర్కొన్నాడు[181].



మూసీనది వరదలు

## ముచికుందనది ప్రళయతాండవం (క్రీ.శ. 1908-ఫస్లీ 1317)

ముచికుందనది వచ్చెనయ్యయ్యో
పట్నమును ముంచి చెడగొట్టెనయ్యయ్యో
ముచుకుందనది వచ్చె మునిగె పట్నము సగము
నశియించిజనులంత నదిలోగొట్టుక పోయిరి ||ముచి||

కొందరికి మహిలాయీ తారీఖూ
ఇట్లు చందు బాబీస్మీ అబానూ
పొందు పదమున్నూట పదిఏడో ఫస్లీలో
హిందూలు ముసల్మాండ్లందరూ జూడంగ ||ముచి||

కీలకనామ సంవత్సరం
జనులకీడొంద జేసెరా మచ్చరం
శూలించి ఆశ్వీజ శుద్ధ తృతీయయందు
వలపోత చంద్రూని వారంబునాడిట్లు ||ముచి||

సకలంబు బాజార్లు మునిగెరా
చూస్తే ఒక బాజారని ఎంచరాదురా
ఇక బేగంబజార్లో ఇండ్లు మిద్దెలు గూలె
ఆకుబర్జ బజార్లో సకలంబిండ్లు గూలె ||ముచి||

మహరాజు గంజంత మునిగెరా
ఇంక మహబూబు గంజంత మునిగెరా
ఇరవూగ సగమంత ఇసమియ్యాబాజారు
అరదూగ పూరాగా అప్జల్‌గంజ్ మునిగె ||ముచి||

ములుకపేటయు సగము మునిగెరా
మునిగె మ్యాకాల మండి బాజారురా
దూలిపేటయుసగము దూరితంబు మునిగెరా
జలము మెండైనంక జనులాతోటెమౌరా ||ముచి||

పరగ్రామముల నుంచి కోరిరా
ఎన్నోపనులుండి వచ్చిన వారురా
మరి ఆరోజున కొందరు మరణంబు జెందిరి
నరహరి కృప దప్పినరులిట్లు మృతులైరి ||ముచి||



వనములెక్కన చెట్లు విరిగెరా
లెక్క వ్రాసిన దస్త్రాలు మునిగెరా
మునిగి చచ్చిన జనులు ఎనుభై తొంభైవేలు
అనరాదు వినరాదు అగణితంబందాజా ||ముచి||

కనబడ్డా పీనుగులా జూచిరీ
అడవికట్టె మండెల రీతి మోసిరీ
దినమూలు మూన్నాల్లు దినమూలు మొయ్యంగ
పీనుగులు ఏడు వేలెనుభై మూడెదొరికె ||ముచి||

భగవత్ తంత్రంబిట్లు జేసెరా
జనుల పాపంబు భరియించలేదురా
నగరంబు మునిగే పోయి నరులంత జచ్చుటకూ
తగరాని ఫికరొంది తండ్లాడె హుజూరు ||ముచి||

రాజాధి మహెబూబు రాజురా
మనల రక్షించె ధైర్యంబు రాజురా
యజమాని మనరాజు ఎంతో ధర్మాత్ముడై
సుజనూడై పాలించి ప్రజలాకన్నము బెట్టె ||ముచి||

పరమాత్మునికి వచ్చె కోపంబూ
ధూర్తునరులు జేసుట లావే పాపంబూ
సరుదారుబాబు సాహెబొక్కని పుణ్యం
మరి మంచిదయ యుండి మానవుల రక్షించె ||ముచి||

ధరణిశ్రీ జగిత్యాల వైశ్యుడూ
బుద్ధి పరమాసద్భక్తి విచారుడూ
కరుణించి జైశెట్టి కవితారాజాఖ్యుండు
నిరతంబు ఆర్యులా శరణాగతుడై యుండె ||ముచి||

ఇట్లు మూసీనది వరదల సమయంలో ఆఅవ నిజాం ప్రభువు మీర్ మహబూబ్ అలీఖాన్ నిరాశ్రయులైన వరద బాధితులను కన్నబిడ్డల వలె ఆదుకొనినాడని జైశెట్టి రాజయ్య గేయములు తెలియజేస్తున్నాయి.

క్రీ.శ. 1911 ఆగస్టు 29న పగలు గం. 2-30 ని.లకు ఆకస్మికముగా వచ్చిన పక్షవాత రోగముతో ఆఅవ నిజాం మీర్ మహబూబ్‌అలీఖాన్ ప్రభువు కన్నుమూశాడు. అతని

రాజ్యప్రజలందరు శోకసముద్రమున మునిగిపోయిరి. అతని భౌతికకాయము మక్కా మసీదులో తండ్రి ప్రక్కనే సమాధి చేయబడింది.



సంస్థానాధీశులతో మహబూబ్‌అలీఖాన్ నవాబు

## మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఆసఫ్‌జా VII (క్రీ.శ. 1911–1948)

ఆరవ నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ మరణించగానే అతని కుమారుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ క్రీ.శ. 1911 ఆగస్టు 29న ఏడవ నిజాంగా ప్రకటింపబడినాడు. అతని పట్టాభిషేకము లాడ్ బజారు సమీపమున గల చౌమహల్లా రాజభవనములో క్రీ.శ. 1911 సెప్టెంబర్ 12న మహావైభవముగా జరిగింది. ఆ సందర్భములో ఏడవ నిజాం తన హైదరాబాద్ రాజ్యమును ప్రపంచములోని అధునాతన రాజ్యములవలె అభివృద్ధి పరచగలనని ప్రకటించాడు. తండ్రి కాలము నుండి ప్రధానమంత్రిగా నున్న మహారాజా సర్ కిషన్ ప్రసాద్ క్రీ.శ. 1912లో తన పదవికి రాజీనామా చేయగానే యూసుఫ్ అలీఖాన్ సాలార్ జంగ్ **III** ప్రధానమంత్రిగా నియమింపబడినాడు. అతడు గూడా క్రీ.శ. 1914లో రాజీనామ చేసి నాలుగు దశాబ్దములు ప్రపంచములోని విలువైన, అందమైన, అద్భుతమైన వస్తువుల సేకరణలో కాలము గడిపి ప్రపంచ విఖ్యాతమైన సాలార్‌జంగ్ మ్యూజియంను తన నివాస గృహమగు దివాన్ దేవుడీలో ఏర్పాటుచేశాడు. అతడు బ్రహ్మచారిగానే జీవితము గడిపి తన 60వ ఏట 1949లో చనిపోయాడు. అతని పేరట వెలసిన సాలార్‌జంగ్ మ్యూజియం నూతనముగా నిర్మించిన ప్రస్తుత భవనములోనికి 1968లో మార్చబడింది.



మూడవ సాలార్‌జంగ్ 1914లో రాజీనామా చేసిన తరువాత ఏడవ నిజాం పరిపాలనా బాధ్యతను తానే స్వీకరించాడు. మొదటి ప్రపంచ యుద్ధ (1914–1918) సమయంలో ఆంగ్లేయులకు సైనిక, ఆర్థిక, వస్తురూపేణ సహాయమందించాడు. 1918లో యుద్ధము ముగియగానే ఐదవ జార్జి చక్రవర్తి ఘనత వహించిన (His Highness) ఏడవ నిజాంకు మహాఘనత వహించిన (His Exalted Highness) బిరుదమును మరియు బ్రిటిష్ ప్రభుత్వ విశ్వాసపాత్రుడైన సహాయకుడు (Faithful Ally of the British Government) అను బిరుదును ప్రకటించి సత్కరించాడు.



మీర్ ఉస్మాన్ అలీఖాన్ నవాబు

ఏడవ నిజాం కాలములోనే హైదరాబాద్ రాజ్యము సర్వతోముఖాభివృద్ధి సాధించింది. దానికి ఆనాటి ఆర్థిక సుస్థిరత (Financial Stability) యే కారణము. రాజ్యము ఆర్థికంగా సుభిక్షముగా ఉండింది. ప్రపంచములోని అతి ధనవంతులలో నిజాం ఒకడుగా పరిగణింపబడ్డాడు. బహుశః మూడవస్థానములో ఉండేవాడు. అయినప్పటికిని అతడు అతి నిరాడంబరుడు. దంబములకు దర్పములకు అతీతుడు. అతి సాధారణ జీవితము గడిపాడు. 1919లో సర్‌అలీ

ఇమాం, అతని తరువాత మహారాజా కిషన్‌ప్రసాద్ 1925 నుండి 1937 వరకు ప్రధానులుగా ఉన్నారు. కిషన్ ప్రసాద్ దయార్ద్ర హృదయుడు మరియు దానశీలి. అతడు పర్యటనకై హైదరాబాద్ పట్టణ వీధులలోకి వెళ్ళినప్పుడు ఆ చేత ఈ చేత అనకుండా రెండు చేతుల వెండి, రాగి నాణెములు పేద ప్రజానీకానికై వెదజల్లెడి వాడని ప్రతీతి. సర్ అక్బర్ హైదరి, నవాబు ఛతారి, సర్‌మిర్జాఇస్మాయిల్, మెహదియార్‌జంగ్, లాయఖ్ అలీలు వరుసగా ప్రధానులైనారు.

## ప్రజోపయోగ సంస్కరణలు


ఏడవ నిజాం కాలములో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టబడినాయి. 1914లో పురావస్తుశాఖ (Archaeological Department) ఏర్పాటు చేయబడింది. 1919లో నూతన రాజ్యాంగమును ప్రవేశపెట్టి ఒక కార్యనిర్వాహక మండలి (Executive Council) ఏర్పరచటమైంది. 1922లో న్యాయశాఖను ఇతర శాఖల నుండి వేరుచేశాడు. 1923లో ఆసఫ్‌జాహీ వంశస్థాపన జరిగి 200 సంవత్సరములు పూర్తి అయిన సందర్భములో రాజ్యమంతట ద్విశతాబ్ది ఉత్సవములను ఘనముగా జరిపించాడు. 1927లో ఉస్మానియా మెడికల్ కళాశాల, 1929లో ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభించాడు. 1930లో రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాల (State Archaeological Museum) స్థాపించబడింది. 1932లో విమాన సర్వీసుల బోర్డ్ (An Aviation Board) స్థాపించబడింది. 1935లో విమానాశ్రయమేర్పడగా కరాచీ నుండి మద్రాసుకు పోవు విమానము హైదరాబాద్‌లో ఆగుటకు వీలుకలిగింది.

1933లో రెసిడెన్సీ (Residency) ని ఆంగ్లేయులు తిరిగి నిజాం ప్రభుత్వానికి అప్పగించారు. అప్పటి నుండి రెసిడెన్సీబజార్ పేరు సుల్తాన్ బజార్‌గా మారింది. 1935లో హైదరాబాద్ నందు ఆకాశవాణి కేంద్రము (Boardcasting Station) ఏర్పడింది. 1936 అక్టోబర్ 24న బ్రిటిష్‌వారు బెరార్‌పై నిజాం సార్వభౌమాధికారమును ఒప్పుకొని, అదనంగా వచ్చిన రెవెన్యూను అతనికిచ్చుటకై నొక ఒడంబడిక చేసికొన్నారు. ఏడవ నిజాం కుమారుడు ఆజంజా బహాదూర్ బెరార్ రాకుమారునిగా (Prince of Berar) బిరుదు పొందాడు. 1936నకు బదులు 1937లో నిజాం తన పరిపాలన రజతోత్సవములను (Silver Jubilee Celebrations) రాజ్యమంతటా జరిపించాడు. ఆ సందర్భములోనే జ్ఞాపక చిహ్నములుగా అనేక చోట్ల కమాన్లను (gateways) నిర్మించారు. ఇట్టి కమాన్‌లు కరీంనగర్, పెద్దపెల్లి, జగిత్యాలలో కూడా 1937లో నిజాం గౌరవార్థము నిర్మింపబడినాయి. కాని జగిత్యాలలోని కమాన్ కూలిపోయి అదృశ్యమైంది. రజతోత్సవముల సందర్భములో చల్‌గల్ (చలిగంటి) రాజా జువ్వాడి ధర్మజలపతిరావు జగిత్యాల నడిబొడ్డున అందమైన, అద్భుతమైన జగిత్యాల టవర్ (Tower) నిర్మించాడు.

రెండవ ప్రపంచ యుద్ధ (1939–1945) కాలంలో బ్రిటిష్ వారికి ఏడవనిజాం 25 మిలియన్ పౌండ్ల ద్రవ్యమునిచ్చి సహాయపడ్డాడు. విద్యుచ్ఛక్తి శాఖ, రోడ్లు, రైల్వే, విమాన సర్వీసుల



శాఖలు అభివృద్ధి చెందాయి. అతి సామాన్యమైన జీవితము గడుపుట వలన ఏడవ నిజాంను పిసినారి అని భావించేవారు. 1939లో చలికాలము ఒక రోజున నిజాం ప్రభువు తన ఉద్యోగికి 25 రూపాయలిచ్చి బజారులో ఒక బ్లాంకెట్ (Blanket) కొనుటకై పంపాడు. అతడు అంగడిలో తిరిగి నవాబు వద్దకు వచ్చి 35 రూపాయలు లేనిదే బ్లాంకెట్ దొరకదని తెలిపాడు. 10 రూపాయలు ఎక్కువ ఖర్చు చేయుటకు ఇష్టపడక ఉన్నటువంటి పాత బ్లాంకెట్ తోనే సరిపెట్టుకుందునని సమాధానమిచ్చాడు. ఇది అతని నిరాడంబరతకు తార్కాణం. అదే సంవత్సరము బికనేర్ మహారాజు అభ్యర్థన మేరకు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయమునకై సహాయమునర్థించగా ఒక లక్ష రూపాయల విరాళము పంపాడు. ఇది అతని ఉదారతకు, విశాల హృదయమునకు తార్కాణము. అలాగే అలీఘర్ ముస్లిం యునివర్సిటీ, శాంతినికేతన్ యునివర్సిటీ, అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయము మున్నగు సంస్థలకు విరివిగా విరాళము లిచ్చుట అతని లౌకిక దృక్పథము (Secular Outlook) నకు నిదర్శనములు.




హైకోర్టు భవనము

## ప్రజోపయోగ కట్టడములు

ఏడవ నిజాం క్రీ.శ. 1919 ఆగస్టు 7న ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. తదనంతరము అడికిమెట్ట (Adikimet) వద్ద 1400 ఎకరముల స్థలము సేకరించాడు. 1934లో ఉస్మానియా విశ్వవిద్యాలయ నిర్మాణమారంభమయింది. వేల మంది కార్మికులు నియోగింపబడిరి. 36 లక్షల వ్యయముతో దీని నిర్మాణము పూర్తికాగానే 1939లో నిజాం ప్రభువు తన హస్తములతో దీని ప్రారంభోత్సవము జరిపాడు. భారతదేశములోని విశ్వవిద్యాలయములన్నింటిలో ఇది ఒక

అందమైన, అద్భుతమైన కట్టడము. దీనికి అనుబంధంగా ప్రస్తుతము 167 కళాశాలలున్నాయి. (Affliated Colleges) ఈ విశ్వవిద్యాలయ విద్యార్థుల సంఖ్య ఒక లక్షకు మించి ఉంది. మూసీనది ఒడ్డున ఉన్నత న్యాయస్థాన భవనము (High Court Building) యొక్క నిర్మాణము 1915లో ఆరంభమైంది. 1920 ఎప్రిల్ 20న నిజాంప్రభువు తానే ఈ భవనమును ప్రారంభించాడు. మూసీనది వరదలు ఆరికట్టుటకై మోక్షగుండం విశ్వేశ్వరయ్య సలహాపై 1914లో గండిపేట చెఱువు (Osman Sagar) మరియు హిమాయత్‌సాగర్‌ల నిర్మాణము ప్రారంభమైంది. 1920లో ఉస్మాన్‌సాగర్ 54 లక్షల వ్యయముతో, 1927లో హిమాయత్‌సాగర్ 92 లక్షల వ్యయముతో పూర్తైనాయి. 1933లో ఢిల్లీలో అందమైన హైదరాబాద్ హౌజ్ (Hyderabad House) నిర్మించబడింది. అదే సంవత్సరము బ్రిటిషు వారి కేంద్ర రాజధాని పాతఢిల్లీ నుండి కొత్త ఢిల్లీకి మార్చబడింది. అందమైన గ్రానైట్‌తో మోజంజాహీ మార్కెట్ 1935లో నిర్మింపబడింది. 1936లో మూసీనది ఒడ్డున స్టేట్ సెంట్రల్ లైబ్రరీ (State Central Library Building) భవనము, 1937లో జుబిలీహాల్ నిర్మింపబడినాయి. ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, యునాని దవాఖానా, పబ్లిక్‌గార్డెన్‌లోని రాష్ట్ర పురావస్తు మ్యూజియం, హెల్త్ మ్యూజియం, బాల్‌భవన్ మున్నగు భవనములన్నియు ఏడవ నిజాం కాలములోనే నిర్మించబడినవి. ప్రభువు పారిశ్రామికాభివృద్ధికై పాటుబడ్డాడు. సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్‌మిల్, బోధన్‌లో నిజాం సుగర్ ఫ్యాక్టరీ, వరంగల్‌లో ఆజంజాహి బట్టల మిల్లు మున్నగునవి స్థాపించబడినాయి.



ఉస్మానియా విశ్వవిద్యాలయము

## రజాకార్ ఉద్యమము

1927లో హైదరాబాద్ నందు "ఇత్తెహాద్-ఉల్-ముసల్మాన్" సంస్థ నవాబు సదర్ యార్‌జంగ్ అధ్యక్షులుగా స్థాపించబడింది. ఇది ఒక దశాబ్దము నామమాత్రంగా పనిచేసింది. 1939లో నవాబు బహాదూర్‌యార్‌జంగ్ అధ్యక్షులు కావడంతో ఈ సంస్థ బలపడింది. 1940 నుండే ఈ సంస్థ హైదరాబాద్ రాజ్య కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తూ వచ్చింది. 1940లోనే ఈ సంస్థ



కొందరు వాలంటీర్లను సమకూర్చుకుంది. వీరినే రజాకార్‌లని అంటారు. 30 మంది రజాకార్లకు 'సలార్' అనే పేరున దళనాయకుడుంటాడు. రజాకార్లు ఖాకీ యునిఫారం, నల్లటోపి ధరిస్తారు. వారికి సైనిక శిక్షణ ఇచ్చారు. కత్తి, బాకు వారి ఆయుధాలు. 1940 అక్టోబర్ నెలలో రజాకార్ వ్యవస్థను బహదూర్ అలీజంగ్ ఆవిష్కరించాడు.

## కాశింరజ్వీ

1946లో కాశింరజ్వీ రజాకార్ల సంస్థకు అధ్యక్షుడైనాడు. ఆయన అధ్వర్యంలో రజాకార్లు ఒక సైనికశక్తిగా రూపొందారు. 1947 జులై నెలలో వారికి తుపాకులిచ్చారు. వారు వీధులలో కవాతులు జరిపి ప్రజలను భయ భ్రాంతులను చేసేవారు. రజాకార్ల సంఖ్య 50వేలకు పెరిగింది. అనతికాలములోనే ఐదు లక్షల మంది రజాకారులను తయారుచేయగలనని రజ్వీ ప్రకటించినాడు. ప్రజలకు రజాకార్లు ఎవరో, నిజాం పోలీసులెవరో తెలియని స్థితి ఏర్పడింది. రజాకార్లు పెద్ద ఎత్తున దౌర్జన్యకాండలు ప్రారంభించారు. శాంతి భద్రతలు కరవైనాయి. భీతావహవాతావరణము ఏర్పడింది. ప్రజలకు ఎటువంటి రక్షణలేదు. దోపిడీలు, హత్యలు, మానభంగాలు నిత్యకృత్యాలైనాయి. రజాకార్లు నిజాం అధికారమునే ఎదురించే స్థితికి వచ్చినారు. ప్రజల నుండి ధనము వసూలు చేసినారు. ప్రజా జీవితం దుర్భరమైంది. రజాకార్లు పగటిపూట, కమ్యూనిస్టులు రాత్రి పూట గ్రామాలపై దాడులు చేసేవారు. నిజాం ప్రభుత్వానికి రజాకార్లు, కమ్యూనిస్టుల ఉద్యమం పెద్ద సవాళ్లుగా పరిణమించాయి.

## యథాతథస్థితి ఒప్పందము 1947 (Stand still Agreement)

భారతదేశము ఆంగ్లేయుల పాలన నుండి 1947 ఆగస్టు 15న విముక్తి నొంది స్వతంత్రదేశంగా అవతరించింది. కాని పాకిస్థాన్ ఇండియా నుండి విడిపోయింది. ఏడవనిజాం తన రాజ్యమును అటు పాకిస్థాన్‌లో గాని ఇటు ఇండియన్ యూనియన్‌లో గాని విలీనము చేయకుండా స్వతంత్రంగా పాలించుటకు నిర్ణయించుకున్నాడు. అతడు 1947 నవంబర్‌లో ఇండియన్ యూనియన్‌తో యథాతథస్థితి ఒప్పందం కుదుర్చుకున్నాడు. దానిననుసరించి హైద్రాబాద్ రాజ్య రక్షణ, విదేశీ వ్యవహారములు భారత యూనియన్ ప్రభుత్వానికి సంక్రమించినాయి. కాని నిజాం ఈ ఒడంబడికను ఉల్లంఘించి పాకిస్థాన్ నుండి ఆయుధములు దిగుమతి చేసికొనుటకు ప్రయత్నించాడు.

రజాకార్ల ఉద్యమము నానా బీభత్సం సృష్టించింది. ఇట్టి పరిస్థితులలో భారత ప్రభుత్వము కె.యం. మున్షీని హైదరాబాద్‌లో తన ప్రతినిధిగా నియమించింది. స్వామి రామానందతీర్థ నిజాం రాజ్యము ఇండియన్ యూనియన్‌లో కలవటానికి ప్రజాభిప్రాయ సేకరణ జరుగవలెనని కోరాడు. కె.యం. మున్షీ రజాకార్ల ఉదమ్యాన్ని నిషేధించవలెనని భారత ప్రభుత్వానికి ఒక నివేదిక పంపినాడు. హైదరాబాద్ రాజ్యము పెద్ద ఎత్తున ఆయుధాలు సమీకరించుకోవడం

తగదని భారత ప్రభుత్వము హెచ్చరించింది. రజాకార్లు రైళ్ళపై దాడులు జరిపారు. బీబీనగర్ స్టేషన్ ధ్వంసం చేసినారు. నల్గొండ, ఖమ్మం జిల్లాలో వారి అత్యాచారాలు మితిమీరినాయి. ప్రజలు రజాకార్లను ఎదురించడానికి దళాలుగా ఏర్పడినారు. కరీంనగరములోని మందపురం కొండల వద్ద, ఖమ్మంలోని మీనబోలువద్ద, నల్గొండలోని రేనికుంటవద్ద, సూర్యాపేట సమీపపు పాతర్ల పహాడ్ వద్ద రజాకార్లకు ప్రజలకు మధ్య సాయుధ సంఘర్షణలు జరిగినాయి. రజాకార్లు వరంగల్‌లోని కూటిగల్‌లో 23 మందిని కాల్చి చంపినారు. బెహ్రంపెల్లి (బైరాన్‌పల్లి) గ్రామములో 76 మందిని చంపినారు.

## పోలీసుచర్య 1948

ఇత్తెహాదుల్ ముసల్మాన్ 1948 మార్చి 31న నిర్వహించిన కార్యక్రమములో కాశింరజ్వీ ఉపన్యసించుచు ఎర్రకోటపై తమ జండాను ఎగురవేయుదమని ప్రగల్భాలు పలికాడు. రజాకార్లు "చలోఢిల్లీ" నినాదము చేశారు. నిజాం ప్రభువు తాను స్వతంత్ర అధిపతినని భారత ప్రభుత్వము తనపై దురాక్రమణకు దిగుతున్నదని ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు పంపాడు. కాశింరజ్వీ భారతప్రభుత్వము పై జిహద్ (పవిత్రయుద్ధం) జరిపే సమయమాసన్నమైనదని ప్రకటించాడు. నిజాం రజాకార్ల ఉద్యమాన్ని నిషేధించడానికి అంగీకరించలేదు. వర్తకులు, న్యాయవాదులు, మేధావులందరు తమకు భద్రతలేదని భారత ప్రభుత్వముతో మొరపెట్టుకొన్నారు.

సర్దార్‌పటేల్ దేశవ్యవహారాల మంత్రి (Home Minister) ఆదేశానుసారము ఇండియన్ యూనియన్ సైన్యములు 1948 సెప్టెంబర్ 13న హైదరాబాద్ రాజ్యమును అన్ని వైపులనుండి ముట్టడించినాయి. పెద్దగా రజాకార్ల ప్రతిఘటన జరుగలేదు. మూడురోజుల ముట్టడిలో రజాకార్లు భీతిల్లారు. సెప్టెంబర్ 17న నిజాం లొంగిపోయినాడు. ప్రధానమంత్రి లాయక్ అలీ పాకిస్థాన్‌కు పారిపోయినాడు. కాశిం రజ్వీపట్టుబడగా పది సంవత్సరముల జైలు శిక్ష విధించారు. సెప్టెంబర్ 17న మధ్యాహ్నము ఒంటిగంటకు నిజాం యుద్ధవిరమణను ప్రకటించి రజాకార్లను నిషేధించాడు. ఐక్యరాజ్యసమితి నుండి తన ఫిర్యాదును ఉపసంహరించుకొన్నాడు. మేజర్ జనరల్ జె.యన్.చౌదరి హైదరాబాదు ప్రవేశించి సెప్టెంబర్ 18న హైదరాబాద్ సంస్థానపు మిలిటరీ గవర్నర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించాడు. అతడు 1949 డిసెంబర్ వరకు ఆ పదవిలో కొనసాగాడు. 1950 జనవరిలో పౌరసివిల్ పరిపాలనా శాఖకు చెందిన యం.కె. వెల్లోడి I.C.S. ముఖ్యమంత్రిగా నియమింపబడినాడు. నిజాం రాజ్యములో మొదటిసారిగా పౌర ప్రభుత్వమేర్పడింది. ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ రాజప్రముఖ్ (Governor)గా నియమింపబడ్డాడు. 1952లో ప్రథమసార్వత్రిక ఎన్నికలు జరిగాయి. బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ప్రజలకు బాధ్యతాయుతమైన మొదటి మంత్రి వర్గమేర్పడింది.

మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1950 జనవరి 26 నుండి 1956 అక్టోబర్ 31 వరకు



రాజప్రముఖ్‌గా పనిచేశాడు. 1956లో భాషారాష్ట్రము లేర్పడినవి. 1956 నవంబర్ ఒకటవ తేదిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము అవతరించింది. పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ ఏడవ నిజాంను గవర్నర్‌గా నుండుటకై కోరినాడు. కాని ఏడవ నిజాం వినమ్రంగా దానిని తిరస్కరించి ప్రజాపాలనా జీవితమునకు స్వస్తి చెప్పి విశ్రాంత జీవితము గడుపుటకు నిర్ణయించుకొన్నాడు.

మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1967 ఫిబ్రవరి 24 శుక్రవారం రోజున పగలు గం. 1-22ని.లకు తుదిశ్వాస విడిచాడు. రాజు అభిమానులు పదిలక్షల మంది శ్రద్ధాపూర్వక నివాళులర్పించారు. రాజలాంఛనాలతో సైనిక వందనములతో అతని భౌతికకాయము అతని తల్లి ప్రక్కనె జుడీ మసీదులో సమాధి చేయబడింది. ఏడవ నిజాంను తప్పుత్రోవ పట్టించిన రజాకార్లనాయకుడు కాశింరజ్వీ పది సంవత్సరములు జైలు శిక్షననుభవించి 1957 సెప్టెంబర్ 10న విడుదలై తన శేషజీవితమును గడుపుటకై పాకిస్థాన్ వెళ్ళి అక్కడే చనిపోయాడు.

## కరవుకాటకాలు క్రీ.శ. 1921 (1331 ఫస్లీ ఆజూరుదూస్రీ)

ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాలములో ఆర్థిక సుస్థిరత ఉన్నప్పటికిని సామాన్య ప్రజలు మాత్రము నాలుగు సంవత్సరములు వరుసగా వర్షములు లేక కరవుకాటకములతో, అధికధరలతో నానా ఇబ్బందుల పాలైనారు. జగిత్యాల ఆదికవి జైశెట్టి రాజయ్య (1842-1921) తన అవసానదశలో తాను మరణించడానికి కొన్ని రోజుల ముందే క్రీ.శ. 1921 (1331 ఫస్లీ ఆజూరు దూస్రీ రోజున)లో ప్రజలు అనుభవించిన కరవు గత్తర, జ్వరాలు అధిక ధరలను గూర్చి అల్లిన గేయములలో కొన్ని ఈ క్రింద నుదహరించబడినవి. ఒక్క రూపాయికి వడ్లు 5 సేర్లు, మక్కలు, జొన్నలు 3 సేర్లు, గిర్నిబియ్యం 2 సేర్లు, అనుములు, మినుములు, శనిగలు, గోధుమలు 2.5 సేర్లు లభించేవని వారి పద్యములలో తెలిపినారు. ఒక్క రూపాయికి చింతపండు 2.5 తక్కళ్లు, పసుపు కొమ్ములు 2 తక్కళ్లు అమ్మబడేవి. ఒక్కొక్క మడుముకు (11.250 K.G.) బెల్లం మరియు అల్లం రూ.8, ఉల్లిగడ్డలు, ఎల్లిగడ్డలు రూ.11, నూనె మరియు ఆముదం రూ.12, మిరుపకాయలు రూ.10, చెక్కెర రూ.16, కొబ్బరి రూ.10, నెయ్యి రూ.32 మడుము ఒక్కంటికి ధరలుండెనని, అవి ఆనాటి ప్రజలకు భారంగా ఉండెనని రాజయ్య తన పద్యములలో తెలిపినాడు. ఏడవనిజాం ప్రభువును కవి తన రచనలలో బాబూసాహెబు, మహారాజు, సర్కారు, హుజూరు అని సంబోధించినాడు.[182]

### కరవుపై కవనము (1921)

స్వామి నీ మహిమ దెలియదురా
కరువు భూమంతటను జేసితివిరా
స్వామి గరీబులకు సకల కష్టములయ్యె
భూమిలో కొందరికి శ్రీమంతమిచ్చితివి ॥స్వామి॥

మోతాజు కాన మొకరారు
చేసి బ్రతికించి సాదె సర్కారూ
బ్రతికించె నబాబు సాహేబు మహరాజు
సతతంబు అంతటికి సర్కారు తలిదండ్రి ॥స్వామి॥

కరువు లోపల గత్తరయ్యే
ఇట్లు నరులు కొందరు మరణమయ్యే
కరువుగత్తర రెండు దొరలకైనదప్పవు
పురజనుల ముంచుటకు దొరలు గుర్తెరుగరు ॥స్వామి॥

ఈ కటువుదండి పెద్దదిరా
ఇంక ఇదిగాకలోకమంతటరా
సకల జనులందరికి సలి జ్వరంబులు వచ్చి
మకరి పట్టె జ్వరము మానవుల పీడించె ॥స్వామి॥

కాలమెత్తర తత్తరాయె
వానకాలమెత్తర తత్తరాయె
నాలుగైదేండ్లిట్లు భూలోకమంతట
కాలంబునదువక కరువాయె ॥స్వామి॥

మక్కపెరండ్లన్ని ఎండె
మఘల ఒక్క చినుకైన బడకుండె
మొక్కలంబుగ మక్క బీజాలు గడ్డలు
ఒక్క పావుల బండె తక్కినవి మరి ఎండె ॥స్వామి॥

మెండైన దండి కరువాయె
పంటబండకను చేండ్లెండిపాయె
దండి నూతులు చెరువు లెండి పోయికొన్నాండ్లు
పండేటి తోటల్ల దినుసుబండకపాయె ॥స్వామి॥

నమ్మించి కార్డు లెగబెట్టె
నరుల పాతగింజలు అమ్మబట్టె
అమ్ముదురు రూపాయికైదు శేర్లును వడ్లు
పొమ్మనక కొలిచిసై పొల్లు వడ్లేగతియు ॥స్వామి॥



కొన్ని కొన్ని దినుసులన్నా
నిత్యము కొని కొని మిడికిరన్నా
జొన్నలు మక్కలు ఉన్న వారిండ్లల్లో
అన్ని దిక్కుల మూడుశేర్లు అమ్మిరాఖరుకు ॥స్వామి॥

ఘనమైనదినుసు కొనబడితె
లావు అనుమాన పడికొందరయితె
అనుములు, మినుములు, శెనిగలు, గోధుమలు
ధనికులమ్మితె కొనిరి ధర రెండు శేర్లనర ॥స్వామి॥

ధరలు దినమొక్క తీరైతె
దొరల వద్దకు ఫిర్యాదు పోయితె
గిర్ని బియ్యము కరువుకున్న దిక్కుల యందూ
అరుదుగా మూడు శేర్లమ్ముమని దొరలాజ్ఞ ॥స్వామి॥

తప్ప మిరియపు కాయలైనా
దొరలు జెప్పినట్లుగ అమ్మిరైనా
ఉప్పుతో తొమ్మిది పప్పుతో పదితీర్లు
తిప్పలాబడి కొంటె చెప్పరాదు ధరలు ॥స్వామి॥

బెల్లమెన్మిది చొప్పు నుండె
మద్దుకల్ల ఎన్మిది తొమ్మిదుండె
ఉల్లిగడ్డలు పుట్టికి యాబయొక్కటి రెండు
యెల్లిగడ్డలు మదుముకెట్లైన పదకొండు ॥స్వామి॥

నెయ్యి నూనామిదం మూడూ
ధరలు నెలకొక్క తీరుండు చూడూ
నెయ్యి ముప్పై రెండు సవ్వాశేరమ్ముకం
నూనామిదం రెండు మదుముకు పన్నెండు ॥స్వామి॥

మరి మిరుపకాయలెట్లున్నా
మంచి వరుగైతె పదిమద్మ కన్నా
మరి మంచి శర్కర మదుముకు పదహారు
మరి కొబ్బరికి పది మద్మనొక్కంటికిని ॥స్వామి॥

ఏరీతి బ్రతికెదామనుచూ
పిల్లగాండ్లు బ్రతుకుటెట్లనియూ
మరువక చాటుకు మరి గిర్ని బియ్యంబు
ఇరువుగా రెండు శేర్లిస్తె తీసుకపోయిరి. ॥స్వామి॥

వెండి బంగారంబు రెండూ
ధరలు రెండు మూడు తీర్లనుండూ
రెండు తక్కల్లనర చింతపండును ధర
బండారి కొమ్ములును రెండు తక్కల్లుండె ॥స్వామి॥

ఎంతదండి కరువు ముప్పు
లోకులెట్లెట్లు దీర్తు రోయప్పు
ముంతలు కంచములు ముందటి కటువులో
అంతలోపల కొందరమ్ముకొని బ్రతికిరి ॥స్వామి॥

ధరణిలో దారిద్రులంతా
వాండ్లు దక్కేది దుర్లభం కొంతా
ఇరువుగా ఈ కరువు కింట్లేమి లేకుంట
సరిపడెను నాల్గు సంవత్సరంబుల నుండి ॥స్వామి॥

దినమెంత కఠినంబు దినమూ
ఒక్క ధనికునికి లేదు పామరమూ
ఎనయంగ తురక లంతెగ బడితె
ధనవంతులిండ్లల్లో దాగుండిరయ్యయ్యో ॥స్వామి॥

ఉదరంబుకొందరికి ఎండె
లెస్సఉదరంబు కొందరికి నిండె
సదరు పింగళనామ సంవత్సరము నుంచి
నదులు నిండక ఎండె నాలుగేండ్లిది వరకు ॥స్వామి॥

అదరి బెదరిపోయిరి నరులూ
చాల ఇది వరకే జరిగె యాపదలూ
ముదము పదమున్నూట ముప్పయొక్కటి ఫసిలి
ఆజూరు దూస్రీ వరకన్ని తీర్లిట్లు జరిగె ॥స్వామి॥



నరులకెంతెంత ఫికరున్నా
స్వామి కృప గలిగితే ఫికరుసున్నా
కరుణించి జైశెట్టి కవి రాజాఖ్యుని
ధరణిలో జగిత్యాల పురములో రక్షించు ॥స్వామి॥

## తెలంగాణాలో జాతీయోద్యమము

నిజాం పాత హైదరాబాద్ రాష్ట్రమును (Erst-while Hyderabad State) భాషాపరంగా తెలంగాణా, మరఠ్వాడా, కర్ణాటక ప్రాంతాలుగా విభజించవచ్చు. తెలుగు ప్రాంతము 49వేల చ.మై. కాగా తెలుగు మాట్లాడే ప్రజలు ఒక కోటి ఉండేవారు[183]. "కోటి రత్నాల వీణ నా తెలంగాణా" అని దాశరథి పలికినాడు. నిజాం రాజ్యములో అక్షరాస్యత 5 శాతము మాత్రమే. అధికారభాష ఉర్దూ క్రీ.శ. 1884 నుండి అమలులోనికి వచ్చింది. 1884కు పూర్వము ఫారసీ అధికార భాషగా ఉండేది. ఆరవనిజాం కాలములో ఉర్దూ అధికార భాషగా ప్రవేశపెట్టబడింది. ఉన్నతోద్యోగాలలో మరఠ్వాడా మరియు ఉత్తర భారత ప్రాంతానికి చెందినవారు ఉండేవారు. తెలంగాణా ప్రజలస్థితి నికృష్టంగా ఉండేది. తెలుగు భాషకుగాని, తెలుగు సంస్కృతికి గాని ఎటువంటి ఆదరణ లేకుండేది.

1885లో భారత జాతీయ కాంగ్రెసు (Indian National Congress) స్థాపితమైంది. దీనిచే నిజాం రాజ్యములో అనేకమంది ప్రభావితులైనారు. డా.అఘోరనాథచటోపాధ్యాయ, ముల్లాఅబ్దుల్ ఖయ్యూంలాటి ప్రముఖులు దీనిలో చేరినారు. 'హిందూ పయనీర్' లాంటి పత్రికలలో నిజాం పాలనలోని లోపాలు బహిర్గత పరిచారు. 1892లో హైదరాబాద్ నందు ఆర్య సమాజశాఖ ఏర్పడింది. కేశవరావు కరోట్కర్ మున్నగు వారు దీనిలో చేరారు.

మునగాల జమిందారు నాయని వెంకటరంగారావు ప్రాజ్ఞులు, ఉదారస్వభావులు. ఆయన వద్ద దివాన్‌గా నుండిన కొమర్రాజు లక్ష్మణరావు కృషి వలన హైదరాబాద్‌లో "శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం" అను తొలి తెలుగు గ్రంథాలయము 1901లో స్థాపించబడింది. 1906లో విజ్ఞాన చంద్రికామండలి ఏర్పడి తెలుగులో పుస్తకాలను ప్రచురించింది. మహారాష్ట్రులు వివేకవర్ధిని విద్యాసంస్థను ప్రారంభించారు. 1919లో ఉస్మానియా విశ్వవిద్యాలయము స్థాపించబడింది.

### రాజకీయ చైతన్య ప్రారంభము

నీలగిరి పత్రిక, తెలుగు పత్రిక ప్రజలలో రాజకీయ సాంఘిక చైతన్యమును కలిగించాయి. 1918లో హైదరాబాద్ నందు వామన్‌నాయక్ అధ్యక్షతన కాంగ్రెస్ కమిటీ ప్రథమంగా ఏర్పడింది. మహాత్మాగాంధీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమము (Non Co-operation Movement) మరియు ముసల్మానులు టర్కీ ఖలీఫాను బలపరుస్తూ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రారంభించిన

ఖిలాఫత్ ఉద్యమము యావద్భారతాన్ని జాగృతం చేసినాయి. ఈ ఉద్యమ ప్రభావము నిజాం రాజ్య నిరంకుశ కవాటాలను కూడా ఛేదించుకొని తెలంగాణా ప్రజలను గూడా చైతన్య పరచింది. 1920 మార్చి, ఏప్రిల్ మాసములలో అన్ని జిల్లాలలో వలె కరీంనగర్ జిల్లాలో గూడా ఖిలాఫత్ ఉద్యమము ఊపందుకొంది. కరీంనగర్ పట్టణములో ఈద్గా (Idgah) వద్ద జరిగిన సమావేశమునకు హైదరాబాద్ నుండి వచ్చిన షాహబీబుల్లా అధ్యక్షత వహించాడు. అన్ని వర్గముల ప్రజలు సమావేశములో పాల్గొన్నారు. ఈ సమావేశమందు సయ్యద్ మెయినొద్దీన్ అలీఖాన్ అవ్వల్‌తాలుక్దార్ (First Taluqdar or District Collector) మరియు రాయ్‌రతన్‌చంద్ జాయింట్ మెజిస్ట్రేట్ పాల్గొన్నారు. స్థానిక న్యాయవాదులు ఈ ఉద్యమములో పాల్గొన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ వర్తకులు తమ దుకాణములను మూసి వేయవలసినదిగా తీర్మానింపబడింది. ఈ సమావేశమునకు పోలీస్ ఆజ్ఞ ముందుగా పొందినట్లు ప్రభుత్వ రికార్డుల్లో లేదు. ఉద్యమము యొక్క ప్రభావము ప్రజలపై అధికారులపై ప్రబలముగా ఉందని సమావేశము తెలిపింది[184].

1920లో జరిగిన సహాయ నిరాకరణోద్యమ ప్రభావానికి లోనై కొందరు తమ చదువులను చాలించారు. డా. జయసూర్య తన వైద్యవిద్యకు స్వస్తి చెప్పినాడు. ఆకాలంలో చదువుకు స్వస్తి చెప్పిన వారిలో, కరీంనగర్‌కు చెందిన మీర్‌మహ్మద్ హుస్సేన్, అక్బర్ అలీఖాన్, మక్బూల్‌అలీ, సయ్యద్ మహ్మద్ అన్సారీ ఉన్నారు. వీరిలో మీర్‌మహ్మద్ హుస్సేన్ నెల్లూరు జైలులో ఆరునెలలు శిక్షను కూడా అనుభవించినారు. తరువాత కాలములో అతడు హైదరాబాద్‌లోని సెంట్రల్ రికార్డ్ ఆఫీసులో డైరక్టర్‌గా నియమితుడైనాడు. అక్బర్ అలీఖాన్ అనంతరకాలంలో సుప్రసిద్ధ బారిస్టర్‌గా పేరునార్జించినాడు. మక్బూల్ అలీ సివిల్ సర్జన్ అయినాడు. సయ్యద్ మహ్మద్ అన్సారీ క్రమంగా వకీలు అయినాడు. రాజకీయ చైతన్యం కలిగిన విద్యార్థులను మేధావులను స్వదేశీ ఉద్యమము చాలా ఆకర్షించింది. పైజామాలను ధరించే పద్ధతిని త్యజించి ఖాదీధోవతులను, గాంధీ టోపీలను బద్రుల్ హసన్, జాఫర్ హసన్ ధరించినారు.[185] బద్రుల్‌హసన్ ఉస్మానియా విశ్వవిద్యాలయములో సమాజశాస్త్ర ఆచార్యులుగా (Professor of Sociology) ఉండేవాడు. ఖాదీ ఉద్యమములో భాగంగా అనేక గృహాలలో చరఖాలు, రాట్నాలు వెలశాయి. మహిళలు రాట్నం వడికి ఖద్దరు గుడ్డను తయారు చేయుటకు తోడ్పడగా, సాంఘిక కార్యకర్తలు వాటిని అమ్మేవాళ్లు. ఆచార్య బద్రుల్ హసన్ బొంబాయి నుండి చరఖాలు తెప్పించి ఇచ్చినాడు. వరంగల్‌లో చరఖాల తయారి కార్మాగారము ఏర్పడింది. కరీంనగర్ జిల్లాలోని మెటుపెల్లిలో గాంధీజీ పేరట ఖాదీ కార్ఖానా స్థాపించబడింది. అనేక మంది రాట్నాలు వడికి నూలు అందులో విక్రయించగా, అచట తయారైన ఖాదీ వస్త్రాలు దూర దూర ప్రాంతాలలో అమ్మబడేవి. ఈ ఖాదీ కార్ఖానాలో బోగ పాపయ్య పంతులు అమోఘముగా తమ సేవలందించారు. వారు 1941లో రెండవ ప్రపంచ యుద్ధకాలములో పూనాకు వెళ్ళి పురందరకోటలో



స్వాతంత్ర్యోద్యమ శిక్షణ పొందినారు. మెటుపల్లికి తిరిగి వచ్చి ఉద్యమమును ఉద్ధృతపరచినారు. మహాత్మాగాంధి ఆశయాలైన ఖద్దరు వినియోగం, మద్యపాన నిషేధం, కరీంనగర్ జిల్లాలోని మారుమూలప్రాంతాలకు ప్రాకినాయి. జిల్లాలో పలుచోట్ల చరఖాకేంద్రాలు ఏర్పడ్డాయి. ఆ రోజులలో ఖాదీబట్టలను ధరించిన వారిని కాంగ్రెస్‌వారని భావించేవారు. ఖద్దరు ధరించిన వారిపై పోలీస్‌నిఘా పెరిగింది.

## ఆంధ్ర జన సంఘం ఆవిర్భావము

మహర్షికార్వే అధ్యక్షతన 1921 నవంబర్ 11, 12 తేదీలలో నిజాం రాజ్య "సాంఘిక సంస్కరణల సమావేశము" హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశకార్యక్రమాలు ఆంగ్లం, మరాఠీ, ఉర్దూ భాషలలో కొనసాగాయి. ప్రతినిధులలో ఒకరైన న్యాయవాది ఆలంపెల్లి వెంకటరామారావు తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించగానే మహారాష్ట్ర సభ్యులు అల్లరిచేసి ఆయన తెలుగు ప్రసంగాన్ని సాగనివ్వలేదు. తెలుగుభాష ఎంత నికృష్టస్థితిలో ఉన్నదో, తెలుగువారు ఎటువంటి దైన్య స్థితిలో ఉన్నారో తేటతెల్లమైనది. తెలుగువారికి కనువిప్పు కలిగింది. అదే రోజు రాత్రి పదకొండు మంది సభ్యులతో తెలుగు ప్రతినిధులు "ఆంధ్రజనసంఘం" అనే నూతన సంస్థను స్థాపించినారు. 1922 ఫిబ్రవరి 14వ తేదీన ఆంధ్రజనసంఘం మొదటి సమావేశము కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగింది. ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరావు కార్యదర్శిగా ఎన్నికైనారు. 1924 ఏప్రిల్ 1న హనుమకొండలో జరిగిన ఆంధ్రజనసంఘ సమావేశమునకు హుజూరాబాద్ ప్రజలు చాలా మంది హాజరైనారు.

ఆంధ్ర జన సంఘం అధ్వర్యములో అనేక తెలుగు గ్రంథాలయాలు, విద్యాలయాలు, పఠనామందిరాలు స్థాపించబడ్డాయి. హనుమకొండలో రాజరాజనరేంద్ర భాషానిలయము, ఖమ్మం జిల్లాలోని ఎర్రు పాలెంలో మహబూబియా గ్రంథాలయము లేర్పడినాయి. తెలుగు ప్రజలలో సాంఘిక, సాంస్కృతిక పునరుజ్జీవం కొఱకు కొమర్రాజు లక్ష్మణరావు ప్రభృతులు కృషి చేశారు. కాకతీయ చరిత్రను వెలుగులోనికి తెచ్చు గోష్ఠి ఒకటి 1930లో వరంగల్ నందు జరిగింది. అందులో కాకతీయ సంచిక వెలువడింది. జనసంఘం చిన్న చిన్న పుస్తకాలను గూడా ప్రచురించింది. వీటిలో 'వర్తకస్వాతంత్ర్యం' పుస్తకము ఎన్నదగినది. ప్రభుత్వోద్యోగుల పర్యటన సందర్భాలలో వర్తకులు ఉచితంగా వస్తువులను, సరుకులను సరఫరా చేసే ఆచారముండేది. పటేల్ పట్వారీలు చిన్న చిన్న వ్యాపారుల నుండి గ్రామాలలో బియ్యం మొదలైన తిండి వస్తువులు ఉచితంగా తెప్పించుకొనేవారు. వర్తకులు విధిలేక 'వంతుపద్ధతి' ఏర్పాటు చేసికునేవారు. ఈ పద్ధతి ప్రకారం వారంలో ఒకరోజు, ఒక నిర్ణయింపబడిన వర్తకుడు వస్తువులను ఉద్యోగులకు ఉచితంగా సరఫరా చేసేవాడు. ఇది ద్వాపర యుగములో నుండిన బకాసురుని రాక్షస పద్ధతిని ఈ వంతులవారి పద్ధతి స్ఫురింపజేస్తుంది. ఒక్కొక్క రోజు ఒక్కొక్క వర్తకుని వంతు వచ్చేది.

ప్రభుత్వోద్యోగుల దోపిడి నుండి కాపాడుకోవడానికి ఆంధ్ర జన సంఘం వర్తక సంఘముల స్థాపనకై ప్రోత్సహించింది. 1923 ఫిబ్రవరి 19న సూర్యాపేట వర్తకసంఘం, 1924 ఆగస్టు 8న ఖమ్మం వర్తక సంఘం స్థాపించబడినవి. ఈ వర్తక సంఘముల కార్యవర్గ సభ్యులను అరెస్టు చేసి నిజాం ప్రభుత్వము హింసించేది. కాని వర్తకులు హైకోర్టుకు పోయి వారి పక్షమున న్యాయము జరుగునట్లు విజయము సాధించారు. "వర్తక స్వాతంత్ర్యం" పుస్తకమును వర్తకులు ఆదరించగా నాలుగుసార్లు పునర్ముద్రణ పొందింది. వర్తకులలో వచ్చిన చైతన్యముతో పెద్ద గ్రామాలలో ప్రభుత్వోద్యోగుల దోపిడి కొంత తగ్గినది. కాని చిన్న గ్రామాలలో వర్తకుల దుస్థితి పోలీసుచర్య జరుగుమట్టుకు బాగుపడలేదు.

ఆంధ్ర జన సంఘం కార్యకలాపాలను ప్రజాబాహుళ్యంలో ప్రచారం చేయడానికై నీలగిరి పత్రిక, తెలుగు పత్రిక, గోలకొండ పత్రికలు పూనుకున్నాయి. 1928లో హైదరాబాద్‌లో ఆంధ్ర బాలికా పాఠశాల స్థాపించబడింది. తెలుగు బోధనాభాషగా ప్రవేశపెట్టడం జరిగింది. ఆంధ్రజనసంఘంపై నిజాం ప్రభుత్వము అనేక ఆంక్షలు విధించింది. 1930 నాటికి ఆంధ్ర జన సంఘం తెలంగాణాలో ఒక గొప్ప రాజకీయశక్తిగా రూపొందింది. క్రమేణ ఆంధ్ర జన సంఘం ఆంధ్రమహాసభగా మారింది.

## ఆంధ్రమహాసభ

ఆంధ్ర జన సంఘం 1930 నాటికి ఆంధ్రమహాసభగా అవతరించింది. ఆంధ్రమహాసభ విద్యావ్యాప్తి కొరకు, సాంస్కృతిక వికాసము కొరకు, ప్రాంతీయ భాష తెలుగు అభివృద్ధికొరకు, సంస్కరణ వాద దృక్పథంతో హక్కుల సాధనకు కృషి చేసింది. ఆంధ్ర మహాసభ మొదటి సమావేశము 1930లో మెదక్ జిల్లా జోగిపేటలో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రప్రథమంగా ఆంధ్ర మహిళా సభ గూడా నడింపల్లి సుందరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలలో జాగీరు భూములు, మహిళావిద్య, హరిజనోద్ధరణ, విద్య, స్థానిక సంస్థల ఎన్నికలు మున్నగు వివిధ విషయాల పై తీర్మానాలు జరిగాయి. 1931లో రెండవ ఆంధ్ర మహాసభ నల్గొండలోని దేవరకొండలో బూర్గుల రామకృష్ణారావు అధ్యక్షతన జరిగింది.

రాజకీయ ఉపన్యాసములు చేయుట వలన నిజాం ప్రభుత్వము ఈ మహాసభను మూడు సంవత్సరాలపాటు సస్పెండ్ చేసింది. అందువలన 1934లో ప్రభుత్వ ఆజ్ఞను పొంది మూడవ ఆంధ్ర మహాసభను ఖమ్మంలో పులిజాల వెంకటరంగారావు అధ్యక్షతన నిర్వహించారు.

## సిరిసిల్లలో నాలుగవ ఆంధ్ర మహాసభ (క్రీ.శ. 1935)

కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో నాలుగవ ఆంధ్ర మహాసభ 1935లో మాడపాటి హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించబడింది. మహిళా ఆంధ్ర మహాసభకు మాడపాటి



హనుమంతరావు సతీమణి మాణిక్యమ్మ అధ్యక్షత వహించినారు. భార్యాభర్తలు ఒకే సమయంలో మహాసభకు, మహిళాసభకు అధ్యక్షత వహించడము విశేషం. సిరిసిల్ల, ఆంధ్రమహాసభలోనే ఆంధ్రమహాసభ నియమావళి సూత్రీకరింపబడింది. ఈ సభ నుండియే మహాసభ ప్రజా ఉద్యమంగా మారింది. సభలో తెలుగులో ఉపన్యసించడం ప్రారంభమైంది. అంతకుముందు హైదరాబాద్‌లో జరిగిన సభలలో ఉర్దూ, ఇంగ్లీషు, మరాఠీ భాషలలోనే ఉపన్యసించు సంప్రదాయముండేది. ఆ సంప్రదాయమునకు స్వస్తి చెప్పబడినది. సిరిసిల్ల ఆంధ్రమహాసభలో అనేక తీర్మానాలు ప్రవేశపెట్టబడినవి.

1. విద్యను పునర్వ్యవస్థీకరించాలి.
2. నిర్బంధ ప్రాథమిక విద్యను అమలు పరచాలి.
3. మాతృభాషలో విద్యాబోధన జరుగాలి.
4. జాగీర్లలో ప్రజాహక్కుల పరిరక్షణ జరుగాలి.
5. బాల్య వివాహాలను వ్యతిరేకించాలి.
6. స్థానిక స్వపరిపాలన అమలు పరచాలి.
7. అంటరాని వారి ఉద్ధరణకై పాటుపడాలి.

పైన పేర్కొనిన స్థిరమైన తీర్మానాలు (Stereotyped Resolutions) యువకులకు నచ్చలేదు. వారు సమూలమైన మార్పులను (Radical Changes) కోరిరి. ఈ తీర్మానాలు ప్రభుత్వ వైఖరిలో ఎలాంటి మార్పుతేలేదు[186]. తెలంగాణాలోని ఉద్యమకారులు బద్దం ఎల్లారెడ్డి, అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి, సంఘ సంస్కర్త భూమయ్య వకీలు సిరిసిల్లలో ఈ మహాసభ నిర్వహణలో ప్రధానపాత్ర వహించారు. జిల్లాలోని అన్ని తాలుకాల నుండి ప్రతినిధులు, ప్రజలు ఈ మహాసభకు హజరైనారు. జగిత్యాల నుండి కాసం శివరాజగుప్త, జైశెట్టి లక్ష్మిరాజం గుప్త, సిద్దంశెట్టి సంగయ్య మున్నగు సంస్కారవాదులు ఈ మహాసభకు హాజరైరి. వీరు జగిత్యాలలో కాసం శివరాజగుప్త నేతృత్వములో ఆంధ్రమహాసభశాఖ నేర్పరచిరి. సిరిసిల్ల మహాసభకు హాజరైన రఘునాథ్‌కాచే మంథనిలో ఆంధ్ర మహాసభశాఖను ఏర్పాటుచేశాడు. సిరిసిల్ల మహాసభ అనంతరము కరీంనగర్‌లోని బోయివాడలో ఆంధ్రమహాసభ కార్యాలయము ఏర్పాటైంది. జిల్లా అధ్యక్షులుగా బద్దం ఎల్లారెడ్డి, కార్యదర్శిగా అనభేరి ప్రభాకర్‌రావు, కార్యాలయ కార్యదర్శిగా కె.వి. దామోదర్ రావు పనిచేశారు. ఆంధ్ర మహాసభశాఖలు సిరిసిల్ల, జగిత్యాల, మంథని, పెద్దపల్లి, మెటుపల్లి, కోరుట్ల, చొప్పదండి, సుల్తానాబాద్, హుజూరాబాద్ మున్నగు చోట్ల స్థాపింపబడినాయి.

1935 సెప్టెంబర్ 6న సిరిసిల్లలో జరిగిన ఆంధ్రమహాసభకు కె.వి.రంగారెడ్డి, జె.వి.నర్సింగరావు, సురవరం ప్రతాపరెడ్డి, రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి లాంటి రాష్ట్ర

నాయకులు పాల్గొన్నారు. ఈ మహాసభ అమృత్‌లాల్ శుక్లా వంటి యువకులకు ఎందరికో స్ఫూర్తి నిచ్చింది. ఈ మహాసభ నిర్వహణలో పోల్కంపెల్లి వెంకటరామారావు లాంటి నాయకులు విశేషసేవలు అందించినారు. ఈ వెంకటరామారావు గారి పూర్వీకులు దేవరకొండ నుండి ఈ ప్రాంతమునకు వచ్చారని తెలుస్తుంది. వీరు సిరిసిల్ల ప్రాంతపు ప్రస్తుత నాయకులైన చెన్నమనేని రాజేశ్వరరావు, మరియు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు గార్లకు స్వయాన బావ. సిరిసిల్ల ఆంధ్రమహాసభలో కోడిరామకృష్ణ బలప్రదర్శన ఏర్పాటు చేయబడింది.

కరీంనగర్ జిల్లాలో ఏర్పడిన ఆంధ్రమహాసభ కార్యాలయాలు నిజాం రాజ్యములో భూస్వాములు, పెత్తందార్ల దోపిడి, రైతుకూలీలపై దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పనిచేశాయి. నిర్బంధలెవీ వసూలు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ప్రచారం సాగించాయి. ఆనాడు నూలుపై కంట్రోలు విధించడంతో చేనేత కార్మికులకు అనేక ఇబ్బందులు ఏర్పడినవి. ఆంధ్రమహాసభశాఖలు చేనేత పనివారికి గిట్టుబాటు ధరలకు ప్రభుత్వము నుండి నూలు లభించేటట్లు చేసినవి. కార్యకర్తలు నూలు కంట్రోలు దుకాణముల వద్ద ఉంటూ గుర్తింపుకార్డులు ఉన్న కార్మికులకు నూలు అందేలాగా కృషి చేసినారు.

## తదనంతరపు ఆంధ్ర మహాసభలు

ఐదవ ఆంధ్రమహాసభ 1936లో జాగీర్ గ్రామమైన షాద్‌నగర్‌లో కొండా వెంకటరంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. 1937లో మందముల నర్సింగరావు అధ్యక్షతన ఆరవ సమావేశము నిజామాబాద్‌లో జరిగింది. ఏడవ సమావేశము మందముల రాంచందర్‌రావు అధ్యక్షతన మల్కాపురంలో జరిగినప్పుడు నల్గొండ నుండి రావినారాయణరెడ్డి, వరంగల్ నుండి కాళోజీ నారాయణరావు, కరీంనగర్ నుండి పోల్కంపెల్లి వెంకటరామారావు మున్నగు ప్రతినిధులు నిజాం ప్రభుత్వము తలపెట్టిన రాజ్యాంగ సంస్కరణలను బహిష్కరించవలెనని తీర్మానం ప్రవేశపెట్టారు. కాని అగ్రనాయకులైన మాడపాటి హనుమంతరావు, కొండా వెంకటరంగారెడ్డి, పులిజాల వెంకటరంగారావు ఈ తీర్మానమును వ్యతిరేకించారు. అయినప్పటికిని తీర్మానము నెగ్గడం సీనియర్ నాయకులను విస్మయపరచింది. ఆంధ్ర మహాసభ మితవాదుల చేతుల నుండి అతివాదుల ప్రాబల్యములోనికి రావడం ఆరంభమైంది. కరీంనగర్ నుండి ప్రాతినిధ్యము వహించిన పోల్కంపెల్లి వెంకటరామారావు ఏడవ ఆంధ్ర మహాసభలో కీలకపాత్ర వహించారు.

ఎనిమిదవ ఆంధ్రమహాసభ 1941లో నల్గొండ జిల్లాలోని హుజూర్‌నగర్ సమీపమున గల చిలుకూరునందు రావినారాయణరెడ్డి అధ్యక్షతన జరిగింది. మహిళా సమస్యలకు, రైతాంగ సమస్యలకు ప్రాధాన్యతనిచ్చినారు. తొమ్మిదవ మహాసభ 1942లో వరంగల్ జిల్లాలోని ధర్మవరంలో మాదిరాజు రామకోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. పదవ ఆంధ్రమహాసభ 1943లో హైదరాబాద్‌లో జరిగింది. మితవాది కొండా వెంకటరంగారెడ్డి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల



ప్రాంతమునకు చెందిన అతివాదుల అభ్యర్థి అయిన బద్దం ఎల్లారెడ్డిని ఓడించి అధ్యక్షుడైనాడు. రాయచూరు జిల్లాలోని గద్వాల, అలంపురంలను తెలంగాణాలో కలుపవలెనని ఈ సమావేశంలో తీర్మానింపబడింది. 1944లో పదకొండవ మహాసభ రావి నారాయణరెడ్డి అధ్యక్షతన భువనగిరిలో జరిగింది. ఆంధ్రమహాసభ కమ్యూనిస్టుల అధీనమైంది. చంద్రరాజేశ్వరరావు ఈ సమావేశములో పాల్గొన్నారు. సుమారు పదివేల మంది ఈ మహాసభకు హాజరు కావడం ఇదే ప్రథమం. మితవాదులైన కొండా వెంకటరంగారెడ్డి, మందముల రాంచందర్‌రావు ఈ సభ నుండి వెళ్లిపోయి పోటీ ఆంధ్రమహాసభ పెట్టినారు. దీనినే జాతీయ ఆంధ్ర మహాసభగా వ్యవహరించగా ఇది 1945 మరియు 1946లో రెండు సమావేశములు జరిపి హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌లో విలీనమైంది. ఆంధ్రమహాసభ పన్నెండవ సమావేశం 1945లో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన ఖమ్మంలో జరిగింది. ఈ సమావేశంలో 40వేల మంది పాల్గొన్నారు. నిజాం ప్రభుత్వము 1946 డిసెంబర్ 3న కమ్యూనిస్టుపార్టీని నిషేధించింది. దీంతో ఆంధ్ర మహాసభ కార్యకలాపాలు అంతమైనవి. జాతీయ ఆంధ్రమహాసభ చివరి సమావేశము 1946లో మెదక్ జిల్లా కంది గ్రామములో జమలాపురం కేశవరావు అధ్యక్షతన జరిగింది.

## మతమార్పిడులు (Proselytisation)

1926లో మంథనిలోని రాజన్న ఇస్లాం మతము లోనికి మార్చబడినాడు. అతనిపేరు మౌల్విరఫీయొద్దీన్‌గా మార్చబడింది. పెద్దపెల్లి నియోగి బ్రాహ్మణుడు రాజేశ్వరరావు ముస్లింగా మార్చబడి జలీల్ పేరుతో పిలువబడినాడు. మంథని తాలుకాలోని ఆదివారంపేట వైశ్యుడు చిటుకేసి వీరయ్య భార్య రాంబాయిని ఆమె ఎనిమిది సంవత్సరముల పుత్రుడు రాంచంద్రంను జైనొద్దీన్ అనునతడు బలవంతంగా ఎత్తుకొని పోయి (Kidnap) మహదేవ్‌పూర్ ఖాజీ ఎదుట ఇస్లాంలోనికి మార్చాడు. రాంబాయి పేరును హనీషాబీగా మార్చి జైనొద్దీన్ వివాహమాడెను. బాలుడైన రాంచంద్రం పేరు అబ్దుల్లాగా మార్చబడింది[187]. దృష్టికిరాని సంఘటనలు ఇలాంటివి ఎన్నో జరిగినవి. బీదవారైన హరిజనులనేకులు ముస్లింలుగా మార్చబడినారు.

1937 మే నెలలో ఇత్తెహాదుల్ ముసల్మాన్ నాయకుడైన బహాదూర్ యార్ జంగ్ మత మార్పిడులను ప్రోత్సహించు ఉద్దేశముతోనే కరీంనగర్, హుజూరాబాద్, పర్కాల, జగిత్యాల మున్నగు ప్రాంతములను పర్యటించాడు. ఇస్లాంను స్వీకరించిన బీదవారికి ప్రతి ఒక్కరికి 20 రూపాయలు ఇస్తానన్నాడు. సిరిసిల్ల, ఎల్లారెడ్డి ప్రాంతాలలో చాలామంది హరిజనులు ఇస్లాం మతమును స్వీకరించారు. 1941లో జరిగిన జనాభా లెక్కల పట్టికలో (Census) హరిజనులను హిందువులుగా పేర్కొనలేదు. దీనిని నిరసించుచు ఇరుకుల్ల జువ్వాడి చొక్కారావు 1941లో గోలకొండ పత్రికకు ఒక లేఖ వ్రాశాడు. 1947లో డా. అంబేద్కర్ గూడా హరిజనుల మత మార్పిడిని ఆక్షేపించాడు[188].

హిందువులను మహ్మదీయులుగా మార్చు ప్రయత్నములే గాకుండా, క్రైస్తవులుగా మార్చుటకు గూడా ముమ్మరంగా ప్రయత్నములు జరిగాయి. కరీంనగర్ జిల్లాలోనికి క్రైస్తవ మిషనరీలు 1882లో ప్రవేశించాయి. 1887 వరకు అవి తమకేంద్రములను జిల్లాలోని పలుచోట్ల స్థాపించాయి. 1897లో ఋతుపవనములు లేక భరింపలేని క్షామమేర్పడింది. ధరలు పెరిగాయి. ఒక్క రూపాయికి మానెడు అనగా నాలుగు సేర్ల బియ్యము అమ్మారు. ఆనాడు ఒక మానుక బియ్యము ధర ఒక రూపాయి. అది ఆనాటి కరవుధర. ఈనాడు ఒక మానుక బియ్యము ధర రూ. 75. కొత్తపెల్లిలో క్రైస్తవ మిషనరీకి చెందిన వెస్లీ (Wesley) ఎందరికో అన్నము పెట్టి ఆదుకొన్నాడు. కరీంనగర్ జిల్లాలో 152 ఆకలిచావులు నమోదైనాయి. ఆకలితో అలమటించే పేదప్రజలు భుక్తి కొరకై క్రైస్తవ మతమును స్వీకరించారు. అందుకే కరీంనగర్ జిల్లాలో క్రైస్తవుల సంఖ్య గణనీయంగా పెరిగింది.[189] 1905 నుండి క్రైస్తవమత ప్రచారము పెరిగింది. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపెల్లి ప్రాంతాల్లో విద్య, వైద్య సౌకర్యములందించి చాలా మంది హిందువులను ప్రధానంగా హరిజనులను మిషనరీలు క్రైస్తవులుగా మార్చాయి. పెద్దపెల్లి ప్రాంతమున మాదిగవారు, మన్నెపువారు అధిక సంఖ్యలో క్రైస్తవులుగా మార్చబడినారు. 1921లో కరీంనగర్ జిల్లాలో 1581 క్రైస్తవులుండగా వారి సంఖ్య రెండు దశాబ్దములలో 1941 వరకు 21,900కు పెరిగింది.[190]

## హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ స్థాపన 1938

స్వామి రామానంద తీర్థ ఈ సంస్థ స్థాపనకు ముఖ్య కారకులు. 1938 జనవరి 29న హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ స్థాపించబడింది. దీనిలో 1200 సభ్యులు చేర్చబడినారు. ఇది ఒక మతపరమైన సంస్థయను సాకుతో నిజాం ప్రభుత్వము దీనిని నిషేధించింది. మందముల నర్సింగరావు, బూర్గుల రామకృష్ణారావు ముసల్మానునాయకులతో చర్చలు జరిపి విఫలులైనారు. దీనిపై నిషేధం తొలగించాలని 1938 అక్టోబర్ 24 నుండి సత్యాగ్రహం ప్రారంభమైంది. బాధ్యతాయుత ప్రభుత్వము (Responsible Government) కావలెనని స్టేట్ కాంగ్రెస్ కోరింది. ఒక జట్టు (Batch) తరువాత ఇంకొక జట్టు మొత్తము 400 మంది 18 జట్లుగా (Batches) ఏర్పడి సత్యాగ్రహమును డిసెంబర్ 24 వరకు రెండు మాసములు జరిపినారు. 12 వ జట్టులో కరీంనగర్ జిల్లాకు చెందిన బద్దం ఎల్లారెడ్డి మున్నగు ప్రముఖులు ఉన్నారు. మహాత్మాగాంధి సలహా మేరకు చివరి జట్టుకు నాయకత్వం వహించిన కాశీనాథవైద్య ఈ సత్యాగ్రహమును నిలుపుదల చేసినారు.

## ఉస్మానియా విశ్వవిద్యాలయములో వందేమాతరం ఉదంతము (1938)

ఆర్యసమాజం, హిందూ మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం మొదలు పెట్టి స్థానిక ప్రజల ప్రాథమిక హక్కులకై పోరాటం జరిపాయి. 1938లో దసరా ఉత్సవముల



సందర్భములో ఉస్మానియా విశ్వవిద్యాలయములోని హాస్టల్‌లో ప్రార్థనామందిరమందు విద్యార్థులు వందేమాతరం గీతం ఆలపించారు. హాస్టల్ అధికారులు ప్రార్థనా మందిరాన్ని మూసి వేసినారు. విద్యార్థులు వరండాలలోనే పాడడము ప్రారంభించారు. విద్యార్థులు పైజామా, నీలిరంగు షేర్వాని వదలి చొక్కాలు, ధోవతులు ధరించి కాలేజీలకు వెళ్లనారంభించినారు. అధికారులు దీనిని ఆక్షేపించినారు. విశ్వవిద్యాలయ ఆవరణలోనే వందేమాతరం గీతం పాడగూడదని నిషేధించినారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించగా 1938 నవంబర్ 29న రాత్రికి రాత్రే హిందూ విద్యార్థులను బయటకు గెంటి వేసి హాస్టళ్లు మూసి వేశారు. హైదరాబాద్ నగరంలో జిల్లాలలో గూడా వేలమంది విద్యార్థులు సమ్మెకు దిగారు. ఈ సమ్మె 1938 నవంబర్ 29 నుండి డిసెంబర్ 10 వరకు నిరంతరాయంగా కొనసాగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయము నుండి 350, సిటీ కాలేజి నుండి 70, గుల్బర్గా కాలేజి నుండి 310 విద్యార్థులు, మహబూబ్‌నగర్ హైస్కూల్ నుండి 120 మంది తదితర జిల్లాలలో గూడా, అనేక మంది విద్యార్థులు విద్యాలయాల నుండి తొలగింపబడినారు.[191] వారి పేర్లు హాజరు పట్టిక నుండి తొలగించబడినవి. తొలగింపబడిన విద్యార్థులు ఇంకను ఏ కళాశాలలో చేరకుండా కక్ష సాధింపు ఆజ్ఞలు జారీ చేయబడినవి. చివరకు నాగపూర్ విశ్వవిద్యాలయము ముందుకు వచ్చి తొలగింపబడిన విద్యార్థులు తమ విద్యా సంవత్సరమును నష్టపోకుండా ఉండుటకై ప్రవేశములను కల్పించినది. నూకల రాంచంద్రారెడ్డి, అచ్యుతరెడ్డి, వరంగల్‌కు చెందిన టి. హయగ్రీవాచారి, కరీంనగర్ జిల్లాకు చెందిన పి.వి.నరసింహారావు వందేమాతరం ఉద్యమంలో చురుకుగా పాల్గొనుట వలన విశ్వవిద్యాలయము నుండి తొలగింపబడినవారిలో ఉన్నారు. వీరు నాగపూర్ విశ్వవిద్యాలయములో చేరినారు. జగిత్యాలలో నివసించుచున్న సిరికొండ వతందారు కుటుంబమునకు చెందిన వైశ్యప్రముఖుడు బట్టుగోపాల్ మల్లేశం న్యాయవాది గూడా ఉస్మానియా విశ్వవిద్యాలయము నుండి బహిష్కరింపబడిన వారిలో ఉన్నారు. వీరు గూడా నాగపూర్‌లో ప్రవేశము పొందినారు. ఇలా ఎందరో విద్యార్థులు అసౌకర్యముల పాలైనారు. జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, సవార్కర్ వంటి ప్రముఖులు విద్యార్థుల పోరాటాన్ని ప్రోత్సహించారు. విద్యార్థులకు వందేమాతరం ప్రార్థనాగీతాన్ని ఆలపించే హక్కు ఉందని మహాత్మాగాంధి తమ మద్దతు ప్రకటించినారు.

## కరీంనగర్ జిల్లాలోని గడులు, జాగీర్దారులు, వతందారులు


గడి అనగా గ్రామములోని భూస్వామి నివసించు అతిపెద్ద అందమైన గృహము లేదా భవనము. 20వ శతాబ్దపు ప్రథమార్ధ భాగములో కరీంనగర్ జిల్లాలో జాగీర్దారులు, మక్తేదారులు, సంస్థానాలు, ఇనాందారులు, అగ్రహారాలు, దేశ్‌ముఖ్‌లు, దేశాయిలు, వతందారులు, భూస్వాములు మరియు పెత్తందారుల పాలనలో సామాన్యప్రజలు నలిగిపోయి దుస్థితి పాలైనారు. కరీంనగర్ జిల్లాలోని కొన్ని ముఖ్యమైన గడులు మరియు ప్రముఖ జాగీర్దారులు, దేశాయిలు, దేశ్‌ముఖ్‌లు, వతందారుల గూర్చిన వివరములు కొన్ని లభ్యమైనంత మట్టుకు ఈ క్రింద నుదహరింపబడినాయి.

కరీంనగర్ జిల్లాలోని ప్రజలు నాటి తరాలలో విభిన్నమైన పాలనను చవిచూశారు. మెటుపెల్లి ఒక జాగీరు పాలనాకేంద్రముగా ఉండేది. దీనికి నవాబు ఫక్రుల్ ముల్క్ జాగీర్దారు. అతడు తరచుగా హైదరాబాద్‌లోనే ఉండి జాగీరు పాలనను చూసేవాడు. మెటుపెల్లి జాగీరు పరిధిలో 5 తాలుకాలు, 118 గ్రామాలుండేవని తెలియుచున్నది. నిజామాబాద్ జిల్లాలోని బిలోలి, కర్ణాటకములోని సిరిసాల, ఖండాల, మహరాష్ట్రలోని బోరిలతో పాటు మెటుపెల్లి పట్టణము తాలూకాలుగా నుండేవి. ఈ విభిన్న ప్రాంతముల పాలనాకేంద్రముగా మెటుపల్లి జాగీరుండేది. మెటుపెల్లిలో జాగీర్దార్ ఫక్రుల్ ముల్క్ అధ్వర్యములో అవ్వల్‌తాలుక్దార్ (Collector), పోలీస్ మొహత్మీమ్ (Superintendent of Police) అధికారులు నియమింపబడేవారు. వీరు జాగీరు క్రిందనున్న పైన పేర్కొనబడిన ఐదు తాలూకాల పాలన మెటుపెల్లి నుండియే చేసేవారు. ప్రజలను పీడిస్తూ కొనసాగిన నిజాం పాలన పంథాలోనే ఈ జాగీరు పాలన గూడా కొనసాగింది. ప్రప్రథమంగా 1912లో మార్కెట్‌లోకి విడుదలైన సైకిల్ పై మెటుపెల్లి జాగీర్దార్ ఫక్రుల్ ముల్క్ స్వారి చేయడం ఆనాటి ప్రజలకు ఒక వింతగా ఉండేది. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా మెటుపెల్లిలో స్థాపించబడిన ఖాదీ ఖార్ఖానా ఈ ప్రాంత ప్రజలలో చైతన్యము కలిగించి స్వాతంత్ర్య స్ఫూర్తి నిచ్చింది.


నిజాం ప్రభువు వద్ద శివరాజ్ బహదూర్ వజీరుగా ఉండేవాడు. కరీంనగర్ జిల్లాలోని బండలింగాపురం, పెద్దపెల్లి అతని సంస్థానములు లేదా జాగీర్లు. శివరాజ్ బహాదూర్‌కు ధరమ్‌కరణ్, ఇంద్రకరణ్ యని ఇరువురు కుమారులు. తండ్రికొడుకులు హైదరాబాద్‌లోనే ఉంటూ తమ సంస్థానములకు వెలమలను కాంట్రాక్టు పద్ధతిపై పాలకులుగా నియమించారు. ఈ పాలన ఏడు తరములుగా కొనసాగినట్లు తెలియుచున్నది. బండలింగాపురం సంస్థానమునకు నిజామాబాద్ ప్రాంతము నుండి పెంపకము వచ్చిన రాజాలింగాల అనంత కిషన్‌రావు చివరి పాలకుడు. యెల్లాపికులమునకు చెందిన జమేదార్ వెంకన్న ఇతని దివాన్. రాయికల్ గ్రామమునకు చెందిన పెగ్గెర్ల రాజన్న ఇతని కొలువులో ఉన్నాడు. రాజా అనంత కిషన్‌రావు భోగలాలసుడు, స్త్రీలోలుడు. బండలింగాపురంలో వాటర్ ట్యాంక్ నిర్మాణము గావించి ప్రజలకు నీటి సరఫరా (Tap System) చేశాడు. జనరేటర్ ద్వారా తన గ్రామము నందు విద్యుద్దీపములను వెలిగించాడు. ఆ రోజులలో నీటి సరఫరా, విద్యుచ్ఛక్తి సరఫరా ప్రజల సౌకర్యమునకై చేయడం అద్భుతమైన అరుదైన ఘట్టములు. వెల్లుల్ల ప్రాంతపు శివారు భూములపై ఆధిపత్యము కొరకు ఇతడు తరచుగా మెటుపెల్లి జాగీర్దారుతో తగాదా పడేవాడు. ఇరు వర్గముల మధ్య అప్పుడప్పుడు బందూకులు (తుపాకులు) లేచేవి. ఇరువురు హైకోర్టు నాశ్రయించగా వెల్లుల్ల శివారు భూములపై తీర్పు మెటుపెల్లి జాగీర్దారుకు అనుకూలముగా వచ్చింది. మెటుపెల్లి పోలీస్ మొహత్మీమ్ వెల్లుల్ల ప్రాంత భూముల ఆక్రమణకై బయలుదేరగా బండలింగాపురం సంస్థానము పక్షాన వందమంది సిపాయిలతో జమేదార్ వెంకన్న బందూకు పట్టుకొని ఎదురు తిరిగాడు. దానితో మెటుపల్లి



పోలీసులు వెనుదిరిగిరని స్థానికులు కథలుగా చెప్పుకుంటారు. అనంతకిషన్‌రావు దారుణమైన మరణమునకు గురి అయినాడు. అతని సేవకుడు మందు సీసాకు బదులు తేజాబ్‌సీసా (Acid Bottle)ను అందివ్వగా అది త్రాగి ప్రాణములు విలవిల కొట్టుకొనుచు వదలెనని స్థానికుల వలన తెలియుచున్నది. బండలింగాపురం సంస్థానము క్రింద ఐలాపురం, రాయికల్ గడులుండేవి. అనంతకిషన్‌రావుకు ఇరువురు కుమారులు. పెద్దకుమారుడు గజసింహారావుకు ఐలాపురంగడి చిన్న కుమారుడు నరసింహారావు వాటా క్రిందికి రాయికల్ గడి వచ్చినాయి. వీరిరువురు బాబులు హైదరాబాద్‌లో ఉంటున్నారు.



బండలింగాపూర్ గడి ప్రవేశద్వారము



భీమారం గడి

జగిత్యాల సమీపమున చలిగంటి (చల్‌గల్) గడికి అధిపతి జువ్వాడి ధర్మజలపతిరావు. ఇతడు బండలింగాపురం ఆడపడుచును వివాహమాడాడు. చల్‌గల్‌లో రెండంతస్తుల అందమైన భవనమును నిర్మించాడు. నేటికి ఈ గడిభవనము చెక్కు చెదరలేదు. ఈ భవనము యొక్క మొదటి అంతస్తు కమాన్‌లు చాలా దూరము వరకు శోభాయమానముగా అగపడుతుంటాయి. ఈ ధర్మజలపతిరావు ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పరిపాలన రజతోత్సవముల చిహ్నముగా 1937లో జగిత్యాల నడిబొడ్డున ఎత్తైన క్లాక్ టవర్ (Clock Tower) నిర్మించాడు. అదే సమయములో జగిత్యాల వేణుగోపాలస్వామి ఆలయమునకుత్తరమున ఒకగడి భవనమును గూడా నిర్మించాడు. ఇప్పుడది ఆబాదిగా మారినది. ధర్మజలపతిరావు ఇరువురు కుమారులు బాబూ కృష్ణభూపాల్‌రావు మరియు రాంభూపాల్‌రావు హైదరాబాద్‌నకు తరలి వెళ్ళారు. డా.రాంభూపాల్ రావు సిటీలో సత్యాకిడ్నీసెంటర్ ఆసుపత్రి నడిపి చనిపోయాడు. ఇతని భార్య వెంకటగిరి సంస్థానము నుండి వచ్చింది.

మేడిపెల్లి మండలంలోని భీమారం గడిగొప్పది. దీని అధిపతి జువ్వాడి ధర్మచొక్కారావు. పీఠాపురం సంస్థానమునకు చెందిన ఆడపడుచు ఇతని రెండవభార్య. ధర్మపురికి సమీపమున గల రాజారం గడి గూడా ఇతని ఆధిపత్యంలో ఉండేది. జగిత్యాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఉత్తరమున భీమారం చొక్కారావు గడి ఉండేది. అందులో చాలాకాలము వరకు జగిత్యాల దువ్వంతాలుక్‌దారులు (Deputy Collectors) నివసించేవారు. ఇప్పుడు అతని గడి అంతయు

ఆబాదిగా మారి సంతోష్‌నగర్‌గా ఏర్పడింది. జువ్వాడి చొక్కారావు పెద్ద కుమారుడు రాంకృష్ణారావు వంతుకు భీమారంగడి రాగా, చిన్న కుమారుడు శరత్ చంద్రరావుకు రాజారం గడి వచ్చింది. వీరిరువురు బాబులు హైదరాబాద్‌లోనే స్థిరపడినారు.

కోరుట్ల, యూసుఫ్‌నగర్‌ల వతందారుగా చందామియా కుమారుడు నిజామొద్దీన్ ఉండేవాడు. నిజామొద్దీన్ అలీఘర్ విశ్వవిద్యాలయము నుండి పట్టభద్రుడైనాడు. ఇతని తమ్ముడు మొహిదిన్‌పాషా. వీరు మల్యాలలో గూడా భూస్వాములు. ప్రప్రథమంగా జగిత్యాల ప్రాంతములో నిజామొద్దీన్ ప్రైవేటు బసు సర్వీసులు నడిపాడు. అతడు నడిపించిన బస్‌ల వలన ప్రజల రాకపోకల సౌకర్యములు పెరిగాయి. రోడ్‌ట్రాన్స్‌పోర్ట్ కార్పోరేషన్ బస్సులు ప్రారంభము కావడానికి పూర్వము నిజామొద్దీన్ బసుసర్వీసులే ఆధారము. అంతకు పూర్వము ఎడ్లబండ్లు, సైకిళ్లు, కాలినడకయేగతి. పోలీసుచర్య 1948లో జరుగుమట్టుకు దాదాపు ఇదే పరిస్థితి కొనసాగింది. ఆ రోజులలో కోరుట్ల దొడ్డు కాగతముల తయారి పరిశ్రమకు కేంద్రము. బీడీ పరిశ్రమ గూడా కోరుట్ల యందు దినదినాభివృద్ధి చెందింది. నిజామొద్దీన్ కుమారులు జాఫర్ నిజాం మరియు అన్వర్ నిజాం. పెద్దకుమారుడు జాఫర్‌నిజాం ఉస్మానియా విశ్వవిద్యాలయములో ప్రొఫెసర్‌గా పనిచేసి కాకతీయ విశ్వవిద్యాలయమునకు వైస్‌ఛాన్స్‌లర్‌గా పనిచేశాడు. ప్రస్తుతము హైదరాబాద్‌లో స్థిరపడినారు.

సిరికొండ, పోతారం, కట్కాపురం, తాటిపెల్లి గ్రామాలకు సిరికొండలోని వైశ్య కుటుంబమునకు చెందిన బట్టు లచ్చన్న వతందారుగా ఉండెను. ఇతడు ఈ నాలుగు గ్రామాల పాలనావ్యవహారములు సిరికొండ కేంద్రంగా నిర్వహించాడు. ఈ సిరికొండ కోరుట్ల సమీపపు కథలాపురం మండలంలో ఉంది. బట్టు లచ్చన్న వెలమదొరలవలె తన అధికారాన్ని నడిపాడు. ఇతనికి కోరుట్ల వతందారు నిజామొద్దీన్‌తో తగాదాలుండేవి. బట్టు లచ్చన్న సవారి కచ్చడము లేదా బండిలో (A Small cart drawn by bulls) ప్రయాణించుచుండగా నిజామొద్దీన్ అనుచరులు బందూకుతో కాల్పులు జరుపగా తూటా దూసుకొని పోయి ఇతడు గాయపడినప్పటికిని బ్రతికి బయటపడ్డాడు.

రాయికల్ మండలంలోని ఇటిక్యాల సంస్థానం వెలమల మక్తాగా ఉండేది. ఇటిక్యాల మక్తేదార్ గడి భవనము కట్టించాడు. ఇటిక్యాల సత్యనారాయణరావు తరువాత కాలములో శాసనసభ్యులుగా నుండిరి. ఇటిక్యాల సంస్థానము క్రిందనే రుద్రంగి గడి ఉండేది. వెల్లుల్ల సమీపమున నున్న విట్టంపేట కరణం బ్రాహ్మణుడైన కిషన్‌రావు మక్తాను ప్రభుత్వము గైకొని అతనికి జీవితాంతము భరణమిచ్చింది. రాయికల్ మండలంలో రామాజిపేట వతందారు వేంకటేశ్వరరావు ప్రజలను పీడించాడు. అతడు సవారి కచ్చడములో ప్రయాణించుచుండగా ప్రజలే అతనిని హతమార్చినారు. వేంకటేశ్వరరావు పెద్ద కుమారుడు విజయ రంగారావు మెటుపెల్లి దేశ్‌ముఖ్ వెంకట నర్సింగరావు గడికి పెంపకముగా ఇవ్వబడినాడు. తదనంతర కాలములో ఈ



విజయ రంగారావు శాసన సభ్యునిగా, కరీంనగర్ జిల్లా పరిషత్ చేర్మెన్‌గా గూడా పనిచేశాడు. వెంకటేశ్వరరావు ఇతర కుమారులలో యశ్వంతరావు కోరుట్ల గడికి పెంపకముపోగా రాజగోపాల్‌రావుకు గుండంపెల్లి, విద్యాసాగర్‌రావుకు రామాజిపేట వతన్‌లు మిగిలాయి.

ధర్మపురి సమీపమున గల నేరెల్ల గడికి గోవిందరావు అధిపతిగా నుండేవాడు. తదనంతర కాలములో అతని కుమారుడు యస్.జనార్ధన్‌రావు జగిత్యాల సమితి అధ్యక్షునిగా పనిచేశాడు. బుగ్గారంకు సమీపమున నున్న మద్దునూరు వతందారు జువ్వాడి రాజేశ్వరరావు తీవ్రవాదుల భయానికి హైదరాబాద్‌లో స్థిరపడినాడు. మేడిపెల్లి సమీపమున నున్న గోవిందారం గడి రాజేశ్వరరావు ఆధిపత్యములో ఉండేది. అతని కుమారుడు రాజగోపాల్‌రావు జగిత్యాలలో స్థిరపడినాడు. పుణ్యక్షేత్రమైన ధర్మపురి మరియు పొలాస గ్రామములు బ్రాహ్మణుల అగ్రహారములుగా ఉండేవి.

జగిత్యాల ప్రాంతమున 60 గ్రామాలకు కరణం బ్రాహ్మణుడైన చాకుంట కిషన్‌రావు దేశ్‌పాండేగా ఉండేవాడు. దేశ్‌పాండేలకు, దేశాయిలకు పన్నులు వసూలు చేయు బాధ్యతలుండేవి. దేశ్‌ముఖ్, సర్దేశ్‌ముఖ్‌లకు మాలి, కోత్వాల్ పాలనా బాధ్యతలుండేవి. చాకుంట కిషన్‌రావు దేవిడి (కచేరి) జగిత్యాల బ్రాహ్మణవాడకు సమీపమున నుండేది. ఇతని వద్ద పాంపాట్టి బుచ్చిరాజం వైశ్యుడు తహసీల్దార్‌గా నుండేవాడు. ప్రప్రథమంగా జగిత్యాల ప్రాంతానికి చాకుంట కిషన్‌రావు దేశాయి కొని తెచ్చిన టూరింగ్ (Car)ను చూచుటకై ప్రజలు ఆసక్తితో వచ్చేవారు. ఆ కాలములో చిన్నకారును టూరింగ్ అనేవారు. ఇతనికి కోరుట్ల నిజామొద్దీన్ వతందారుకు ప్రచ్ఛన్న వైరములుండేవి. చాకుంట కిషన్‌రావు మద్యమునకు బానిసయని ఎతిగిన విరోధులు ఆయనకు మద్యములో విషప్రయోగము చేసి తుదముట్టించారని తెలుస్తుంది. చాకుంట కిషన్‌రావుకు ముగ్గురు సోదరీమణులు. ఒకరు మానకొండూరు దేశాయి సదాశివరావు తల్లి, మరియొకరు జగిత్యాల విష్ణుదాసుగోపాల్‌రావు భార్య. విష్ణుదాస్ గోపాల్‌రావు జగిత్యాల సమీపమున గల తిప్పన్నపేట, గోపాల్‌రావుపేటల భూస్వామి. ఇంకొకరు చాకుంట గంగాధర్ తల్లి. చాకుంట కిషన్‌రావు కీర్తి ప్రతిష్ఠలు నలుదిశల వ్యాపించాయి.

ధర్మపురి మండలంలోని బుగ్గారం కరణం బ్రాహ్మణుడైన నమిలెశంకర్రావు 40 గ్రామాలకు దేశాయిగా ఉండేవాడు. ఇతని ఆస్తి గూడా చాకుంట కిషన్ రావునకే సంక్రమించింది.

పెద్దపెల్లి ఆరవ నిజాం వజీరైన రాజా శివరాజ్ బహాదూర్ జాగీరుగా ఉండేది. బండలింగాపురం వలె దీనిని గూడా వెలమలకు కాంట్రాక్టు పద్ధతిపై ఇచ్చేశాడు. నస్పూర్ ముత్యంరావు పెద్దపెల్లిలో గొప్ప భూస్వామి. మంథని ప్రాంతపు తాడిచెర్ల గడి గూడా వెలమదొరల ఆధీనంలో ఉండేది. వేములవాడ, సిరిసిల్ల దేశ్‌ముఖ్‌ల పాలనలో ఉండేవి. సిరిసిల్ల ప్రాంతములోని నేరెల్ల గడి సర్దైన గోపాల్‌రావు, గజ సింగారం గడి కోరుకంటి రాజేశ్వరరావు, నిమ్మపెల్లి గడి నేటి భాస్కరరావు పూర్వీకుల అధీనములో ఉండేది.

1903లో మెటుపెల్లి ప్రాంతమును కలుపుకొని పాత జగిత్యాల తాలుకాలో 221 గ్రామములుండెనని, ఇవి గాక ఇంకను మదిరెలుండెనని జైశెట్టి రాజయ్య (1842-1921) తన కవితలలో పేర్కొన్నాడు[192]. యెల్లాపికులమునకు చెందిన గందె వారికి చిలువాకోడూరు, ఇసరాజపల్లె, వెంగళాపురం, గుల్లకోట నాలుగు జాగీర్లు జగిత్యాల తాలుకాలోను, ఇతర తాలుకాలలో పైడిపెల్లి, ముంజంపెల్లి యని మరి రెండు జాగీర్లుండెనని జైశెట్టి రాజయ్య 1903లో తెలిపినాడు. గందె వంశమునకు చెందిన వెంగళాపురం ధర్మారావు జగిత్యాలలో స్థిరపడినాడు.

పూర్వము పల్లెల్లో కచేరీలుగా, న్యాయస్థానాలుగా వెలుగొందిన గడులు నేడు శిథిలావస్థలో ఉన్నాయి. ఎందరో అమాయక ప్రజల కష్టంతో నిర్మించిన గడులు నేడు నిర్మానుష్యమై, కళావిహీనమై వెలవెల బోతున్నాయి. బండలింగాపురం, ఐలాపురం, రాయికల్, ఇటిక్యాల, రుద్రంగి, చల్‌గల్, భీమారం, రాజారం, నేరెల్ల, వేములవాడ, సిరిసిల్ల, ఇల్లంతకుంట, రాచర్ల బొప్పాపురం, నిమ్మపెల్లి, పెద్దపల్లి, తాడిచెర్ల, నేరెళ్ల, గజసింగారం మున్నగు ప్రాంతములలోని గడులన్నియు నాటి నిరంకుశ పాలనకు నిదర్శనాలుగా నిలిచిఉన్నాయి.

## నిజాం కాలములో భూస్వాముల ప్రజాపీడన

నిజాం నిరంకుశపాలనలో సంస్థానాలు, జాగీర్దారులు, మక్తేదారులు, ఇనాందారులు, వతందారులు, దేశ్‌ముఖ్‌లు, దేశాయిలు, అగ్రహారీకులు అను పేర్లతో భూస్వాములు (Feudal Lords) పెత్తందారులు ప్రజలను దోచుకొని పీల్చి పిప్పి చేశారు. ఈ దోపిడి దారులంతా నిజాం సర్కారుకు తాబేదార్లుగా, తొత్తులుగా వ్యవహరించారు. పన్నులు వసూలు చేసే దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు, వతందారులు, జాగీర్దారులు, దొరలు సృష్టించిన అరాచకాలు హృదయ విదారకరమైనవి. దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యానికి గురైన రైతులు కౌలుదారులుగా మారారు. సాగులో ఉన్న అతి సారవంతమైన వేలాది, వందలాది ఎకరాల భూములను కబళించి భూస్వాములు తమ స్వంత ఆస్తులుగా మార్చుకున్నారు. అప్పులు తీర్చలేని రైతుల భూములు లాక్కునేవారు. పన్నులు చెల్లించలేని రైతులను తీవ్రంగా హింసించేవారు. వంశ పారంపర్య హక్కులతో గ్రామాధికారులుగా మారిన మాలిపటేల్, పట్వారీలు చదువురాని ప్రజలను నానారకాల అవస్థలపాలు జేసినారు. ఆనాటి ప్రజలు పడిన వేదనలు, పీడనలు వర్ణనాతీతం.

దొరలు అన్నివర్గాల ప్రజలను తమకు సేవలు చేసే బానిసలుగా భావించేవారు. పల్లకీలు, మేనాలు మోయటం, దొరలు ప్రయాణించే ఎడ్లబండ్ల ముందు వెనకాల చాకలి మంగలులు పరుగెత్తటం సర్వ సాధారణ విషయం. కుమ్మరి, కమ్మరి, వడ్రంగి మున్నగువారు ఉచితంగా పనులు చేయటం సాధారణ విధులుగా మారినాయి. అన్ని గ్రామాలలో అన్ని కులాల వారికి వెట్టి చాకిరి తప్పలేదు. దోపిడి, వెట్టిచాకిరి, బానిసవిధానం సర్వత్రావ్యాపించింది. దొరగారి భూములలో విత్తనాలు నాటిన తరువాత గాని రైతులు తమ భూములలో నాటుకొనుటకు



వీలులేని దైన్యస్థితి ఉండేది. వ్యవసాయ కార్మికులు, మహిళా కూలీలు నాట్లు, కలుపులు, కోతలు వంటి వ్యవసాయ పనులన్నీ ఉచితంగా చేసేవారు. స్త్రీలు, వృద్ధులు, బాలలకు గూడా మినహాయింపులేదు. పచ్చి బాలెంతలైనా వెట్టి చాకిరికి వెళ్లేవారు. కొన్ని చోట్ల ఏడ్చుచున్న శిశువులకు గూడా తల్లులు పాలివ్వకుండా పని చేయించుచూ భూస్వాములు అతి కౄరంగా ప్రవర్తించేవారు. దొరల ఇళ్లు ఊడ్వటము, అలుకుచల్లడము, బోళ్లు శుభ్రపరచడం, బట్టలు ఉతకటం, పిండి విసరటము, వడ్లు దంచడము, పాలుపితకటం, అడవిలో గడ్డికోసి మోపులుగా కట్టి తేవడం, కాళ్లు వత్తడం, స్నానాలు చేయించడం ఒక్కటేమిటి అన్నిపనులు అమాయక పేద ప్రజలే కిక్కురు మనకుండా కుక్కిన పేనులవలె చచ్చినట్లు చేసేవారు. వారి పట్ల ఏ మాత్రం జాలి, కరుణ, కనికరం చూపేవారు కాదు. గడుల ముందు ఎవరైనా దొరలు కూర్చొని ఉంటే అటువైపు వెళ్లే ప్రజలు చెప్పులు చేతపట్టుకొని "నీ బాంచెన్ దొర" అని దండం పెడుతూ పొయ్యేవారు. దొరలకు "నీ బానిసన్ దొర"యని పలుకు పదములే క్రమేపి "నీ బాంచెన్‌దొర" గా మారినాయి. తెలంగాణా సాయుధ పోరాట సమయము (1946-1951) లో కమ్యూనిస్టుల భయానికి దొరలందరు తమ గడులను వదలిపెట్టి పట్టణాలకు పారి పోయినారు. వారి స్థానములో ఆముక్త్యారాంయను గుమాస్తాలను నియమించినారు. ఈ గుమాస్తాల పాలన గూడా ప్రజలపై తీవ్ర ప్రభావము చూపింది. కొందరు గుమాస్తాలు అసలు దొరలకంటే అధికంగా అధికారము చెలాయించి సామాన్య ప్రజలను దోచుకొన్నారు. రాయికల్ గడి గుమాస్తా లక్ష్మారెడ్డి ముందు ఎవరు చెప్పులు వేసికొని నడిచేవారు కాదట. అట్లు చేయని వారిని కొరడాతో కొట్టి చిత్రహింసలు పెట్టేవారట. ఇలాంటి దోపిడి దౌర్జన్యాలకు గురైన బాధితుల నుండే దొరలకు వ్యతిరేకంగా, నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటము ఆవిర్భవించింది.

ప్రజల పీడన అంతయు 20వ శతాబ్దపు ప్రథమార్థములో జరిగింది. కాని గత రెండు మూడు దశాబ్దముల నుండి పరిస్థితులు పూర్తిగా తారుమారైనాయి. ఏ పని చేయుటకు అలవాటు పడని చాలా మంది దొరలు పనిపాటాలేకుండా దీనావస్థలో జీవించుచున్నారనుటలో అతిశయోక్తి లేదు.

## తెలంగాణా సాయుధ పోరాటము (Armed Struggle in Telangana) (1946-1951)

తెలంగాణాలో 1946 అక్టోబర్‌లో రైతాంగ సాయుధ పోరాటము ఆరంభమైంది. నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణా సాయుధ పోరాటమునకు ఆంధ్ర మహాసభ బీజం వేసింది. నిజాం పాలనను, రజాకార్ల దురాగతాలను ఎదుర్కోవడము ప్రధాన లక్ష్యమైనను, వారి సత్వర శత్రువులు మాత్రము పల్లెలలోని భూస్వాములే. భూస్వాముల అరాచకాలు రైతాంగ ఉద్యమానికి ఆజ్యము పోసినవి[193]. 1948లో పోలీసు చర్య జరిగిన తరువాత గూడా మూడు సంవత్సరాలు రైతాంగవిముక్తికై సాయుధ పోరాటము కొనసాగడము ఈ విషయమును ధృవపరచుచున్నది. తెలంగాణలో "బగేల" పద్ధతి కొనసాగింది. పేదవారికి, తక్కువ కులాల

వారికి భూస్వాములు వడ్డీపై అప్పులిచ్చేవారు. అప్పు తీరే మట్టుకు ఆ వ్యక్తి, అతని భార్య భూస్వామి పొలాలలో పని చేయవలె. వారికిచ్చే కూలి వడ్డీ క్రింద పోయేది. వడ్డీ కన్న కూలి తక్కువ. జీవితాంతము కాయకష్టము చేసినను వడ్డీ గూడా తీరకుండెను. అప్పుతీరే ప్రసక్తే లేదు. వారి సంతానం ఇదే పద్ధతిలో "బగేలా"గా మారుతుంది[194]. అదే రీతిగా పేదరైతాంగముతో వెట్టి చాక్రిరి చేయించేవారు. ఈ పేదల బానిసబ్రతుకులు నికృష్టమైనవి. హీనాతిహీనమైనవి. అందులకే అనేక మంది యువకులు అజ్ఞాతములోకి వెళ్ళి ఆయుధాలను చేతబూని భూస్వాములపై, వారి గుమాస్తాలపై ప్రతీకారము తీర్చుకొన్నారు.

కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల తాలుకాలో గల గాలిపల్లి గ్రామము సాయుధపోరాటానికి స్ఫూర్తి నిచ్చింది. బద్దం ఎల్లారెడ్డి, బద్దం మల్లారెడ్డి, బద్దం బలరాంరెడ్డి వంటి ఎందరో వీరపుత్రులను గన్న జన్మభూమి గాలిపెల్లి. 1947 సెప్టెంబర్‌లో గాలిపెల్లి ప్రజలు నిజాం పోలీసులను ఎదురించి వారిని ఊరి పొలిమేరలకు తరిమినారు. తదనంతరము అదనపు బలగాలతో వచ్చిన పోలీసులు గాలిపల్లి పై తూటాల వర్షము కురిపించగా అనేకులు ప్రాణాలు గోల్పోయిరి. బుల్లెట్ తగిలి బ్రతికి బయటపడిన వారిలో సింగిరెడ్డి, అంజిరెడ్డిలున్నారు. 300 మంది పోలీసుల శిబిరము గాలిపల్లిలో విడిది చేసింది. వారు రైతాంగమును ముప్పుతిప్పలు పెట్టినారు. గాలిపల్లికి చెందిన బద్దం ఎల్లారెడ్డి తదనంతరకాలములో పి.వి. నరసింహారావును ఓడించి 1952 సాధారణ ఎన్నికలలో పార్లమెంట్ సభ్యునిగా మరియు బద్దం మల్లారెడ్డి జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యునిగా ఎన్నికైనారు.

కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపురం మండలమందు గల పోలంపల్లి గ్రామములో 1910 ఆగస్టు 15న యెల్లాపు పెద్దింటి బిడ్డగా పుట్టి నిజాం ప్రభుత్వముపై రణభేరి మ్రోగించిన అనభేరి ప్రభాకర్‌రావు తెలంగాణా వీరుడు. నిజాం కాలేజిలో చదువుచూ గాంధీజీ ఆశయాలకు ఉత్తేజితుడై ఉద్యమంలోనికి దిగినాడు. 1947 సెప్టెంబర్ 13న బద్దం ఎల్లారెడ్డి తదితర నాయకులు సాయుధ పోరాటమునకై పిలుపు నిచ్చారు. కరీంనగర్ జిల్లాలో అనభేరి ప్రభాకర్‌రావు నాయకత్వంలో తొలిదళం ఏర్పడింది. వీరు 1948 జనవరి, ఫిబ్రవరిలలో 40 గ్రామాల పటేల్, పట్వారీల దస్తరాలను (Records) దహనం చేసినారు. 1948 మార్చిలో హుస్నాబాద్‌కు సమీపమున గల మాందాపురం గుట్టలలో పోలీసులతో, రజాకార్లతోను వీరోచితంగా దళసభ్యులు పోరాడి ఎదురు కాల్పులు జరిపినారు. అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డితో పాటు ఎనిమిది మంది వీరమరణము పొందినారు[195]. నిజాం పాలనను, రజాకార్లను ధైర్యంగా ఎదురించి కరీంనగర్ జిల్లాలో చైతన్యము తెచ్చిన అనభేరి ప్రభాకర్‌రావు చిరస్మరణీయుడు.

పేదప్రజలు ఈ ఉద్యమమును బలపరచినారు. భూస్వాముల పీడన వలన వారికి తిండి గింజలే లభ్యమగుట కష్టముగా ఉండేది. మక్కలను రవ్వ రూపంలో విసరుకొని (Maize Crushed into small pieces) గట్కా వండేవారు. దానికి తోడుగా కారం కలుపుకునేవారు. ఈ



మక్క గట్కాయే రెండు పూటలు దొరికితే మహాభాగ్యంగా ఉండేది. చుట్టం వస్తేగాని, పండుగ రోజులలో గాని అన్నం వండుకునే అవకాశం లభించేది. కడు బీదలు జొన్న అంబలి త్రాగేవారు. ఒక్క జొన్నరొట్టెకై రోజంతా పనిచేసిన ఉదంతాలున్నాయి. దాదాపు రెండు దశాబ్దముల క్రింది వరకు గట్కా తిన్నకుటుంబాలున్నాయి. ఈ దైన్యస్థితి భూస్వాముల వ్యతిరేక పోరాటానికి చేయూత నిచ్చింది.

తెలంగాణా సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించిన వేరొక నాయకుడు అమృత్‌లాల్ శుక్లా. ఇతడు సిరిసిల్ల ప్రాంతమునకు చెందినవాడు. ఉపాధ్యాయునిగా తొలుత పనిచేసినాడు. పెన్‌ను వదలి గన్‌ను చేత బూని సాయుధ పోరాటము సాగించాడు. యువకులైన గన్నేరువరం దామోదర్‌రావు, గట్టుపెల్లి మురళి లేదా మురహర్‌రావు. ఠాకూర్ శ్యాంసుందర్‌సింగ్ మున్నగు వారు కరీంనగర్ జిల్లాలో తీవ్ర సంచలనము సృష్టించారు. కమ్యూనిస్టులు పట్టపగలే గడులపై దాడులు జరిపి ప్రజానీకమును పీడించిన దొరలను గుమాస్తాలను గూడా కాల్చిచంపారు. 1949–1950 మధ్యకాలములో చందుర్తి మండలంలోని రుద్రంగి పై సాయుధ కమ్యూనిస్టులు దాడి చేసి గడిని ధ్వంసం చేశారు. పటేల్ పట్వారీల దస్త్రాలను ఫైళ్లను, రిజిస్టర్లను బజార్లో వేసి నిప్పంటించినారు. ప్రజలను పీడిస్తూ రాజభోగాలు అనుభవించిన జమీందారులు, దేశ్‌ముఖ్‌లు, భూస్వాములు మరియు వారి గుమాస్తాలు సాగించిన నిరంకుశ పాలనకు కమ్యూనిస్టుల రాకతో కాలం చెల్లిపోయింది.

ఠాకూర్ శ్యాంసుందర్ సింగ్ జగిత్యాల, కరీంనగర్ ఉన్నత పాఠశాలలో చదివినాడు. 1946లో అతడు విద్యార్థులకు నాయకత్వము వహించగా పాఠశాల నుండి బహిష్కరింపబడినాడు. కమ్యూనిస్టు ఉద్యమములో పాల్గొని గట్టుపెల్లి మురహర్‌రావుతో కలిసి పోరాటము సాగించినాడు. శ్యాంసుందర్‌సింగ్ పెద్దపెల్లిలో ప్రస్తుతము న్యాయవాదిగా నున్న ఠాకూర్ రాజారాంసింగ్ యొక్క సోదరుడు. గట్టుపెల్లి మురహర్‌రావు, శ్యాంసుందర్‌సింగ్, గన్నేరువరం దామోదర్‌రావులను నిజాం పోలీసులు తరుముతూ వెంబడించగా వారు నంది మేడారం చెరువులో దూకి కమలపు మొక్కకాడలకు (Sticks of Lotus buds) రంధ్రములు చేసి నోట్లో పెట్టుకొని గాలిని పీలిస్తూ నీటియందే మునిగి ఈదుకుంటూ పోలీసుల కన్నులు కప్పి బ్రతికి బయట పడ్డారని తెలియుచున్నది. 1951 అక్టోబర్‌లో అధికారికంగా కమ్యూనిస్టుల పోరాటము విరమింపబడినది. 1952 సాధారణ ఎన్నికల యందు వారు పాల్గొన్నారు.

## సామాజిక చైతన్యము

సిరిసిల్లలో 1935లో జరిగిన ఆంధ్ర మహాసభ వలన కరీంనగరము జిల్లాలో సామాజిక చైతన్యము పెరిగింది. తాలుకా కేంద్రాలలో ఆంధ్రమహాసభ శాఖ లేర్పడి ప్రజలను విజ్ఞానవంతులను చేయుటకై గ్రంథాలయముల స్థాపనగావించి, సాంఘిక దురాచారములను మాన్పుటకై అమితంగా

కృషి సలిపినవి. జగిత్యాలలో 1935లోనే ఆంధ్రమహాసభ శాఖను కాసం శివరాజగుప్త, జైశెట్టి లక్ష్మిరాజం గుప్త, సిద్ధంశెట్టి వీరసంగయ్య మున్నగు వారు ఏర్పరచి సంఘ సంస్కరణలకై శ్రీకారము చుట్టారు. బాల్యవివాహములను నిరుత్సాహపరచి వితంతు వివాహములను ప్రోత్సహించారు.

వరంగల్‌లోని చందాకాంతయ్య సేటు దానశీలి, ఉదార స్వభావము గల సౌజన్యమూర్తి. అతని పేరట స్థాపించబడిన కళాశాల నేటికిని వరంగల్‌లో నడుచుచున్నది. 1945లో చందాకాంతయ్య మరియు ప్రొద్దుటూరి వీరేశం గారలు జగిత్యాలలో సిద్ధంశెట్టి వీరసంగయ్య గృహము నందు సమాజములో మార్పులు తెచ్చుటకై జరిగిన సభలో పాల్గొన్నారు. 300 సభ్యులు పాల్గొనిన ఈ సభలో రాయంచ లక్ష్మికాంతం సార్, మందిరం చంద్రమౌళిశాస్త్రి, జగన్నాథాచార్యులు ఉపన్యసించినట్లు తెలియుచున్నది.[196] వారు బాలికలకు 14 సంవత్సరములు బాలునికి 18 సంవత్సరములు కనీస వయస్సు వివాహమునకై ఉండవలెనని తీర్మానించారు. 1943లో కాసం శివరాజగుప్త అనేక పల్లెలలో తిరిగి వితంతువులు మరల వివాహము చేసికొనవలెనని ప్రబోధించారు. మెటుపెల్లిలో అతడు కొంతకాలము ఉపాధ్యాయునిగా పనిచేశాడు. ఒక పరియాయము ఒక వితంతువుకు కాళ్లు కడిగి కన్యాదానము చేయుటకు ఎవరు ముందుకు రాకపోగా తానే ధైర్యంగా ముందుకు వచ్చి వితంతువు కాళ్లు కడిగి కన్యాదానము చేసిన ధీరుడు ధీమంతుడు కాసం శివరాజగుప్త. స్త్రీ విద్యావ్యాప్తికై అతడు ఆంధ్రప్రాంతము నుండి నాగమణి యను పంతులమ్మను తీసికొని వచ్చి ఆంధ్ర బాలికా పాఠశాలను జగిత్యాలలో స్థాపించాడు. జగిత్యాల ప్రాంతమునకు ప్రప్రథమ న్యూస్ ఏజెంట్‌గా నుండి అనేక వార్తా పత్రికలను వార పత్రికలను తెప్పించి ప్రజల విజ్ఞానాభివృద్ధికై పాటుపడెను. హిందీ ప్రచార సభ పక్షమున ప్రథమ నుండి విద్వాన్ వరకు పరీక్షల నిర్వహణకై తోడ్పడినాడు. వారికాలములో హిందీ అర్హతాపత్రములతో నియమింపబడిన ఉపాధ్యాయులనేకులు ఇప్పుడు రిటైరగుచున్నారు.

1939లో వరంగల్ జిల్లా యందు ఐదు గ్రంథాలయములుండగా కరీంనగర్ జిల్లాలో కేవలము ఒక గ్రంథాలయముండెను. శివరాజగుప్త జగిత్యాలలో 1944లో ఆంధ్ర గ్రంథాలయ స్థాపనకై తోడ్పడెను. ఈ గ్రంథాలయ స్థాపనలో అర్వపెల్లి లచ్చయ్య, కాసం శంకరయ్య మున్నగు వారి కృషి బహుళముగా నుండెనని తెలియుచున్నది. ఇన్ని విధముల సంఘ సంస్కరణలకై తోడ్పడిన కాసం శివరాజగుప్త గారిని "జగిత్యాల కందుకూరి వీరేశలింగం"అని అభివర్ణించుటలో అతిశయోక్తి లేదు.

గాంధీజీ ప్రబోధములను ఆదర్శంగా తీసుకొని జగిత్యాల వైశ్యుడు రాగెల్ల లచ్చయ్య హరిజనోద్ధరణకై పాటుపడ్డాడు. ప్రతి దినము హరిజనవాడకు వెళ్లి వారికి వయోజనవిద్య, పారిశుద్ధ్యము మున్నగు రంగములలో సేవలందించుచు అంటరానితనమును రూపు మాపుటకై బహుళముగా కృషి చేసిన రాగెల్ల లచ్చయ్యను "జగిత్యాల గాంధి"గా ప్రజలు పిలిచేవారు. రాఘవపట్నం రామసింహం కవి సాంఘిక దురాచారములను తొలగించుటకై 'బాలవివాహఖండన' పునర్వివాహమండన' మున్నగు పుస్తకములను రచించి తన పద్యములను మిగుల ప్రాచుర్యములోనికి తెచ్చాడు.



జాతిపిత మహాత్మాగాంధి తెలంగాణములో అడుగిడిన సందర్భములో ఎందరో యువకులు స్ఫూర్తి పొందారు. 1929లో గాంధీజీ ఖమ్మం వచ్చినప్పుడు వేలాది మంది అతన్ని దర్శించుకొన్నారు[197]. జమలాపురం కేశవరావులాంటి యువకులెందరో వారి బోధనలతో ప్రభావితులైనారు. గాంధీజీ మద్రాసు నుండి వార్ధా వెళుతుండగా 1946 మార్చి 5న ఆనాటి యువకులు వరంగల్‌లో కొద్ది సమయము కొఱకు ఆపినారు. యం.యస్.రాజలింగం, చందా కాంతయ్య, టి.హయగ్రీవాచారి, చంద్రమౌళీశ్వర్‌రావు, నాగభూషణ్‌రావు మున్నగు వారు ప్లాట్‌ఫారం ప్రక్కనే బహిరంగ సభనేర్పాటు చేశారు. దాదాపు ఐదు లక్షల మంది హాజరైనారు[198]. సభలో పాల్గొనిన గాంధీజీ ఒక గంట విరామం తీసికునే సమయములో యువకులు రెండు లక్షల రూపాయల విరాళాలు వసూలు చేసి గాంధీజీకి అందించినారు. స్త్రీలు తమపై నున్న బంగారు ఆభరణములను సమర్పించారు. చందా కాంతయ్య కోరగానే అతని భార్య తనపై అలంకరించుకొనిన బంగారమంతయు గాంధీజీకి విరాళంగా సమర్పించెనని ప్రతీతి. కరీంనగర్ జిల్లా నుండి గూడా వేల సంఖ్యలో గాంధీజీ సభలో పాల్గొని స్ఫూర్తి పొందారు.

## సంలీనోద్యమము Join Indian Union Movement (1947-1948)

1947 మే నెలలో హైదరాబాద్ కాంగ్రెస్ సభలు జరిగాయి. ఆనాటి కాంగ్రెస్‌లో స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావుల నాయకత్వంలో రెండు వర్గములేర్పడినాయి. ఈ సభలో రామానంద తీర్థ అధ్యక్షులుగా ఎన్నికైనారు. ఆయన 1947 ఆగస్టు 7న హైదరాబాద్ రాష్ట్రము భారత యూనియన్‌లో చేరవలె (Join Indian Union Movement) అనే ఉద్యమముతో సత్యాగ్రహాన్ని ఆరంభింపవలసినదిగా పిలుపు నిచ్చాడు. రాష్ట్రమంతట కార్యకర్తలు ఊరేగింపులు చేశారు. నిజాంకు వ్యతిరేకంగా సరిహద్దు శిబిరాలు నిర్వహింపబడినాయి. విజయవాడ క్యాంపుకు టి.హయగ్రీవాచారి, పరిటాలకు కోదాటి నారాయణరావు ఉద్యమ నిర్వహణ బాధ్యత వహించినారు. చాందాను తమ ముఖ్యస్థావరంగా చేసికొని కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో అజ్ఞాత యోధులు సాగించే పోరాటాన్ని నడిపే బాధ్యతను పి.వి. నరసింహారావు, కె.వి.నర్సింగరావులు వహించినారు.

భీందేవరపల్లి మండలంలోని వంగర గ్రామములో 1921లో కరణం బ్రాహ్మణుల కుటుంబములో రంగారావు రుక్మిణీ దంపతులకు పాములపర్తి వెంకట నరసింహారావు జన్మించారు. వంగరలోను, కరీంనగర్ ఉన్నత పాఠశాలలోను అతని విద్యాభ్యాసం జరిగింది. వరంగల్‌లో పాత ఇంటర్మీడియెట్ (Old Inter Course of two years, after which the Degree Course was of only two years in O.U.) చదువుచుండగా వందేమాతరం ఉద్యమంలో పాలు పంచుకున్నారు. నిజాం నిరంకుశాన్ని ఎదురించటంతో హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయము నుండి

పి.వి. బహిష్కరింపబడినాడు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ క్యాంపు పెట్టి నాగపూర్ కేంద్రంగా నిజాంకు వ్యతిరేకంగా పోరాడినాడు. 1947లోనే కాంగ్రెస్‌లో చేరి అంచెలంచెలుగా ఎదిగి చివరకు ప్రధానమంత్రిగా ఐదేళ్లపాటు 1991-1996 వరకు ప్రభుత్వమును నడిపిన ఘనత కరీంనగర్ జిల్లా ముద్దుబిడ్డయైన పి.వి.కే దక్కింది. ఇతని కుమారులే పి.వి. రంగారావు, పి.వి.రాజేశ్వరరావులు.

రామడుగు కరణం బ్రాహ్మణుల కుటుంబములో జన్మించిన కల్వకోట వెంకటనర్సింగరావు (కె.వి) స్వయాన పి.వి.కి వియ్యంకుడు. పి.వి. కూతురు సరస్వతి వివాహము కె.వి.పెద్దకుమారుడైన డా.శరత్‌తో జరిగింది. అలాగే హుస్నాబాద్ లక్ష్మీకాంతరావు గూడా పి.వి.కి వియ్యంకుడే. లక్ష్మికాంతరావు కూతురు వివాహము పి.వి.కుమారుడైన రాజేశ్వర్‌రావుతో జరిగింది. వియ్యంకులు ముగ్గురు నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన ధీరులే. కరీంనగర్ జిల్లాలో ఇరువురు మేధావులైన పి.వి. మరియు కె.వి. నిజాంకు వ్యతిరేకంగా జరిపిన పోరాటము చిరస్మరణీయం. కె.వి.నర్సింగరావు సరిహద్దులోని బెజవాడ జోనల్ కార్యాలయం సూచనలననుసరించి 300 మంది కార్యకర్తలతో చాందా సరిహద్దుక్యాంపు నడుపుతూ విజయవంతంగా హైదరాబాద్ విమోచన పోరాటం సాగించాడు. 1947లో బల్హార్షా ఉపశిబిరమును కె.వి. కేశవులు నడిపారు.

కరీంనగర్ జిల్లాలోని మంథని నివాసి రఘునాథరావు కాచే సత్యాగ్రహము చేసిన వారిలో ప్రథముడు. కరీంనగర్ జిల్లాలోని జువ్వాడి వంశస్థులు నిజాం వ్యతిరేకపోరాటములో చురుకుగా పాల్గొన్నారు. ఇరుకుల్ల గ్రామమునకు చెందిన జువ్వాడి గౌతమరావు, జువ్వాడి రామేశ్వరరావు, జువ్వాడి హనుమంతరావు, జువ్వాడి మురళీధర్‌రావు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. గౌతమరావు 1929లో ఇరుకుల్ల పద్మనాయక కుటుంబములో జన్మించాడు. విద్యార్థి దశ నుండియే నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొని నిజాం ప్రభుత్వముచే నిర్బంధింపబడినాడు. 1947 అక్టోబర్‌లో ఔరంగాబాద్ జైలులో బందీగా ఉన్నాడు. 1947 డిసెంబర్‌లో ఔరంగాబాద్ జైలు నుండి తప్పించుకొని, అజ్ఞాతవాసంలో నున్న తన సాటి వారితో కలిసి పోరాటం మరల సాగించాడు. గౌతమరావు ఎంతటి స్వాతంత్ర్య సమరయోధుడో అంతటి సాహితీపిపాసి. 1946 నుండియే కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సాహిత్యముతో ఆకర్షితుడైనాడు. 1953లో వారితో పరిచయమేర్పడింది. కవిసామ్రాట్ కరీంనగర్ ప్రభుత్వ యస్.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నున్న రోజుల్లో సాన్నిహిత్యమేర్పడింది. విశ్వనాథగారు చెబుతూ పోతుంటే వారి సరసన కూర్చొని దాదాపు 20 మాసాలలో 10 నవలలు లిఖించిన మహద్భాగ్యము గౌతమరావు గారికి దక్కింది. మోయు తుమ్మెద, ఏకవీర, సముద్రపు దిబ్బ మున్నగు నవలలు అప్పుడు వెలువడినవే. విశ్వనాథగారి రామాయణ కల్పవృక్షాన్ని శ్రావ్యంగా గానము చేయగలిగిన ఖ్యాతి కేవలం గౌతమరావునకే దక్కినదనుటలో అతిశయోక్తి లేదు.

మంథనిలో గణపతిరావు, సిరిసిల్ల ప్రాంతములో అమృతలాల్, జె.ఆర్.గోపాల్‌రావు,



చెన్నమనేని రాజేశ్వర్‌రావు, మురళీధర్‌రావు, హనుమంతరావు, గాలిపల్లి బద్దం ఎల్లారెడ్డి, పరకాల నివాసి కేశవరెడ్డి మున్నగువారు నిజాం వ్యతిరేకపోరాటములో చురుకుగా పాల్గొన్నారు. ఇరుకుల్ల జువ్వాడి చొక్కారావు మరియు కరీంనగర్‌లోని జువ్వాడి రమాపతిరావు, అతని అన్నకుమారుడు జువ్వాడి మధుసూదనరావు, ముల్కనూరు నుండి కిషన్‌రెడ్డి జగిత్యాల ప్రాంతములో దాసరి రాఘవులు, వెల్గొండ కె.సంజీవరావు, యస్వంతరావుపేట వేంకటేశ్వరరావు, వెలకటూరు లింగాల సత్యనారాయణరావు, చిలువాకోడూరు గందె జగన్నాథవరావు, జోగినపెల్లి నారాయణరెడ్డి మున్నగు వారు రజాకార్లకు వ్యతిరేకపోరాటము సాగించారు. తరువాత కాలములో జువ్వాడి రమాపతిరావు, జువ్వాడి చొక్కారావులు పార్లమెంటు సభ్యులుగా కరీంనగర్ నుండి ఎన్నికైనారు.

కరీంనగరము జిల్లా వాసి యైన గొప్పకవి, రచయిత దాశరథి కృష్ణమాచార్యులు తమ రచనలతో, పాటలతో, పద్యాలతో ఉద్యమకారులను ఉత్తేజపరిచేవారు. "మా నిజాం రాజు జన్మ జన్మాల బూజు" అని దాశరథి ఉద్వేగంతో పలికాడు. ఆరోజులలో నిజాం అధికారులను, రజాకార్లను, పోలీసులను సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను, అమీన్‌లను చూడగానే రెచ్చిపోయి పాడిన పాటలలోని రెండు పంక్తులు నేటికి ఈ ప్రాంత ప్రజలస్మృతి పథంలో స్థిరముగా నిలిచి పోయినవి. ఆ పంక్తులు ఈ క్రింద పేర్కొనబడినవి.

**"బండెనుక బండి కట్టి, పదహారు బండ్లు కట్టి**
**ఏ బండిలున్నవురో, నిజాం సర్కిలోదా"**

హుజురాబాద్‌కు చెందిన ధ్రువసింగ్, సీతారామానాయుడు ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ధ్రువసింగ్ క్విట్ ఇండియా ఉద్యమములో పాల్గొని జైలు పాలైనాడు. 1946లో తాలుకా కాంగ్రెస్ స్థాపించి తరువాత అజ్ఞాతంలోకి పోయి పోరాటం సాగించాడు. కరీంనగర్ వకీలు ముకుందులాల్ మిశ్రా, బోయినపెల్లి వెంకటరామారావు మున్నగువారు అరెస్టు అయినవారిలో నున్నారు. తోటపెల్లి గ్రామమునకు చెందిన బోయినపెల్లి వెంకటరామారావు హైదరాబాద్ రాష్ట్రము ఇండియన్ యూనియన్‌లో సంలీనము కావాలని గర్జించి అరెస్టయినారు. సర్వోదయ, భూదానోద్యమ, గ్రంథాలయోద్యమములకు అంకితమైనారు. బెజ్జంకి గ్రామములో నిజాం అధికారులు పోలీసుల సహాయముతో బలవంతంగా లేవీ గల్లాధాన్యము వసూలు చేసినారు. వెంకటరామారావు దీనిని నిరసించుచు బెజ్జంకిలో ఏర్పాటుచేసిన బహిరంగసభలో టి.హయగ్రీవాచారి, బూర్గుల రామకృష్ణారావు ప్రభృతులు ప్రసంగించినారు. కరీంనగర్ జిల్లా వాసులు వీరిని తోటపల్లి గాంధియని నేటికిని పిలుచుచున్నారు.

మెటుపెల్లిలో రాజకీయ చైతన్యస్ఫూర్తి నిచ్చిన వ్యక్తులు మెటుపెల్లి ఖాదీ కార్ఖానాలో నుండిన బోగపాపయ్య పంతులు మరియు బట్టు లక్ష్మినారాయణ రాజు. 1947లో మెటుపెల్లి గ్రామము నందు ఒకేసారి 22 మందిని అరెస్టు చేసి రెండు మాసములకు పైగా కరీంనగర్ జైలులో నిర్బంధించినారు. నిర్బంధింపబడిన వారిలో మెటుపెల్లి దేశ్‌ముఖ్ వెంకటనర్సింగరావు,

అతని గడిలో పనిచేసే చిన్నయ్య గూడా ఉన్నారు. అరెస్టయిన వారిలో చాలా మంది వైశ్య వర్తకులున్నారు. చకినం వెంకన్న, కటుకం గంగారాం, రాగెల్ల సోమయ్య, దొంతుల నారాయణ (రేగుంట నారాయణ), వల్లకొండ రాజం, పాంపాట్టి బుచ్చిరాజం, సామ బుచ్చిరాజం, చేపూరి భూమయ్య, చౌటుపెల్లి కౌటికె కిష్టయ్య, మున్నగు వైశ్యులందరు కారాగృహశిక్షననుభవించినారు. వీరే గాకుండా గుంటుక రాజగంగారాం, గుంటుక బుచ్చయ్య, బూస గంగారాం, కటుకం లక్ష్మయ్య, బట్టు బుచ్చయ్య, హెూటల్ నారాయణ, డా.రాంచంద్రం, చిట్టాపురం గంగారెడ్డి మరియు కల్లూరు నారాయణరావు మున్నగువారు గూడా కరీంనగర్ జైలులో రెండు మాసాలకు పైగా నిర్బంధింపబడినారు. ఈ విధముగా నిజాం నిరంకుశపాలనతో, రజాకార్ల దౌర్జన్యముతో కరీంనగర్ జిల్లా అంతయు అట్టుడికింది. సత్వరమే నిజాం రాజ్యమును భారత యూనియన్‌లో సంలీనము చేయవలెనని సర్వత్రా ప్రజలందరు కేంద్ర ప్రభుత్వముతో మొరబెట్టుకొన్నారు.

1948 సెప్టెంబర్ 13న భారతసైన్యములు నిజాం రాష్ట్రమును అన్ని వైపుల ముట్టడించాయి. సెప్టెంబర్ 17న నిజాం ప్రభువు లొంగిపోయాడు. సెప్టెంబర్ 18 నుండి నిజాం నిరంకుశపాలన అంతరించి ప్రజలు స్వేచ్ఛా వాయువును పీల్చుకొన్నారు. నిజాం రాజ్యము భారత ప్రభుత్వములో సంలీనము చేయబడింది.

## మన ముఖ్యమంత్రులు

ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ జిల్లాలు మద్రాసు ప్రెసిడెన్సీ (Madras Presidency) అంతర్భాగముగా ఉండేవి. త్యాగధనుడైన పొట్టి శ్రీరాములు చేసిన సత్యాగ్రహము, ప్రాణత్యాగము ఫలితంగా ఆంధ్రరాష్ట్రము మద్రాసు రాష్ట్రము నుండి వేరుచేయబడింది. 1953 నుండి 1956 వరకు కర్నూలు రాజధానిగా ఉంది. 1-10-1953 నుండి 15-11-1954 వరకు టంగుటూరి ప్రకాశం గారు ముఖ్యమంత్రిగా ఉన్నాడు. ఆ తరువాత అధ్యక్షపాలన కొనసాగింది. మరల 28-3-1955 నుండి 31-10-1956 వరకు బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రిగా ఆంధ్రరాష్ట్రాన్ని పాలించాడు.

నిజాం రాష్ట్రము (Erst-while Hyderabad State) నకు 1952లో జరిగిన సాధారణ ఎన్నికల తరువాత నుండి 31-10-1956 వరకు బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ఉన్నాడు. తెలంగాణా జిల్లాలన్నియు నిజాం డొమీనియన్‌లోని పాలనాభాగములే.

తేది 1-11-1956 రోజున భాషా రాష్ట్రాల ప్రాతిపదికన కోస్తా, రాయలసీమ, తెలంగాణా మూడు ప్రాంతములు కలిసి నూతనముగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము అవతరించింది. ఈ రాష్ట్రములోని జిల్లాలలో కరీంనగర్ జిల్లా ఒకటి. 1956 నుండి ఈ జిల్లాను మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమును పాలించిన ముఖ్యమంత్రుల జాబిత పాఠకులకు పునరావృతము చేయబడింది. అలాగే ప్రధానమంత్రుల, భారత అధ్యక్షుల పట్టికలు ఇవ్వబడినాయి.



## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రులు

| | | | | |
|---|---|---|---|---|
| 1) | 01-11-1956 | నుండి | 10-1-1960 | నీలం సంజీవరెడ్డి |
| 2) | 11-01-1960 | నుండి | 11-3-1962 | దామోదరం సంజీవయ్య |
| 3) | 12-03-1962 | నుండి | 28-2-1964 | నీలం సంజీవరెడ్డి |
| 4) | 29-02-1964 | నుండి | 29-9-1971 | కాసు బ్రహ్మానందరెడ్డి |
| 5) | 30-09-1971 | నుండి | 17-1-1973 | పి.వి. నరసింహారావు |
| 6) | 18-01-1973 | నుండి | 09-12-1973 | అధ్యక్షపాలన |
| 7) | 10-12-1973 | నుండి | 05-03-1978 | జలగం వెంగళరావు |
| 8) | 06-03-1978 | నుండి | 10-10-1980 | మర్రి చెన్నారెడ్డి |
| 9) | 11-10-1980 | నుండి | 23-02-1982 | టి. అంజయ్య |
| 10) | 24-02-1982 | నుండి | 19-09-1982 | భవనం వెంకట్రామ్ |
| 11) | 20-09-1982 | నుండి | 08-01-1983 | కోట్ల విజయభాస్కర్‌రెడ్డి |
| 12) | 09-01-1983 | నుండి | 15-08-1984 | నందమూరి తారకరామారావు |
| 13) | 16-08-1984 | నుండి | 15-09-1984 | నాదెండ్ల భాస్కర్‌రావు |
| 14) | 16-09-1984 | నుండి | 02-12-1989 | నందమూరి తారకరామారావు |
| 15) | 03-12-1989 | నుండి | 16-12-1990 | మర్రిచెన్నారెడ్డి |
| 16) | 17-12-1990 | నుండి | 08-10-1992 | నేదురుమల్లి జనార్ధనరెడ్డి |
| 17) | 09-10-1992 | నుండి | 11-12-1994 | కోట్ల విజయభాస్కర్‌రెడ్డి |
| 18) | 12-12-1994 | నుండి | 31-08-1995 | నందమూరి తారకరామారావు |
| 19) | 01-09-1995 | నుండి | నేటి వరకు | నారా చంద్రబాబునాయుడు |

## మన ప్రధానమంత్రులు

| | | | | |
|---|---|---|---|---|
| 1) | 15-08-1947 | నుండి | 27-05-1964 | జవహర్‌లాల్ నెహ్రూ |
| 2) | 27-05-1964 | నుండి | 09-06-1964 | గుల్జారిలాల్ నందా |
| 3) | 09-06-1964 | నుండి | 11-01-1966 | లాల్ బహాదూర్ శాస్త్రి |
| 4) | 11-01-1966 | నుండి | 24-01-1966 | గుల్జారిలాల్‌నందా |
| 5) | 24-01-1966 | నుండి | 24-03-1977 | ఇందిరాగాంధి |
| 6) | 24-03-1977 | నుండి | 28-07-1979 | మొరార్జీదేశాయి |
| 7) | 28-07-1979 | నుండి | 14-01-1980 | చరణ్‌సింగ్ |
| 8) | 14-01-1980 | నుండి | 31-10-1984 | ఇందిరాగాంధి |
| 9) | 31-10-1984 | నుండి | 01-12-1989 | రాజీవ్‌గాంధి |

| | | | |
|---|---|---|---|
| 10) 02-12-1989 | నుండి | 10-11-1990 | వి.పి.సింగ్ |
| 11) 10-11-1990 | నుండి | 21-06-1991 | చంద్రశేఖర్ |
| 12) 22-06-1991 | నుండి | 15-05-1996 | పి.వి. నరసింహారావు |
| 13) 16-05-1996 | నుండి | 31-05-1996 | అటల్ బిహారి వాజ్‌పాయి |
| 14) 01-06-1996 | నుండి | 20-04-1997 | హెచ్.డి. దేవగౌడ |
| 15) 21-04-1997 | నుండి | 18-03-1998 | ఇంద్రకరణ్ గుజరాల్ |
| 16) 19-03-1998 | నుండి | నేటివరకు | అటల్ బిహారి వాజ్‌పాయి |

## మన భారత అధ్యక్షులు

| | | | |
|---|---|---|---|
| 1) 26-01-1950 | నుండి | 13-05-1962 | డా. రాజేంద్రప్రసాద్ |
| 2) 13-05-1962 | నుండి | 13-05-1967 | డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ |
| 3) 13-05-1967 | నుండి | 03-05-1969 | డా. జాకీర్ హుస్సేన్ |
| 4) 24-08-1969 | నుండి | 24-08-1974 | వి.వి.గిరి |
| 5) 24-08-1974 | నుండి | 11-02-1977 | ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ |
| 6) 25-07-1977 | నుండి | 25-07-1982 | డా.నీలం సంజీవరెడ్డి |
| 7) 25-07-1982 | నుండి | 25-07-1987 | జ్ఞాని జైల్‌సింగ్ |
| 8) 25-07-1987 | నుండి | 25-07-1992 | ఆర్. వెంకటరామన్ |
| 9) 25-07-1992 | నుండి | 25-07-1997 | డా. శంకరదయాల్‌శర్మ |
| 10) 25-07-1997 | నుండి | 25-07-2002 | కె.ఆర్.నారాయణన్ |
| 11) 25-07-2002 | నుండి | నేటి వరకు | డా.ఎ.పి.జె. అబ్దుల్ కలామ్. |

## ఆధార గ్రంథములు

**(References)**


1. Hemachandra Rayachaudhuri, *"Geography of the Deccan" ,EHD.* p. 26
2. K.A.Nilakanta Sastri & G. Srinivasachary, *Advanced History of India,* p. 8
3. ఆర్. సుబ్రహ్మణ్యం, అశోకుని ఎర్రగుడిశాసనములు, నెం.1 నుండి 13 వరకు
4. Parameshwarilal Gupta, punchmarked coins in A.P. Museum. pp. 4,5
5. N.S. Ramachandra Murthy, "Presidential Address" *APHC* Vol.XXIV, 2000, p. 22
6. *Ibid,* p. 25
7. N.S.Ramachandra Murthy, "Kotilingala an early historical site" *APHC,* Vol. XVI, 1992, p. 34
8. A.M.Sastry, "President's Address", *APHC,* Vol. V, 1980. p.s-1
9. Aloka parashar, "Trade in Mid-Godavari valley 200 B.C. to A.D." *APHC* Vol. X, 1986, p. 29
10. *Ibid,* p. 30
11. N.S.Ramachandra Murthy, "Presidential Address" *APHC* Vol.XXIV, 2000 p. 22





12. S.J. Mangalam, "Presidential Address" *APHC* Vol. XXIII, 1999. p.14,15.
13. *Ibid,* p.15
14. *Ibid*
15. N.S.Ramchandra Murthy, *Op.cit.* p. 25
16. S.J.Mangalam. "Presidential Address" *APHC* Vol. XXIII, 1999 P. 14
17. *Ibid*
18. *Ibid* pp. 15,16
19. *Ibid,* p.16
20. *ARDAM,* 1977-1978, p. 26
21. *Ibid,* pp. 39 & 43.
22. M.Rama Rao, *Satavahana Coins in A.P. Govt. Museum,* p. 9
23. Romila Thaper, *The Past and Prejudice,* p. 63
24. Parameshwarilal Gupta, *Op.cit.* p.27
25. V.V.Krishna Sastri, *Op.cit,* p. 200
26. B.S.L. Hanumantha Rao, "Presidential Address" *APHC* Vol. III 1978, p. 7
27. *Ibid,* p. 8
28. A.M.Sastry, Op.cit. *APHC* Vol. V, 1980. p. 5
29. B.R.Subrahmanyam "Presidential Address" *APHC* Vol. VII, 1983. p. 13
30. V.Sundararama Sastry, "Early pallava-vishnukundin Relations" *APHC* Vol. III, 1978, p. 16
31. M.Rama Rao, *Select Andhra Temples.,* p. 1
32. Roy C. Craven, *A Concise history of Indian Art,* p. 133
33. Percy Brown, *Indian Architecture,* p. 62
34. James Fergusson, *History of Indian and Eastern Architecture,* p. 421.
35. Abdul Waheed khan, "Introduction", *Early chalukyan Temples of Andhra Desa,* p. I
36. *Ibid.,* p. II
37. Stella Kramrisch, *The Art of India,* Plate. 57.
38. కుందూరి ఈశ్వర్‌దత్, ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, pp. 316-317
39. జైశెట్టి రాజయ్య, లేములవాడ రాజరాజేశ్వర శతకము మరియు మనస్సంబోధన కీర్తనలు, ప్రథమముద్రణ 1933, ద్వితీయముద్రణ 1992
40. *APGKD,* 1974, p. 252
41. Kolluru Suryanarayana, "Kollipara plates of Arikesari I", *APHC, Vol. VIII,* 1984. Medieval section, pp. 10-14.
42. N. Venkataramanaiah, *Chalukyas of Vemulawada.,* pp. 92-94.
43. *ARE,* 1967, No.1. pp. 22,23
44. బి.యన్.శాస్త్రి, వేములవాడ చరిత్ర - శాసనములు, 1991, p. 55
45. Kolluru Suryanarayana, *Op.cit,* pp. 10-14
46. బి.యన్.శాస్త్రి, *Op.cit,* pp. 46-52
47. *Ibid*
48. *Ibid,* pp. 43 & 46
49. N.Venkataramanaiah, *Op.cit,* pp. 9-12.
50. *Ibid,* p. 14
51. బి.యన్.శాస్త్రి, *Op.cit,* pp. 45 & 56
52. *EHD,* p. 508
53. నేలటూరి వెంకటరమణయ్య, పల్లవులు-చాళుక్యులు, p. 187
54. D.C.Sircar, "The Eastern chalukyas" Chapter VI, *Bharatiya Vidya Bhavan,* Vol. IV p. 135
55. బి.యన్.శాస్త్రి, *Op.cit.,* p. 58
56. R.C. Majumdar, "Rise and fall of the Partihara Empire" Chapter II, *Bharatiya Vidya Bhavan,* Vol. IV, p. 36
57. J.Ramanaiah, *Temples of South India,* 1989. p. 24


58. *IAPKD*, Nos. 1,2,3. pp. 2-11
59. *ARE*, 1967, No.1, pp. 22,23
60. *RE*, 1966, No. 170, pp. 42,43
61. *IAPKD*, 1974, No.2, pp. 5-10
62. *EA*, Vol. II, pp 21-28
63. *EHD*, p. 504
64. *EA*, Vol.II, pp. 31-35
65. *ARE*, 1967, No.1, pp. 22,23
66. A.S.Altekar, "The Rashtrakutas" *EHD*, pp. 290, 291
67. N.Venkataramanaiah, *Op-cit.*, p. 38,39
68. *Ibid*, pp. 44,45&82.
69. *EHD*, p. 511
70. *IAPKD*, No. 4 p.12
71. *Ibid*, No.5 pp. 12-17
72. *IAPKD*, Nos. 6,7,8,9. pp. 17-26
73. *EA*, Vol. II, pp. 36, 37.
74. *IAPKD*, Nos. 10,11,12. pp. 26-32.
75. *Ibid*, No. 13, pp. 32-36.
76. బి.యన్.శాస్త్రి, *Op.cit*, శాసనము నెం.7, p.116
77. తెలంగాణా శాసనములు, Vol. I, No.21, pp. 173-177.
78. P. Sreenivasachar (ed), *Op.cit.* pp. 48,49.
79. K.A.Nilakanta Sastry, "The Chalukyas of Kalyani" *EHD*, p. 330.
80. *IAPKD*, Nos. 14,15,16,17 pp. 36-47.
81. *EA*, Vol. IV, p.68
82. Paul G.Hiebert,"A Brief History of Patancheru or potttalakere"*JAHRS*, Vol. XXVI, (II to IV parts), p.3
83. *A Catalogue of Inscriptions copied upto 1964*, Nos. 187,188,189.
84. *EA*, Vol. IV, pp. 74-78.
85. *Ibid*, pp. 81-84.
86. *IAPKD*, No.23, pp. 58-60
87. *EA*, Vol.IV, pp. 84-89
88. *JAHRS*. Vol. XXXVI, Part I, pp. 33-43.
89. P.V. Parabrahma Sastry, *The Kakatiyas*, pp. 60-62
90. *EA*, Vol. I, pp 111-113
91. *IAPKD*, No. 75, pp. 139-141
92. *RE*, 1965, No. 308, p.71
93. *IAPWD*, Nos. 44 & 45
94. *JAHRS*, XXXVI, Part I, pp. 58 - 62.
95. *Ibid*, pp. 63 & 64
96. *Ibid*, pp. 1-24
97. *EHD*. p.582
98. *IAPKD*, No. 77
99. *Ibid*, No. 74, pp. 137-139.
100. *EHD*, p. 586
101. డా. పి.వి.పరబ్రహ్మశాస్త్రి, కాకతీయ శాసన సాహిత్యము, pp.21,22.
102. *IAPKD*, No.23, pp. 58-60
103. *IAPWD*, No. 31, p. 87
104. P.V.Parabrahma Sastry, *Kakatiya Coins and Measures.*, pp. 9,10
105. *IAPKD*, No. 25, pp. 64-71.



106. *Ibid*, No.26, pp. 71-73.
107. J.Ramanaiah, *Temples of South India*, 1989, pp. 109, 270 & 271.
108. *IAPKD*, No.27, pp. 73 & 74
109: *Ibid.*, Nos. 28-34, pp. 75-103
110. *JAHARS*, Vol. XXXV, pp. 183-186 & *IAPKD*, Appendix, pp. 146,147.
111. ఈనాడు, 2001 నవంబర్ 16, 26, 29వ తేదీల దినపత్రికలలోని సమాచారము.
112. *IAPKD*, No.36, pp. 103,104.
113. *Ibid*, Nos. 37-39, pp. 104-112.
114. J.Ramanaiah, *Op.cit.*, p. 43-44 & 272-274.
115. P.V.Parabrahma Sastry, *The Kakatiyas*, p. 132
116. *EHD*, pp. 644-647
117. దక్షిణ భారతదేశ చరిత్ర, తెలుగు అకాడమి, 1982. p. 246
118. *Ibid*, p. 320
119. H.K.Sherwani & P.M. Joshi, *History of Medieval Deccan*, Vol. I, p. 12
120. ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి, తెలుగు అకాడమి, 1986, p. 168
121. దక్షిణ భారతదేశ చరిత్ర, 1982, p. 286
122. బి.యన్.శాస్త్రి, రేచర్ల పద్మనాయకులు, 1991, pp. 21-24
124. *Ibid*, శాసనము సంఖ్య 21
125. యం.శ్యాంసుందర శాస్త్రి, (ed), త్రిశతి pp. 17-23
126. *APGKD*, 1974, p. 52
127. *IAPWD*, Nos. 104, 108
128. *IAPKD*, 1974, Nos. 48,49,53,57
129. *APGKD*, 1974, p. 53
130. *IAPKD*, No. 45, p. 117
131. *ARDAM*, 1976-1977, pp. 53&61
132. *APGKD*, 1974, p. 52
133. S.K.Sinha, *Mediaeval History of the Deccan*, Bahamanids, 1964, pp. 166-172
134. H.K.Sherwani, *Muhammad Quli Qutub Shah*, 1967, p. 5
135. H.K.Sherwani, *History of Qutub Shahi dynasty*, 1974, pp. 24&25
136. *IAPWD*, No. III, p. 291
137. H.K.Sherwani, *Op-cit.*, pp. 25-27
138. H.K.Sherwani, *Muhammad Quli Qutub Shah*, 1967, p. 5
139. *Ibid*, p. 7
140. H.K. Sherwani, *History of Qutub Shahi dynasty*, 1974, pp. 99-104
141. Raza Alikhan, *Hyderabad 400 years*, 1591-1991, pp. 65 & 66
142. H.K.Sherwani, *Op.cit*,, pp. 125-127
143. *Ibid*, p. 198
144. Md.Abdul Wali khan, *Qutub Shahi Coins A.P. Govt. Museum*, 1961, pp. 17 & 18.
145. H.K.Sherwani, *Op.cit.*, Appendix II, p. 136.
146. Md.Abdul Wali khan, *Op.cit.* p. 7
147. H.K.Sherwani, *Muhammad Quli Qutubshah*, 1967, p.14-16
148. *Ibid*, P. 20
149. *Ibid*, p. 28-32
150. Md.Abdul Wali khan, *Op.cit.* pp. 18&19
151. *Ibid*, p.19.
152. *IAPKD*, No.54, pp. 126 & 127
153. H.K.Sherwani, *History of Qutub Shahi dynasty*, pp. 442-445.
154. Raza Ali Khan, *Op.cit.*, pp. 47 & 48.

155. యరబాటి బాబురావు, రామగిరి చరిత్ర, 1982, p.37
156. M.Narasimhacharya, *History of cult of Narasimha in Telangana,* 1989, pp. 123,124.
157. H.K.Sherwani, *Op.cit.* p. 645
158. *Ibid,* pp. 652 & 653.
159. *Ibid,* pp. 654-657.
160. *Ibid,* p.479.
161. H.K.Sherwani, *Op.cit.* p.642
162. *Census Handbook, Karimnagar district,* 1961, p.VI.
163. *APGKD,* 1974, p. 59.
164. M.Narasimhacharya, *Op.cit,* p. 124.
165. *APGKD,* 1974, p. 60
166. *Ibid.*
167. M.Narasimhacharya, *Op.cit.* p. 124.
168. *Ibid,* pp. 124 & 303
169. *APGKD,* p. 61
170. *Ibid*
171. *Ibid*
172. A.Nagabhooshanam, *"The Greatness of Jagtial Fort",* Published in English daily Newpaper, dated. 22-10-1972.
173. *Ibid.*
174. *APGKD,* 1974, p. 61
175. సంగనభట్ల నరహరి, "కాలప్రవంతిలో ధర్మపురి" త్రిశతి, 1979, p.23,24.
176. *Ibid*
177. కోల రాంచంద్రారెడ్డి, "ఎలగందులఖిలా" శాతవాహన కళోత్సవాల సంచిక, 2002. pp.22,23
178. సంగనభట్ల నరహరి, *Op.cit,* p. 24.
179. కోల రాంచంద్రారెడ్డి, *Op.cit,* p. 23.
180. జైశెట్టి రాజయ్య, శ్రీవేములవాడ రాజరాజేశ్వర శతకము మరియు మనస్సంబోధన కీర్తనలు, జగిత్యాల. ప్రథమముద్రణ 1933 & ద్వితియముద్రణ 1992, pp.204-207. (ఈ గ్రంథ రచయిత డా.జైశెట్టి రమణయ్య పితామహులే జైశెట్టి రాజయ్యగారు క్రీ.శ.1842-1921)
181. *Ibid,* pp. 195-199
182. *Ibid,* pp. 212-217.
183. ఎ.వి.కోటిరెడ్డి, ఆధునిక ఆంధ్రదేశచరిత్ర, తెలుగు అకాడమి, 1982, p. 148
184. V.RamaKrishna Reddy, Economic History of Hyd. State- Warangal Suba, 1911-1950. Delhi. 1987,p.71.
185. సరోజనిరేగాని, ఆంధ్రలో స్వాతంత్ర్యోద్యమచరిత్ర, తెలుగు అకాడమి, 1986, p. 191
186. G.Arun Kumar, *'Andhra Mahasaba - Telangana Movement' APHC,* X 1986, pp 186-188
187. K.Narotham Reddy, "Prolestyrisation in Nizam State" *APHC,* XV Volume, 1991. pp. 210 - 214
188. *Ibid*
189. K. Rama Krishna, "Famine Relief works in Karimnagar District" *APHC,* IX volume, 1985, pp. 140-142.
190. K.Narotham Reddy, *Op.cit.,* p. 213
191. సరోజనిరేగాని, *Op.cit.,* pp. 200-202
192. జైశెట్టి రాజయ్య, *Op.cit.,* pp. 236-240
193. Vasant K. Bawa, "Presidential address" *APHC,* Vol. XIII, 1989. p. 138
194. ఎ.వి.కోటిరెడ్డి, ఆధునిక ఆంధ్రదేశచరిత్ర, 1982. pp. 203
195. సరోజనిరేగాని, *Op.cit.,* pp. 235
196. K.Natotham Reddy, "Social Movements in Telangana" *APHC.,* vol. VIII, 1984. pp. 20-23.
197. J.Laxminarayana, "The role of J.Keshava Rao" *APHC,* Vol. XI, 1987, p. 106
198. ఆంధ్రభూమి మే 28, 2001, కరీంనగరము ఎడిషన్ ప్రత్యేక ప్రారంభ సంచిక "రత్నాలవీణ". p. 129





## మూడవ అధ్యాయం

# III. చారిత్రక స్థలములు


అతిప్రాచీనకాలం నుండి సారవంతమైన నదీ మైదానాలపై విలసిల్లిన జనావాసాలతో రాజకీయ ప్రాధాన్యత కల్గిన పరిపాలనా వ్యవస్థలతో నేటి కరీంనగర్ జిల్లా విశిష్టమైన చారిత్రక విశేషాలతో కూడి ఉంది. కనుక కాలానుక్రమ పరిణామాలతో మహత్తరమైన నాగరికతా సంస్కృతుల వికాసాలకు కూడా ఈ ప్రాంతం ప్రఖ్యాతమైందని సులువుగా గ్రహింపవచ్చు. మతధార్మిక పరిణామాల వలన, వాస్తుశిల్పాల అభివృద్ధి క్రమంచేత పరిపాలకులు ధనాఢ్యులైన ప్రజలచేత అనాదికాలం నుండి బౌద్ధ, జైన, హిందూ ధర్మాలకు చెందిన ఆలయాల నిర్మాణం జరిగిందని నేటికీ నిలిచి ఉన్న అవశేషాల వలన స్పష్టమౌతుంది. ఈ అవశేషాలు నిలిచి ఉన్న స్థలాలు నాటి చారిత్రక పరిణామాలకు సాక్ష్యాలు, ఈనాటి వారికి దర్శనీయమైన క్షేత్రాలు. ఈ చారిత్రక స్థలాల్లో నిలిచి ఉన్న అవశేషాలు వివిధమైనవి. కొన్ని కొండచరియల్లోని గండశిలలను మలచి ఏర్పరచిన గుహాలయాలు మరికొన్ని జనావాసాల నడుమ నిర్మించిన ఆలయాలు. గుహాలయాల కంటె దేవాలయముల సంఖ్య ఎక్కువ. శైలావాసాల (Rock-shelters) నుండి జనావాసాలను ఏర్పరచుకొని చారిత్రక పరిణామములో ప్రజలు సాగించిన జీవనక్రమములో వివిధ రాజవంశముల పాలనలో నిర్మింపబడిన కోటలు, కట్టడములు, ఆలయములు మున్నగువాటి గురించిన వివరణ ఈ అధ్యాయంలో పొందుపరచడం జరిగింది.

## 1. అడవి సోమనపెల్లి గుహాలయములు

కరీంనగర్ జిల్లాలో మంథనికి 22 కి.మీ. దూరమున అడవి సోమనపెల్లి గుట్టపై నున్న శిలను తొలిచి నిర్మించిన నాలుగు గుహాలయములు (Rock Cut Temples) ప్రాచీన భారతీయ వాస్తు శిల్పమునకు తొలి చిహ్నములుగా నిలిచి ఉన్నాయి. తాడిచెర్ల వద్ద బసు దిగగానే అడవి జంతువులతో కూడుకొనిన దట్టమైన అరణ్యము గుండా 4 కి.మీ. కాలినడకన పోయినచో ఈ ప్రాంతమును చేరవచ్చు. వర్షాకాలములో బురదనేల గనుక ప్రయాణము కష్టము. కొండ పై నున్న ఒకే పెద్ద శిలను తొలుచగా ఏర్పడిన ఈ నాలుగు గుహాలయములు పడమటి ముఖమును



గలిగి మానేరు నదికి ఎదురుగా నిలిచి ఉన్నాయి. ఇచటి నుండి తిలకించినచో పరిసర ప్రకృతి దృశ్యములు ఎంతో రమణీయముగా, మనోహరముగా అగబడుతాయి. స్థానికముగా నైనగుళ్లు అని పిలువబడు ఈ శివాలయముల కొలతలు ఒక్కరీతిగా లేవు. నాసిరకపు శిల యగుటచే శతాబ్దముల తరబడి ప్రకృతి వాతావరణమునకు మరియు మానేరునది నుండి వీచు చల్లని గాలులకు తట్టుకోలేక ఈ గుహాలయములు కొంత చెదరిపోయి శిథిలమగుచున్నవి. విజయవాడకు సమీపమున మొగల్రాజపురములో చెక్కబడిన విష్ణుకుండినుల కాలపు గుహాలయములవలె ఇచటి గుహాలయములు గూడా గర్భగృహము మరియు దాని ముందు మంటపముండునట్లు తొలుచబడినాయి. ఇచటి స్తంభములు మొగల్రాజపురము నాలుగవ గుహాలయ స్తంభములను పోలి సామాన్యముగా (Plain) చెక్కబడినాయి[1].



మొదటి గుహాలయ మంటపము



గర్భగృహము

### మొదటి గుహాలయము (Rock-cut Temple No. I)

ఈ ఆలయమందు గర్భగృహము, దాని ముందు అర్ధ మంటపము నిలిచి ఉన్నాయి. మంటప ప్రవేశము నందే రెండు పెద్దసైజు స్తంభములు (Heavy Pillars) వాటికెదురుగా గర్భగృహ ద్వారానికిరువైపుల రెండు కుడ్య స్తంభములు (Pilasters) చెక్కబడిఉన్నాయి. స్తంభములు మోటుగా మలుచబడి యుండి అశ్వపాదం (Base) స్తంభము (Shaft) మరియు లింటెల్‌ను ఆనుకొని ద్విముఖ బ్రాకెట్ (Bracket extending only two sides along the lintel) ను కలిగి ఉన్నాయి. స్తంభభాగములో రెండు చతురస్రాకారపు విభాగముల మధ్య అష్టాస్రమైన 6 అంగుళముల పట్టిక (Octogonal member of about 6" height) ఉంది. మంటపము 13'-10" x 12'-4" కొలతలతో 7'-6" ఎత్తు వరకు తొలుచబడింది. ఈ మంటప కుడ్యములు (Walls) ఎలాంటి అలంకారములు లేకుండా సాదాగా ఉన్నాయి. చాలా ఆసక్తికరమైన అద్భుతమైన విషయమేమన మంటపము యొక్క లోకప్పు (Ceiling) సన్నని సున్నపు పొరతో చదును చేయబడి, దానిపై (Colour Paintings) వర్ణచిత్రములున్నాయి. కాని దురదృష్టవశాత్తు ఈ వర్ణ చిత్రముల పొరలు

కాలప్రవాహములో ఊడిపోయి ప్రస్తుతము నల్లని, ఎర్రని, నీలి, పసుపుపచ్చని మున్నగు వివిధ రంగులలో కొన్ని అస్పష్టమైన గుర్తులు మిగిలిఉన్నాయి. ఈ చిత్తర్వులలో అర్థోరుకము మరియు ఊర్ధ్వ వస్త్రము ధరించిన స్త్రీ,పురుష రూపములు కొన్ని అగబడుచున్నవి. వీరు కిరీటమకుటములు, కంఠహారములు, పత్రకుండలములు, దండ కడియములు, యజ్ఞోపవీతము మున్నగునవి ధరించినట్లు అగబడుచున్నారు. అచ్చటచ్చట మిగిలియున్న వర్ణచిత్రములలో నర్తకీలు, యుద్ధదృశ్యములు, అశ్వములచే లాగబడు రథములు, విలుకాండ్రు, రాచభవనములు మున్నగు అంశములు చూపరుల దృష్టినాకర్షిస్తాయి.

మంటపము నుండి 5'-6" ఎత్తు 2'-3" వెడల్పు గల ద్వారము గుండా గర్భగృహము లోనికి ప్రవేశింపవచ్చు. గర్భగృహము 10'-10" x 10'-1" కొలతలతో 7'-3" ఎత్తును కలిగిఉంది. ఇందులో 2'-5" ఎత్తుగల పీఠము (Pedestal) పై లింగము చెక్కబడిఉంది. ఈ లింగరూపము మోటు (Crude) గా నుండి 1'-7" ఎత్తు 4'-1" చుట్టుకొలతతో నున్నది. తల విరిగిన నంది విగ్రహమొకటి అచట విడిగా పడి ఉంది.

## రెండవ గుహాలయము (Rock-cut Temple No. II)

రెండవ రాతి గుహాలయము నందు గర్భగృహము మరియు దాని ముందు అర్ధ మంటపముంది. మంటపమునకు ముందు రెండు స్తంభములు లేకుండా గర్భగృహము ముందర రెండు కుడ్య స్తంభములు (Pilasters) మలచబడినవి. మంటపము 8'-7"x4'-7" కొలతలతో 7 అడుగుల ఎత్తుతో ఉంది. గర్భగృహము 5'-2"x 4'-3" కొలతలతో 6'-10" ఎత్తును కలిగి ఉంది. మొదటి గుహాలయములో వలె మంటపము నుండి గర్భగృహమునకు ప్రవేశద్వారమున్నది. గర్భగృహపు వెనుక గోడ నానుకొని ఒక పీఠముంది. దానిపై నల్లరాతితో మలచబడిన ద్విభంగములో నున్న మహిషాసురమర్దని ప్రతిమ విరిగిన తలతో నిలుపబడిఉంది. దేవి కుడికాలును నేలపై నిలుపగా ఎడమకాలు మహిష రూపమున నున్న అసురుని మెడపై ఉంచింది. ఆమె చతుర్భుజములలో పైనున్న ఎడమచేయి విరిగిపోగా, కుడిచేతిలోని త్రిశూలముతో అసురుని శరీరమును గ్రుచ్చుచున్నది. (Piercing the trisula into the body of the demon) క్రింది ఎడమచేతితో మహిషుని తోకను పట్టుకొని కుడి చేత ఖడ్గముతో పొడుచుచున్నది. గ్రైవేయకములు, కేయూరములు, కటిబంధము, యజ్ఞోపవీతము, ముంజేతి కడియములు మున్నగు ఆభరణములతో దేవి అలంకరింపబడిఉంది. ఆమె చేతికి గాజులు, అన్ని వ్రేళ్లకు ఉంగరములున్నాయి. ఆమె ధరించిన వస్త్రపు చెంగులు మోకాళ్ల వరకు వ్రేలాడుతున్నాయి.

## మూడవ గుహాలయము (Rock-cut Temple No. III)

మూడవ గుహ రెండు స్తంభములపై ఆనియున్న కేవలము అర్ధమంటపము మాత్రమే. ఈ మంటపము 12'-5"x12'-2" కొలతలతో 7'-6" ఎత్తును కలిగి ఉంది. మంటపము మధ్యనున్న



వేదికపై నాలుగు అడుగుల చుట్టుకొలత గల శిథిలమైన లింగమున్నది. రెండవ మూడవగుహాలకు మధ్యనున్న బాహ్య రౌతు కుడ్యము పై రెండు గూడులున్నాయి (Niches). ఒకదానిలో గణపతి రెండవ దానిలో ద్వారపాలక శిల్పాలున్నాయి.



మూడవ గుహాలయము

## నాలుగవ గుహాలయము (Rock-Cut Temple No. IV)


ఇది గూడా రెండు స్తంభములపై నిలిచియున్న అర్ధమంటపముతో గూడిన గుహామాత్రమే. మంటపము 14'-0"x8'-4" కొలతలతో 7 అడుగుల ఎత్తుతో ఖాళీగా ఉంది. ఈ మంటపమునకు ఎడమ ప్రక్కన రెండు గూడులున్నాయి. ఒకటి ఖాళీగా నుండగా రెండవ దానిలో అస్పష్టమైన ప్రతిమ చెక్కబడిఉంది.

ఈ గుహలకు ముందున్న కుడ్యముపై పదవ, పదకొండవ శతాబ్దపు తెలుగులిపి లక్షణములతో రెండు చిన్న శాసనములు (Label inscriptions in the characters of 10th or 11th Century A.D. in Telugu) ఉన్నాయి[2]. మొదటి అసంపూర్ణ శాసనము నందు ఎక్కటె విమున యనునతడు రామేశ్వర దేవుని ప్రతిష్ఠించగా కెంపెన యనునతడు రాతిని తొలిచినట్లు తెలుపబడింది. పెనుకంటి ముచ్చిరెడ్డి రామేశ్వరదేవునకు ముగ్గు (Lime Linings) దీప నైవేద్యములకై పన్నస భూదానమిచ్చినట్లు రెండవ శాసనము తెలుపుతుంది.

బాహ్యముగా ఈ గుహాలయములు విజయవాడకు సమీపమున గల ఉండవల్లి కొండలపై నున్న గుహాలయములను పోలిఉన్నాయి. కాని వీటిని ఉండవల్లిలోని ఐదు అంతస్తుల అనంతశయన గుడితో పోల్చలేము. కళారీతులను బట్టి ఈ గుహలు క్రీ.శ. ఏడవ, ఎనిమిదవ శతాబ్దములకు చెందినవని డా.యన్.యస్.రామచంద్రమూర్తి అభిప్రాయము[3].

# 2. వేములవాడ

కరీంనగర్‌కు పడమట 35 కి.మీ. దూరములో మూలవాగు ఒడ్డుననున్న ఒక మండల కేంద్రము వేములవాడ. ఇది క్రీ.శ. 750 నుండి 973 వరకు పాలించిన వేములవాడ చాళుక్యులకు రాజధానిగా వెలసింది. ఇచటనున్న అనేక శిల్పప్రతిమలు, శిథిలమైన ఆలయములను బట్టి వారు గొప్ప నిర్మాతలని సుబోధకమగుచున్నది. అనేక దేవాలయములకు నిలయమైన వేములవాడ పూర్వ వైభవము దాదాపు పదిశాసనములలో పేర్కొనబడింది[4]. శాసనములందు ఈ పట్టణము లేంబుళవాటక, లేంబులవాడె, లేంబులవాడ యని పేర్కొనబడింది. ఉచ్చారణలో క్రమముగా ఇది లేములవాడ, ఏములవాడ, వేములవాడగా మారింది. కరీంనగర్ జిల్లాలో అతి ప్రాచీనమైన దేవాలయములు వేములవాడలోనే ఉన్నాయి.



వేములవాడ దేవాలయముల సముదాయము


## భీమేశ్వర దేవాలయము

శైవమత ప్రభావము అధికముగా నుండుటచే దక్షిణ భారతదేశములో రాతితో నిర్మించిన దేవాలయములు క్రీ.శ. ఏడవ శతాబ్దము నుండి అగబడుచున్నవి. వేములవాడలో నున్న అతి సుందరమైన భీమేశ్వరాలయము తొమ్మిదవ శతాబ్దమునకు చెందింది. వేములవాడను పాలించిన చాళుక్యరాజు బద్దెగుడు (క్రీ.శ. 850–895) దీనిని నిర్మించినందున ప్రప్రథమములో ఇది బద్దెగేశ్వరాలయముగా వ్యవహరింపబడింది[5]. ఈ దేవాలయము చుట్టు రాతి ప్రాకారముంది. వేములవాడలో నున్న దేవాలయము లన్నింటిలో కంటే ఈ దేవాలయము ఆనాటి శిల్పకళా వైభవాన్ని తెలియచేస్తుంది.


భీమేశ్వరాలయమునందు గర్భగృహము, అంతరాళము, ముఖమంటపము మరియు దాని ముందు రెండు దిశల సోపానములున్న ఎత్తైన వేదిక ఉన్నాయి. ఉపపీఠముపై నున్న ప్రతిబంధరీతి అధిష్ఠానము అష్టాస్రకుముదమును కలిగి ఉంది. ఇట్టి నిర్మాణరీతులు హేమవతి,




వెల్దుర్తి మున్నగు దేవాలయములలో గోచరిస్తాయి. అనేక విభాగములుగా విభజింపబడిన ఉపపీఠమునందు దశావతారములు, మొసలి మరియు మర్కటము లాంటి పంచ తంత్ర గాథలున్నాయి. గర్భగృహపు గోడలు సాదాగా (Plain) నుండి మంటపగోడలు కుడ్య స్తంభములతో (Pilasters) విభజింపబడి ఉన్నాయి. ప్రస్తర భాగము నందు హంసమాల, కపోతములు బహుఅందముగా చెక్కబడినాయి. మందిరము ముందున్న వేదిక అధిష్ఠాన కంఠ భాగమునందు చిన్నచిన్న గడులలో రెండు మాతృదేవతా (Mother Goddess) రూపములు చెక్కబడినవి. ఈ దేవతలు కూర్చొని తమ కాళ్లను వెడల్పుగా తెరచి నగ్న రూపములో కనబడుదురు. జననేంద్రియములు స్పష్టముగా కనిపిస్తున్నాయి. వీటిని బట్టి ఆనాటి ప్రజలు సంతానసాఫల్య పూజలు (Fertility Cult) జరిపే వారని తెలియుచున్నది. పిల్లలు లేని తల్లులు సంతానమునకై ఆంధ్ర ప్రాంతములో నేటికి ఈ మాతృదేవతా పూజలు చేస్తారు[6].




భీమేశ్వరాలయము




లింగం




వేములవాడ భీమేశ్వర దేవాలయము–గ్రౌండ్‌ప్లాన్



వేములవాడ భీమేశ్వర దేవాలయము ముందు నుండి బాహ్యరూపము (Front Elevation)




వేములవాడ భీమేశ్వర దేవాలయము ప్రక్కనుండి బాహ్యరూపము (Side Elevation)



ముఖమంటప ప్రవేశ ద్వారము త్రిశాఖలతో లింటెల్ వద్ద మకరతోరణము, లలాటమున గజలక్ష్మి మరియు అడుగున ఒక హస్తము నందు గద, రెండవది అభయ ముద్రతో గల ద్వారపాలకుల మరియు చామరగ్రాహిణుల శిల్పాలున్నాయి. ముఖమంటపములోని నాలుగు మధ్య స్తంభములు (Central Pillars) అత్యంత ఎత్తుగా నుండి చుట్టు వాటికి జతగానిలుచు స్తంభములు (The other Corresponding Pillars) కుఱుచగా నుండుటచే కప్పు ఏటవాలుగా (Slopy pent roof) ఉంది. మధ్య స్తంభములు చిత్ర ఖండ రూపాలంకరణతో ఉన్నాయి. మంటపము యొక్క లోకప్పు (Ceiling) త్రికోణ శిలలతో ఉపవితాన (కదలికా కరణ) పద్ధతిలో వేయబడింది. మధ్యశిల విరబూసిన పద్మముద్రికను కలిగిఉంది.

అంతరాళభాగము నందు ఉత్తర దిశయందున్న వాతాయనములో గల మహిషాసురమర్దని విగ్రహము చూపరుల దృష్టి నాకర్షిస్తుంది. ఎనిమిది హస్తములతో గూడిన దేవత మహిషుని తలను కాళ్లతో త్రొక్కుతుంది. అతి సుందరముగా మలచబడిన ఈ శిల్పము అలంపురము, ఎల్లోరలలో రాష్ట్ర కూటుల కాలములో మలచబడిన విగ్రహములను పోలిఉంది[7]. గర్భగృహప్రవేశ ద్వారముపై ముందుకు పొడుచుకొని వచ్చిన చూరు (Projecting cornice over the lintel) ఉంది. లలాటమందు గజలక్ష్మి చెక్కబడింది. ద్వారపు శాఖల అడుగున చతుర్భుజ ద్వారపాలకులు చెక్కబడినారు. క్రింది హస్తమొకటి అభయముద్రలో నుండగా మిగిలిన మూడు చేతులందు త్రిశూలము, గద, నాగసర్పములున్నాయి. గర్భగృహము లోపల తొలి చాళుక్యుల కళా సంప్రదాయానుసారము నాలుగు స్తంభములు గలవు. వీటి మధ్యలో నున్న ఎత్తైన పీఠము (Pedestal) పై మూడు అడుగుల చుట్టు కొలత గల బృహత్ లింగముంది. శంఖనిధి, పద్మనిధితో గూడిన నున్నని (Smooth) చంద్రశిల అంతరాళము ముందున్నది. గర్భగృహము లోపల నాలుగు స్తంభములుండు తొలిచాళుక్యుల కళా సంప్రదాయము అలంపురము, సత్యవోలు, మహానంది ఆలయముల గర్భగృహములందు గూడా చూడవచ్చును[8]. చాళుక్యుల కళారీతులలో భీమేశ్వరాలయ గోపురమునకు తూర్పు ముఖమున శుకనాసముంది.



మహిషాసురమర్దని



జైన చౌముఖము

## నగరేశ్వరాలయం

వేములవాడ ఏలిక రెండవ అరికేసరి (క్రీ.శ. 930-955) కాలపు తేది లేని శాసనమందు పేర్కొనబడిన నాలుగు దేవాలయములలో నగరేశ్వరాలయమొకటి[9]. ఇది వేములవాడ నకరము అను వర్తక సమాజముచే నిర్మించబడిన ఆలయము[10]. పదవ శతాబ్దపు ఈ ఆలయము చుట్టు ప్రాకారముండి తూర్పు ముఖమును కలిగిఉంది.

నగరేశ్వరాలయ అధిష్ఠానమందు ఉపానము, విశాలపట్టిక, జగతి అగబడుచున్నాయి. కుడ్య స్తంభములతో గూడిన భిత్తి (Wall with Pilasters) మరియు గోపురము మధ్యన మోటైన చూరు (Cornice in crude form) ఉంది. హంసమాల ప్రస్తరభాగమునలంకరించింది. శిఖరము మెట్లు గల పిరమిడ్ ఆకారములో (Stepped pyramidal form) ఉంది. మంటపము మధ్యన నాలుగు స్తంభాలున్నాయి. మంటపం ముందు ఉప మంటపము (Porch) ఉంది. మంటపము యొక్క లోకప్పు చదును (Flat)గా ఉంది. ఆలయస్తంభములు మోటుగా పెద్దగా (Heavy and crude in form) ఉన్నాయి. శివలింగముతో కూడిన గర్భగృహము ముందు గల అర్థమంటపములో కుడి వైపు గణపతి ఎడమవైపు అమ్మవారు పార్వతి ప్రతిమలున్నాయి.

## బద్ది పోచమ్మ ఆలయం

నగరేశ్వరాలయం ఎదురుగానే బద్దిపోచమ్మ ఆలయముంది. బహుశః ఇది బద్దెగరాజు కాలమునకు చెందినదై యుండును. గర్భగృహము నందు గల చతుర్భుజ భద్రకాళిమాత పైనున్న కుడి హస్తములో త్రిశూలము, ఎడమ హస్తములో డమరుకము, క్రింది కుడి హస్తములో ఖడ్గము, ఎడమ హస్తములో తెగిన అసురుని తల ఉన్నాయి. మంటపములో పురాతన పోచమ్మ ప్రతిమ పడిఉంది. ఈ ఆలయ ఆవరణలో రెండు అడుగుల ఎత్తుగల కాయోత్సర్గరీతిలో నిలబడియున్న దిగంబర జైన విగ్రహముంది. ఇటీవల ఈ ఆలయ పునర్నిర్మాణము జరిగింది.


## కేదారేశ్వరాలయము

రాతి ప్రాకారములోపల గల ఈ ఆలయము ముందు క్రీ.శ. 1033 నాటి శిలా స్తంభ శాసనమొకటి ఉంది. చీకరాజుచే ప్రతిష్ఠింపబడిన రాజేశ్వర దేవరకు అతని అధికారి ఒకరు పూజ నైవేద్యాదులకై భూదానములిచ్చినట్లు ఈ శాసనము తెలుపుతుంది. ఈ రాజేశ్వరదేవుడే నేడు కేదారేశ్వరునిగా పూజలందుకొనుచున్నాడు. ఈ దేవాలయమందు గర్భగృహము ముఖమంటపములను కలుపుతూ అర్ధమంటపముంది.

కేదారేశ్వరదేవాలయ అధిష్ఠానమందు ఉపానము, పట్టిక మరియు అనేక దేవతా, పుష్పాకృతులతో అలంకరింపబడిన వేదిక ఉన్నాయి. జననేంద్రియమును ప్రదర్శించుచున్న తొలికాలపు మాతృదేవతా రూపము చూపరులనాకర్షించును. కుడ్య స్తంభములతో



అలంకరింపబడిన గోడలకు దేవతా విగ్రహముల శాలలు చెక్కబడినాయి. మొదటి శాలలో పద్మము పై ఆసీనుడైన గణపతి, రెండవ దానిలో 3' ఎత్తున్న బ్రహ్మ, మూడవ దానిలో శివుడు నాలుగవ దానిలో విష్ణువు అంతే ఎత్తు తో చెక్కబడియున్నారు. అచటచట గజారూఢులు (Elephant riders) బహుఅందంగా గోడలపై మలచబడినారు.





**వేములవాడ కేదారేశ్వర దేవాలయము-గ్రౌండ్‌ప్లాన్**


గర్భగృహము నందు గల లింగమునకు నాలుగువైపుల స్తంభములున్నాయి. ఈ నాలుగు స్తంభముల చుట్టు ప్రదక్షిణా పథమున్నది. కరీంనగరము జిల్లాలోని పదవ, పదకొండవ శతాబ్దపు దేవాలయముల గర్భగృహములందు నాలుగు స్తంభములు నిలుపునట్టి తొలి చాళుక్యుల కళా సంప్రదాయము గోచరిస్తుంది. ఈ ఆలయ శిల్పమనుపమానము. దేవాలయ కుడ్యములు అపురూప శిల్ప సంపదతో నొప్పారుతున్నాయి. పంచతంత్ర హంస తాబేలు కథ, పక్షులు, సింహములు, పౌరాణికకథలు, స్త్రీల నృత్య భంగిమలు చూపరులనాకర్షిస్తాయి.

## రాజరాజేశ్వర దేవాలయము

వేములవాడలోని ఆలయములన్నింటిలో అత్యంత జనప్రియమైన ఆలయము (Popular Temple) శ్రీరాజరాజేశ్వర దేవాలయం. శ్రీరాజరాజేశ్వర క్షేత్ర మహాత్మ్యము అను స్థల పురాణము దీని ప్రాధాన్యతను తెలుపుచున్నది. పశ్చిమ కళ్యాణి చాళుక్య చక్రవర్తి, ఆఱవ విక్రమాదిత్యుని మహా మండలేశ్వరుడైన రాజాదిత్యుడు ప్రతిష్ఠించిన రాజాదిత్యేశ్వర దేవరకు గొప్ప దేవాలయము నిర్మించెనని ఈ ఆలయమందు నిలుపబడిన క్రీ.శ. 1083 శాసనంలో ఉంది[11]. అదియే నేడు శ్రీ రాజరాజేశ్వర దేవాలయముగా వ్యవహరింపబడుతుంది. చుట్టూ ఎత్తైన రాతి ప్రాకారము గల ఈ దేవాలయము తూర్పు ముఖమును కలిగిఉంది. ఈ ఆలయ ప్రాంగణము సువిశాలముగా నుండుటచే కాలక్రమములో ఇతర చిన్న దేవాలయాలు వెలసాయి.




గర్భగృహద్వారము



కోనేరు

రాజరాజేశ్వర దేవాలయ అధిష్ఠానము నేలను చదును (Flooring) చేయుట వలన భూమిలో మునిగిఉంది. దీనిపై నున్న కుడ్యములు అలంకరణ లేక సాదాగా (Plain) నుండి కుడ్య స్తంభముల (Pilasters) తో అలంకరింపబడినాయి. గోడపై నున్న కపోతము (Cornice) అర్ధచంద్రాకృతి శిలలతో అలంకరింపబడింది. ప్రస్తర భాగము హంసలు, కత్తి, డాలు పట్టుకొన్న యోధులు, గజారూఢులు, స్త్రీ రూపములు మున్నగు వాటితో అలంకరింపబడింది. గర్భగృహముపై నున్న శిఖరము సంపూర్ణముగా నూతన నిర్మాణము. అంతకు ముందున్న శిఖరము పిరమిడ్ ఆకృతిలో (Stepped Pyramidal Form) ఉండేది. పూర్వపు పునాదుల పైననే ఆలయ ముఖమంటపము పునఃనిర్మాణముగావింపబడింది. గోపురము, ముఖమంటపము దాని ముందు జీవముట్టిపడునట్లు నిలువెత్తు మలచబడిన నునుపైన ద్వారపాలక విగ్రహములు మున్నగునవన్నియు నూతన నిర్మాణములే. ముఖమంటపమునకు తూర్పు, ఉత్తర, దక్షిణ దిశల యందు ప్రవేశద్వారము లుండి, పడమట నున్న గర్భ గృహమందు గల పానవట్టముపై లింగము






వేములవాడ రాజరాజేశ్వర దేవాలయము - గ్రౌండ్ ప్లాన్

ప్రతిష్ఠించబడి ఉంది. ముఖమంటపములో కుడివైపున లక్ష్మీగణపతి విగ్రహముంది. ఇది అత్యంత మనోహరముగా నుండి శిల్పకళతో నొప్పారుతుంది. ఇంద్రనీల ఛాయగల ఈ విగ్రహము చూపరులనాకర్షిస్తుంది. గణపతి మలచుకొని యున్న ఎడమకాలిపై దేవి (Goddess seated on his folded left leg) కూర్చొని ఉంది. మంటపములోని ఎడమవైపు రాజరాజేశ్వరీదేవి ఆలయముంది. అమ్మవారి పైచేతులలో డమరుకము, త్రిశూలము, క్రింది చేతులలో ఖడ్గము, గిన్నె (Bowl) ను చూడవచ్చు.

ఆలయ గర్భ గృహ ప్రవేశ ద్వారము లలాటమున గజలక్ష్మి ప్రతిమతో కళ్యాణి చాళుక్యుల కళారీతులలో శోభాయమానముగా ఉంది. ఈ ఆలయ ద్వార బంధములు శిల్ప సంపద కాలవాలమైనవి. లింటెల్ పై బయటకు చాపుకొని యున్న చూరు బహుఅందముగా నున్నది. ద్వారమునకిరువైపుల చెక్కబడిన త్రిశాఖలలో మధ్యనున్న స్తంభాకారమున కిరువైపుల వివిధ లత పుష్పాకృతులు మాలల రూపమున మలచబడినాయి. ద్వారపు అధోభాగముననున్న ఫలకములపై అందమైన ద్వారపాలకులు మలచబడినారు. వీరి పైహస్తములందు త్రిశూలము, డమరుకము క్రింది కుడి హస్తమునందు గద యుండగా దానిపై ఎడమహస్తము నిలుపబడింది. ద్వారపాలకులకు ఇరువైపుల మలచబడిన సుందరాంగుల అంగసౌష్ఠవము, కేశాలంకరణ, వివిధ ఆభరణములు శిల్పసౌందర్యమును చాటుతున్నాయి.

రాజేశ్వరాలయమునకు ఎడమవైపు కాశీవిశ్వేశ్వరాలయమున్నది. ఇది ఒక మంటపము వంటిది. ఇచట లేత గులాబీరంగులో నున్న శివలింగము కాశీ విశ్వేశ్వరలింగమనబడుచున్నది. వేములవాడను దక్షిణ కాశీయని పిలుచుటకు ఈ లింగవే కారణమై ఉంటుంది. రాజేశ్వరాలయమునకు వెనుక అనంతపద్మనాభస్వామి ఆలయముంది. ఈ ఆలయ ద్వార తోరణములు శిల్పకళల కాలవాలమై ఉన్నాయి. శివకేశవుల ఉత్సవములు వేములవాడలో నిర్వహించబడుట వలన ఇది హరిహర క్షేత్రమని ప్రసిద్ధి గాంచింది.

రాజరాజేశ్వరాలయ ప్రాంగణములో కోదండ రాముని, బాలత్రిపుర సుందరీదేవి, బాలరాజేశ్వర, విఠలేశ్వర మున్నగు ఆలయాలున్నాయి. రాజరాజేశ్వరాలయమొక బృహత్తటాకపు కట్ట (Bund) పై నిలిచిఉంది. ఈ ఆలయమునంటుకొని ఉత్తర దిశలో యొక కోనేరున్నది. అది ధర్మకుండ మనబడును. దీని యందు స్నానమాచరించినచో భూత,ప్రేత,పిశాచాది గ్రహబాధలు, చర్మవ్యాధులు, పాపము నివృత్తి యగునని భక్తులు నమ్ముతారు. రాజరాజనరేంద్రుడీ కుండమునకు సోపానములు నిర్మించాడని తెలుస్తుంది. గుండము నందు శివలింగములు గల రెండు మంటపములున్నాయి. ధర్మకుండమునకు పై భాగమునందనేక నాగప్రతిమలు చెక్కిన శిలలున్నాయి. ఈ ధర్మకుండము నందున్న రెండు లింగ మంటపములు బాదామికి సమీపమున గల మహాకూటేశ్వరము నందలి పద్మకొలనులో క్రీ.శ. 600 ప్రాంతములో నిర్మింపబడిన లింగ



మంటపమును (Linga pavilion constructed in vishnu's lotus pond at Mahakut datable to A.D. 600) గుర్తు చేస్తాయి[12]. రాజరాజేశ్వర దేవాలయ ప్రాంగణములో అనేక విడివిగ్రహాలున్నాయి. అందులో భైరవుడు, మురళీకృష్ణుడు, వినాయకుడు, లింగములు, నంది విగ్రహములు ప్రధానమైనవి. శ్రీ రాజరాజేశ్వరాలయ ప్రాంగణములో ఈశాన్యమునందొక మహ్మదీయ సాధువు సమాధి ఉంది. హిందూ మహ్మదీయులు దానిని పవిత్రమైనదిగా భావిస్తారు.

## ఆదిత్య గృహం

రెండవ అరికేసరి కాలపు శాసనములో పేర్కొనబడిన నాలుగు దేవాలయములలో ఆదిత్య గృహమొకటి[13]. ఇది పూర్తిగా శిథిలమైనందున దీని నామరూపాలు నేడు లేవు. కాని దాదాపు రెండడుగుల ఎత్తున్న ఆదిత్య విగ్రహమొకటి రాజరాజేశ్వర దేవాలయ దీప స్తంభము సమీపమున ఉంది. ఈ ద్విహస్తముల సూర్యప్రతిమలో పైకెత్తిన రెండు చేతులలో పద్మములున్నాయి. పాదముల వద్ద కొంత శిథిలమైన ఇలాంటి విగ్రహమే ఇంకొకటి భీమేశ్వరాలయమందలి బయటి వరండాలో పడిఉంది. ఇది బాగా అతిగిపోయిన విగ్రహము. ఇందులో గూడా ఆదిత్యుని పైకెత్తిన ద్విహస్తములందు పద్మములున్నాయి. అంసుమద్భేదాగమము మరియు సుప్రభేదాగమములను అనుసరించి కమలములను పట్టుకొనిన పిడికిలిలు సూర్యుని భుజములదాకా ఎత్తబడియున్నవి[14]. సూర్యుడు సమభంగములో నిలబడి తలవెనుక ప్రభామండలమును కలిగియున్నాడు. సూర్యుని మెడలో హారము, కర్ణములకు వలయాకారాభరణములు (Ear-Rings) తలపై మకుటము అలంకరింపబడినవి. బహుశః ఈ రెండు సూర్య విగ్రహములు రెండవ అరికేసరి తంత్రపాలుడైన పెద్దనార్యుడు కట్టించిన ఆదిత్య గృహమునకు సంబంధించినవై యుండును.

## శుభధామ జినాలయము

ప్రస్తుత మీ జినాలయము లేదు. పూర్తిగా శిథిలమై అదృశ్యమైంది. కాని ఇందలి నిలువెత్తు పార్శ్వనాథ విగ్రహము చాలాకాలము మట్టుకు రాజరాజేశ్వర గోపురద్వారము లోపలి గోడకు ఆనుకొని నిలుపబడి ఉండేది. ఈ ఆలయ పునరుద్ధరణ సమయములో ఇందలి విడి విగ్రహములన్నియు (Loose Sculptures) భీమేశ్వరాలయమునకు ఉత్తరమున నున్న తోటలోనికి తరలింపబడినాయి. అద్భుతమైన రాతి శిల్పములనేకములు నేటికిని ఈ తోటలో పడిఉన్నాయి. ఎర్రఇసుక రాతితో చెక్కబడిన పార్శ్వనాథుని విగ్రహము కాయోత్సర్గ రీతిలో నుండి అతని బాహువులు మోకాళ్ల వరకు విస్తరించి యున్నవి. అతని వెనుక మెలికలు తిరిగిన సర్పము (Coils of the serpent) చెక్కబడి దాని పడగలు అతని శిరముపై గొడుగువలె అలంకార ప్రాయముగా విప్పుకొనియున్నవి. ఈ దిగంబర విగ్రహమునకు ఒక ప్రక్కన శిశువుతో గూడిన స్త్రీ రూపము మలచబడింది. పార్శ్వనాథుడు సంతానసాఫల్యమునకై వచ్చిన తన భక్తులను దీవించేవాడని దీని వలన ద్యోతకమవుతుంది. ఈ ప్రతిమ అడుగుభాగమున నాలుగు పంక్తుల

సంస్కృతశాసనము చెక్కబడిఉంది[15]. రెండవ అరికేసరి లోకాంబికలకు జన్మించిన రెండవ బద్దెగుడనురాజు తన సపాదలక్ష దేశము నందు సుప్రసిద్ధ జైనమతాచార్యుడైన సోమదేవసూరి కొఱకు వేములవాడలో శుభధామజినాలయమును కట్టించెనని ఈ శాసనము తెలుపుతుంది. గౌడ సంఘాధ్యక్షుడగు సోమ దేవసూరి బద్దెగుని విద్యాగురువు.

వేములవాడ ప్రాచీనకాలమున జైనమత కేంద్ర స్థానముగా ఉండేది. చాళుక్యులు జైన మతానుయాయులు. వీరి పరిపాలనా కాలమున జైన మఠములు, జినభవనములు, జైన బసదులు, జినాలయములు నిర్మింపబడినాయి. అనేక తీర్థంకరుల విగ్రహములు ప్రతిష్ఠింపబడినాయి. కాలక్రమమున జైన మతము క్షీణించింది. జినాలయములు, జైనమఠములు పడగొట్టబడినాయి. శిథిలాలయములందలి విగ్రహములు, స్తంభములు శివాలయముల నిర్మాణ మందుపయోగింపబడినాయి. స్థానిక వేణు గోపాలస్వామి దేవాలయ కుడ్యముల నిర్మాణమందట్టి జైనాలయముల శిథిలావశేషములు ఉపయోగింప బడినాయి. రాష్ట్రకూటుల వలె వారి సామంతులైన వేములవాడ చాళుక్యులు జైన మతముతో పాటు వైదిక మతమును పోషించారు. ఆనాడు జైనమతమున వర్ణవ్యవస్థకు స్థానమేర్పడి ఉంది[16].

శాసనాధారమును బట్టి శుభధామజినాలయమును గూర్చి మాత్రమే తెలుస్తుంది. కాని వేములవాడలో వివిధ దేవాలయములందు కనీసము ఒక డజన్ జైన విగ్రహములున్నాయి. ఈ ప్రతిమలన్నియు ఒకే దేవాలయమందు ప్రతిష్ఠింపబడినవని చెప్పుటకు వీలులేదు. ప్రస్తుతము వేములవాడలో ఐదు పార్శ్వనాథుని, మూడు వర్ధమానుని, ఒక గోమతేశ్వరుని విగ్రహములు గలవు. ఇంకను నాలుగు ప్రతిమల అడుగుభాగమున వారి వాహనముల గుర్తులు లేనందున అవి ఏ తీర్థంకరులవో చెప్పుటకు కష్టముగా నున్నది. ఈ ప్రతిమలన్నియు వేములవాడ చాళుక్యుల తొలికాలము నుండి కళ్యాణి చాళుక్యుల పాలనాంతకాలము వరకు సంబంధించినవై ఉంటాయి. ఇవి ప్రధానంగా తొమ్మిది మరియు పదకొండవ శతాబ్దముల మధ్యకాలములో చెక్కబడియుండవచ్చు. వేములవాడలోని గోమతేశ్వరుని శిల్పము నందు బోధన్ ప్రాంతపు శిల్పకళా ప్రభావము మిక్కుటముగా గోచరిస్తుంది.

వేములవాడ చాళుక్యుల తొలి రాజధాని బోధన్ నగరం. ఇచటి జైన దేవాలయములు రూప శిల్ప సౌందర్య విరాజితములు. జైన తీర్థంకరుల ఎత్తైన విగ్రహములతి మనోహరములు. శిథిలమైన బోధన్ దుర్గము నందు నాలుగు జైన శాసనములు లభించినవి. బోధన్‌లో అతి ఎత్తైన జైన తీర్థంకరుల విగ్రహములు తయారు అవుతుండేవి. అందొక విగ్రహము 56 అడుగుల కంటే ఎత్తైనది. ఆ విగ్రహము శిథిలమైనది. దాని మొండెమెన్ని ప్రక్కలైనదో తెలియదు కాని జైన తీర్థంకరుని శిరస్సు మాత్రము బోధన్‌లోని రహదారి బంగళా ఆవరణలో పడిఉంది. ఈ విగ్రహము నాదర్శముగా గొని కర్ణాటక మందలి శ్రావణ బెళగోళలోని విగ్రహము రూపొందింపబడినదని



ప్రతీతి[17]. వేములవాడలోని జైన విగ్రహములు అతి ప్రాచీన శిల్పకళారీతులను కలిగి కొనకొండ్ల మరియు పెదతుంబలమ్‌లోని విగ్రహములను బోలియున్నవి[18].

## ప్రతిమా శిల్పములు (Sculptures and Icons)

ఒకానొక కాలమందు రాజరాజేశ్వర దేవాలయ అరుగుల పై నుండిన అనేక విడి ప్రతిమా శిల్పములు భీమేశ్వరాలయములో ఆగ్నేయదిశయందు గల వరండాలో పడి ఉన్నాయి. ఈ శిల్పరాజము లన్నియు శతాబ్దముల తరబడి నిరాదరణకు గురియై ఎండకు ఎండి వానకు తడిచి రూప విహీనములై అరిగి పోయాయి.

### 1. సప్తమాతృకాఫలకము

ఒక చివరలో వినాయకునితో గూడిన ఈ సప్తమాతృక ఫలకము (Stone Slab) చాలా అఱిగిపోయి (Worn out) ఉంది. ఈ ఫలకముపై బ్రాహ్మి, మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండీ మరియు గణపతి రూపములు, వాటి ఆసనముల క్రింద వరుసగా హంస, నంది, నెమలి, గరుడ, మహిషము, ఐరావతము, జంబుకము, మూషిక వాహనములు ఆగమ శాస్త్రానుసారముగా చెక్కబడినవి. సప్తమాతృకలందరు మకుటములు ధరించి వాటి వెనుక ప్రభా మండలములతో (Halos) శోభిల్లుచున్నారు. సప్తమాతృకలు సాధారణముగా ధరించు అన్ని ఆభరణములతో చతుర్భుజములను కలిగియున్నారు. ఇది క్రీ.శ. తొమ్మిదవ, పదవ శతాబ్ద కాలముద్దై యుండును.

### 2. ఇంకొక సప్త మాతృకాఫలకము

ఈ సప్తమాతృకల ఒక చివరలో గణపతి, రెండవ చివరలో వీరభద్రుడు చెక్కబడినారు. ఈ రూపములన్నియు చతుర్భుజములను కలిగి వాటి క్రింద వాహనములు చెక్కబడియున్నవి. సప్తమాతృకలు మకుటములు, కర్ణవలయములు (Ear-Rings) గ్రైవేయకములు, దండ, ముంజేతి, కాలికడియములను (arm-lets, wrist-lets and anklets) ధరించియున్నారు.

**3. సూర్య విగ్రహము** :- కమలపు మొగ్గలను కలిగిన కాడలను పైకెత్తిన ద్విహస్తములతో పట్టుకొని యున్న ఈ చిన్న సూర్య విగ్రహము పాదముల చెంత కొంత విరిగిపోయి ఉంది.

**4. వినాయక విగ్రహము** :- ద్విహస్తములు గల కిరీటములేని ఏనుగు తల గల గణపతి కుడిచేతిలో దంతము ఎడమచేతిలో గల పాత్రలోని మోదకములపై తన తొండపు కొనను నిలిపియున్నాడు.

### 5. జైన చౌముఖ శిల్పము

ఈ జైన చౌముఖ ప్రతిమ లేదా సర్వతోభద్రిక నాలుగు ప్రక్కల పద్మాసనములో నున్న జినుల విగ్రహాలున్నాయి. కడప జిల్లాలోని దానవులపాడు చౌముఖముల కంటె ఇది కొంత

ఎక్కువ పొడవు వెడల్పులను కలిగి ఉంది. పండుగ సమయములందు దీనిని పానవట్టము పై నిలిపి అభిషేకము చేస్తుంటారు[19].

**6. వేరొక జైన చౌముఖము** :- దీనికి నాలుగు ప్రక్కల పద్మాసనములో నున్న జినవిగ్రహముల చేతులు ధ్యానముద్రలోనున్నవి.

**7. జైన చౌవీస శిల్పము**

జైన చౌవీస శిల్పము గూడా చౌముఖ శిల్పము వలెనే యుండి ఒక్కొక్క ప్రక్క మూడు అంతరములను (Three Floors) కలిగి ఆరేసి జైన విగ్రహములు చెక్కబడినవి. ఈ విధంగా నాలుగు ప్రక్కల యందు మొత్తము చౌవీస (Twenty Four) జిన విగ్రహాలున్నాయి. ఈ చౌముఖ మరియు చౌవీస ప్రతిమలు ఏలేశ్వరము, వెల్దుర్తి, అలంపురము, మహానందిలలో భక్తులు మ్రొక్కుబడికై చేయించిన చిన్న చిన్న శివాలయములను (Resembling the votive shrines of siva) బోలియున్నవి[20]. దానవుల పాడులోని ఇలాంటి జైన చౌముఖ ప్రతిమపై రాష్ట్రకూట మూడవ ఇంద్రుని చిన్న శాసనముంది. దీనిని బట్టి వేములవాడలోని చౌముఖములు, చౌవీస ప్రతిమలు గూడా క్రీ.శ. పదవ శతాబ్దమునకు చెందినవని రూఢీగా చెప్పవచ్చు[21].

**8. జినవిగ్రహములు**

నల్లని గ్రానైట్ రాయితో చేయబడి ధ్యానముద్రలో కూర్చొనియున్న రెండు జినవిగ్రహములు ఉంగరాల జట్టును (hair in spiral ringlets) కలిగియున్నవి.

**9. భైరవుడు** :- నాలుగు అడుగుల ఎత్తున్న ఈ భైరవ ప్రతిమ పైహస్తములందు డమరుకము, త్రిశూలము, క్రింది హస్తములందు ఖడ్గము మరియు గిన్నె లేదా పాత్ర (Bowl) ఉన్నాయి.

**10. స్కందుడు** :- ఇది నెమలి పై స్వారి చేయుచున్న షణ్ముఖ విగ్రహము.

ఇవి గాకుండా ఇంకను అనేక నాగశిల్పములు, రెండు సర్పములు తమ పడగలను పైన నిలిపి ఒకటికొకటి పెనవేసికొనిన (Two Nagas entwined with their hoods above) ప్రతిమలు, వినాయక, దేవి, నంది ప్రతిమలనేకములు భీమేశ్వరాలయము లోను, దాని కుత్తరమున నున్న తోటలోను పడిఉన్నాయి. ఈ ప్రతిమా శిల్పముల వలన వేములవాడ చాళుక్యుల మరియు కళ్యాణి చాళుక్యుల కాలములో వేములవాడ గొప్ప శైవ, సౌర, జైన క్షేత్రముగా విరాజిల్లినట్లు ద్యోతకమగుచున్నది.

## 3. గంగాధర

కరీంనగరమునకుత్తరమున 25 కి.మీ. దూరంలో గంగాధర ఒక మండలకేంద్రముగా నున్నది. వేములవాడ రాజధానిగా నేలిన చాళుక్య ప్రభువగు రెండవ అరికేసరి పెద్దకుమారుడు



వాగరాజు గంగాధర ఉపరాజధానిగా కొంతకాలము పాలించాడు. సుప్రసిద్ధ జైనకవి సోమదేవసూరి గంగాధరలో నిలిచి క్రీ.శ. 959లో తన "యశస్తిలక చంపువు" అను సంస్కృత గ్రంథమును పూర్తి చేశాడు. గంగాధర నేలు వాగరాజు రాష్ట్రకూట మూడవ కృష్ణ వల్లభునితో దక్షిణ దండయాత్రలకేగి చిత్తూరు జిల్లాలోని మెల్పాడి వద్ద బస చేయుచున్న సమయమున సోమదేవసూరి తన యశస్తిలక గ్రంథమును పూర్తి చేసెనని ఆ గ్రంథమందే వ్రాయబడి ఉంది[22]. వాగరాజు సవతి తమ్ముడైన రెండవ బద్దెగుడు గూడా గంగాధరకు కొంతకాలము పాలకునిగా ఉండేవాడు. ఆ కాలమందు గంగాధర పట్టణము అమితమైన సిరిసంపదలతో నిండియుండెనని తెలియుచున్నది[23]. పదవ శతాబ్ది మధ్యభాగములో గంగాధర ఒక గొప్ప జైన క్షేత్రముగా విరాజిల్లినందువలన జైన కవి సోమదేవసూరి ఇచటనే నివసించి తన రచనలను కొనసాగించాడు.

### బొమ్మలగుట్ట

వేములవాడ చాళుక్య ప్రభువైన రెండవ అరికేసరి మరియు అతని వారసుల కాలములో గంగాధరకు దక్షిణమున 2 కి.మీ. దూరంలో కొండన్నపల్లి దగ్గర నున్న బొమ్మలగుట్ట వృషభాద్రియను పేరుతో గొప్ప జైన క్షేత్రంగా వెలుగొందింది. కరీంనగర్ నుండి జగిత్యాలకు పోవు రహదారి పై నున్న కురిక్యాల గ్రామము నుండి లేదా గంగాధర నుండి 2 కి.మీ. కాలినడకతో ఈ గుట్టను చేరవచ్చు. పంప మహాకవి సోదరుడైన జినవల్లభుడు వేయించిన సంస్కృత, కన్నడాంధ్ర పద్యములతో గూడిన సుప్రసిద్ధ త్రిభాషా శాసనమొకటి (Trilingual inscription) ఈ గుట్టపై ఉంది. ఈ శాసనాంతమున తెలుగులో చెక్కబడిన చివరి మూడు కంద పద్యములు ఈ ప్రాంతములో తెలుగు భాష యందు తొలి పద్యములుగా గుర్తింపబడినాయి. ఆదికవి నన్నయ్య గావించిన ఆంధ్ర మహాభారత రచన కంటే ఒక శతాబ్దము పూర్వమే ఉత్తర తెలంగాణాలో పద్యములల్లి కవితారచన సాగించుస్థాయికి తెలుగుభాష అభివృద్ధి చెందినదని జినవల్లభుని శాసనమందలి ఈ క్రింది మూడు కందపద్యముల వలన తెలియుచున్నది.

కం॥ జిన భవనంబు లెత్తించుట
జిన పూజల్సేయు చున్కి జినమునులకున
త్తిన యన్న దానం బీవుట
జినవల్లభుడు బోలంగలరె జినధమ్మపరుల్

దినకరు సరి వెల్గుదు మని
జినవల్లభు నొట్ట నెత్తి జితకవి ననను
మను జుల్గలరే ధాత్రిం
విని తిచ్చిదు ననియవృత్త విబుధ కవీన్ద్రుల్

ఒక్కొక్క గుణంబ కల్గుదు
రొక్కొణ్డిగా కొక్కలక్క లేవెవ్వరికిం
లెక్కింప నొక్కొ లక్కకు
మిక్కిలి గుణ పక్షపాతి గుణమణి గుణంబుల్

కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర రచన గావించిన డా.మలయశ్రీ చివరి తెలుగు పద్యాన్ని ఇప్పటి విధానంలో వ్రాస్తే ఈ క్రింది విధంగా ఉంటుందని తెలిపారు[24].

ఒక్కొక్క గుణమ గల్గుదు
రొక్కొదుగా నొక్క లెక్క లేవెవ్వరికిన్
లెక్కింప నొక్క లెక్కకు
మిక్కిలి గుణ పక్షపాతి గుణమణి గుణముల్


జినభవనములు కట్టించుట, జినసాధువుల పూజలు చేయుట, జినమునులకు నచ్చిన భోజనములు పెట్టుటలో ఇతర జైనులెవ్వరూ జినవల్లభునితో సరిపోజాలరు. సూర్యునితో సమానముగా వెలుగువారును, జినవల్లభునితో సరితూగు మరే కవులునూ లేరు. ఒక్కొక్కరు ఒక్కొక్క సుగుణము కలవారుగా ఉంటారు. ఆలోచించి చూడగా జినవల్లభుడు గుణమణి. పైగా అతడు గుణపక్షపాతియని మూడుకందములందు పేర్కొనబడింది. కందం కన్నడం నుండి తెలుగులోనికి వచ్చిందని, అదీ కరీంనగర్ జిల్లాలో జినవల్లభుని ద్వారానే ఆవిర్భవించిందని డా.మలయశ్రీ అభిప్రాయము. జినవల్లభుడు జైన మతాధిపతిగా సాధు జీవితం గడిపాడు. శాంతి ధర్మ ప్రబోధంతో పాటు త్రిభాషా సాహిత్యాన్ని వెలయించాడు. ఈ జిల్లా ప్రథమాంధ్ర కవిగానే కాక, అఖిలాంధ్ర దేశంలోనే మొట్టమొదట తెలుగులో కందపద్య రచన గావించిన ప్రయోగశీలిగా జినవల్లభుడు చిరస్మరణీయుడై నిలిచినాడు. ఇతడు సంగీతపరుడు, ప్రియభాషణుడు మరియు కవిపుంగవుడు. ఇచటి దిగంబర సంప్రదాయ జైన క్షేత్రం సర్వదా జినభక్తుల సంచారముతో సందడిగా ఉండేది.

ఈ బొమ్మలగుట్ట వృషభగిరి, వృషభాద్రి లేదా వృషభ పర్వతముగా పిలువబడింది. ఈ గుట్ట వృషభాకారములో నుండుటచే ఇది వృషభగిరి యని పిలువబడింది. అంతే గాకుండా ఈ పర్వతముపై వృషభేశ్వరుడు చెక్కబడినాడు కావున ఇది వృషభాద్రిగా ప్రసిద్ధి చెందింది. ఈ గుట్టపైనొక గండశిల ఉంది. ఇది ఇచటి శాసనమందు సిద్ధశిలగా పేర్కొనబడింది. ఈ సిద్ధశిలపై జైనమత ఆద్యంత తీర్థంకరుల మరియు చక్రేశ్వరి బృహత్ప్రతిమలు చెక్కబడినాయి. ఈ ప్రతిమల సమీపమందే జినవల్లభుని శాసనముంది. ఈ శాసనము క్రీ.శ. 945 కాలమునకు చెందింది[25]. ఇచటి జైన ప్రతిమలు జినవల్లభుని కులదైవములుగా పేర్కొనబడినవి. అతడిచట త్రిభువనతిలకమనే జైనబసది కవితాగుణార్ణవమనే తటాకము, మదన విలాసమనే తోటను ఏర్పరచాడు. పంప మహాకవికి కవితాగుణార్ణవుడను బిరుదముంది. తన సోదరునిపై గల



అభిమానము వలన తాను త్రవ్వించిన తటాకమునకు కవితాగుణార్ణవమను పేరు పెట్టి యుండును. కురిక్యాల నుండి గంగాధరకు కాలినడకన పోవు మార్గమందు ఈ గుట్ట దగ్గర నున్న చెఱువే కవితా గుణార్ణవ తటాకమై యుండును. మదనవిలాసమను వనము నేడు కానరాదు. త్రిభువనతిలక యను జైన బసది శిథిలమై అదృశ్యమైనది. కాని ఈ గుట్టచుట్టున్న పొలములందు మరియు గంగాధర గ్రామమునందనేక జైన విగ్రహములు పడిఉన్నాయి. ఇవన్నియు ఈ జైన క్షేత్రమునకు సంబంధించినవై ఉంటాయి. ఇటీవల ఇచటి పొలములందు లభ్యమైన నిలువెత్తు పార్శ్వనాథవిగ్రహము కరీంనగర్ మ్యూజియంనకు తరలింపబడింది. మ్యూజియం గేటులోనికి ప్రవేశించగానే నగునూరు గణపతి, గంగాధర పార్శ్వనాథ విగ్రహములు ఎదురుగానే చూడవచ్చు. ఈ పార్శ్వనాథుని వెనుక మెలికలు తిరిగిన సర్పముండి దాని పడగలు ఛత్రరూపమున తీర్థంకరుని శిరస్సు పైభాగమున అలంకార భూషణముగా నున్నవి.

బొమ్మలగుట్టపై నిలిచియున్న సువిశాల మరియు సమతల సిద్ధశిలపై జినవల్లభుడు చెక్కించిన అతని కులదైవములు, జినదేవత చక్రేశ్వరి, ఆది తీర్థంకరుడైన వృషభుని, అంత్య తీర్థంకరుడైన వర్ధమానుని బృహత్ ప్రతిమలు బహు సుందరముగా నున్నవి. జైన శిల్పములలో అత్యంత అద్భుత చిత్రమైన చక్రేశ్వరి కిరువైపుల సేవకులైన స్త్రీరూపములున్నాయి (Flanked by the lady attendants). చక్రేశ్వరి జినదేవత వృషభుని యక్షిణి. ఆమె మకుటము, గ్రైవేయకములు, కేయూరములు, కంకణములు, కటిబంధము మున్నగు ఆభరణములతో అలంకరింపబడింది. అష్టభుజములను కలిగియున్న ఈమె ఆసనము క్రింద గరుడ వాహనమున్నది. ఈ యక్షిణి భుజముల సంఖ్య వేర్వేరు ప్రాంతములందు వేర్వేరుగా ఉంది. మధురలో దశ భుజములు, దియోఘర్‌లో షోడశ భుజములు, అదే చోట వేరొక ప్రతిమ అష్టభుజములు మరియు ఒరిస్సా యందలి ఉదయగిరిలో పండ్రెండు భుజములతో గూడిన ఈ దేవతా శిల్ప ప్రతిమలున్నాయి[26]. రాజస్థాన్‌లోని మౌంట్ అబూపై గల దిల్వారా ఆలయమందున్న అష్టభుజ చక్రేశ్వరి ఆభరణ భారముతో అందముగా చెక్కబడింది. ఇది పదమూడవ శతాబ్దమునకు చెందింది. పదవ శతాబ్దమునకు చెందిన బొమ్మలగుట్టపై కూర్చొని యున్న జినదేవత కుడికాలు క్రిందికి వ్రేలాడియుండి ఎడమకాలు మలచుకొని ఉంది. కాని దీనికి భిన్నముగా దిల్వారా జినాలయము లోని దేవత కుడికాలు మలచుకొని ఉండి ఎడమకాలు క్రిందికి వ్రేలాడునట్లు కూర్చొని యున్నది[27]. ఆదితీర్థంకరుని శాసనదేవిగా ఈ జినదేవత అత్యంత ప్రాధాన్యతను కలిగియున్నది. వృషభుని యక్షిణిగా ఈమె గరుడ చిహ్నముతో మరియు యక్షుడైన గోముఖుడు వృషభ చిహ్నముతో శిల్పములందు అగబడుదురు[28]. గరుడ చిహ్నముతో చక్రధారిణియైన ఈ చక్రేశ్వరి చక్రధారుడైన శ్రీ మహావిష్ణువు అర్ధాంగి వైష్ణవికోవకు చెందింది. ఈ వైష్ణవి వేరొక నామమే చక్రేశ్వరి. సాధారణముగా యక్షిణుల ప్రతిమలందు వైదిక దేవతల (Brahamanic Goddesses) మరియు అర్ధదేవతలైన (Demi divinities) యక్షుల సంప్రదాయముల మేళవింపు శిల్పము గోచరించును[29].




జైన చక్రేశ్వరి

బొమ్మల గుట్టపై నున్న జైన చక్రేశ్వరి కిరువైపుల ముగ్గురు చొప్పున మొత్తము ఆరుగురు జైన దిగంబరులు చెక్కబడినారు. చక్రేశ్వరి పై భాగమున ఆద్యంత తీర్థంకరులు వృషభుడు మరియు వర్ధమానుడు ఆజానుబాహువులతో నిలబడియున్నారు. ఈ యౌవ్వన దిగంబర విగ్రహములందు మృదుస్వభావముట్టి పడుతుంది. వీరి తలలపైన త్రిఛత్రములు శోభాయమానముగా నున్నవి. ఈ ప్రతిమల సమీపమందున్న వలయములో జినపాదములు చెక్కబడినవి.



ఆద్యంత తీర్థంకరులు



వైష్ణవాలయము



జినవల్లభుడనేక మంది జైనమత గురువులను, పండితులను, కవులను, ఆదరించి పోషించాడు. కవిజనాశ్రయమను ఛందో గ్రంథము మల్లియరేచన యను జైన వైశ్యపుంగవుడు జినవల్లభుని ప్రోత్సాహముతో రచించినట్లు సుప్రసిద్ధశాసన పరిశోధకులు డా.పి.వి.పరబ్రహ్మశాస్త్రి అభిప్రాయము[30]. తరువాతి కాలములో ఈ కవిజనాశ్రయము వేములవాడ భీమకవి పేరప్రఖ్యాతి గాంచినదని పలువురి అభిప్రాయము.

## వైష్ణవాలయము

ప్రాచీన చారిత్రక గ్రామమైన గంగాధరలో నొక వైష్ణవాలయముంది. దానిచుట్టు ప్రహారీగోడ ఉంది. ఒకే అధిష్ఠానము పై నిలిచియున్న గర్భగృహము, అంతరాళము తొలి నిర్మాణాలై ఉంటాయి. తరువాతి కాలములోని మంటపము దాని ముందున్న చిన్న మంటపము (Porch) రెండును వేరొక అధిష్ఠానము పై నిర్మింపబడి ఉన్నాయి. అధిష్ఠానము నందు చతుర్దళ పుష్పాకృతులు చెక్కబడినాయి. ఆలయభిత్తిని అర్ధచంద్రాకారాకృతులతో అలంకరింపబడిన కపోతము (Cornice) గోపురము నుండి వేరుచేయుచున్నది. నాలుగు మధ్యస్తంభములతో (Central Pillars) కూడిన పదహారు స్తంభముల చతురస్రాకారపు మంటపము చుట్టును పిట్టగోడ (Pial) యుండి తూర్పులో పోర్చ్ నుండి లోనికి ప్రవేశించుటకు మార్గమున్నది. అంతరాళ మరియు మంటప లోకప్పు సమతలముగా (Flat roofed) నుండి మంటప మధ్యభాగము మరియు గర్భగృహపు లోకప్పు (Ceiling) లుపవితాన రీతిలో తీర్చిదిద్దబడింది.

దేవాలయ శిఖరం ఎత్తైన పిరమిడ్ ఆకారము (Stepped elongated pyramid form) లో ఉంది. ఆలయ ప్రవేశమునందొక వైపు 4' ఎత్తున్న గరుడ మరియొకవైపు ఆంజనేయ విగ్రహములున్నాయి. ఆలయము ముందు దాదాపు 20' ఎత్తుగల గరుడ స్తంభముంది. దానిపై నుండిన చిన్న మంటపము లోని గరుడ ప్రతిమ ఇప్పుడొక గూటిలో నిలుపబడింది. ఇచటి గరుడస్తంభము కరీంనగర్ జిల్లాలోని వాల్గొండ, చిలువాకోడూరు, నగునూరు, రామగుండం ఆలయముల ముందున్న స్తంభములను పోలియున్నది. మధ్యయుగపు ఈ దేవాలయము నందు ప్రస్తుతము లక్ష్మీదేవి, పద్మావతులతో గూడిన వేంకటేశ్వర విగ్రహము ప్రతిష్ఠింపబడి ఉంది.

## 4. రేపాక

కరీంనగర్‌నకు నైరుతి యందున్న కుగ్రామమైన రేపాకకు బెజ్జంకి నుండి లేదా సిరిసిల్ల గుండా చేరవచ్చు. వేములవాడ నేలిన మూడవ అరికేసరి క్రీ.శ. 966లో జారీ చేసిన పర్భిణి తామ్రశాసనమందు రేపాక ప్రసక్తి ఉంది[31]. సోమదేవ సూరి కొరకు తన తండ్రి బద్దెగుడు నిర్మించిన శుభధామ జినాలయ మరమ్మతులకు, సున్నము వేయుటకు, నైవేద్యములకై సబ్బి సహస్రములోని రేపాక ద్వాదశాంతర్గత వనికటుపలు గ్రామమును దానమిచ్చు సందర్భము నందు మూడవ అరికేసరి పై తామ్రశాసనమును వేయించాడు. ఈ శాసనమును బట్టి రేపాక

పన్నెండు గ్రామములకు పాలనా కేంద్రముగా నుండెనని తెలుస్తుంది.

రేపాక గ్రామమున మాధ్యమిక పాఠశాలకు చేరువలో నున్న చేనులో పడియున్న స్తంభముపై నాలుగు ప్రక్కల చెక్కబడిన 116 పంక్తుల శాసనమొకటున్నది[32]. శక సంవత్సరము ప్రభవ ఫాల్గుణ శుద్ధ త్రయోదశి బృహస్పతి వారము క్రీ.శ. 968 ఫిబ్రవరి 14న వేయబడిన ఈ శాసనము మూడవ అరికేసరి రేపాక యందొక జినాలయము నిర్మించినట్లు తెలుపుచున్నది. ఇదియే ఖలివృత్తు జినాలయము. శాసనమందలి పంక్తుల మొదటి అక్షరములు చాలా మట్టుకు అరిగి పోయినందున జినాలయము పేరు అస్పష్టముగా నున్నది. అరిగిన అక్షరములు వదలినచో ప్రస్తుతము ఖలివృత్తు జినాలయమని చదువవచ్చు. శ్రీమద్విట్టకుల వంశీయులగు కామ,రామ, తుక్కయ, రేవణ, పుణ్యారామ, కొమ్మయ్య మున్నగువారు ఇందులో పేర్కొనబడినారు. అటుకూరు-70, పమ్మి-12 ప్రాంత పాలకులైన శ్రీమద్విట్టకుల సంభవులగు జైనమతానుయాయుల విషయమిందు వర్ణితము.

ఈ శాసనశిల మొదటి రెండుప్రక్కలు కన్నడ భాషలో నున్నవి. మూడవ, నాలుగవ ప్రక్కలు సంస్కృత భాషలో చెక్కబడ్డాయి. ఈ శాసనాంతమున వ్యాసగీతాశ్లోకములున్నవి. తరువాత కన్నడ వచనముంది[33].

## 5. ధర్మపురి

కరీంనగర్ నుండి 65 కి.మీ. దూరంలో, జగిత్యాల నుండి 27 కి.మీ. దూరంలో పవిత్ర గోదావరి నది తీరమందున్న ధర్మపురిని చేరవచ్చు. ఇచట గోదావరినది ఉత్తరము నుండి దక్షిణదిశకు ప్రవహించుట విశేషం. ఈ గోదావరి కరీంనగర్ ఆదిలాబాద్ జిల్లాలకు మధ్య సరిహద్దుగా ఉంది. దీనిలో పవిత్రస్నానము లాచరించుటకై బ్రహ్మగుండం, చక్రతీర్థం, యమగుండం, వసిష్ఠగుండం, సత్యావతి గుండం, గొల్లమడుగు అను గోపికాతీర్థం మున్నగు గుండాలున్నాయి. ధర్మపురి ప్రాచీన ప్రాశస్త్యమును, చారిత్రక విశేషములను, పూర్వ వైభవమును తెలుపు దేవాలయములనేకములు ఇక్కడ ఉన్నాయి.

శ్రీమహావిష్ణువు అవతారమైన నృసింహస్వామి దేవాలయము ఇచట నుండుట వలన ధర్మపురి గొప్ప హైందవ క్షేత్రముగా విరాజిల్లినది. శక సంవత్సరము 850 అనగా క్రీ.శ.928కి సంబంధించిన "ధర్మపురి క్షేత్ర మహాత్మ్యము" అను స్థలపురాణము ఈ ప్రాంత విశిష్టతను తెలియచేస్తుంది[34]. ఇది 105 అధ్యాయములు, 3500 సంస్కృత శ్లోకములతో కూడుకొనిన తాళపత్రగ్రంథము. శాసనములందు, సాహితీ గ్రంథములందు ధర్మపురి నామము గోచరిస్తుంది. పంప మహాకవి సోదరుడైన జినవల్లభుడు బొమ్మలగుట్టపై నున్న సువిశాల సమతల సిద్ధశిలపై క్రీ.శ.945లో వేయించిన కురిక్యాల శాసనమునందు ధర్మపురి 'ధర్మపురము' లేదా ధర్మపురముగా పేర్కొనబడింది[35]. వేములవాడ పాలకులందరిలో అతి శ్రేష్ఠుడైన రాజన్యుడు రెండవ అరికేసరి



(క్రీ.శ. 930-955) తన ఆస్థాన కన్నడకవి పంపడు రచించిన విక్రమార్జున విజయమను పంప మహాభారత రచనకు సంతసించి ధర్మపురమును అతని కగ్రహారముగా నొసంగెనని పై శాసనము తెలుపుచున్నది. ధర్మపురిలోని రామలింగేశ్వరాలయావరణలో నిలిచియున్న అరిగిపోయిన విరిగిపోయిన (Much abraded and broken inscription) కాకతీయ గణపతి దేవచక్రవర్తి కాలపు క్రీ.శ.1246 శిలాశాసనమందు వైజనాథ, సూర్యదేవరలకు దానములు ఇవ్వబడినట్లు పేర్కొన బడింది[36]. ఇదే శిలా స్తంభముపై పూర్వపు శాసనమొకటి ఉండెననియు అది కళ్యాణి చాళుక్య చక్రవర్తి ఆఱవ విక్రమాదిత్యుని కాలమున (క్రీ.శ.1076-1126) వేయబడినదనియు అందు రామేశ్వరస్వామి కిచ్చిన దానములు స్పష్టముగా తెలియడము లేదనియు ఆం.ప్ర. పురావస్తుశాఖలో శాసన పరిశోధనా విభాగములో పనిచేసిన ధర్మపురి నివాసి కీ.శే.సంగనభట్ల నరహరి త్రిశతి గ్రంథము నందు తెలిపినారు[37].



దేవాలయముల సముదాయము

క్రీ.శ. 1323లో కాకతీయ సామ్రాజ్య పతనానంతరము ఓరుగల్లు మహ్మదీయుల వశమైంది. కాని కాపయనాయకుడు క్రీ.శ. 1336లో తిరిగి ఓరుగల్లును వశపరచుకొని తన సన్నిహితుల ననేకులను వివిధ ప్రాంతములందు పాలకులుగా నియమించాడు. గురజాల తెలుగునృపాలుని కుమారుడైన ముప్పభూపాలుని రామగిరి దుర్గము రాజధానిగా గోదావరికి దక్షిణమున నున్న సబ్బినాడు ప్రాంతము నేలుటకై నియమించాడు. ముప్పభూపాలుని మంత్రి కేసన మిగుల సమర్థుడు. ఇతని సోదరుడు కందనామాత్యుడు ఎల్లందల పాలకునిగా ఉండెను. మడికి సింగన రామగిరి ఆస్థాన కవిగా నుండి శక సంవత్సరము క్రీ.శ.1342లో అనగా క్రీ.శ.1420లో పద్మపురాణోత్తర ఖండమును రచించి దానిని వెలిగందుల కందనకు అంకితమిచ్చాడు. ఈ గ్రంథమందు రామగిరి కేసనామాత్యుడు ధర్మపురిలో అన్న సత్రము పెట్టించి లక్ష్మీనృసింహస్వామి వారికి ఉత్సవాదులు జరిపించి దానములొసంగెనని పేర్కొనబడింది[38].

చివరి కుతుబ్‌షా అబుల్ హసన్ తానీషా ప్రధానమంత్రి మాదన్న క్రీ.శ. 1676లో ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవములకు మరియు నిత్యపూజలకై అక్కడి బ్రాహ్మణులకు భూదానములిచ్చాడు. మాదన్న కాలపు ప్రభుత్వ ముద్రతో గూడిన సనదు పత్రములు (Manuscript documents with the official seal of Madanna) నేడు మునగాల చిద్రూపయ్య పంతులు వారి మరియు వజ్జలవారి పత్రములు అనే పేరట పిలువబడుచున్నవి[39]. ఐదవ నిజాం అఫ్జలుద్దౌలా కాలములో క్రీ.శ. 1858 కాళయుక్తి కార్తీక బహుళ దశమి మంగళవారము రోజున ధర్మపురిలో రోహిల్లాలు బీభత్సము సృష్టించి గ్రామము నంతటిని దోచుకొన్నారు. ఆనాటి ప్రజల ఆక్రందనలను నృసింహదాసుకవి "రోహిల్లాలపాట" రూపములో వ్రాశాడు. అదే సంవత్సరములో పుష్య బహుళ ఏకాదశినాడు ధర్మపురిలోని ఉభయ నరసింహ దేవాలయములందు సంప్రోక్షణ చేశారు[40].

సాహిత్యపరంగా, ఏకామ్రనాథుని ప్రతాపచరిత్రము, కొఅవిగోపరాజు సింహాసన ద్వాత్రింశిక, పోతన నారాయణశతకము, పింగళి సూరన కళాపూర్ణోదయము, చరిగొండ ధర్మయ్య చిత్రభారతము, చరిగొండ హన్మయ్య జ్యోతిష రత్నాకరము, శేషప్ప లేదా శేషాచలదాసు నృసింహ, నరసింహ, నృకేసరి శతకములు, నరసింహదాసు రోహిల్లాలపాట, మైరావణ చరిత్ర యక్షగానములు, మున్నగు గ్రంథము లందు మరియు కీ.శే. సంగనభట్ల నరహరి సేకరించిన ప్రాచీన వ్రాత పత్రములందు (Old Manuscripts) ధర్మపురి ప్రసక్తి ఉంది. 1956లో కొరిడె సదాశివశాస్త్రి, 1979లో యం.శ్యాంసుందరశాస్త్రి ప్రచురించిన ధర్మపురి క్షేత్ర మహాత్మ్యగ్రంథములు గూడా ధర్మపురి గురించిన వివరాలను తెలియజేస్తాయి.

ధర్మపురిని తొలి శతాబ్దములలో బౌద్ధభిక్షువులు 'ధమ్మపురి' యని పిలిచెడివారు. ఇచటి తొమ్మిదవ శతాబ్దపు అముద్రిత దెక్కల బండ శాసనమందు ఇది 'ధర్మ్యారమని' పేర్కొనబడింది. రాష్ట్రకూటులకు లోబడి పరిపాలించిన వేములవాడ చాళుక్యరాజు బద్దెగుని (క్రీ.శ. 850-895) సామంతుడగు హైహయ వంశోద్భవుడు ఆయ్యవర్మ చేసిన భూదానములీ దెక్కల బండ శాసనమందు పేర్కొనబడినవి. కరీంనగర్ జిల్లాలో ఇంతవరకు లభ్యమైన శాసనములలో కోటిలింగాలలోని బ్రాహ్మీలిపి లేఖనములు తప్ప ధర్మపురిలోని ఈ దెక్కల బండ శాసనమే అతి ప్రాచీనమైంది[41].

15వ శతాబ్ది నుండి యున్న అనేక దానపత్రములు (Manuscripts) మహ్మదీయ కాలము నాటి సమాచారాన్ని తెలియజేస్తాయి. వాటిలో భర్తునిపేట దాన పత్రము, ఇందవరపు వారి పత్రములు, గోలకొండ మంత్రి మాదన్న పత్రము, ఇనుంగంటి, జువ్వాడి, గూడూరి వెలమదొరల, గందేవారి యెల్లాపు దొరల, నమిలెవారి బ్రాహ్మణకరణం వారి పత్రములు ధర్మపురి విశేషాలను తెలియచేస్తాయి. అంతే గాకుండా సంగనభట్ల, మునిగెల, పాలెపు, పణతుల, చక్రవర్తుల, రావులకొలను, పార్నంది మున్నగు వారి పత్రములు గూడా ధర్మపురి గత సమాచారము నందిస్తాయి. ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాలములో ధర్మపురి వాసుల వినతి పత్రములను



మన్నించి అతని వజీరు మహరాజాకిషన్ ప్రసాద్ బహదూర్ ధర్మపురి వారి నుండి నాలుగవ వంతు భూమిశిస్తు మాత్రమే గ్రహించుటకు తగు ఆదేశములిచ్చాడు[42].

మున్యాశ్రమముగా పేరు తెలియని ఈ క్షేత్రము ధర్మవర్మ కారణముగా ధర్మపురి మహాక్షేత్రమై చారిత్రకయుగమున అద్వితీయ వైభవమునునుభవించింది. స్కందపురాణాంతర్గతమని చెప్పబడు ధర్మపురి క్షేత్రమహాత్మ్యము నందు బలవర్మ నందనుడగు ధర్మవర్మ ఇచటి లక్ష్మీనృసింహుని గురించి తపమాచరించి, అతని కటాక్షమున తన పేరట ఈ క్షేత్రమునకు ధర్మపురి నామము కలుగవలెనని వరములు పొందినట్లు తెలుస్తుంది. పరమ సాధ్వియగు సత్యవతి సర్పరూపియగు తన భర్తతో ఇచటి గోదావరిలో స్నానమాడి యౌవన పురుషుడుగా భర్తను పొందెనని ఇందు వర్ణింపబడింది. వారు స్నానమాచరించిన స్థలమే నేడు సత్యవతి గుండముగా పిలువబడుచున్నది[43].

వేదవేదాంగ శాస్త్రాగమ నృత్య గీత నాట్యాదులందారి తేరిన ధార్మిక ప్రజానీకముతో, అనంత కాలగతిలోని వివిధ ప్రభుత్వముల ఏలుబడిలో మతసామరస్యముతో కలిమిలేముల ఒడిదుడుకులతో మనగలిగి ఈ గ్రామము వర్ధిల్లినది. వేదవేదాంగములందు, యజ్ఞయాగాదులందు ఆరితేరిన విప్రవరులెందరో అనేక రాష్ట్రములలోని పలు సంస్థానములందు పారితోషికముల బడసినారు. అట్టి వారిలో ఇందవరపు, సంగనభట్ల, కొరిడె, రొట్టె, పణతుల, పాలెపు, నార్వాభట్ల కుటుంబముల ప్రముఖుల నేకులున్నారు. గర్భకుర్తి గదాధరశాస్త్రి, బొజ్జగ గదాధరశాస్త్రి, భావి వెంకట కృష్ణశాస్త్రి, పార్నంది ధర్మశాస్త్రి, రావులకొలను నర్సన్నశాస్త్రి, పాత పాపయ్యశాస్త్రి, రొట్టె వాసుదేవమూర్తి మున్నగు వారెందరో 18,19 శతాబ్దములందు వర్ధిల్లారు. భక్తి పారవశమున భగవన్నామ మాచరించిన శేషప్ప, అతని బంధువు నృసింహదాసులు సుప్రసిద్ధులు.


ప్రాచీనార్ష విజ్ఞాన సభ్యతా సంస్కృతులకు భక్తి ప్రపత్తులకు నేటికిని కాణాచిగా నిలిచిన ఈ సనాతన తీర్థక్షేత్రము గంభీర గౌతమీ తటమున నెలకొని ఆస్తిక ప్రపంచమునకు భక్తి, ముక్తి నిచ్చుచున్నది.

## పాతనరసింహ (యోగానంద) స్వామి దేవాలయం

ప్రస్తుతం ధర్మపురిలో ఇది అత్యంత జనాదరణ గల దేవాలయం. ధర్మపురి ప్రజలు దీనిని క్రీ.శ.1724-1750 మధ్యకాలములో నిర్మించినట్లు సంగనభట్ల నరహరి వద్ద నున్న పత్రముల వలన (Manuscripts) తెలియుచున్నది[44]. క్రీ.శ.1794లో చెన్నమనేని జోగారాయుడు శ్రీ లక్ష్మీనృసింహునికి వెండి భూషణముల జేయించి కోవెల ప్రహరి లోపల రాయి పరిపించాడు. పొలాస, దీవికొండ పర్గణాల దేశ్‌ముఖ్‌లు గందెవారు, జువ్వాడివారు ప్రతి ఏట స్వామి వారి కళ్యాణోత్సవములకు వలయు సర్వమంగళ ద్రవ్యములను వంశపారంపర్యంగా సమర్పించుటకు తగు నియమములు ఏర్పాటు జేశారు[45].

రాతి ప్రాకారములో గల ఈ దేవాలయము గర్భగృహము, దాని ముందు 48 స్తంభముల

మంటపమును కలిగియున్నది. అధిష్ఠానము విశాలపట్టిక, అర్ధచంద్రాకారశిలలతో గూడిన జగతిని కలిగియున్నది. భిత్తి నుండి కపోతము శిఖరమును వేరు చేయుచున్నది. పిరమిడ్ ఆకారములో (Stepped Pyramidal Form) శిఖరమున్నది. గర్భగృహమందు ఉగ్రరూపములో గాకుండా యోగరూపములో యోగానంద లక్ష్మీనరసింహస్వామి విగ్రహముంది. గర్భగృహ అధిష్ఠానము వేరుగా నుండుటచే మంటపము తరువాత కాలానికి చెందినదై యుండును. మంటపము చుట్టు పిట్టగోడ (Parapet wall) యుండగా తూర్పు, ఉత్తర, దక్షిణముల నుండి మంటపమును ప్రవేశింపవచ్చు.




శ్రీ లక్ష్మీనరసింహస్వామి

ఈ దేవాలయము ముందు నల్ల గ్రానైట్ రాయితో నిర్మింపబడిన కాకతీయుల కాలము నాటి నాలుగు స్తంభముల కళ్యాణమంటపముంది. ఈ నాలుగు స్తంభములు సొంతము అనేక ప్రతిమా శిల్పములు కలిగియున్నవి. ఇతిహాసగాథలు, మత్స్య, కూర్మ, వరాహ, నటరాజ, నరసింహ, రామలక్ష్మణుల మున్నగు చిత్రములు చెక్కబడినవి. ముస్లిముల దుశ్చర్యల వలన ఈ చిత్రశిల్పములు అంగచ్ఛేదములైనాయి. ఈ మంటపము పదకొండవ, పన్నెండవ శతాబ్దమునకు చెందిన కాకతీయుల నిర్మాణము గనుక ఇచ్చోట ప్రప్రథమము నుండియే నృసింహ దేవాలయము నిలిచి యుండును. ఆసఫ్‌జాహీల పాలనారంభకాలములో అనగా 18వ శతాబ్దపు ప్రథమార్థములో ధర్మపురి వాసులు శిథిలమైన ప్రాచీన దేవాలయమున్న చోటనే ప్రస్తుత పాత నరసింహదేవాలయ పునఃనిర్మాణము గావించి యుందురు. ఈ ఆలయ ప్రాంగణములో అష్టదిక్కులయందు నరసింహస్వామి ప్రీత్యర్థము భక్తాంజనేయ విగ్రహములు ప్రతిష్ఠింపబడుట విశేషము.

ఈ ఆలయ మంటపమందు బ్రహ్మ, బలరామకృష్ణుల ప్రతిమలు నిలుపబడినవి. కాని ప్రస్తుతము ఒక బలరామ విగ్రహమే మంటపమందున్నది. కృష్ణుని ప్రతిమ కరీంనగర్ మ్యూజియంకు తరలింపబడింది.





కాకతీయుల మంటపము



మంటప స్తంభము

బ్రహ్మ:- చతుర్భుజములతో ఆరడుగల ఎత్తున్న శిలాఫలకము పై చెక్కబడిన విగ్రహమిది. పై నున్న కుడి హస్తములో శృకము ఎడమ హస్తములో వేదాలు, క్రింది ఎడమ హస్తము అక్షమాలతో గూడిన అభయముద్రలోను కుడి హస్తము ఎడమ ప్రక్కకున్న గదపై నిలుపబడినట్లున్నవి. ప్రతిమలో నున్న మూడు ముఖములలో మధ్యముఖమునకు గడ్డము చెక్కబడిఉంది. శిలాఫలకము కావున నాలుగవ ముఖమగబడుటకు వీలులేదు. బ్రహ్మజటామకుటము ధరించి కర్ణకుండలములు, హారములు, దండ ముంజేతి కడియములు, చీలమండలకు కడియములు, పాదములకు నూపురములు ధరించియున్నాడు. అతని కుడివైపున క్రింది భాగమున హంస వాహనమున్నది. మహారాష్ట్రమందలి తానా జిల్లాలో గల సోపరయందు గల బ్రహ్మవిగ్రహము యొక్క మధ్యముఖము గడ్డముతో చెక్కబడి ధర్మపురిలోని బ్రహ్మప్రతిమను పోలియున్నది[46].



బ్రహ్మ



బలరాముడు



శివాలయం గణపతి

**బలరాముడు:-** ద్విహస్తములతో నున్న ఈ ప్రతిమ మకుటము, గ్రైవేయకములు, కేయూరములు, కంకణములు, వనమాల, చీలమండ కడియములు, పూసలతో గూడిన నూపురములతో అలంకరింప బడింది. కుడికాలును ఎడమ వైపు త్రిప్పి వ్రేళ్లపై మోపబడింది. రెండు చేతుల వేణువు ధరించి ఒకకొన పెదవులపై నిలుపబడింది. అతని హస్తముల వ్రేళ్లన్నియు ఉంగరములతో అలంకరింపబడినాయి. క్రింది భాగమున అతని కిరువైపుల చామర గ్రాహిణుల శిల్పములున్నవి. ప్రతిమ వెనుక మకరతోరణము, కుడివైపున అతని చిహ్నము హలము, ఎడమవైపు వేణువు ఒర (Case) చెక్కబడియున్న ఈ మనోహర శిల్పము చూపరుల దృష్టినాకర్షిస్తుంది.

**శ్రీకృష్ణుడు :-** ఇది 4' ఎత్తు గల నల్ల గ్రానైట్ రాతి విగ్రహము. శ్రీకృష్ణుడు త్రిభంగములో నిలబడి కుడికాలును ఎడమవైపునకు త్రిప్పి వ్రేళ్లపై మోపినాడు. ఇది అష్టభుజప్రతిమ. కుడివైపున నున్న నాలుగు చేతులలో మొదటి చేతి వ్రేలుపై గోవర్ధనగిరిని ఎత్తినాడు. రెండవ, మూడవ హస్తములందు శంఖము, ఖడ్గములున్నాయి. ఎడమవైపున్న మూడు హస్తములందు పద్మము, గద, చక్రము గలవు. మిగిలిన రెండు చేతులలో మురళి ఉంది. కాని విరిగిపోయింది. శ్రీకృష్ణుడు మకుటము, కర్ణకుండలములు, కటిబంధము, వనమాల, కేయూరములు, కంకణములు, చిన్నవ్రేళ్లకు ఉంగరములు చీలమండ కడియములు, నూపురములు ధరించియున్నాడు. అతినికిరువైపుల క్రింది భాగమున చామర గ్రాహిశిల్పములున్నాయి. ఈ ప్రతిమ గోవర్ధనధారి కృష్ణునిది గనుక ఆవులు, దూడలు చెక్కబడినాయి. ప్రస్తుత మీ ప్రతిమ కరీంనగరములోని ప్రభుత్వ మ్యూజియం నందు నిలుపబడినది.

**గరుడుడు:-** ఎగురుచున్న రెక్కలు గల గరుడుడు రెండు చేతులు జోడించి అంజలి ఘటించు రూపమున మలచబడినాడు.

## అరువది స్తంభముల దేవాలయము The Sixty Pillared Temple

బహమనీ సుల్తాన్ అహ్మద్‌షా (క్రీ.శ. 1422-1436) కాలములో అజీమ్‌ఖాన్ సేనాని ధర్మపురిలోని ఆలయమును ధ్వంసము చేశాడు. అది నేటి మసీదు దేవాలయమై ఉంటుంది. క్రీ.శ. 1448 ప్రభవ సం॥లో అరవై స్తంభములతో గూడిన నూతన దేవాలయము దాని ప్రక్కనే నిర్మింపబడింది. అందులో నరసింహస్వామి విగ్రహము ప్రతిష్ఠింపబడింది[47]. ప్రస్తుత మీ దేవాలయ మందు శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహముంది. తూర్పు దిశయందు 12 స్తంభములు పడిపోవుట వలన ఇప్పుడిది 48 స్తంభములపై నిలబడియున్నది. అధిష్ఠానమునందు ఉపానము, పట్టిక, అర్థచంద్రాకృతి శిలలతో గూడిన జగతి, కుముదము, వేది అగబడుచున్నవి. ఈ ఆలయ మంటపము చుట్టు ఎలాంటి పిట్ట గోడలేదు. మంటపము యొక్క పై కప్పు చూరు కొంత వంపును కలిగి యుండి (Cornice with slight slant) అచ్చటచ్చట శిథిలమైయున్నది.



## క్రొత్త నరసింహ దేవాలయము

అన్నదానపరులగు పణతుల నారాయణ దీక్షితులవారు శకసంవత్సరము 1725 అనగా క్రీ.శ. 1803లో నూతనముగా ఆలయము నిర్మించి (క్రొత్తగుడి) యోగానందలక్ష్మీ నృసింహస్వామిని ప్రతిష్ఠించారు. జువ్వాడి దేశ్‌ముఖ్ ధర్మజగపతిరావు ఈ స్వామి వారికి కానుకలు సమర్పించి సకలోత్సవములకు తగు ఏర్పాట్లుజేసినాడు. మసీదు వెనుకనున్న ఈ దేవాలయము తూర్పు ముఖమును కలిగిఉంది. ఈ ఆలయమందు గర్భగృహము, అంతరాళము, దాని ముందు మంటపములున్నాయి. పూర్వము ఈ ఆలయమునకు అష్టదిక్కులయందు అష్టదిక్పాలకులు వేర్వేరు శాలలలో ప్రతిష్ఠింపబడిరి. ప్రస్తుతము ఇంద్రుడు అతని వాహనము ఐరావతముతో నొక శాలయందుండగా, రెండు తలలు గల అగ్ని వేరొక శాల (Miniature Shrine) లో అతని వాహనము మేషముతో నిలబడియున్నాడు.


## వేణుగోపాలస్వామి ఆలయము

క్రొత్త నరసింహస్వామి గుడి నిర్మించిన కాలములోనే భూంపల్లి చలం అను భక్తుడు వేణుగోపాలస్వామి ఆలయమును కట్టించాడు. దీనికి అర్చకుడుగా జువ్వాడి దేశ్‌ముఖ్‌లచే ఇందుర్తి శ్రీనివాసాచార్యులు నియమింపబడినాడు[48]. ఇది అరవది స్తంభముల గుడి వెనుక తూర్పు ముఖముతో నిలిచిఉంది. ఈ దేవాలయమందు వేణుగోపాలస్వామి మరియు కొందరు ఆళ్వారుల శిల్పప్రతిమలు గలవు. ప్రవేశమునకు ముందు ఎడమవైపు ఆంజనేయ, కుడివైపు గరుడ విగ్రహములున్నాయి.

## రామలింగేశ్వరాలయము

పది,పదకొండవ శతాబ్దములకు చెందిన ఈ దేవాలయము చుట్టు పది అడుగుల ఎత్తుగల రాతిప్రాకారము కలదు. నరసింహ దేవాలయమునకు ఈశాన్యదిశయందు గల ఈ దేవాలయము తూర్పు ముఖమును కలిగి ఉంది. ఆలయ ప్రాంగణములోనికి ప్రవేశము పొందుటకు గల ముఖద్వారము లలాటమున గజలక్ష్మి, దాని పై ఉబికి వచ్చిన చూరు (Projecting Cornice), ద్వారపుశాఖల క్రింది భాగమున శైవ ద్వారపాలకుల కిరువైపుల చామరగ్రాహి శిల్పములున్నవి. ద్వారపాలకుల పైరెండు హస్తములందు డమరుకము, కపాలములుండగా క్రింది ఎడమ హస్తములో గద, కుడిహస్తము అభయ ముద్రలో చెక్కబడినది. ప్రాకారము లోపలివైపు ప్రవేశద్వారము నానుకొని 16 స్తంభముల మంటపమున్నది. ఈ మంటపము మధ్య నుండి లోనికి ప్రవేశించుటకు మార్గమున్నది. మార్గమునకు అటు, ఇటు రెండు వైపుల ఎత్తైన అరుగులున్నవి. ఈ అరుగులపై ఒక్కొక్కవైపు ఎనిమిది స్తంభములున్నవి. ఈ అరుగుల క్రింది భాగమున చతుర్దళముల పుష్పాకృతులున్నవి.

ఈ దేవాలయమందు గర్భగృహము, అంతరాళము, ముఖమంటపము, దాని ముందు రెండు స్తంభములపై నిలబడియున్న చిన్న మంటపము (Porch) ఉన్నాయి. తూర్పు నుండి లోనికి ప్రవేశింపవచ్చు. ఈ ఆలయ ఎత్తైన అధిష్ఠానమందు ఉపానము, పట్టిక, జగతి, కుముదము వేది అగబడుచున్నవి. అధిష్ఠానము పై నున్న చూరు (Cornice) అర్ధచంద్ర శిలలతో అలంకరింపబడియున్నది. దానిపై భిత్తి పెద్ద పెద్ద శిలలతో నిర్మింపబడింది. గర్భగృహముపై నాగరరీతిలో నున్న చాపరేఖాకృతి శిఖరముపై (Curvilinear Sikhara) రాతి ఆమలకము, దానిపై గుండ్రని శిలాకలశము నేటికి నిలిచిఉన్నాయి. చాళుక్య కళారీతులలో శిఖరము ముందు అడుగు భాగము నుండి శుకనాసము నిర్మింపబడింది.



రామలింగేశ్వరాలయం

మెట్లు ఎక్కిలోనికి ప్రవేశించగానే దీర్ఘచతురస్రాకారపు మంటపములో ఎనిమిది స్తంభములు వాటికి అనుబంధ కుడ్యస్తంభములున్నాయి. వీటి పైనున్న లోకప్పు పన్నెండు విభాగములుగా నుండి కదలికాకరణ పద్ధతిలో (లుపవితాన పద్ధతిలో) దర్శనమిస్తుంది. తూర్పు, ఉత్తర, దక్షిణముల నుండి మంటపములోనికి ప్రవేశములుండగా పడమట గర్భగృహమున్నది. గర్భగృహములోని సైకత లింగమును శ్రీరామచంద్రుడు దండకారణ్యములో సంచరించు సమయమున నిలిపినాడని స్థానికుల కథనము. గర్భగృహములోని దేవి విగ్రహము పైచేతులలో డమరుకము, త్రిశూలము, క్రింది హస్తములందు ఖడ్గము, గిన్నె (Bowl) ఉన్నాయి.

రామలింగేశ్వరాలయ ప్రాంగణమునందే ఈశాన్య దిశలో నున్న చిన్నగుడి (Small shrine) యందు అతి పెద్ద గణపతి విగ్రహముంది. చతుర్భుజములతో, చాటల లాంటి అతి పెద్ద చెవులతో, తలపై కరండ మకుటమును ధరించిన గణపతి కూర్చొనియున్నాడు. రామలింగేశ్వరాలయ మంటపము నందనేక విడిప్రతిమా శిల్పములున్నాయి.



**1. సప్తమాతృకల ఫలకము:-** ఏడుగురు దేవతలు చెక్కబడిన ఈ శిలాఫలకము నందు ఒక చివరలో వినాయకుడు మరియొక్క చివరలో వీరభద్రుడు చెక్కబడినారు. వీరందరి ఆసనముల క్రింద వారి వారి వాహనములు చెక్కబడినాయి. చతుర్భుజములు గల సప్తమాతృకలు మకుటములతో నుండి సాధారణమైన ఆభరణములన్నియు ధరించియున్నారు.

**2. మహిషాసురమర్దని:-** అందంగా నున్న ఈ దేవతా శిల్పము యొక్క చేతులన్నియు ఛేదింపబడినాయి. మహిషుడు జంతురూపమున నున్నాడు.

**3. ఆలింగనమూర్తి :-** కూర్చొని యున్న ఈ ప్రతిమ కుడికాలు వ్రేలాడుచుండగా, మలచిన ఎడమకాలు (Folded left leg) పై దేవి చెక్కబడింది. పై నున్న కుడిహస్తము నందు నాగసర్పముచే చుట్టబడిన డమరుకము, ఎడమ హస్తమునందు త్రిశూలము, క్రింది కుడిహస్తము అభయముద్రలో నుండగా, అక్షమాలతో గూడిన ఎడమహస్తము దేవి నడుముచుట్టు నిలుపబడియున్నది. అలంపురములో నున్న తొలిచాళుక్యుల కాలపు ప్రతిమలను ఇది పోలియున్నది[49].

**4. స్కందుడు :-** ఆరుముఖములు గల అందమైన ఈ ప్రతిమ నెమలి వాహనముతో ఉంది.

**5. గౌతమ, అహల్యల ప్రతిమ :-** కూర్చొని యున్న దంపతులు గౌతముడు, అహల్య అంజలి ముద్రలో శోభాయమానముగా నున్నారు.

రామలింగేశ్వరాలయ ప్రాంగణములో వీరగల్లుల, నంది, నాగదేవత, తదితర విగ్రహము లనేకములు పడిఉన్నాయి. ఆలయము ముందు 25 అడుగుల ఎత్తున్న స్తంభముపై పూర్వమొక చిన్న మంటపములో నంది నిలుపబడి ఉండేది. కాని ఒక స్తంభము మాత్రమే నేడు నిలిచి ఉంది.

## సత్యవతి దేవాలయము

ఎత్తైన ప్రదేశములో నున్న ఈ దేవాలయము కేవలము చతురస్రాకారపు గర్భగృహముతో తూర్పు ముఖమును కలిగియున్నది. ఇందులో లక్ష్మీనరసింహస్వామి ప్రతిష్ఠింపబడియున్నను ఇది సత్యవతి ఆలయంగానే స్థానికులచే పిలువబడుతుంది. ఈ ఆలయము ముందు దాదాపు 25 అడుగుల ఎత్తుగల ఎర్ర ఇసుకరాతి స్తంభము (Red Sand Stone Pillar) ఉంది. దీనివలన ఈ ఆలయములోని దేవుడిని స్తంభ నరసింహస్వామి అని అంటారు. పౌరాణికగాథలోని సత్యవతి తన పాతివ్రత్యమును చాటుటకై ఈ స్తంభమును నిలిపినట్లు ప్రతీతి. సర్పరూపములో నున్న తన భర్తతో సత్యవతి పవిత్ర గోదావరిలో స్నానమాచరించగా ఆ సర్పము చిత్రాంగదునిగా మారెనని, ఆ చోటును సత్యవతి గుండంగా నేటికీ పిలుస్తుంటారు. ఈ సత్యవతి ఆలయమునకు ముందు 9 స్తంభములపై నిలిచియున్న మంటపము కలదు. ఆ మంటపములో ద్వారపు శాఖలు కలిగిన ఒక శిథిలమైన శిలపై 5' అడుగుల ఎత్తున్న భీకరద్వారపాలుని విగ్రహము

చతుర్భుజములతో చెక్కబడి ఉంది. పై నున్న కుడిచేతిలో ఖట్వాంగము, ఎడమచేతిలో డమరుకము, క్రింది కుడిహస్తము ఎడమవైపునకు మలచబడి గదపై నిలుపబడింది. క్రింది ఎడమ హస్తము అభయముద్రలో ఉంది. ఈ ద్వారపాలుని విగ్రహము కాళేశ్వర మందున్న రెండు ద్వారపాలప్రతిమలను బోలియున్నది.

## మసీదు దేవాలయము

అరువది స్తంభముల దేవాలయము అనగా నేటి వేంకటేశ్వరాలయమునకు దక్షిణ దిశయందున్న ప్రాచీన త్రికూటాలయము మసీదుగా మార్చబడింది. ప్రవేశద్వారము లోపలివైపు ప్రాకారమునానుకొని పదహారు స్తంభముల మంటపము రామలింగేశ్వర దేవాలయములో వలె నిలిచియున్నది. ఈ దేవాలయపు అధిష్ఠానమునందు ఉపానము, విశాల పట్టిక, జగతి, వేదిక అగబడుచున్నవి. ఈ మసీదు దక్షిణ భాగము నందు ద్వారపు శాఖల ప్రక్కనే కాకతీయుల కాలపు జాలిపని (Lattice Work) గాలి వెలుతురుకై చేసిన రంధ్రముల అల్లిక కనబడును. ఇది మసీదుగా మార్చబడినను అనేక హిందు దేవాలయ లక్షణములు కనబడుతూనే ఉన్నాయి.

త్రిశతి పుస్తకమందలి సమాచారమును బట్టి ఈ దేవాలయము మూడు పరియాయములు ధ్వంసము చేయబడినట్లు తెలియుచున్నది. మొదటి పరియాయము అలాఉద్దీన్ ఖిల్జీ సేనాని మలిక్‌కాఫూర్ వరంగల్ పై దండెత్తినప్పుడు, రెండవ పరియాయము బహమనీ సుల్తాన్ అహ్మద్‌షా (క్రీ.శ. 1422-1436) సేనాని అజీంఖాన్ చే ఈ ఆలయము ధ్వంసము చేయబడింది. చివరగా మూడవ పరియాయము ఔరంగజేబుచే దక్కన్ సుబేదార్‌గా నియమింపబడిన రుస్తుందిల్ ఖాన్ దీనిని క్రీ.శ. 1693లో పూర్తిగా మసీదుగా మార్చివేసి, అబుల్‌హసన్‌ఫారస్ అనునతనిని మౌజన్‌గా నియమించి, దీని నిర్వహణకై వంద బిగముల భూమిని ఇచ్చాడు[50].


## బ్రహ్మపుష్కరిణి

నాలుగువైపుల మెట్లున్న సువిశాలమైన చతురస్రాకారపు కోనేరే బ్రహ్మపుష్కరిణి. కోనేరు మధ్యనున్న భోగమంటపమును చేరుటకు ఆరు అడుగుల వెడల్పున్న వంతెన కలదు. పుష్కరిణికి నాలుగు వైపుల పిట్టగోడ నిర్మింపబడింది. నాలుగు దిక్కుల యందు ప్రవేశద్వారములు కలవు. ఉత్తరద్వారము వంతెనతో కలుపబడింది.

ఈ బ్రహ్మపుష్కరిణి మంటపమున గల స్తంభముపై చింతల నర్సాబోయి తనయుడగు తిరుమల్లయ్య శక సంవత్సరము 1566 పార్థివ వైశాఖ శుద్ధ త్రయోదశి సోమవారము రోజున వేయించిన శాసనము ఉంది. క్రీ.శ. 1644లో చెక్కబడిన ఈ శాసనమందు మొత్తము 53 పంక్తులున్నాయి. ఇది తెలుగు శాసనము. నర్సింహస్వామి భోగార్థము బ్రహ్మపుష్కరిణి మధ్యలో మంటపమును, పుష్కరిణి చుట్టు పిట్టగోడను (Parapet wall) తిరమలయ్య నిర్మించినట్లు అంతకు



ముందే జూపెల్లి ధర్మరాయుడు బ్రహ్మపుష్కరిణి చుట్టు సోపానములు, పుష్కరిణి మధ్యలో వేదిక నిర్మాణము గావించినట్లు ఈ శాసనం తెలుపుచున్నది.




బ్రహ్మపుష్కరిణి

# 6. చొప్పదండి

కరీంనగర్‌కు ఉత్తరమున 16 కి.మీ. దూరములో చొప్పదండి లక్షెటిపేటకు పోవు రహదారి పై నున్నది. ఇచట లభ్యమైన రెండు శిలాశాసనములందు ఈ గ్రామము చెప్పణ్డణ్డి (చెప్పండండి) మరియు చొప్పంద్యాణ్డి (చొప్పంద్యాండి)గా పేర్కొనబడింది. శక సంవత్సరము 914 నందన శ్రావణ శు॥ విదియ ఆదిత్యవారము సరియగు తేది క్రీ.శ. 992 జులై 3న వేయబడిన ఆహవమల్లదేవ బిరుదాంకితుడైన పశ్చిమ కళ్యాణి చక్రవర్తి రెండవ తైలపుని కాలపు శాసనం చొప్పదండి సమీపమున గల మేలకుంట వద్ద నున్నది. రాజకుమారుడైన సత్యాశ్రయ ఇర్వబెడంగుని అనుచర గణములోని అనుంగు దుర్గారాయని కూతురు ఆచబ్బె (ఆచవ్వ) పేరట ఆచబ్బెసముద్రము నిర్మింపబడినట్లు ఈ శాసనంలో ఉంది. అంతే కాకుండా కళ్యాణి రాకుమారుడైన ఇర్వబెడంగుని దాది (Female Nurse) దేవకబ్బె (దేవకవ్వ) మార్తాండదేవరకు 70 ద్రమ్మములను నాణెములు మరియు భూదానముల నొసంగెనని ఇదే శాసనంలో ఉంది[51]. స్వస్తిశ్రీ శక సంవత్సరము 930 కీలక వైశాఖ శుద్ధ తదియ ఆదిత్య వారము సరియగు తేది క్రీ.శ. 1008 ఏప్రిల్ 11న సమస్త భువనాశ్రయ శ్రీ పృథ్వీ వల్లభ మహారాజాధిరాజ పరమేశ్వర పరమభట్టారక సత్యాశ్రయ కులతిళకం శ్రీమత్ ఇర్వెబెడెంగ దేవరదాది దీవకబ్బె (దీవకవ్వ) వేయించిన శిలాశాసనము శంభుని గుడి ప్రాంగణమందు నిలిచియున్నది[52]. దీవకబ్బెచే ప్రతిష్ఠింపబడిన దివకేశ్వరునకు భూదానములిచ్చిన వివరములు ఈ శాసనమందు గలవు. ఈ దివకేశ్వరాలయము నేడు శంభుని గుడిగా పిలువబడుతుంది. శంభుని గుడి పదవ శతాబ్దపు నిర్మాణ రీతులకు

ప్రతీకగా నిలిచిఉంది. కళ్యాణి చాళుక్యుల కాలపు కళారీతులకు ఈ దేవాలయము కాణాచిగా శోభిల్లుచున్నది. పదవ శతాబ్దపు చివరి భాగములో తెలంగాణమందు నిర్మింపబడిన దేవాలయములలో ఇది ప్రధానమైనది[53].



దేవాలయాల ప్రాంగణము


## శంభునిగుడి

పెద్ద పెద్ద శిలలతో నిర్మింపబడిన ప్రాకారమందు నిలిచియున్న ఈ దేవాలయము తూర్పు ముఖమును కలిగిఉంది. గర్భగృహము, అర్ధమంటపమును బోలిన అంతరాళము, ముఖమంటపము దాని ముందు చిన్న మంటపము (Porch) ఈ దేవాలయ ప్రధానభాగములు. మంటపము చుట్టు గోడలుండుట వలన దేవాలయములోనికి గాలి, వెలుతురు ధారాళముగా వచ్చుటకు వీలులేదు. మంచబంధ అధిష్ఠానము ఎత్తుగా నుండి ఉపానము, పట్టము, జగతి, ప్రతిలను కలిగియున్నది. భిత్తిభాగము నందు దేవకోష్ఠములు (Niches) లేవు. గోడలు కుడ్యస్తంభముల (Pilasters) చే అలంకరింపబడినాయి. గర్భగృహము పై నున్న శిఖరము (Spire) 8 మెట్లతో లేదా భూమికలతో పిరమిడ్ ఆకారములో ఆనాటి వేములవాడ దేవాలయముల శిఖరములను బోలియున్నది. క్రమముగా ఒక దాని కంటె మరియొకటి చిన్నగా నున్న ఈ ఎనిమిది మెట్లపై నున్న పొడుగాటి పెద్దగోళాకారము పై ఆమలకము, దానిపై రాతి కలశము నిలుపబడియున్నవి. శిఖరము నాలుగు దిశల యందు మధ్యన మెట్లనన్నింటిని కలుపుతూ ఒక విశాలపట్టిక గలదు. (The Eight Steps of the spire are connected by a wide tapering band in the centre on all four sides) శిఖరము ముందు శుకనాసము లేదు.


గోడలచే పరివేష్టితమైన ముఖమంటప ద్వారము $2^1/_2$ అడుగుల వెడల్పు 5' అడుగుల ఎత్తుతో నుండి అడుగున శైవద్వారపాలకులు, ఊర్ధ్వ పట్టిక పైన గుడి గోపురములు (Turrets)




చెక్కబడినాయి. మంటపము యొక్క లోకప్పు చదునుగా (Flat) ఉంది. అంతరాళమునకు ద్వారము లేదు. గర్భగృహద్వారము పై ఏలాంటి అలంకారములు లేవు.



శంభునిగుడి శిఖరము



గోడ వివరములు



చాముండాదేవి

ఈ దేవాలయమునకు అభిముఖముగా నున్న కేశవాలయమునందు గర్భగృహము, అర్ధ మంటపము కలవు. దీని నిర్మాణ రీతులు కూడా దివకేశ్వరాలయమునే బోలియున్నవి. ఒక స్తంభముల వరుస ఈ రెండు దేవాలయములను కలుపుచున్నది. కేశవుడు సమపాద స్థానకమందుండి పై నున్న కుడిచేతిలో శంఖం, ఎడమచేతిలో చక్రం, క్రింది కుడి హస్తం నందు పద్మము, ఎడమ హస్తము గదపై నిలిపినట్లుగా మలుచబడింది. కిరీటమకుటము, పూసలహారము, కంకణములు, కేయూరములు, ఉదరబంధము, కటిబంధము మున్నగు ఆభరణములతో కేశవుని ప్రతిమ శోభాయమానముగా మలుచబడింది.

ప్రాకారము బయట శిథిలమైన ద్వారపు శకలముల అడుగుభాగమున అందమైన ద్వారపాలకుల ప్రతిమలు మలుచబడినవి. ఈ దేవాలయమునకు దక్షిణదిశలో ప్రాకారము బయట కోనేరు (Holy Tank) శిథిలావస్థలో ఉన్నది. దీనికి నాలుగు వైపుల మెట్లున్నవి. శంభుని గుడిముందు చాళుక్య కళారీతులలో $3^1/_2$ అడుగుల పొడవు 2 అడుగుల ఎత్తున్న నంది విగ్రహమున్నది.

### చాముండాదేవి

చతుర్భుజములు గల ఈ చాముండాదేవి సుఖాసనములో కూర్చొనియుండి పై నున్న కుడి హస్తము నందు దమరుకము, ఎడమహస్తము నందు ఖట్వాంగము, క్రింది కుడిహస్తమునందు ఖడ్గం, ఎడమ హస్తమందు గిన్నె (Bowl) ధరించియున్నది. జటాజూటములు సుస్పష్టముగా

చెక్కబడినవి. దేవి మకుటము, కుండలములు, గ్రైవేయకములు, కటిబంధము, కేయూరములు, దండ, ముంజేతి, కాలికడియములు ధరించియున్నది. మోకాళ్లవరకు అర్ధోరుకమున్నది. దేవి ధరించిన కపాలముల హారము కుచద్వయము నడుమ నుండి నాభి వరకు వ్రేలాడుచున్నది. మకుటమునకిరువైపుల నాగసర్ప పడగలు చెక్కబడినవి. దేవి ఆసనం క్రింద ఏ వాహనము కాని, చిహ్నముకాని చెక్కబడలేదు. ఎండకు ఎండి, వానకు నాని చాలా అరగిపోయిన ఈ ప్రతిమ 1980లో కరీంనగర్ మ్యూజియంనకు తరలింపబడింది. మ్యూజియం ఆవరణలో ఈ చాముండాదేవి శిల్పప్రతిమ సందర్శకుల దృష్టినాకర్షించు చున్నది. వేములవాడ, నందికంది, పానుగల్, హన్మకొండలోని విగ్రహములతో పోల్చినపుడు ఈ ప్రతిమ 10వ శతాబ్దమునకు చెందినదనవచ్చు[54].

## 7. జమ్మికుంట

కరీంనగర్‌నకు ఆగ్నేయమున 53 కి.మీ. దూరములో గల జమ్మికుంట, కాజిపేట-బల్హార్షా రైల్వేలైన్‌పై నున్నది. హుజురాబాద్ నుండి ఈ గ్రామము చేరవచ్చును. స్టేషన్ జమ్మికుంటకు 2 కి.మీ. దూరమున పాత జమ్మికుంట గ్రామమున్నది. అచ్చటనున్న చెరువు ప్రక్కనేనొక ప్రాచీన శివాలయము ఉన్నది. దాని ప్రాంగణములో దాదాపు 25' అడుగుల ఎత్తున్న ఏకశిలా ధ్వజ స్తంభముపైన నొక ప్రక్క 25 పంక్తులు, 2వ ప్రక్క 30 పంక్తులు మొత్తము 55 పంక్తుల కన్నడశాసనము చెక్కబడింది. శక సంవత్సరము 917 మన్మథ వైశాఖ శుద్ధ తదియ శుక్రవారము సరియగు తేది క్రీ.శ. 995 ఏప్రిల్ 5న స్వస్తిశ్రీ పృథ్వీవల్లభ మహారాజాధిరాజ పరమేశ్వర పరమబట్టారక చాళుక్యాభరణ శ్రీమదాహవ మల్లదేవ బిరుదాంకితుడైన కళ్యాణి చాళుక్య చక్రవర్తి రెండవ తైలపుని కాలములో జమ్మికుంటను ఏలిన నాగియగావుండు తన భార్య వేమకబ్బె (వేమకవ్వ) కు శుభములు చేకూరుటకై ఆదిత్య గృహమునకు ఇరువది మర్తురుల నీర్నేల (Wet land) మరియు ఇతర భూములతో పాటు, సేద్యపు బావులనుండి నీటిని బయటకు లాగుటకు రెండు రాటణములను దానమిచ్చినట్లు ఈ శాసనములో పేర్కొనబడింది[55]. రెండవ తైలపుని ఉత్తర దండయాత్రల సందర్భములో అతడు ఉప్పల లేదా ఉత్పల రాజ్యమును జయించి మాళవ పారామారరాజుపై విజయం సాధించినట్లు ఈ శాసనము తెలుపుచున్నది. ఈ శాసనమందు గ్రామనామము 'దమ్మికుంటెయ'యని పేర్కొనబడింది. శాసనమునందు తెలుపబడిన ఆదిత్యగృహము లేదా సూర్యదేవాలయము నేడు జమ్మికుంటలో కానరాదు. అలాగే క్రీ.శ. 992 చొప్పదండి శాసనములో పేర్కొనబడిన రెండవ తైలపుని కాలపు మార్తాండదేవుని ఆలయము గూడా కనబడుటలేదు. జమ్మికుంట, చొప్పదండి శాసనములను బట్టి తొలికళ్యాణి చాళుక్య చక్రవర్తుల కాలములో సౌరపూజ సర్వవ్యాప్తమై ఉండెనని తెలియుచున్నది. వేయి సంవత్సరముల క్రిందటి దమ్మికుంటె (Dammikunte) నేడు జమ్మికుంటగా వ్యవహరింపబడుచున్నది.





వినాయకుడు

పాతజమ్మికుంట చెఱువు ప్రక్కనే నున్న శివాలయము తూర్పు ముఖమును కలిగి ఉంది. శిథిలమైన సనాతన దేవాలయపునాదుల పైననే ప్రస్తుత ఆలయ పునఃనిర్మాణము జరిగినదని స్థానికుల కథనము. కళ్యాణి చాళుక్యుల కాలపు శిలాప్రతిమలు కొన్ని ఈ ఆలయము ప్రాంగణమందున్నవి. గణపతి మకుటధారియై అతని తొండము ఎడమ హస్తములో గల మోదకములపై నిలుపబడింది. నాగసర్ప పడగ నీడలోనున్న భైరవవిగ్రహము చూడ ముచ్చటగా నున్నది. మూడు, ఐదు, ఏడు పడగల నీడలో నున్న పెక్కునాగిని ప్రతిమలు తమ హస్తములందు డాలు, ఖడ్గములను ధరించియున్నవి. ఈ నాగిని ప్రతిమలు పొలాస యందున్న నాగిని విగ్రహములను పోలియున్నవి. నాగిని ప్రతిమల ఊర్ధ్వభాగము స్త్రీ రూపములోను అధోభాగము సర్పరూపములోను మలచబడినవి. చాళుక్యుల కాలపు నంది విగ్రహములిచట కనబడును.

## 8. శనిగరము

కరీంనగరము నుండి 40 కి.మీ. దూరంలో హైదరాబాద్‌కు పోవు రాజీవ్‌రహదారిపై నున్న సరిహద్దు గ్రామమే శనిగరము. ఇచటి కళ్యాణి చాళుక్య చక్రవర్తులకాలపు ఐదు శిలాశాసనములు శనిగరము ఒక జైన, శైవ క్షేత్రముగా విరాజిల్లెనని తెలుపుతున్నాయి[56]. శాసనములందీ గ్రామము "సణగర, ఖణ్డిసణగర, బళియసనగర" యని పేర్కొనబడింది. కళ్యాణి చాళుక్య చక్రవర్తి మొదటి సోమేశ్వరుని కాలపు క్రీ.శ. 1051 శాసనములో అతని మహాసామంతుడు కాకతీయ మొదటి బేతరాజు యొక్క ప్రెగ్గడ నార్ణయ్య స్థానిక గావుండులైన (Local Officers) ముప్పడయ్య, పున్నెరడ్డిల అనుమతితో శక సంవత్సరము 973 (క్రీ.శ. 1051) వికృతి ఉత్తరాయణ సంక్రాంతి నిమిత్తము ఒక రాటణమును (రాటుపంపు) దుద్ధమల్ల జినాలయమునకు దానముగా నొసంగెనని పేర్కొనబడింది. ఇది శనిగరములో లభ్యమైన తొలి శాసనము. ఇదే చక్రవర్తి కాలపు రెండవ శాసనములో అతని మహాసామంతుడైన కాకతీయ

మొదటి ప్రోలరాజు శక సంవత్సరము 975 విజయకార్తీక అమావాస్య ఆదిత్యవారము సూర్యగ్రహణము రోజున సరియగు తేది క్రీ.శ. 1053 నవంబర్ 13న స్థానిక, గావుండుల అంగీకారముతో 12 నివాస స్థలములను మాన్యములుగను, ఒకరాటణమును, 20 మఱ్తుర్ల నల్లరేగడి భూమిని, 20 మఱ్తుర్ల కేసుకాడు భూమిని దానములుగా నొసంగెనని తెలుపబడింది. బెజవాంకేయ (బెజ్జంకి) గ్రామకాటెరడ్డి తదితరుల అంగీకారముతో ఖణ్డిసణగరమందు ప్రెగ్గడ మధువప్పయ్య ప్రతిష్ఠించిన మధుపేశ్వరదేవరకు ఒక మఱ్తురు నీరు నేలను మొదటి ప్రోలరాజు దానముగా ఇచ్చాడు.

కళ్యాణి చాళుక్య ప్రభువులలో మేటి చక్రవర్తి అయిన ఆఱవ విక్రమాదిత్యుని కాలపు శిలాశాసనము క్రీ.శ. 1107 జనవరి 10న అతని మహామండలేశ్వరుడైన జగద్దేవరసర్ (పారమార జగద్దేవుడు) దండనాయకుడైన కొండమయ్య శకసంవత్సరము వ్యయ మాఘ శుద్ధ పూర్ణిమ గురువారము సోమగ్రహణ నిమిత్తం పుల్గునూర్-70 అంతర్గత బళియ సనగరమందున్న స్వయంభూః భీమేశ్వర దేవరకు ఒకరాటణమును, కొన్ని భూములను దానమిచ్చినట్లు తెలుపుతుంది. ఖణ్డిసణగర, బళియసనగర యను నామములు ఆనాటి శనిగరమందలి వాడల, వీధుల పేర్లు అయి ఉంటాయి.

కళ్యాణి చాళుక్య చక్రవర్తి భూలోకమల్ల మూడవ సోమేశ్వరుని కాలపు క్రీ.శ. 1128 శాసనములో అతని మహామండలేశ్వరుడైన కాకతీయ రెండవ ప్రోలరాజు అధికారి సబ్బిసహస్రమునేలు రేపోల కుఱవరాజు శకసంవత్సరము 1050 కీలక, ఆశ్వీజ అమావాస్య ఆదిత్యవారము సూర్యగ్రహణ నిమిత్తం ఖండిసనగరమందలి కొమ్మేశ్వర దేవుని ధూపదీపనైవేద్యములకు, సన్యాసులకు ఉచితాన్న వస్త్రములకై ఒక రాటణమును, ఒక గాణువును, మరియు బెజవాంకేయ గ్రామమందలి ఎనిమిది మఱ్తుర్ల నేలను దానములుగా ఇచ్చాడు.

కళ్యాణి చాళుక్య రెండవ జగదేకమల్లచక్రవర్తి పాద పద్మోపజీవి కాకతీయ రెండవ ప్రోలరాజు అధీనమందున్న సబ్బి సహస్రమునేలు రేపోల కుఱువ రాజు యొక్క దండనాయకుడు, ఆత్రేయ గోత్రికుడైన మండపరసర్ (మండపరాజు) క్రీ.శ. 1149 మార్చి 25న వేయించిన శిలాశాసనములో శనిగరమందలి పార్థేశ్వరదేవునకు నిత్యనైవేద్యములకు, అఖండదీపమునకు, సన్యాసుల అన్నవస్త్రములకై ఒక రాటణము, ఒక గాణువు మరియు కొన్ని భూములను అతడుదానముగా నొసంగినట్లు తెలుపబడింది.

క్రీ.శ. 1051 నుండి 1149 వరకు అనగా శతాబ్దకాలమునకు చెందిన ఐదు శిలాశాసనములు ఒక్క శనిగరమందే లభ్యమగుట వలన పదకొండవ, పన్నెండవ శతాబ్దములలో ఈ ప్రాంతము అత్యంత చారిత్రక ప్రాధాన్యత కలిగి ఉండెనని ద్యోతకమవుతుంది. కాకతీయుల తొలి నలుగురు ప్రభువులు కళ్యాణి చక్రవర్తులకు సామంతులని విదితమవుతుంది.



గోలకొండ రాజ్యమునేలిన అబ్దుల్లాకుతుబ్షా కాలపు శిలాశాసనమొకటి పెద్దచెఱువు అలుగు ప్రక్కన కట్టమైసమ్మ గుడి ఎదురుగా ఉంది. శకసంవత్సరము 1586 ప్లవంగ శ్రావణ మాసమందు అబ్దుల్లాకుతుబ్షా ఆజ్ఞానుసారము సైదు ముజపుర్ సరిఖేలు అను అధికారి 540 హొన్నులను బంగారు నాణెములు మంజూరు చేయగా హవల్దార్ మెనవిబేగ్ వెంకటపతితో శనిగరపు చెఱువు మత్తడిని కట్టించాడు. నరసింహ క్షేత్రమున కివ్వబడిన దేవ బ్రాహ్మణ వృత్తులన్నియు ఎప్పటిలాగే కొనసాగునని ఈ శాసనమందు పేర్కొనబడింది[57].

శాసనములలో పేర్కొనబడిన దేవాలయములేవియు ప్రస్తుతము శనిగరములో అగబడుటలేదు. వాటి శిథిలాలు గ్రామ సమీపమందున్న గుట్టబోరులందు పొలములలోను అగబడుతాయి. గుట్టలపైన ప్రాచీన కోటగోడల అవశేషాలు అక్కడక్కడ కనిపిస్తాయి.

## దుద్ధమల్ల జినాలయము

ఇచటి క్రీ.శ. 1051 శాసనములో దుద్ధమల్ల జినాలయమును మరమ్మతు చేసి నారణయ్య దానములిచ్చినట్లు పేర్కొనబడింది. వేములవాడ నేలిన చాళుక్యప్రభువులలో యుద్ధమల్ల నామము గల రాజు ఈ దుద్ధమల్ల జినాలయమును నిర్మించి ఉంటాడు[58]. కాని ఇప్పుడీ జినాలయములేదు. ప్రస్తుతము ఒక గుట్టపైనున్న శిలపై పార్శ్వనాథుని రూపము చెక్కబడిఉంది. అచ్చోటనే ఆనాటి దుద్ధమల్ల జినాలయము విరాజిల్లి ఉంటుంది. చెఱువునకు పోవు మార్గమున ఒక శిలపై పార్శ్వనాథుడు కాయోత్సర్గ రీతిలో నిలబడి ఉన్నాడు. అతని వెనుక మెలికలు తిరిగిన సర్పముండి దాని పడగలు అతని తలపై అలంకారప్రాయముగా ఉన్నాయి. వేములవాడలోని శిల్పము వలె ఇచటి పార్శ్వనాథునికి ఎడమవైపు క్రింది భాగమున శిశువుతో గూడిన తల్లి సంతానసాఫల్యము సూచకంగా కృతజ్ఞతాభావము తెలుపుచున్నట్లు చెక్కబడింది. వేములవాడ శుభధామ జినాలయపు పార్శ్వనాథ విగ్రహముతో ఇచటి ప్రతిమ పోలికలు అధికముగా నుండుటచే ఇవి ఏకకాలమునకు అనగా పదవ శతాబ్దమునకు చెందినవై ఉంటాయి[59].

## భీమేశ్వరదేవాలయము

ప్రస్తుతము జననివాసము లేని ప్రాంతమున గుట్టబోరుల దగ్గర నున్న భీమేశ్వరాలయము తూర్పు ముఖమును కలిగి శిథిలావస్థలో ఉంది. శనిగరమందలి క్రీ.శ. 1107 శాసనములో పేర్కొనబడిన భీమేశ్వరాలయము ఇదేకావచ్చు. ఈ దేవాలయ గర్భగృహము 11' అడుగుల చతురస్రాకారములో ఉంది. దాని ముందు 8'-8" ఎనిమిది అడుగుల ఎనిమిది అంగుళముల వెడల్పుతో 11' అడుగుల పొడవు గల అంతరాళము, దాని ముందు 9'-2" వెడల్పుతో 18' అడుగుల పొడవుగల మంటపము ఉన్నాయి. గర్భగృహ, అంతరాళపు గోడలు ఎలాంటి అలంకారములు లేక సాదాగా ఉన్నాయి. ఆలయ గోపురము శిథిలమై అదృశ్యమైంది. మంటపము యొక్క లోకప్పు చదునుగా నుండి ఆరుస్తంభములపై నిలిచి ఉంది. చాళుక్యుల కళారీతులలో

గల గర్భగృహప్రవేశ ద్వారపు క్రింది భాగమున శైవద్వార పాలకులు, ద్వార పతంగము (Lintel) పైన ఒక అడుగు ఉబికి వచ్చిన చూరు (Projecting Cornice over the lintel) అందంగా మలచబడింది.




శనిగరం భీమేశ్వరాలయం

**మహిషాసురమర్దని :-** భీమేశ్వరాలయ గర్భగృహమందున్న ఈ ప్రతిమ అడుగుభాగము శిథిలమైంది. ఊర్ధ్వభాగము అనేక చేతులతో ఉంది. ఆమె కుడి చేతులలోని ఒక హస్తముతో శూలమును అసురుని వైపు దించుచున్నట్లుంది. కాని అసురుని భాగము ఛేదింపబడి ఉంది.

**సప్తమాతృకల శకలము**

సప్తమాతృకల శిలాఫలకము శిథిలము కాగా ఏడుగురు దేవతలలో కేవలము ఇరువురు దేవతల ముక్క మిగిలి భీమేశ్వరాలయమందు పడి ఉంది.



గణపతి మహాలింగేశ్వరాలయము

**మహాలింగేశ్వర దేవాలయము**

శనిగరము ఊరు పొలిమేరలలో నున్న ఈ చిన్న ఆలయము నందు గల వేదికపై శివలింగముంది. వేదికపై 1'-8" ఎత్తుతో 4'-6" చుట్టుకొలత గల ఈ బృహత్ లింగము



చూపరులదృష్టి నాకర్షిస్తుంది. ఈ ఆలయముముందు ఒక పెద్ద గణపతి శిల్పముంది. చతుర్భుజములు గల ఈ వినాయకుని పైకుడి హస్తమందు పరశువు, వామహస్తమందు త్రిశూలము, క్రింది దక్షిణ హస్తమందు దంతము, వామహస్తమందొక పాత్రలో నున్న మోదకములపై తొండముకొన ఆని ఉంది. గణపతి తల పై చిన్న కిరీటము, ఆసనము క్రింద మూషిక వాహనము స్పష్టముగా అగబడుతాయి. చాళుక్య కళారీతులలో నున్న ఈ గణపతి సమీపముననే ఒక నంది విగ్రహముంది. ఈ కళాఖండములు పదకొండవ శతాబ్దానికి చెందినవి.

## పొలములలో నున్న శివాలయము

పూర్తిగా శిథిలమైన ఈ దేవాలయమందు గర్భగృహము,దాని ముందు అంతరాళము ఉన్నాయి. వీటిపై నున్న కప్పు నేడు కానరాదు. అంతరాళ ద్వార లలాటమున గజలక్ష్మి, క్రింది భాగమున శైవ ద్వారపాలకులు చెక్కబడ్డారు. ఈ ఆలయము తూర్పు ముఖమును కలిగిఉంది. ఇచటి శాసనములలో పేర్కొనబడిన ఈశ్వరాలయములలో ఇది ఒకటై ఉంటుంది.

## భైరవుడు

శనిగరము నుండి కోహెడకు పోవు మార్గమందు ఆరు అడుగుల నిలువెత్తు భైరవ విగ్రహముంది. పై నున్న కుడి హస్తములో డమరుకము, వామహస్తములో త్రిశూలము, క్రింది దక్షిణ హస్తములో ఖడ్గము, వామహస్తములో మొండెము నుండి వేరు చేయబడిన నెత్తురు కారుచున్న తల చెక్కబడి ఉన్నాయి.

## గుట్టపై నున్న నరసింహదేవాలయము

గ్రామమునకు ఒక కిలోమీటరు దూరంలో నొక గుట్టపై నున్న ఈ ఆలయమునకు ఎనిమిది రాతి మెట్లున్నాయి. ఒక పెద్దశిల క్రింద ఏర్పడిన గుహ 18'x9' కొలతలతో $4^1/_2$' ఎత్తును కలిగిఉంది. మూడు అడుగుల ఎత్తు గల నరసింహస్వామి ప్రతిమ చతుర్భుజములతో ఒక పెద్దబండపై చెక్కబడింది. పైహస్తములందు శంఖచక్రములున్నాయి. క్రింది హస్తములందలి చిహ్నములు అస్పష్టముగా ఉన్నాయి[60].

## గ్రామమందున్న లక్ష్మీనరసింహ దేవాలయము

గ్రామములో నున్న ఈ దేవాలయమందు గర్భగృహము, అంతరాళము, ముఖ మంటపములున్నాయి. నల్లని గ్రానైట్ రాయితో చెక్కబడిన మూడడుగుల ఎత్తున్న ఈ విగ్రహము చతుర్భుజములతో మలచబడింది. పై నున్న దక్షిణ హస్తమందు శంఖము, వామహస్తమందు చక్రము, క్రింది కుడిచేతి వ్రేళ్లలో పద్మముండి అభయముద్రలో నుండగా ఎడమచేతి యందు గద ఉంది.

శనిగరము వేయి సంవత్సరములకు మించిన వైభవ చరిత్రను కలిగియుండుట విశేషం.

# 9. పొట్లపల్లి

కరీంనగర్‌కు దక్షిణమున దాదాపు 35 కి.మీ. దూరంలో నున్న పొట్లపల్లి గ్రామమును హుస్నాబాద్ గుండా చేరవచ్చు. ఇచట బృహత్ శిలా సమాధులు లేదా రాకాసిగుళ్లు (Megalithic burials) ఉండుట వలన ఇది అత్యంత ప్రాచీన గ్రామమని చెప్పవచ్చు. స్వస్తి సమస్త భువనాశ్రయ శ్రీ పృథ్వీవల్లభ మహారాజాధిరాజపరమేశ్వర, పరమభట్టారక సత్యాశ్రయకుల తిలకం చాళుక్యాభరణ త్రైలోక్య మల్ల మొదటి సోమేశ్వరుని కాలపు కన్నడ శాసనమొకటి ఇచటి రామాలయము నందు నిలిచి ఉంది[61]. శకసంవత్సరము 988 పరాభవ చైత్రపూర్ణిమ ఆదిత్యవారము సోమగ్రహణ నిమిత్తం సరియగు తేది క్రీ.శ. 1066 మార్చి 14న వేయబడిన ఈ శిలాశాసనంలో మహాసామంతుడైన రేంగొణ్ణ (రేగొండ) చందయ్యరసర్ (చంద్రయ్యరాజు) ఒక రాటణమును ఇచటి దేవాలయమునకు దానంగా ఇచ్చినట్లు పేర్కొనబడింది. శాసనమందు రెండు పరియాయములు ఈ గ్రామనామము "పొట్టపల్లియ" అని చెక్కబడింది. ఆనాటి 'పొట్టపల్లియ'యే నేడు పొట్లపల్లిగా వ్యవహరింపబడుట గమనార్హం. ఈ శాసనమందు పేర్కొనబడిన 'రేంగొణ్ణ' పొట్లపల్లికి సమీపమున గల నేటి రేగొండ గ్రామము. ఈ రేగొండ గ్రామమందు గల రాక్‌షెల్టర్స్ (Rock shelters) లో కొత్తరాతి యుగపు రాక్ పేయింటింగ్స్ (Rock paintings) ఉన్నాయి. పొట్టపల్లియ గ్రామమునందు ఐదు మఠములుండినట్లు, తపోధనుల ఆహార నిమిత్తం గూడా దానములిచ్చినట్లు ఈ శాసనమందుంది. ఈ శిలాశాసనపు మొదటి ప్రక్కలో 27 పంక్తులు, రెండవ ప్రక్కలో 21 పంక్తులు, మూడవ ప్రక్కలో శపించు పంక్తులు (Imprecatory Verses) చెక్కబడినాయి.


పై శిలాశాసనములోని రెండవ ప్రక్కయందు మొదటి వరసలో లేదా పంక్తిలో నకరేశ్వర దేవర ప్రసక్తి ఉంది. నకరేశ్వరము నేడు నగరేశ్వరముగా పిలువబడుతుంది. ప్రాచీన కాలమందు వర్తక వ్యాపారమొనర్చువారు నకరముల నేర్పరచుకొనేవారు. నకరమనగా వ్యాపారసంఘము. దేశ విదేశములతో వ్యాపారమొనర్చు వర్తకులు తమ వ్యాపారాభివృద్ధికై వారిలోని సమస్యల పరిష్కారమునకై నకరములను లేదా వర్తక సంఘములను స్థాపించుకొనేవారు. వర్తక సంఘము లేదా నకరములో సభ్యత్వమున్న వారు కొంత ధనమును నకరమునకీయ వలసి ఉండేది. అట్లు ప్రోగైన ద్రవ్యము ధర్మకార్యములకు వినియోగింపబడేది. వేములవాడలో పదవ శతాబ్దములో నుండిన నకరము వారు అచటి నకరేశ్వరాలయము (నగరేశ్వరాలయము)ను నిర్మించియుందురు[62]. అదే విధముగా ఆనాటి పొట్టపల్లియ గ్రామమందుండిన నకరము లేదా వర్తక సమాజము శాసనమందు పేర్కొనబడిన నకరేశ్వరాలయమును వేములవాడలో వలె పొట్లపల్లియందు గూడా నిర్మించియుందురు. పొట్లపెల్లి నకరేశ్వరాలయమునకు దానము లివ్వబడినట్లు అచటి శాసనమందుంది. కాని ఈ నకరేశ్వరాలయము శిథిలమై నేడు అదృశ్యమైంది. దాని అవశేషాలు అచటచ్చట గ్రామమందు అగబడుతాయి.



పొట్లపల్లి మల్లన్న గుడి సమీపమున గల వేరొక శాసనము పురావస్తుశాఖ దృష్టికి వచ్చినట్లుగా లేదు. ఈ శాసనము అచటి బావి సమీపమున నిలిచిఉంది. ఇచట లభ్యమైన జైన అవశేషములను బట్టి పొట్లపల్లి జైనమతకేంద్రమై యుండినట్లు తెలుస్తుంది. ప్రాచీన ఆలయములన్నియు కనుమరుగై వాటి శిథిలాలు గ్రామమందు దర్శనమిచ్చుచున్నవి. గ్రామము మధ్యలో నున్న బురుజు పైభాగమున ద్వారపాలకుడున్న శిలాఫలకము మరియు చైత్యవాతాయనమును బోలిన శిల్పమున్న శిల, కట్టడములో వాడబడినాయి. చెఱువు తూము నిర్మాణములో సింహశిల్పము మరియు చైత్యవాతాయన శిల్పరూపమున్న శిలలు వాడబడినాయి.

మల్లన్నగుడి సమీపమున ఒక లోతైన చేదబావి అరుదైన రీతిలో నిర్మింపబడి ఉంది. ఈ బావిలోపలి వైపు నలుదిక్కుల చతురస్రాకారములో నున్న పొడవైన శిలలు ఒకదానిపై నొకటి చక్కగా క్రింది వరకు పేర్చబడి కళాత్మకముగా ఉన్నాయి. నేటికాలములో రింగులు ఒకదానిపై నొకటి అమర్చినట్లుగా ఆనాటి కాలములో ఒక దానిపై నొకటి పొడుగాటి పెద్ద పెద్దశిలలు క్రిందికి నీటి వరకు అమర్చుట అద్భుతముగాను, అందంగాను ఉండుట విశేషం.

పొట్లపల్లిలో ప్రస్తుతమున్న రామాలయము జమ్మికుంటలోని చెఱువు ప్రక్కనున్న శివాలయము మాదిరిగా శిథిలమైన దేవాలయపు పాత పునాదులపైననే నిర్మింపబడినట్లు స్థానికుల కథనము. ఈ రామాలయ అధిష్ఠానమందు ప్రాచీన మత్స్య, కూర్మ, మాతృదేవత (Primitive Mother Goddess) శిల్పములున్నాయి. గజముల సింహముల చిత్ర ఫలకములు పునాది భాగమున కనిపిస్తాయి.




పొట్లపల్లి దేవాలయము

పొట్లపల్లిలో కుమ్మరికులమునకు చెందిన చిలువేరి పోచయ్య, రాజవ్వల ఇంటి ముందు ప్రహరీగోడ నిర్మాణమునకై పునాది త్రవ్వుచుండగా కాకతీయుల శిల్పకళారీతులలో నున్న పెద్ద శివలింగమొకటి బయల్పడింది. దీనినిప్పుడు స్వయంభూ లింగంగా ప్రజలు సేవించుచున్నారు.

ఎత్తైన వేదికతో గూడిన పానవట్టముపై రెండడగుల ఎత్తు గల నల్లసరపురాయి లింగమున్నది. క్రీ.శ.1996 సెప్టెంబర్ 10 మంగళవారము రోజున సాయంత్రము దరిపెల్లి రాజయ్య త్రవ్వునప్పుడు ఈ బృహత్ లింగము బయటపడింది[63].

గ్రామములో కొన్ని ప్రాచీన ప్రతిమాశిల్పములున్నాయి.



పొట్లపల్లి లింగము



జైన ప్రతిమ

**గణపతి :-** ద్విహస్తములతో మకుటములేని ఏనుగుతల గల గణపతి బాదామి చాళుక్యుల కళారీతులలో మల్లన్నగుడియందు నిలుపబడి ఉంది.

**సప్తమాతృకల శకలము :-** ఏడుగురు దేవతలలో కేవలము ముగ్గురు దేవతలతో మిగిలి ఉన్న సప్తమాతృకల ఫలకములోని శకలము మల్లన్నగుడిలో పడి ఉంది.

**జైనప్రతిమ :-** పద్మాసనము వేసుకొని ధ్యానముద్రలో నున్న జైన తీర్థంకరుని విగ్రహమొకటి పొట్లపల్లి చెఱువుకట్ట వెనుకభాగమున పడిఉంది. ఈ విగ్రహపు రెండు బాహువులు ఛేదింపబడినాయి. ఉంగరాల జుట్టుతో నున్న తల, ధ్యానముద్రలో ఒకదానిపై నొకటి నిలుపబడిన హస్తములు స్పష్టముగా అగబడుచున్నాయి. చేతులు ఖండింపబడిన ఈ ప్రతిమ నల్లరాతితో మలచబడింది. ఈ విగ్రహము వేములవాడలోని జైన విగ్రహములను పోలిఉంది.

పొట్లపల్లిలో మల్లికార్జునాలయం, శివాలయం, రామాలయం, ఆంజనేయగుడి, ఎల్లమ్మగుడి, బ్రహ్మంగారి గుడి మున్నగు ఆలయాలున్నాయి.

## 10. కోరుట్ల

కరీంనగర్ నుండి 72 కి.మీ. దూరంలో నిజామాబాద్‌కు పోవు రహదారిపై కోరుట్ల పట్టణముంది. కోరుట్లలో నున్న పాతకోట, ఎత్తైన మట్టిగోడలు, కోటద్వారములు, కోటచుట్టున్న కందకములు, రాతితో, ఇటుకతో కట్టిన బురుజులు సందర్శకుల దృష్టినాకర్షిస్తాయి. కళ్యాణి చాళుక్య చక్రవర్తి త్రైలోక్యమల్ల మొదటి సోమేశ్వరుని కాలపు (క్రీ.శ. 1042-1068) కన్నడ



శాసనమొకటి కోరుట్ల కోట లేదా గడిలోని కోనేరు (Holy tank) లో ఉంది[64]. తేదిలేని ఈ శిలాశాసనం నాలుగు ప్రక్కల యందు చెక్కబడింది. మూడవ ప్రక్క కోనేరు కట్టడములో ఉపయోగింపబడుట వలన పురావస్తు శాఖవారు కనిపించు మూడు ప్రక్కల యందున్న వ్రాతలనే కాపీ చేయగలిగారు. మొదటి ప్రక్కలో 19 పంక్తులు, రెండవప్రక్కలో 26 పంక్తులు, నాలుగవ ప్రక్కలో 20 పంక్తులు చెక్కబడినాయి. మూడవ ప్రక్క నిర్మాణములో మూసుకపోయింది. రెండవ మరియు నాలుగవ ప్రక్కలందున్న పంక్తుల మొదటి అక్షరములు అఱిగిపోవుట వలన గుర్తింపబడుటలేదు. శాసనమందున్న రెండవ ప్రక్కలోని మొదటి రెండు పంక్తులలో ఫాల్గుణ శుద్ధ పంచమి బృహస్పతివారము అను పదములు స్పష్టంగా తెలుస్తున్నాయి. కాని శక సంవత్సరము లేదు. శాసనము యొక్క అంచులు విరిగి పోవుట వలన పంక్తులలోని మొదటి అక్షరములు గోల్పోవడమైంది.

పొలవాసరాజుల మాదిరిగా లట్టలూరు పురవరాధీశ్వర, సువర్ణ గరుడధ్వజాది బిరుదములు ధరించిన రాష్ట్రకూట నాయకుడొకడు (Chief) కోరుట్లలోని రట్టమార్తాండ జినాలయ మరమ్మతులకు, పూజలకు, నైవేద్యములకు భూదానములిచ్చినట్లు ఈ శాసనము తెలుపుతుంది.

శాసనమందలి లట్టలూరు (Lathore) రాష్ట్రకూటుల రాజధానిగా ఉండేది. లట్టలూరు పురవరాధీశ్వర యను బిరుదము ధరించిన దాత రాష్ట్రకూట వంశజుడై ఉంటాడు లేదా రాష్ట్రకూట నాయకుడై ఉంటాడు. రట్టయను పదము రాష్ట్రకూటులను సూచిస్తుంది. కావున దానములిచ్చిన దాత రాష్ట్రకూటనాయకులలో ఒకడై ఉంటాడు. అతని పేరు తెలియుటలేదు. రాష్ట్రకూటులకు సామంతులుగా సమకాలీనులుగా క్రీ.శ. 750 నుండి 973 వరకు వేములవాడ చాళుక్యులు పాలించారు. వేములవాడ ప్రభువులకు రాష్ట్రకూట పాలకులతో వివాహబాంధవ్యాలున్నాయి. అందువలన ఈ ప్రాంతములో వేములవాడ ప్రభువుల పాలన యందు రాష్ట్రకూటనాయకులు కొందరు పాలకులుగా నుండు అవకాశముంది. రాష్ట్రకూటుల వలె వేములవాడ చాళుక్యులు గూడా జైనమత పోషకులు. కోరుట్లలోని రట్టమార్తాండ జినాలయము గూడా వేములవాడ చాళుక్య ప్రభువుల కాలములో నిర్మింపబడి ఉంటుంది. శనిగరములోని దుద్దమల్ల జినాలయము, రేపాకలోని ఖలివృత్తు జినాలయము, వేములవాడలోని శుభధామ జినాలయముతో పాటు కోరుట్లలోని రట్టమార్తాండ జినాలయము గూడా వేములవాడ చాళుక్యప్రభువుల కాలములోనే నిర్మింపబడి ఉంటాయి. కాని ఈ జినాలయములు నేడు కనబడుటలేదు. శనిగరము, రేపాక, వేములవాడలోని జినాలయములు అదృశ్యమైనాయి. కోరుట్లలోని రట్ట మార్తాండ జినాలయము నేడు మహాదేవ స్వామి ఆలయముగా వ్యవహరింపబడుతుంది. జైన మతములో క్రాణూరుగణ మరియు తింత్రిణి గచ్ఛశాఖలకు జెందిన కొరవట్టుగోష్ఠి జైనుల ప్రసక్తి ఈ శాసనమందుంది. పది, పదకొండవ శతాబ్దములలో కొరవట్టు జైనుల కేంద్రమగుటచే ఈ పట్టణమునకు క్రమముగా

కొరవట్టుల, దాని నుండి కోరుట్ల అను నామము వచ్చి ఉంటుంది. కొరవట్టుల పదమే కోరుట్లగా మారినదనుటలో సందేహం లేదు.

## మహాదేవస్వామి దేవాలయము

కోరుట్ల వాగు ఒడ్డుననున్న చిన్నగుడియే మహాదేవస్వామి ఆలయము. కోరుట్ల శాసనములో పేర్కొనబడిన రట్టమార్తాండ జినాలయము నేటి మహాదేవస్వామి ఆలయమే యనుటకు ప్రబల నిదర్శనములున్నాయి. ఇచటి జినాలయములోని పార్శ్వనాథుని, బాహుబలి విగ్రహములు బయటపడ వేయుట వలన అవి నేడు ప్రవేశద్వారమునకిరువైపుల లోపలిగోడలకు నిలుపబడి ఉన్నాయి. పన్నెండవ, పదమూడవ శతాబ్దములలో వీరశైవులు జైనులను ముప్పుతిప్పలు పెట్టి వారి జినాలయములన్నింటిని బలవంతముగా శివాలయములుగా మార్చి వాటిలోని జైన ప్రతిమలను బయటపడ వేశారు. కోరుట్లలోని జినాలయము గూడా బలవంతంగా శివాలయముగా మార్చబడి నేడు మహాదేవాలయముగా పిలువ బడుతుంది. అందలి జైన ప్రతిమలను బయట పడవేయుట వలన అవి నేడు అదే ప్రాంగణములో దర్శనమిస్తున్నాయి. ప్రప్రథమములో ఈ దేవాలయమందు కేవలము గర్భగృహము, దాని ముందు చిన్న మంటపము (Porch) మాత్రమే ఉండేవి. ఈ చిన్నమంటపము (Porch) ముందున్న ముఖ మంటప నిర్మాణము ఈ జినాలయమును శివాలయముగా మార్చినప్పుడు జరిగి యుండవచ్చు. ద్వారపుశాఖల క్రింది భాగమున పూర్ణకుంభములను చెక్కడము జైన సంప్రదాయం [65]. ఈ దేవాలయపు గర్భగృహ ద్వారము క్రింది భాగమున హిందూ దేవాలయములలోవలె ద్వారపాలకులు లేకుండా, జైన సంప్రదాయములో పూర్ణకుంభములు చెక్కబడినాయి. దేవాలయ ప్రాంగణములో నున్న ప్రతిమాశిల్పములు ఈ క్రింద పేర్కొనబడినాయి.




మహాదేవాలయము

**పార్శ్వనాథుడు** :- ఐదు అడుగుల ఎత్తుగల ఈ పార్శ్వనాథ విగ్రహము ఎఱ్ర ఇసుకరాయితో (Redsandstone) మలచబడింది. యౌవ్వనముట్టిపడుచు కాయెత్సర్గ (Kayotsarga Posture)




రీతిలో నగ్నముగా నిలబడియున్న ప్రతిమ ఇది. పార్శ్వనాథుని వెనుక మెలికలు తిరిగిన సర్పము యొక్క ఏడు పడగలు అతని తలపై భాగమున ఛత్రము వలె బహు అందంగా చెక్కబడినాయి. కాని ఎడమవైపున నుండిన మూడు పడగలు విరిగిపోయినాయి. ప్రస్తుతము ఈ ప్రతిమ ఆలయ ప్రవేశద్వారము లోపలి వైపు గోడకు నిలుపబడింది.

**బాహుబలి** :- నాలుగు అడుగుల ఎత్తున్న ఈ జైన విగ్రహము ఎఱ్రయిసుకరాయితో మలచబడింది. బాహుబలి తలపై త్రిఛత్రములు చెక్కబడినాయి. ఈ ప్రతిమలో బాహుబలి నగ్నముగా కాయోత్సర్గరీతిలో నిలబడి ఉన్నాడు. అతని బాహువులు మోకాళ్లనంటుచున్నాయి.



పార్శ్వనాథుడు, బాహుబలి



జైన ప్రభామండలి

**జైనప్రభామండలి** :- ఈ దేవాలయ ప్రాంగణములోనే వెనుకభాగమందు ఒక అందమైన జైన ప్రభామండలి పడి ఉంది. ఈ ప్రభామండలి ఒక పెద్ద జైన విగ్రహము యొక్క తల వెనుక భాగముననుండు అందమైన అలంకారము. కాని ఆ పెద్ద జైనవిగ్రహము అదృశ్యమైంది. దానికి సంబంధించిన ప్రభామండలి మాత్రము మిగిలిఉంది. త్రిఛత్రములతో గూడిన ఈ ప్రభామండలికిరువైపుల నున్న చిన్నశాలలలో (Miniature Shrines) ధ్యానముద్రయందున్న జైన తీర్థంకరులు చెక్కబడినారు. ప్రభామండలిపై ఎగురుచున్న గంధర్వులు చామరధారులై ఉన్నారు. త్రిఛత్రముల క్రింద తలభాగమునకై స్థలము వదలబడింది. ఈ ప్రభామండలితో గూడిన అతి పెద్ద ఎత్తైన జైన విగ్రహము నేడు కనబడుటలేదు. శిథిలమై అదృశ్యమై ఉంటుంది.

**సప్తమాతృకల శకలము** :- సప్తమాతృకల శిలాఫలకము నుండి విరిగిపోయిన భాగము ఒక వేదికపై నిలుపబడింది. ఇందులో బ్రాహ్మి, మహేశ్వరి మరియు కౌమారి దేవతలు స్పష్టముగా అగబడుచున్నారు.

**సూర్యుడు** :- ఇది ఒక చిన్న సూర్యప్రతిమ. నాభి క్రింది భాగము శిథిలమై అదృశ్యమైంది. పైకెత్తియున్న రెండు చేతులలో కమలపు మొగ్గలున్నవి. ఇది గూడా అదే వేదిక సమీపమున నిలుపబడింది.

కోరుట్ల జవాహర్ రోడ్‌పై కాలువగడ్డకు సమీపమున నున్న ఆంజనేయ దేవాలయంలో సమీకరింపబడిన విడిప్రతిమలలో పదవ, పదకొండవ శతాబ్దములకు చెందిన చిన్న మకుటము ధరించిన నాలుగు హస్తముల గణపతి, మహిషాసురమర్దని, సూర్య విగ్రహములున్నాయి. కోరుట్ల నడిబొడ్డున నగరేశ్వరాలయము, వేంకటేశ్వరాలయములున్నాయి. ప్రస్తుతమున్న వేణుగోపాలస్వామి ఆలయము నందు 1923లో ఉభయవేదాంతద్వయవర్ధని యను సంస్కృత పాఠశాల స్థాపించబడింది. కాని ప్రస్తుతమిది కరీంనగర్‌కు మార్చబడింది. కోరుట్ల సంస్కృత పాఠశాల వ్యవస్థాపకుడు సేనాపతి నరసింహాచార్యులు మరియు సాహితీసేవలో అగ్రగణ్యులైన శ్రీ శిరశినహల్ కృష్ణమాచార్య శతావధాని కోరుట్ల వాసులకు చిరస్మరణీయులు. కోరుట్ల వాగు ఒడ్డున ఇటీవల నిర్మింపబడిన షిరిడి సాయిబాబా దేవాలయము జనప్రియమైన ఆలయంగా పేరొందింది.

ఒక శతాబ్దము క్రిందట కోరుట్ల కాగిత పరిశ్రమకు సుప్రసిద్ధమైంది. కోరుట్లలోని బండలవాడ ప్రాంతము కాగితపు పరిశ్రమ ఏర్పాటు కావటంతో కాగజ్‌పురాగా రూపొందింది. ఇక్కడి కాగితము హైదరాబాద్, సిద్ధిపేట, వరంగల్, షోలాపూర్, నాందేడ్, తదితర ప్రాంతాలలో అమ్మబడేది. కాని ఈ పరిశ్రమ, ఆధునిక పద్ధతులలో తెల్లకాగితం రావటం వలన కనుమరుగైంది. ప్రస్తుతము కోరుట్ల బీడి పరిశ్రమకు ప్రసిద్ధము. జనాభా క్రమేణ పెరుగుట వలన కోరుట్లలో సిటి మున్సిపాలిటి ఏర్పడింది.

## 11. పొలాస

కరీంనగర్‌కు ఉత్తరమున 56 కి.మీ. దూరంలో పొలాస గ్రామముంది. జగిత్యాలకు 6 కి.మీ. దూరమున ధర్మపురికి పోవు జాతీయ రహదారిపై నున్న ఈ పొలాస గ్రామము ఒకనాడు పొలవాస రాజులు పాలించిన పొలవాస రాజ్యమునకు రాజధానిగా విరాజిల్లింది. పొలవాస రాజులు రాష్ట్రకూట సేనానుల సంతతివారు. పొలాస పంచాయితీ కార్యాలయము సమీపమున నున్న ఒక శిలాస్తంభముపై కేవలము శకసంవత్సరము మరియు వారము మాత్రము చెక్కబడిఉన్నాయి. ఈ శాసనస్తంభము ఏదేని ఒక మంటపనిర్మాణములో వాడియుందురు. ఆరు చిన్న పంక్తులు గల ఈ శాసనములో శకసంవత్సరము 1001 సిద్ధార్థి శ్రావణ శుద్ధ పాడ్యమి బృహస్పతి వారమందు అనగా క్రీ.శ. 1079లో కట్టినారని మాత్రమే చెక్కబడిఉంది[66]. వేరొక ప్రధానమైన 49 పంక్తులతో గూడిన కన్నడశిలాశాసనము పులస్త్యేశ్వర దేవాలయ ప్రాంగణమందు నిలిచిఉంది. స్వస్తి సమధిగత పంచమహాశబ్ద మహామండలేశ్వరుడు, లత్తలూరు పురవరాధీశ్వరుడు, సువర్ణగరుడధ్వజుడు, మూర్తి మకరధ్వజ, త్రివళీ శబ్దఘోషణ, గుణమణి విభూషణ, శరణాగత వజ్రప్రాకార, గండరహీర, పగెవరమల్ల, పరమండల సూరకార, చక్రగొట్టరాయ దిశాపట్ట, మండలిక లలాటపట్ట, శ్రీకేశవదేవ దివ్య శ్రీ పాదపద్మారాధక, పరబలసాధక, ద్విజగురుదేవ పూజాపరాయణ, శ్రీ సత్యనారాయణ నామాది సమస్త ప్రశస్తి సహితుండైన శ్రీమన్మహామండలేశ్వరుడు మేడరాజు



నిజరాజధాని పొలవాసె యందు రాజ్యపాలన చేయుచుండగా వీరబలంజవర్తక సమాజమునకు చెందిన అయ్యావళి-500 స్వాములు, 36 బిడులకు చెందిన ముమ్మూరిదండులు మరియు ఉభయ నానాదేశీలు పులస్త్యేశ్వర దేవరకొసంగిన దానముల ప్రసక్తి ఈ శాసనమందు ఉంది[67]. దానముల వివరములు స్పష్టముగా లేవు. పొలాస గ్రామనామము పొలవాస అనియు, అచటి పులస్త్యముని ఆశ్రమము మున్నగు వివరములు ఈ శాసనమందు పేర్కొనబడినాయి. శాసనమందు పులస్త్యాశ్రమ పట్టణమనియు పొలవాస పట్టణమనియు పేర్కొనబడిన ఈ ప్రదేశము నేడు పొలాస (Polas) గ్రామముగా వ్యవహరింప బడుతుంది.

తుంగభద్రానది ఒడ్డున వ్యాపారవర్తక మహానాడు కేంద్రంగా విరాజిల్లిన అలంపురము శాసనములందు కన్నడ ఉభయ నానాదేశీలు-400, 36 బిడులకు చెందిన అయ్యవోలు మరియు ముమ్మూరి దండుల వర్తక సంఘముల (Guilds) యొక్క ప్రసక్తి ఉంది[68]. ఈ ప్రాంతమునకు కన్నడ దేశీయులతో వర్తక సంబంధములధికముగా నుండెనని వారు దానధర్మాలు చేసేవారని తెలుస్తుంది. వీరబలంజ సమయ (Guilds) వర్తక సంఘములు గూడా వివిధ దేవాలయములకు విరివిగా దానములిచ్చేవారని తెలుస్తుంది[69]. అలాగే ఈ వ్యాపారసంస్థలు పొలవాసలోని పులస్త్యేశ్వర దేవరకు గూడా దానములొసంగినాయి.

పొలాస గ్రామములో శిథిలాలయములు, అనేక శిల్పములున్నాయి. గ్రామము చుట్టు బలమైన కోట ఉంది. దాని చుట్టుండిన లోతైన కందకముల ఆనవాళ్లు మరియు మట్టిగోడలు అక్కడక్కడా ఉన్నాయి.


పదునాల్గొవ శతాబ్దమునకు చెందిన క్రీడాభిరామములో పొలవాసతో పాటు ఆరు ఏకవీర దేవత స్థావరముల ప్రసక్తి ఉంది. పొలవాస, మందపాక, పెనుపాక, మాహూరము, నాగవరము మరియు ఓరుగల్లు అను ఆరు ప్రదేశములందు ఏకవీర, కాకతమ్మలు కొలువబడుచున్నారని క్రీడాభిరామము నందు పేర్కొనబడింది[70]. ఇందలి 128వ పద్యము చివరలో "కాకతమ్మకు సైదోడు ఏకవీర" యని పేర్కొనబడుట వలన ఓరుగల్లునందు ఏకవీర, కాకతమ్మదేవతలు ఒకరి ప్రక్కనే మరొకరు ప్రతిష్ఠింపబడినారని తెలుస్తుంది.[71] శాక్తేయపూజలు పరివ్యాప్తమగుట వలన దుర్గ, గౌరి, గంగమ్మ, కాకతమ్మ, ఏకవీర, ఇరుకలమ్మ, ఎల్లమ్మ ఇత్యాది దేవతలు మధ్యయుగమందు పూజింపబడినారు[72].


### పులస్త్యేశ్వర దేవాలయము

పొలాస చెఱువుకు ఉత్తరమున పొలములలో పులస్త్యేశ్వరాలయము తూర్పు ముఖమును కలిగి ఉంది. పది అడుగుల చతురస్రాకారపు గర్భగృహమునకు ముందు 7'x9' కొలతలతో అంతరాళముంది. దేవాలయమును బాహ్యము నుండి కొలిచినచో 24 అడుగుల పొడవు 16 అడుగుల వెడల్పును కలిగిఉంది. గర్భగృహద్వారపు శాఖల క్రింద పూర్ణకుంభములు లలాటమున

గజలక్ష్మితో కూడిన పతంగము (Lintel) పైన ముందుకు వచ్చిన చూరు (Projecting Cornice) మలచబడింది. గర్భగృహపు లోకప్పు లుపవితాన (కదలికాకరణ) రీతిలో నుండి మధ్యలో విరబూసిన కమలము క్రింది వైపు చూచునట్లు చెక్కబడింది.

దేవాలయ అధిష్ఠానము సాధారణరీతి (Plain and Simple) లో నుండి దానిపై 6' అడుగుల ఎత్తు గల భిత్తి (wall) ని కపోతము (Cornice) శిఖరము నుండి వేరుచేస్తుంది. శిఖరము మొదట చతురస్రాకారములో నుండి పోను పోను చాపరేఖాకృతి (Curvilinear)ని కలిగి దానిపై నున్న ఆమలకము పై పెద్ద గుండ్రని శిలాకలశము ఉంది.



శిఖరము


నాగిని దేవతలు


నాగిని దేవత


గర్భగృహము, అంతరాళము ముందుగా కట్టినవై ఉంటాయి. వాటి ముందున్న 16 స్తంభముల మంటపమునకు దేవాలయము నంటి యుండిన చిన్నమంటపము (Porch) కూలి యుండుట వలన ఈ రెండింటి మధ్య సందు (gap) ఏర్పడింది. ఈ మంటపము చుట్టు గోడలు నిర్మింపబడినవి. ఈ 16 స్తంభముల మంటపమునానుకొని తూర్పున బహుశః కాకతీయుల కాలములో ఇంకొక 16 స్తంభముల మంటపము నిర్మింపబడింది. ఈ రెండవ దశలో నిర్మింపబడిన మంటపము చుట్టు ఉన్న చిన్న గోడలపై (Parapet wall) కక్షాసనములున్నాయి. ఈ మంటపమునకు తూర్పు, ఉత్తర, దక్షిణములందున్న చిన్న మంటపముల (Porches) ద్వారా లోనికి ప్రవేశింపవచ్చు. పడమటి దిశలో మొదటి మంటపములోనికి ప్రవేశ మార్గముంది. ప్రస్తుతము రెండవ మంటపము తూర్పు దిశ సోపానములపై నుండిన చిన్నమంటపము (Porch) అదృశ్యమైంది. రెండవదశలో నిర్మింపబడిన ఈ మంటప పునాదులు శిథిలమైనాయి. మంటపము పైకప్పు చూరు (Cornice) రాళ్లు అచ్చటచ్చట పడి పోయినాయి. రెండవ మంటపము మధ్యనున్న నాలుగు స్తంభముల నడుమ వర్తులాకారములో ఒక అంగుళము ఎత్తున్న రంగశిల ఉంది. శిథిలావస్థలో నున్న ఈ రెండవ మంటపభాగములను స్థానికులు ఇటీవల మరమ్మతులు గావించి కూలిపోకుండా నిలుపగలిగారు. ఈ రెండవ మంటపము పైకప్పు చూరు కాకతీయుల కాలపు చూరులవలె కొంత వంగి యుండుట (Cornice with slight slant) గమనార్హము.




పులస్త్యేశ్వరాలయము

దేవాలయ మంటపమునకు ఉత్తరమున మెట్లతో గూడిన పిరమిడ్ ఆకారపు శిఖరముతో ఒక చిన్నగుడి (Small Shrine) పార్వతికై నిర్మింపబడింది. ఈ గుడి శిఖరమందు వాడిన ఇటుకలు 11"x8"x2" కొలతలతో నుండి ధృఢముగా ఉన్నాయి. మంటపమునకు ఉత్తరమున నున్న కోనేరు ఒక పెద్ద బావి రూపములో ఇటుకలచే నిర్మింపబడింది. ఇందులోని నీటిని చేరుకొనుటకు దక్షిణదిశలో మెట్లున్నాయి. ఎన్ని కరువుకాటకములు వచ్చినను, వర్షాలు లేక పోయినను ఈ కోనేరు ఎండి పోలేదు. ఎందుకనగా ఈ కోనేరు చెఱువుకు సమీపముననే ఉంది.

**విడిప్రతిమలు** :- పులస్త్యేశ్వర దేవాలయమందు, దాని ప్రాంగణములో అనేక ప్రతిమా శిల్పములు దర్శనమిస్తాయి.


సప్తమాతృకలు

**1. సప్తమాతృకల ఫలకము** :- ఈ సప్తమాతృకల శిలాఫలకము అతిప్రాచీనమైంది. ఎనిమిది, తొమ్మిదవ శతాబ్దములకు సంబంధించినదై ఉంటుంది. ఎందుకనగా ఈ ఫలకముపై కేవలము

ఏడుగురు దేవతలే ద్విహస్తములతో చెక్కబడినారు. చివరల యందు వినాయకుడు గాని, వీరభ... గాని లేరు. దేవత ఆసనముల క్రింద వారి చిహ్నములుగాని, వాహనములుగాని లేవు. ఆసీ... దేవతల ఎడమకాళ్లు మలచుకొని (Legs Folded) కుడికాళ్లు వ్రేలాడుచున్నట్లు (Legs hanging) ఉన్నాయి. సప్తమాతృకలు కిరీటములతో చెక్కబడినారు. వారు గ్రైవేయకములు, దండ, ముంజేతి, కాలి కడియములు ధరించి యున్నారు. ఈ సప్తమాతృకల శిలాఫలకము బాదామి చాళుక్యుల కాలపు కళారీతులను పోలియుండుట వలన ఇది ఈ జిల్లాలోనే అతిప్రాచీన సంప్రదాయ శిలాఫలకమని చెప్పవచ్చు. తదనంతరపు కాలములో చెక్కబడిన ఫలకములందు, చతుర్భుజముల దేవతలు, వారి వాహనములు, చివరలయందు వినాయక వీర భద్రులుండుట గమనింపదగిన అంశములు. ఆ లక్షణములిందు లేనందున ఇది అతి ప్రాచీన కళారీతులలో నున్న ఫలకము.

**2. దేవీ విగ్రహము** :- చతుర్భుజములతో కూడిన ఈ దేవి పైనున్న కుడిచేతిలో డమరుకము, ఎడమచేతిలో త్రిశూలము క్రింది కుడిహస్తము నందు ఖడ్గము, ఎడమచేతిలో గిన్నె (Bowl) చెక్కబడినాయి. కరండ మకుటమును ధరించిన ఈ దేవి ఎడమకాలు మలచుకొని ఉండగా వ్రేలాడుచున్న కుడికాలు ప్రక్కకు నంది మలచబడిఉంది. నంది వాహనమున్నందున ఈమె శివుని అర్ధాంగి యనవచ్చు. ఈ ప్రతిమా శిల్పము ఒకనాడు కళ్యాణి చాళుక్యులకు రాజధానులుగా వెలసిన పటంచెరువు, కొలనుపాకలోని విగ్రహములను పోలిఉంది[73]. ఇలాంటి ప్రతిమలనేకములు కరీంనగర్ జిల్లా అంతటను కనిపిస్తాయి.

**3. వీరగల్ శిల్పము** :- ఎడమచేతిలో డాలు, పైకెత్తిన కుడిచేతిలో ఖడ్గము ధరించిన యోధుడు చెక్కబడిన శిల్పమిది. అతని వెంద్రుకలు ఒక ప్రక్కకు శిఖరూపములో మలచబడినాయి. అతనికి ఎడమవైపున తొండమును పైకెత్తిన గజము చెక్కబడింది.

**4. వీరగల్ శిల్పము :-** చేతులలో డాలు, ఖడ్గము ధరించిన ఈ వీరుని కేశములు అతని ఎడమ ప్రక్కకు మలచబడి ముడివేసిన శిఖరూపమున ఉన్నాయి. అతని కాలి వ్రేళ్లకు ఉంగరములున్నాయి. అతడు నడుమునకు బాకును (dagger) ధరించి ఉన్నాడు. అతనికి ఎడమవైపున గల పడతి తన కుచముల మధ్య హస్తములు కలిపి అంజలి ముద్రలో ఉంది.

**5. గణపతి** :- చిన్నమకుటమును ధరించి ద్విహస్తములతో నున్న విగ్రహమిది.

**6. గణపతి** :- చతుర్భుజములతో, విశాలమైన చాటలలాంటి చెవులతో మకుటమును ధరించిన వినాయకుని విగ్రహమిది.

**7. నాగిని** :- ఈ ప్రతిమా శిల్పము యొక్క ఊర్ధ్వభాగము స్త్రీ రూపములోను నాభి నుండి క్రింది భాగము సర్పరూపములోను మలచబడింది. శిల్పరత్న గ్రంథములో పేర్కొనినట్లు ఈమె దక్షిణ హస్తమందు ఖడ్గము, వామ హస్తము నందు డాలు ధరించి ఉంది[74]. సర్పము యొక్క ఐదు పడగలు ఆమె తలపై భాగమున విప్పుకొని ఛత్రమువలె ఉన్నాయి. ఆమె గ్రైవేయకమును మరియు



స్తనములపై వ్రేలాడు హారమును ధరించి ఉంది. ఆమె మకుటమును ధరించలేదు. ఈ ప్రతిమలను సాధారణంగా పిల్లలు కలగని స్త్రీలు ప్రతిష్ఠించుచుంటారు[75].

పొలాస యందు దాదాపు ఒక డజన్ నాగిని ప్రతిమలున్నాయి. ఈ శిల్పములు మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపురం, నల్గొండ జిల్లాలోని కొలనుపాక, తూర్పు గోదావరి జిల్లాలోని బిక్కవోలు ప్రాంతములందు గల శిల్పములను పోలి ఉన్నాయి. పులస్త్యేశ్వర దేవాలయ ప్రాంగణములో చాళుక్య కళారీతులలోని నంది విగ్రహములు, వీరగల్లుల ప్రతిమలు మరియు చతుర్భుజములు కలిగిన సప్తమాతృకల శిథిలమైన ఫలకము తదితరమూర్తి శిల్పములు అనేకములు పడి ఉన్నాయి.

## చెఱువు కట్టపై నున్న దేవాలయము


చెఱువు కట్టపై నుండిన దేవాలయము సంపూర్ణముగా శిథిలమై కూలిపోయింది. దాని స్తంభములు, లోకప్పు ఫలకముల పై చెక్కబడిన విరబూసిన కమలములు తదితర అవశేషాలు నీటిలో కట్ట ప్రక్కకు పడి ఉన్నాయి. కట్టపై పెద్ద లింగములు, అన్నపూర్ణవిగ్రహము, పెద్ద వినాయకుని విగ్రహము మున్నగు ప్రతిమా శిల్పములు సందర్శకుల దృష్టిని ఆకర్షిస్తాయి. ఇటీవల గ్రామస్థులు రెండు చిన్న మందిరములు కట్టపై నిర్మించి ఈ విగ్రహములను వాటిలో నిలిపారు.



అన్నపూర్ణ



గణపతి



జైన ప్రతిమ

**అన్నపూర్ణ విగ్రహము** :- మూడు అడుగుల ఎత్తున్న గ్రానైట్ రాతి ఫలకము పై ఉబ్బుగా (Carved in bas-relief) చెక్కబడిన ప్రతిమ ఇది. ఈమె ఉన్నత కుచములతో నున్న దేవత. చతుర్భుజములున్న ఈ దేవత పైహస్తములలో డమరుకము, త్రిశూలము లుండగా క్రింది వామహస్తముతో కుండను పట్టుకొని దక్షిణహస్తములోని తెడ్డు (A wooden spoon or ladle) తో అన్నమును వడ్డించుటకై బయటకు తీయుచున్నట్లుగా మలచబడింది. అన్నమును అందించు ఈ ప్రతిమను అన్నపూర్ణగా, పరమశివుని అర్ధాంగిగా వ్యవహరింపబడుచున్నది. ఈ ప్రతిమలు కేవలము దక్కన్‌లోనే కనిపిస్తాయి. పొలాసలోని అన్నపూర్ణ ఎడమకాలును అడ్డముగా మలుచుకొనగా కుడికాలు పొడవుగా మలుచుకొని కూర్చొని ఉంది. కరండ మకుటమున్న ఈ

దేవత గ్రైవేయకములు, పత్రకుండలములు, దండ, ముంజేతి, కాలి కడియములతో అలంకరింపబడింది. గ్రీవమందున్న హారము స్తనముల మధ్య వ్రేలాడుచున్నది. దేవత వెనక మకరతోరణమున్నది. దీనికంటే కొంత చిన్నగా నున్న చతుర్భుజముల అన్నపూర్ణ ప్రతిమ ఒకటి కాళేశ్వరములోని ముక్తేశ్వరాలయ ప్రాంగణము ముందు నిలుపబడిన అనేక మూర్తి శిల్పములలో ఒకటిగా పడి ఉంది. ఇలాంటి అన్నపూర్ణ ప్రతిమ పొలాస ప్రక్క గ్రామమైన జాబితాపూర్‌లోని చిన్నగుడిలో ఉంది. అరుదైన ఈ శిల్పము చూడ ముచ్చటగా ఉంది. ప్రస్తుతము ఇది నూతనముగా చెఱువు కట్టపై నిర్మించిన ఒక గుడిలో బృహత్ లింగముతో పాటు నిలుపబడిఉంది.

**గణపతి** :- అనేక సంవత్సరాలుగా ఎండకు ఎండి, వానకు తడిచి కొంత అరగి పోయిన ఈ బృహత్ గణపతి పూర్ణ చిత్ర శిల్పము చాల అందంగా ఉంది. ఇప్పుడిది గ్రామస్థులచే నూతనముగా చెఱువు కట్టపై నిర్మింపబడిన గదిలో నిలుపబడింది. గణపతి ఎడమకాలు మలచబడి కుడికాలు వ్రేలాడుచు చెక్కబడింది. ద్విహస్తములతో గూడిన ఈ గణపతి తలపై చిన్న మకుటముంది. వామహస్తము నందు పొడుగాటి దంతము, దక్షిణహస్తములోని పాత్రలో మోదకములుండగా తొండము యొక్క కొన వాటిపై నిలుపబడి ఉంది. గణపతి యజ్ఞోపవీతము ముంజేతి కడియములు ధరించి ఉన్నాడు. తొలికాలపు ప్రతిమలలో మకుటము కానరాదు. కళింగుల సంప్రదాయానుసారము తూర్పు చాళుక్యుల కాలపు బిక్కవోలు గోలింగేశ్వరాలయములోని గణపతి ప్రతిమలు చిన్న మకుటములను (Short Makutas) కలిగి ఉన్నాయి[76]. కాని అక్కడి ప్రతిమలు చతుర్భుజములతో నుండగా వాటికి భిన్నముగా పొలాస బృహత్ గణపతి ద్విహస్తములతో నుండుట విశేషం.

పొలాస చెఱువు కట్టపై శిథిలమైన పూర్వపు దేవాలయమునకు సంబంధించిన పానవట్టములు, లింగములు, చాళుక్య కళారీతిలోని నంది మున్నగు ప్రతిమలు నయనానందంగా ఉన్నాయి.

## వేణుగోపాల స్వామి దేవాలయము

పొలాస గ్రామము మధ్యలో ఈ దేవాలయం తూర్పు ముఖమును కలిగి ఉంది. గర్భగృహము, అంతరాళముతో నున్న ఈ దేవాలయము ముందు ఒక వేదిక గలదు. కాని దానిపైన గల మంటపము నేడు కానరాదు. చాళుక్య కళారీతిలో నున్న త్రిశాఖలతో గూడిన అంతరాళ ద్వారము బహురమ్యంగా ఉంది. శాఖలకు క్రింది భాగమున నున్న ఫలకములందు గల వైష్ణవ ద్వారపాలకులకు ఇరువైపుల వింజామరలతో గూడిన అందమైన స్త్రీల రూపములు (Lady attendants with fly whisks or chowries) మలచబడినాయి. అరుదైన కేశాలంకరణ, అంగసౌష్ఠవము, ఆభరణముల భారము, ఉన్నత కుచద్వయము, వాటి మధ్యన వ్రేలాడుచున్న హారములతో నిండు యౌవ్వనము తొణకిసలాడుచున్న రమ్యమైన ఈ స్త్రీల రూపములు చూపరుల



దృష్టి నాకర్షిస్తాయి. చతుర్భుజములు గల ద్వారపాలకుల పైకుడిచేతిలో శంఖము, ఎడమచేతిలో చక్రము క్రింది కుడిహస్తము అభయ ముద్రలో నుండగా ఎడమ హస్తము నందు గద ఉంది. చామర గ్రాహిణుల కుడిచేతులు పైకెత్తి ఉండగా ఎడమచేతులు వారి తొడలపై నిలుపబడినాయి. అంతరాళ ద్వారపు లలాటమున గజలక్ష్మి చెక్కబడింది. త్రిశాఖలలో మధ్యన కుడ్య స్తంభాకారముండగా దాని కిరువైపుల పద్మలతాశిల్పములు, జంతు శిల్పముల బారులు చెక్కబడినాయి.

దేవాలయ అధిష్ఠానమందొక పట్టము కన్పట్టును. మిగిలిన భాగము భూమిలో మునిగి పోయింది. భిత్తిపై నున్న చూరు శిఖరమును వేరు చేస్తుంది. మెట్లతో గూడిన పిరమిడ్ ఆకారపు ఈ శిఖరము నాలుగు వైపుల మధ్యలో నున్న త్రిభుజాకారపు సన్నని పట్టి మెట్లను కలుపుచూ మలచబడింది. (The spire is in stepped pyramidal form with a wide tapering band in the Centre on all four sides) దేవాలయము ముందు 20' ఎత్తున్న శిలాస్తంభముపైన నాలుగు చిన్న స్తంభములతో ఒక చిన్న మంటపము (Miniature Mandapa) నిలిచి ఉంది. అందులో నుండిన గరుడ ప్రతిమ ప్రస్తుతము ప్రాంగణములో పడి ఉంది. మకుటమును ధరించి అంజలి ముద్రలో నున్న గరుడుడు తన రెక్కలతో ఎగురుచున్నట్లు మలచబడినాడు. అతనికి కుడివైపున శంఖము ఎడమ వైపున చక్రము చెక్కబడినాయి. ఈ ప్రతిమ నల్లసరపు రాయితో మలచబడింది.

వేణుగోపాల దేవాలయము చుట్టూ ఎత్తైన మట్టిగోడలున్నాయి. ఈ ఆలయ ప్రాకారము ముందున్న వీరగల్ శిల్పముపై దేవనాగరిలిపిలో చిన్న శాసనపంక్తి చెక్కబడింది. చెఱువు కట్టపై నున్న వీరగల్, పులస్త్యేశ్వర ప్రాంగణమందున్న వీరగల్, ప్రతిమలపై గూడా ఇలాంటి ఏకపంక్తి, ద్విపంక్తి శాసనములు కన్పట్టును. వేణుగోపాలాలయమునకు తూర్పున కొన్ని అడుగుల దూరంలో నున్న వేదికపై నిలువెత్తు హన్మంతుని విగ్రహములున్నాయి. దీని సమీపమున సేకరింపబడిన గణపతి ప్రతిమ ఏనుగుతలతో ద్విహస్తములను కలిగిఉంది. ఇలా గ్రామమంతటను చిత్ర శిల్పములున్నాయి.

## ఎల్లమ్మగుడి

పొలాస చెఱువుకట్ట దక్షిణ చివరిభాగములో ఏరుకలవాడకు సమీపమున ప్రాచీనమైన అనేక శిల్పాలు పడిఉన్నాయి. అచటి దేవాలయము పూర్తిగా శిథిలమై దాని స్తంభములు, పై కప్పు శిలలు చుట్టు పక్కల పడిఉన్నాయి. శిల్పములన్నియు రక్షణ లేక బాహ్య వాతావరణములో అరిగి పోయినాయి. ఇటీవల గ్రామస్థులు ఒక నూతన దేవాలయమును నిర్మించి క్రొత్త విగ్రహములు ప్రతిష్ఠించారు. చాళుక్యుల కళారీతులలో నున్న కొన్ని మూర్తిశిల్పములు బయట పడియున్న వాటిని వివరించుట ఆవశ్యకము.

1. **మహిషాసురమర్దని** :- ఇది కూర్చొనియున్న అరుదైన ప్రతిమాశిల్పము. మహిషాసురమర్దని

అష్టభుజములలో మూడు విరిగిపోయినాయి. ఆమె కుడి హస్తములందు చక్రము, ఖడ్గము, త్రిశూలములుండగా వామహస్తము లందు శంఖము, డాలు అగబడుచున్నవి. ఆమె కుడి కాలు మోకాలివద్ద మలచబడి పాదమును మహిషునిపై నిలిపింది. సాధారణమైన ఆభరణములన్నింటితో పాటు ఆమె వనమాలను ధరించిఉంది. ఆమె వాహనమైన సింహము ఆమెకు కుడివైపున వేరుగా చెక్కబడింది.

**2. భైరవుడు** :- తల వెనుక కాంతి మండలి (halo) ని కలిగి త్రిభంగములో నిలబడియున్న నగ్న ప్రతిమా శిల్పమిది. భైరవుని పైహస్తములందు డమరుకము, త్రిశూలములుండగా క్రింది హస్తములు (Lower hands) విరిగి పోయినాయి. ఈ ప్రతిమ కంటె కొంచెము చిన్నగా నున్న వేరొక భైరవశిల్పము అచటనే పడి ఉంది.

**3. పెద్ద గుండ్రాయి పై నున్న భైరవుడు :-** చతుర్భుజములతో కూడిన భైరవుడు ఒక స్థిరమైన గుండ్రాయిపై చెక్కబడి ఉన్నాడు. (The figure is carved in low relief on an immovable boulder) అతని పైహస్తములందు డమరుకము, త్రిశూలములుండగా క్రింది హస్తములలో ఒకటి అరిగిపోగా వేరొక దానిలో కపాలము ఉంది. నాభి క్రింద నున్న భాగము చాలా మట్టుకు అతిగిపోయింది.

**4. గణపతి** :- చతుర్భుజములతో కూర్చొని యున్న ఈ గణపతి తల ఛేదింపబడి ఉంది.

**5. నాగిని :-** ఈ శిల్పము ఊర్ధ్వభాగము స్త్రీరూపములో నాభి నుండి అధోభాగము సర్పరూపములో నుండి ఆమె తలపై ఐదుపడగలు ఛత్రరూపమున చెక్కబడినాయి. ఆమె తలపై మకుటము లేదు. ఆమె కుచములపై హారము వ్రేలాడుచున్నది. ఇచటనే వేరొక ప్రతిమలోని నాగిని మకుటము, కుండలములు, దండ కడియములు ధరించి రెండు చేతులందు ఖడ్గము, డాలు ధరించి ఉంది. పొలాస యందలి నాగశిల్పములు సగము మానవాకృతిలోను, మిగిలిన సగము సర్పరూపములో నుండి మహాబలిపురములోని ఏడవ శతాబ్దమునకు చెందిన సువిశాలమైన అర్జునుని తపస్సు ఫలకముపై చెక్కబడిన (A panel of penance of Arjuna at Mahabalipuram datable to 7th Century A.D.) నాగిని రూపములను పోలిఉన్నాయి[77].

ఎల్లమ్మగుడి సమీపముననే అంజలి ముద్రలో కూర్చొని ఉన్న ఒక భక్తురాలి (Female devotee) శిల్పముంది. ఆమె కుండలములు, గ్రైవేయకములు, ముంజేతి కడియములు, గాజులు ధరించి ఉంది. ఆమె కేశములు అందంగా మలచబడిఉన్నాయి. ఇద్దరు గుఱ్ఱపురౌతులు (Two Cavaliers) ఖడ్గములతో ద్వంద్వ యుద్ధము చేయుచున్న శిలాఫలకమొకటి ఇచట పడిఉంది. లోకప్పు మధ్యన వాడునటువంటి చతురస్రాకారపు శిలాఫలకము పై విరబూసిన పద్మము చెక్కబడి ఉంది. (A Central square slab of the ceiling carved with a full blown lotus). వీటితో పాటు మరికొన్ని శిథిలమైన ప్రతిమలు ఇచట పడిఉన్నాయి.



**జైన చిహ్నములు** (Jain vestiges)

పొలవాస ప్రభువులు, శైవ, వైష్ణవ మతములతో పాటు జైన మతము నాదరించి పోషించారు. నర్సంపేట తాలుకాలోని బాణాజిపేటలో మేడరాజు వీరకమల జినాలయమును కట్టించెనని అచటి క్రీ.శ. 1082 శాసనము తెలుపుతుంది. పొలాస యందున్న జైన విగ్రహములను బట్టి ఇచట కూడా ఒక జినాలయము ఉండెనని చెప్పవచ్చు.

**1. జైనప్రతిమ :-** పొలాసలోని కొలిచాల విశ్వనాథం అతని భవన నిర్మాణమునకై పునాదులు త్రవ్వుచుండగా కాయోత్సర్గరీతిలో నిలబడియున్న రెండడుగుల ఎత్తున్న అద్భుతమైన జైన ప్రతిమాశిల్పమొకటి బయల్పడింది. ఈ జైన తీర్థంకరుని వెనుక మెలికలు తిరిగిన సర్పము మలచబడలేదు. తలపై పడగలు లేకుండా ఉంగరాల జుట్టు చెక్కబడి ఉంది. చెఱువు నానుకొని ఉన్న సత్యనారాయణ దేవాలయములో నిలుపబడిన ఈ అందమైన మూర్తి శిల్పము నేడు కనిపించుటలేదు.

**2. తెల్ల గుట్టపై నున్న జైన విగ్రహము** :- పద్మాసనములో కూర్చొని యున్న జైన తీర్థంకరుని ప్రతిమాశిల్పమొకటి పులస్త్యేశ్వర దేవాలయమునకు సమీపముననే పడమట నున్న తెల్ల గుట్టపై పడి ఉంది. కాని దీని తల ఛేదింపబడింది. తలలేని ఈ తీర్థంకరుని హస్తములు ధ్యానముద్రలో ఉన్నాయి. బాగా అతిగి పోయి చెదరిపోయిన ఈ విగ్రహము వేములవాడ భీమేశ్వరాలయపు అరుగులపై నిలుపబడిన జైన విగ్రహములను బోలిఉంది.

పదకొండవ పన్నెండవ శతాబ్దములలో రాజధానిగా వెలసిన పొలవాస పట్టణము జైన, శైవ, వైష్ణవ మతముల పోషణకు గొప్ప కేంద్రంగా విరాజిల్లింది.

## 12. నంది మేడారం

కరీంనగర్‌కు ఈశాన్యము నందు గల నంది మేడారం గ్రామమును లక్షెటిపేట రహదారిపై నున్న ధర్మారం మండల కేంద్రము నుండి చేరవచ్చును. రెండు గుట్ట బోరులను కలుపుతూ నిర్మించిన పెద్ద చెఱువు కట్ట వెనుక భాగమున నున్న ఈ గ్రామమునందు రెండు శాసనములు లభ్యమైనాయి. కాకతీయుల కళారీతులలో చెక్కబడిన ఒక బృహత్ నంది విగ్రహము ఇచటనుండుటచే ఈ గ్రామము నందిమేడారంగా పిలువబడుతుంది.

శకవర్షములు 1098 దుర్మిఖి సంవత్సరము అనగా క్రీ.శ. 1175 సంవత్సరమునకు చెందిన శిథిల శాసనమొకటి (Fragmentary epigraph) గ్రామమునందు గల చిన్నకొండాల్‌రావు ఇంటిముందు నిలిచి ఉంది[78]. నాలుగువైపుల చెక్కబడిన ఈ శాసనములోని అంశములు ఒకదానికొకటి పొంతన లేకుండా ఉన్నాయి. మొదటి ప్రక్కలో బండి బ్రమ్మెనాయకుడు కేశవదేవరకు వెలిచేను వంటి భూదానములిచ్చినట్లున్నది. రెండవ ప్రక్కలో శకవర్షములు 1098 దుర్మిఖి

సంవత్సరముతో పాటు మేడరాజు త్రికూటాలయమును నిర్మించినట్లున్నది. మూడవ ప్రక్కలో శ్రీ మన్మహామండలేశ్వర కాకెత రుద్ర దేవరాజు పేర్కొనబడినాడు. ఇందులోని కాకెతపదము కాకతీయ శబ్దమును సూచిస్తుంది. నాలుగవ ప్రక్కలో ప్రోలేశ్వర, లక్ష్మీశ్వర దేవరలకు దానములిచ్చినట్లు పేర్కొనబడింది. నాలుగు ప్రక్కలందు చెక్కబడిన ఈ శిథిలశాసనమందలి అంశములలో సమన్వయము లేనందున వ్యాఖ్యానించుట కష్టము.

శాసనమందు పేర్కొనబడిన మేడరాజు పొలవాస దేశమును పాలించిన రెండవ మేడరాజై ఉంటాడు. అతడు 1175లో త్రికూటాలయము నిర్మించెనని శాసనమందున్నది. కాని అతని అధికారము క్రీ.శ. 1159 వరకే కొనసాగింది. ఎందుకనగా అదే సంవత్సరములో కాకతీయ రుద్రదేవుడతనిని మానేరునది సమీపమున జరిగిన నగునూరు యుద్ధములో నోడించి పొలవాస రాజ్యమును వశపరచుకొన్నాడు. అందువలన రెండవ మేడరాజు క్రీ.శ. 1175 వరకు పాలించినాడనుటకు వీలు లేదు. శాసనమందలి తేది స్పష్టముగా లేదు. ఎందుకనగా శిథిలమైన ఈ శాసనాంశములు చాలా వరకు అఠిగిపోయినాయి. లేదా శిల్పి తేదిని చెక్కడంలో పొరపాటు చేసి యుండవచ్చు. ఏది ఎట్లున్నను మేడరాజే త్రికూటాలయము నిర్మించెనని స్పష్టముగా శాసనమందున్నది. కావున ఈ గ్రామమందలి త్రికూటాలయము పన్నెండవ శతాబ్దపు ప్రథమార్ధభాగములో ఈ ప్రాంతమందు పరివ్యాప్తమై యున్న కళారీతులకు కాణాచిగా నిలిచి ఉంది. తరువాత కాలములో కాకతీయులు నిర్మించిన అద్భుతమైన త్రికూటాలయముల సౌందర్యము మిన్ను ముట్టింది. అట్టి అందము దీని నిర్మాణములో కానరాదు.

తేదిలేని కాకతి గణపతి చక్రవర్తి కాలపుశాసనమొకటి అమరేశ్వర దేవాలయము వద్ద నున్నది. నాలుగు ప్రక్కలందు చెక్కబడిన ఈ శిలాశాసనమందలి అక్షరములు చాలా మట్టుకు అఠిగిపోయి వివరములు తెలియుటలేదు[79]. ఈ శాసనమందు పేర్కొనబడిన గణపతిదేవునికి కుడి భుజముగా వ్యవహరించిన పల్లవుల వంశమునకు చెందిన ప్రముఖనాయకుని పేరు తెలియుట లేదు. ఇది గ్రామమందు లభ్యమైన రెండవశాసనము. త్రికూటాలయమునకు కొంతదూరములో గాండ్ల గౌరయ్య ఇంటి ముందున్న చిన్న శిలాశాసనము పురావస్తు శాఖవారి దృష్టికి వచ్చినట్లు లేదు. అది ఇంతవరకు రికార్డు చేయబడలేదు. చెఱువు కట్టపై నున్న త్రికూటాలయము వెనుక భాగాన నున్న కోట బురుజు క్రమముగా శిథిలమగుచున్నది. ఈ కోట బురుజులో ఒక సొరంగ మార్గమున్నట్లు కనిపిస్తుంది.


## త్రికూటాలయము

చెఱువు కట్టపైన తూర్పు చివరలో నున్న త్రికూట దేవాలయము ఉత్తర ముఖమును కలిగి ఉంది. తూర్పు, దక్షిణములందుండిన గర్భగృహములు మరియు మంటపమునకుత్తరమున నుండిన ప్రవేశ మంటపము (Porch) నేడు కానరావు. వాటి శిథిలములు అచటనే పడి ఉన్నాయి.



పడమటి గర్భగృహము మరియు మంటపము మాత్రము శిథిలావస్థలో నిలిచిఉన్నాయి. ఆలయ అధిష్ఠానము మరియు గోడలు సాదాగా (Simple and plain) ఉన్నాయి. పదహారు స్తంభములతో గూడిన మంటపము చుట్టూ పిట్టగోడ (Parapet wall) ఉంది. మంటపములోని తొమ్మిది విభాగములందు లోకప్పు ఉపవితాన (కదలికాకరణ) రీతిలో నుండి మధ్యలో కప్పుబడిన చతురస్రాకారపు ఫలకములు విరబూసిన పద్మములను కలిగి ఉన్నాయి. పడమట నిలిచిఉన్న ఆలయము (Western Shrine) ముందున్న పిట్టగోడలపై ఇరువైపుల చిన్న (Miniature Shrines) దేవకోష్ఠములుండుట ఈ మంటపము యొక్క ప్రత్యేకత. పిట్ట గోడలపై (Over the parapet wall) చిన్న చిన్న కోష్ఠములు (Miniature shrines) నిలుపు సంప్రదాయము రాయికల్ త్రికూటాలయములో గూడా కన్పట్టును. తరువాత కాలములో ఈ సంప్రదాయము ననుసరించి రామప్ప, చంద్రవెల్లి, కొత్తపెల్లి దేవాలయములలో కాకతీయులు ఇటువంటి చిన్న కోష్ఠములు నిలిపినారు.

పడమట నిలిచియున్న గర్భగృహము ముందు ద్వారములేని అంతరాళము మాదిరిగా అర్థమంటపము రాయికల్, వాల్గొండ త్రికూటాలయములలోని రీతులలో నిలిచి ఉంది. శివలింగము ప్రతిష్ఠింపబడిన ఈ గర్భగృహ ద్వారపు శాఖల క్రింది భాగమున శైవద్వారపాలకులు ఉన్నారు. పతంగముపైన ముందుకు చొచ్చుకొని వచ్చు చూరుచుట్టు కుండలములు లేదా కమలపు మొగ్గలు (Projecting cornice over the lintel decorated with pendants) ఝూరావళి వలె అందంగా వ్రేలాడుతున్నాయి. ఈ చూరుపై భాగమున తోరణమందు శిఖర అంతస్తులు చెక్కబడినాయి. (The turrets are sculptured on the architrave) మంటపమునకు దక్షిణమున వైష్ణవ ద్వారపాలకులతో గూడిన ద్వారపు శిథిలములు పడి ఉన్నాయి. వీటిని బట్టి దక్షిణ గర్భగృహము వైష్ణవాలయమై ఉండవచ్చు. శాసనమందు గల బండి బ్రమ్మె నాయకుడు ఇందులోని కేశవదేవరకు దానములిచ్చి ఉంటాడు. తూర్పున నుండిన గర్భగృహపు వివరములు తెలియుటలేదు. చాళుక్యుల కళారీతిలో నున్న నంది మంటపమందు నిలుప బడి ఉంది.



త్రికూటాలయము

## అమరేశ్వర దేవాలయము


చెఱువు కట్టపైన పడమటి చివరలో గర్భగృహము, అంతరాళముతో గూడిన అమరేశ్వరాలయము నేటికి పూజలందుకొనుచున్నది. ఆలయ మంటపము శిథిలమై అదృశ్యమైంది. ఆలయ శిఖరము పిరమిడ్ రూపము (Stepped pyramidal form) లో ఉంది. పైన కలశం కనిపిస్తుంది. చతురస్రాకార శిఖరమునకు నాలుగు వైపుల సింహముద్రికలున్నాయి. త్రిశాఖలతో గూడిన గర్భగృహ ద్వారపు క్రింది భాగమున 2' x 2' కొలతలతో నున్న ఫలకములపై శైవద్వారపాలకులు అందముగా మలచబడినారు. ఈ ద్వారపాలకుల కిరువైపుల అందమైన అంగ సౌష్ఠవమున్న చామర ధారిణులు చెక్కబడినారు. చాళుక్య రీతులలో నున్న నంది మరియు పెక్కు నాగశిల్పములు ఈ ఆలయమందు చూడవచ్చు.

## నంది ముందున్న దేవాలయము

గ్రామము మధ్యలోనున్న పెద్ద నంది ముందుండిన దేవాలయము శిథిలమై అదృశ్యమై కేవలము విశాలవేదిక మాత్రము మిగిలి ఉంది. ఈ వేదికపై ఆనాటి శిలాస్తంభమొకటి నేటికి నిలిచి ఉంది. లింగముతో గూడిన పానవట్టము, నాగినిప్రతిమ, గణపతి, సప్తమాతృకల శిథిల ఫలకము, మున్నగు శిల్పములు ఈ వేదికపై సమీకరింపబడి ఉన్నాయి.



బృహత్ నంది



నాగకన్య

### బృహత్ నంది

వేదిక (Platform) ముందు కాకతీయుల కళారీతులుట్టిపడు రమ్యమైన బృహత్ నంది విగ్రహమొకటి శిలాపీఠము (pedestal) పై మలచబడిఉంది. ఇది కరీంనగరము జిల్లాలోనే అతి పెద్ద నంది విగ్రహము. అద్భుతమైన అందమైన ఈ నంది హనుమకొండ వేయి స్తంభాల గుడి ముందున్న నందిని బోలియున్నది. పరిమాణములో నిర్మాణములో ఇవి దాదాపు సమానముగా ఉంటాయి. ఇచటి నంది 8 అడుగుల పొడువు 5 అడుగుల ఎత్తుండగా హనుమకొండలోని నంది $7^1/_2$ అడుగుల పొడువు 5'-8" ఎత్తును కలిగిఉంది. పొడువులో ఇచటి నంది ఆరు



అంగుళములు ఎక్కువగా నుండగా హనుమకొండలోని నంది ఎనిమిది అంగుళములు దీనికంటె ఎక్కువ ఎత్తును కలిగిఉంది. ఇచటి నంది లలాటము (Fore head) కంఠము (Neck) అనేక హారములతో ఆభరణములతో అలంకరింపబడినాయి. మెడ నుండి ఒకదాని క్రిందనొకటి రెండు గంటలు (Bells) వ్రేలాడుతున్నాయి. క్రింది గంట పైదాని కంటే పెద్దగా ఉంది. నంది పాదములు గూడా ఆభరణములచే అలంకరింపబడినాయి. నంది దేహమంతటను గల చిన్న గంటల హారములు, మువ్వల మరియు గజ్జెల హారములు, శిల్ప ఔన్నత్యమును చాటును. ఈ నంది సజీవముగా నున్నట్లు మలచబడుట విశేషం. జీవచైతన్య ముట్టిపడునట్లు ఈ నందిని మలచిన శిల్పి తన శిల్పకళ యందు పరాకాష్ఠను పొందినాడనుటలో అతిశయోక్తి లేదు. ఈ నంది నితంబముల (Rumps) ను చుట్టుచూ దేహమంతటను పరివ్యాప్తమై యున్న అతి సూక్ష్మమైన ప్రశస్తమైన చెక్కడములతో నున్న హారము (Festooned rump garland) కాకతీయ శిల్పకళావైభవమును చాటుతుంది[80].

**నాగకన్య** :- నాలుగు అడుగుల ఎత్తు, రెండున్నర అడుగుల వెడల్పున్న శిలాఫలకముపై మలచబడిన ఈ నాగకన్య ప్రతిమ కరీంనగర్ జిల్లాలో అన్నింటికంటె పెద్దది, రమ్యమైంది. ఈ శిల్పము ఊర్ధ్వభాగము స్త్రీ రూపములోను, నాభినుండి అధోభాగము సర్పరూపములో నుండి ఆమె తలపై అనేక పడగలు (Multi-hooded canopy) ఛత్రము వలె మనోహరంగా చెక్కబడినాయి. ఈ సుందర నాగకన్య నడుము సన్నముగా నుండి ఆమె కుచముల మధ్య హారము వ్రేలాడుచున్నది. ఆమె వామహస్తమందు డాలు, దక్షిణహస్తమందు ఖడ్గము ఉన్నాయి. ఆమె మకుటము, కుండలములు, గ్రైవేయకములు, కటిబంధము మున్నగు ఆభరణములను ధరించిఉంది. ఆమె కిరువైపుల పడగలతో గూడిన మెలికలు తిరిగిన నాగసర్పములు చెక్కబడినాయి. ప్రస్తుతమీ ప్రతిమ అమరేశ్వరాలయము ముందు నిలుపబడి ఉంది.


**గణపతి** :- మకుటములేని ఏనుగుతల గలిగిన ద్విహస్తముల గణపతి యొక్క తొండము కొన అతని దక్షిణ హస్తమందున్న మోదకములపై నిలుపబడింది. అతని వామహస్తములో దంతమున్నది.

## 13. రాయికల్

కరీంనగర్‌కు వాయువ్యమందు 70 కి.మీ. దూరములో నున్న పెద్దగ్రామము రాయికల్ నేడొక మండలకేంద్రము. జగిత్యాలకు 20 కి.మీ. దూరములో నున్న ఈ గ్రామమును బసు ద్వారా జేరవచ్చు. రాయికల్ చెఱువునకు తూర్పున సమీపమందే గల గుడికోటలో చాళుక్యుల శిల్ప కళారీతులలో నిర్మింపబడిన త్రికూటాలయము పదకొండవ శతాబ్దమునకు చెందినదై యుండును. దీనినిప్పుడు పంచముఖ లింగేశ్వర కేశవనాథ దేవాలయముగా పిలుస్తున్నారు. ఈ గుడి ఒకప్పుడు కోటలో నుండుట వలన ఈ ప్రదేశము ఇప్పటికిని గుడికోటయని పిలువబడుతుంది. ప్రాచీనకోట చిహ్నములు, కూలుచున్న మట్టి ప్రాకారములు నేటికి

కనిపిస్తున్నాయి. 1980లో ప్రభుత్వము దేవాలయ పునరుద్ధరణ కార్యక్రమము చేపట్టింది. ఆలయమందలి శిల్పములను బయటకు తరలించారు. రెండు దశాబ్దములు గడిచినను జీర్ణోద్ధరణ జరుగలేదని స్థానికులు వాపోవుచున్నారు. ఈ దేవాలయ ప్రాంగణమందున్న క్రీ.శ. 1305 తెలుగు శిథిల శిలాశాసనమును పురావస్తుశాఖ రికార్డ్ చేసి ప్రకటించినట్లుగా కనిపించుటలేదు. మూడు వైపుల చెక్కబడిన ఈ శిలాశాసన శీర్షమున నంది చెక్కబడిఉంది.


స్వస్తిశ్రీ శకవర్షములు 1227 (క్రీ.శ. 1305) శ్రీ మన్మహామండలేశ్వర కాకతీయ ప్రతాపరుద్ర దేవ మహారాజు సుఖసంగాత వినోదమున పృథ్వీరాజ్యము చేయుచుండగా విశ్వావసు సంవత్సర శ్రావణ బహుళ ద్వాదశి వడ్డవారమున ఒకానొక రెడ్డి (పేరు తెలియుటలేదు) కొడుకు రుద్రదేవని గారు రావికంటి రామనాథదేవరకు, లకుమేశ్వర దేవరకు అంగరంగ వైభోగములకుగాను దొనులకాలువ వద్ద 5 మఱుర్లు, బుడిమలగటులో 5 మఱుర్లు మొత్తము పది మఱుర్ల నేలను దానముగా నొసంగినట్లు ఈ అముద్రిత తెలుగు శాసనమందు పేర్కొనబడింది [81]. కోమట్లు (వైశ్యులు) అష్టాదశప్రజలు ఈ శాసనమందు పేర్కొనబడుట విశేషము. ఈ శాసనమందు గ్రామనామము రవికంటి లేదా రావికంటి యని పేర్కొనబడింది. వృద్ధులు ఇప్పటికిని ఈ గ్రామమును రావికంటి లేదా రాయికంటి అని పిలుస్తారు. ఆనాటి రావికంటియే నేడు రాయికల్‌గా మారడము గమనార్హము. రవికంటి యనగా సూర్యుని కన్ను అని అర్థము. ఈ ప్రాంతమున సౌరపూజ పరివ్యాప్తమై యుండెననుటకు త్రికూటాలయములోని ఒక ఆలయము సూర్యదేవరకు అంకితము చేయబడుటయే ప్రబల నిదర్శనము. అంతేగాకుండా ఈ గ్రామమందు ఒక సూర్య శిల్పము లభ్యమైంది. సూర్యుని కన్నుగా భావింపబడిన రవికంటి క్రమముగా రాయికంటి, నేడు రాయికల్‌గా మారింది.



అధిష్ఠాన వివరములు



కేశవుడు, దేవి



స్తంభము

ఆలయ ప్రాంగణమందున్న ఒక వీరగల్ ప్రతిమపై పదకొండవ పన్నెండవ శతాబ్దములకు చెందిన దేవనాగరి లిపిలో 'శ్రీమతు విక్రమ సంవత్సర' పదములు మాత్రమే కనిపిస్తున్నాయి. [82] బహుశః ఈ దేవనాగరి లిపి గణపతి దేవ చక్రవర్తి కాలముదై ఉండును.



## క్రీ.శ. 1305 అముద్రిత శాసనము, రాయికల్.

**మొదటిప్రక్క**

1. స్వస్తిశ్రీ శకవరుషాలు
2. 1227 స్వస్తిశ్రీ
3. మన్మహా మండలేశ్వర
4. కాకతీయ ప్రతాప
5. రుద్రదేవ మహా
6. రాజులు సుఖసంగ
7. తా వినోదాన పృథివి
8. రాజ్యము చేయు
9. చుండగాను విశ్వావసు
10. సంవత్సర శ్రావణ
11. బహుళ 12 వడ్డవా
12. !రాన స్వస్తి! శ్రీమతు
13. ..................... తొలి
14. రెండి కొడుకు రుద్ర
15. దేవనిగారు రావికం
16. టి రామనాథ దే
17. వరకు

**రెండవ ప్రక్క**

1. లఖుమేస్వ
2. ర దేవరకు
3. ను అంగభో
4. గానకును
5. రంగ భోగాన
6. కునుదొనుల
7. కాలువ మ-5
8. బుడిమల
9. గటులో-5
10. వెరిసిపది
11. మర్తురును
12. దారవోసి స్వస్తి శ్రీమతు
13. బెజగంగూలె (శిలవిరిగింది)
14. కగారును రా
15. వికంటి ! ప్రోలు !

**మూడవ ప్రక్క**

1. ................ కోమట్లకు
2. మణి .............. అష్టాదశ! ప్రజలు!
3. కు.................. లకు
4. దేవరలు యజమా
5. అంగభోగానకు దేవ
6. యము మాడపా (దుక)
7. లెఖను దార వోసిరి
8. స్వదత్తం ద్విగుణం పుణ్యం
9. పరదత్తను పాలనం ప
10. రదత్తా పహరణ స్వద
11. త్తం నిష్ఫలం భవేతు (శిలవిరిగింది)
12. షష్టిర్వరుష సహ
13. స్రాణి విష్టాయాం జా
14. యతే క్రిమిః ।

## త్రికూటాలయము

రాయికల్ గ్రామమందలి గుడికోటలో గల ఈ త్రికూటాలయము దక్షిణ ముఖమును కలిగి యుండుట అరుదైన విషయము. తూర్పు, పడమర, ఉత్తరములందు గర్భగృహములున్నాయి. దక్షిణమున సోపానములపై నిర్మించిన చిన్నప్రవేశ మంటపము (Portico Projecting to the

south) శిథిలమైంది. దేవాలయ అధిష్ఠానమందు, ఉపానము, విశాలపట్టిక, జగతి, కుముదము, వేదిక ఉన్నాయి. భిత్తిని (Wall) రెండు వరుసల కపోతము (Cornice in two tiers) శిఖరములను వేరు చేయుచున్నది. దేవాలయ కుడ్యములు కోష్ఠములు లేకుండా సాదాగా ఉన్నాయి. మూడు ఆలయముల నిర్మాణము ఒకే విధముగా ఉంది. వాటిపై నాగరరీతిలో (Nagara type) నున్న పొడుగైన శిఖరములు చాపరేఖాకృతిలో (Curvilinear spires) నుండి ఆమలకములచే కప్పబడినాయి. వాటిపై శిలాకలశములున్నాయి. చాళుక్య కళారీతులలో నున్న ఈ శిఖరములు అలంపురము, మహానంది, సత్యవోలు ఆలయముల శిఖరములను బోలిఉన్నాయి. రాయికల్ త్రికూటాలయ శిఖరముల ముందున్న శుకనాసములు చాళుక్య సంప్రదాయమునకు చిహ్నములు. ఈ శుకనాసములు ఖాళీగా ఉన్నాయి.

దక్షిణ దిశయందున్న సోపానముల ద్వారా ముఖమంటపము లేదా రంగ మంటపమును ప్రవేశింపవచ్చు. నాలుగు మధ్యస్తంభముల (Central pillars) తో గూడిన ఈ మంటపము 24 అడుగుల చతురస్రము. దీనిచుట్టున్న పిట్టగోడ (Parapet wall) పై కక్షాసనములున్నాయి. ఈ కక్షాసనముల అగ్రభాగము కొంత వంపుగా (Slight-Slant) మలచబడింది. పశ్చిమ చాళుక్యుల దేవాలయములలో వలె పిట్టగోడ లోపలి వైపు క్రింది భాగమున పద్మశిల్ప ముద్రికలున్నాయి. మధ్యస్తంభములపై విష్ణు అవతారములైన మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ రూపములు చెక్కబడినాయి. మంటపమందలి లోకప్పు మొత్తము తొమ్మిది విభాగములందు (Nine Compartments of the ceiling) ఉపవితాన (కదలికాకరణ) రీతిలో త్రికోణపు శిలలతో సుందరముగా నిలిచి ఉంది. దూలముల క్రింది ముఖము లందు బహుదళ పద్మములు (Multi-petalled lotuses carved on the bottom faces of the lintels) చూడ ముచ్చటగానున్నాయి.

మూడు గర్భగృహములు ఏకరూపములో నున్న 8'-4" చతురస్రాకారములు. వాటి ముందు 8'.4"x8' కొలతలతో అర్థమంటపములున్నాయి. అంతరాళము లాంటి అర్థమంటపములకు ద్వారములు లేవు. గర్భగృహముల ద్వారములు రత్న, లతపత్ర, కుడ్యస్తంభ, పద్మ, పత్ర అను పంచశాఖలతో శిల్ప సౌందర్యమును చాటుతున్నాయి[83]. ద్వార లలాటములందు గజలక్ష్మి చెక్కబడింది. ద్వారముల పతంగములపైన (Above the lintels) ముందుకు చొచ్చుకొని వచ్చు (Projecting cornice) చూరు ఉంది. ద్వారపు శాఖల క్రింది భాగమందున్న చతురస్రాకార ఫలకములపై ద్వారపాలకులు మలచబడినారు. ద్వారములముందు శంఖనిధి, పద్మనిధి గల నున్నటి చంద్రశిలలున్నాయి. గర్భగృహ ద్వారములకిరువైపుల అర్థమంటపములందు కూర్చొనియున్న చిన్న ఏనుగుల శిల్పములున్నాయి. అర్థమంటపముల, గర్భగృహముల లోకప్పు ఉపవితాన (కదలికాకరణ) రీతిలో ఉంది.


పడమటి గర్భగృహము ముందు గల పిట్టగోడపై ఇరువైపుల రెండు దేవకోష్ఠములు (Miniature shrines or Niches) ఉండుటవలన ఇది మిగిలిన రెండింటి కంటే ప్రధానమైందని



తెలుస్తుంది. ఇది తూర్పు ముఖమును కలిగియుండుట వలన శ్రేష్ఠమైనదిగా భావింపబడుతుంది. ఇందున్న అరుదైన పంచముఖ లింగేశ్వరస్వామి శిల్పము భారతదేశములో ఒక కాశీయందు తప్ప మరెచ్చటను లేదని ప్రతీతి. ఈ గర్భగృహద్వారపు శాఖల క్రింద నున్న శైవద్వారపాలకుల కిరువైపుల వింజామరలతో గూడిన స్త్రీ పురుష రూపములు రమ్యముగా మలచబడినాయి. ఈ రూపములలో మానవాకృతిలో వృషభాననమును కలిగిన నందీశ్వరుడు గూడా ఉన్నాడు.

ఉత్తర గర్భగృహ ద్వారపు శాఖల క్రిందనున్న ఫలకములపై వైష్ణవ ద్వారపాలకులు మలచబడి వారికిరువైపుల అందమైన స్త్రీ పురుష రూపములు వింజామరలతో చెక్కబడినాయి. ఇందు కేశవనాథుడు ప్రతిష్ఠింపబడినాడు.

తూర్పు గర్భగృహము సూర్యదేవరకు అంకితము చేయబడింది. దీని ద్వారపు శాఖల క్రింద నున్న ఫలకములందు మలచబడిన ద్వారపాలకుల నాలుగు హస్తములందు కాడతో గూడిన కమలపు మొగ్గ (Lotus bud) ధనుస్సు, నాగసర్పము, గద ఉన్నాయి. ద్వారపాలకుల చతుర్భుజములలోని ఒక హస్తమందు కమలపు మొగ్గ యుండుట వలన ఇది కమలబాంధవుడైన సూర్యుని ఆలయమని చెప్పవచ్చు. గ్రామములో లభ్యమైన సూర్య విగ్రహము ఈ విషయమును ధృవపరుస్తుంది. ద్వారపాలకులకిరువైపుల అందమైన చామర ధారిణిలు మలచబడినారు. హనుమకొండలోని వేయిస్తంభాలగుడి యందున్న శైవ, వైష్ణవ, సౌర మూడు ఆలయముల మాదిరిగా రాయికల్ త్రికూటాలయమందు గూడా అదే వ్యవస్థ కన్పట్టుట గమనార్హము.



త్రికూటాలయము – పంచముఖ లింగేశ్వరాలయం

చాళుక్యుల శిల్ప కళారీతులను బట్టి రాయికల్ త్రికూటాలయము 11వ శతాబ్దమునకు చెందినదై యుండును. దాన శాసనము మాత్రము క్రీ.శ. 1305లో వేయబడింది. ఆలయ జీర్ణోద్ధరణకై ప్రతిమాశిల్పములన్నియు బయట నిలుపబడినాయి.

**పంచముఖ లింగము** :- ప్రస్తుతమిది పడమటి గర్భగృహమందు ఎప్పటి మాదిరిగా తిరిగి నిలుపబడింది. ఒకే ఫలకముపై మధ్యనున్న శివ లింగమునకు నాలుగు మూలలందు నాలుగు లింగములు చెక్కబడినాయి. ఒకే శిలాఫలకముపై ఐదు లింగములుండుట వలన పంచముఖ లింగేశ్వరస్వామిగా పిలువబడుచున్నాడు.

**కేశవనాథుడు** :- నల్లరాయితో మలచబడిన ఈ వైష్ణవ ప్రతిమలో కేశవుడు సమభంగములో సమపాదములో చతుర్భుజములతో నిలబడియున్నాడు. పైనున్న దక్షిణ హస్తమందు శంఖము, వామహస్తమందు చక్రము, క్రింది వామ హస్తములో గద, పద్మముతో గూడిన దక్షిణ హస్తము అభయముద్రలో మలచబడింది. కేశవునికి కుడివైపున అంజలిముద్రలో వినమ్రుడైన గరుడుడుండగా ఎడమవైపున స్త్రీ రూపము చెక్కబడింది. కేశవుని హస్తములందు ఏ వరుసలో ఎట్టి చిహ్నములుండవలెనో (Attributes in four hands) 'రూపమండాన'మను శిల్పాగమము నందు పేర్కొనినట్లుగా ఇచటి కేశవుని హస్తములందు అదే వరుసలో చిహ్నములు చెక్కబడిఉన్నాయి[84].

**దేవి :-** ఎడమకాలు మలచుకొని, నేలపై నిలిపిన కుడికాలుతో, కూర్చొనియున్న దేవతా ప్రతిమ ఇది. ఆమె వామహస్తమందు గిన్నె (Bowl) యుండగా దక్షిణ హస్తము ఛేదింపబడింది. బహుశః అందులో ఖడ్గముండి యుండును. ఇది నల్లరాతితో మలచబడిన విగ్రహము.

**సూర్యుడు** :- పైకెత్తిన ద్విహస్తములందు పద్మములున్న చిన్నసూర్య ప్రతిమ ఇది. ఆగమశాస్త్రములందు తెలిపిన రీతిలో పద్మములు భుజములకంటె ఎత్తున మలచబడినాయి. (The Lotuses rise above the shoulders). కిరీటమకుటమున్న సూర్యుడు గ్రైవేయకము, హారము, కటిబంధము, వనమాల, కాలికడియములు (Anklets) పాదములకు నూపురములు మున్నగు ఆభరణాలంకారములతో శోభిల్లు చున్నాడు. త్రికూటాలయములోని తూర్పు గర్భగృహ మందుండిన ఈ సూర్య విగ్రహము ప్రస్తుతము గ్రామమునకు దక్షిణమందున్న భీమన్న గుడి వద్ద నిలుపబడిఉంది. ఇలాంటి సూర్యవిగ్రహములు రేణిగుంట సమీపమున గుడిమల్లామ్‌లో గల పరశురామేశ్వరాలయమందు [85], మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపురం దేవాలయములందు చూడవచ్చు[86].


## 14. వాల్గొండ

కరీంనగర్‌కు వాయువ్యమున 110 కి.మీ. దూరమున మల్లాపురం మండలంలో గోదావరి నది దక్షిణతీరమందున్న గ్రామమే వాల్గొండ. మెటుపెల్లి నుండి 27 కి.మీ. దూరమున నున్న ఈ గ్రామమును బసుద్వారా జేరవచ్చు. గోదావరి ఒడ్డున నున్న కొండ (Hillock) గ్రామము వైపు వాలుగా (Slope) నుండుట వలన వాల్గొండగా పిలువబడియుండును. గోదావరి తీరమందున్న ఈ గుట్టబోరు (Hillock) పైననే చెక్కుచెదరని త్రికూటాలయముంది. చాళుక్యుల కళారీతులలో



నున్న ఈ త్రికూటాలయము అదేకాలమునకు చెందిన రాయికల్ లోని త్రికూటాలయమును బోలి దాని ప్రతిబింబము వలెనున్నది. ఈ దేవాలయ పరిసరములందున్న ప్రకృతి సిద్ధమైన మనోహర దృశ్యములు సందర్శకుల కంటికి ఇంపుగా ఉంటాయి. వడిగా పరుగులు దీయుచు, గర్జించుచు ఉద్ధృతంగా ప్రవహించు గోదావరి తటమున ఈ ప్రదేశము, అందమైన గుట్టలు, పంట చేలు, పొలాలు, పక్షుల కిలకిలారావములతో ఎంతో రమ్యంగా ఉంటుంది. ఆహ్లాదకరమైన వాతావరణముతో కూడిన ఈ ప్రాంతము వనభోజనములకు (Picnic Spot) మిగుల ఉపయుక్తముగా నుండుననుటలో ఏ మాత్రము సందేహము లేదు.

ఇచటి దేవాలయ ప్రాంగణములో శాసనమునకై ఉద్దేశింపబడిన శిలాఫలకమొకటున్నది. దీనిపై భాగమున సూర్యుడు, నెలవంక రూపములో చంద్రుడు, ఖడ్గము మున్నగు తదితర అస్పష్ట చిహ్నములు చెక్కబడినాయి. కాని ఏ కారణము చేతనో శాసనము చెక్కుట జరుగలేదు. వ్రాతలేని ఫలకము అచటనే పడిఉంది. రాయికల్ త్రికూటాలయ శిఖరములవలె ఇచటి మూడు శిఖరములు గూడా నాగరరీతిలో చాపరేఖాకృతిని (Curvilinear) కలిగి ఉన్నాయి. శిఖరముల ముందు చాళుక్య సంప్రదాయములో శుకనాసములున్నాయి. కాని వాటిలో ఎలాంటి దేవతా ప్రతిమలులేవు.



త్రికూటాలయము

ఇచటి త్రికూటాలయము చుట్టు గల రాతి ప్రాకారమునకు ఉత్తర దక్షిణములందు ప్రవేశములున్నాయి. ఈ రాతిగోడ శిథిలమగుచున్నది. ఉత్తరమున నున్న సోపానముల ద్వారా 20' అడుగుల చతురప్రాకారములో నున్న ముఖమంటపమును ప్రవేశింపవచ్చు. దక్షిణ, పడమట, తూర్పు దిశలందు గర్భగృహములుండి వాటి ముందు అర్ధమంటపములున్నాయి. ఉత్తర ముఖమును కలిగిన ఈ దేవాలయము నుండి గోదావరినది ప్రవహిస్తుంది. గోదావరిలోని యిసుక తిన్నెల నుండి దాదాపు 50 మెట్లెక్కినచో ఎత్తుననున్న ఈ దేవాలయ ప్రాంగణమును జేరవచ్చు. అచటి నుండి తిలకించినచో ప్రకృతి మిక్కిలి మనోహరంగా ఉంటుంది.

ఈ త్రికూటాలయ అధిష్ఠానము మలుపులు లేకుండా సాదాగా (Plain and Simple) ఉంది. దీనిపై ఆరు అడుగుల ఎత్తు వరకున్న భిత్తిని రెండు వరుసలలో నున్న కపోతము శిఖరముల నుండి వేరుచేస్తుంది. సోపానములకు ఎదురుగా నున్న దక్షిణ గర్భగృహము వైష్ణవాలయము. ప్రస్తుత మిందులో సీతారామలక్ష్మణుల ప్రతిమలు పూజలందుకొంటున్నాయి. తూర్పు గర్భగృహమందు లింగరూపమున నున్న రాజేశ్వరస్వామి, పడమటి గర్భగృహమందు అదే లింగ రూపములో నున్న రామలింగేశ్వరస్వామి ప్రతిష్ఠింపబడిఉన్నారు. మంటపములోని నాలుగు మధ్య స్తంభముల నడుమ ఒక అంగుళము ఎత్తున్న చతురస్రాకారముపై మరల వృత్తాకారములో రంగశిల బహురమ్యంగా ఉంది. మంటపము చుట్టు పిట్టగోడ ఉండి ఉత్తరమున ప్రవేశమంటపము (Porch) ఉంది. రాయికల్ ముఖమంటపము 24' అడుగుల చతురస్రాకారములోనుండగా ఇక్కడి మంటపము నాలుగు అడుగుల తక్కువతో 20' అడుగుల చతురస్రాకారములో నుండుట గమనార్హము.

దేవాలయ ప్రవేశమున కిరువైపుల 5' అడుగుల ఎత్తున్న చతుర్భుజశైవ ద్వారపాలకుల ప్రతిమలు నిలుపబడినాయి. పై రెండు హస్తములందు డమరుకము, త్రిశూలములుండగా క్రింది వామహస్తమందు గద, దక్షిణ హస్తము అభయముద్రలో మలచబడినాయి. మంటపము పైకప్పు చుట్టున్న పెద్దచూరు వర్షపునీరు సులభముగా క్రింద పడుటకు కొంత వాలు (Big eave cornice with slight slant) కలిగి ఉంది. నాగరరీతి (Nagara Style) లో నున్న ఎత్తైన శిఖరములు ఆమలకములచే కప్పబడినాయి. శిల్పకలశములీ ఆమలకములపై నిలుపబడినాయి. ఈ శిఖరముల ముందు శుకనాసములున్నాయి.

ఆలయప్రాంగణములో 25' అడుగుల ఎత్తున్న గరుడ స్తంభముంది. ఈ స్తంభముపై నుండిన చిన్నమంటపము, దానిలోని చిన్నగరుడ ప్రతిమ నేడగబడుట లేదు. దీని వలెనే నుండిన రెండు నంది స్తంభములు ఆవరణలో పడిఉన్నాయి. ప్రాంగణములో భైరవ, గరుడ, వైష్ణవ ఆళ్వారుల మున్నగు విగ్రహములు పడిఉన్నాయి. చాళుక్యుల శిల్ప కళారీతులలో నున్న ఇచటి త్రికూటాలయము పదకొండవ శతాబ్దమునకు చెందినదని చెప్పవచ్చు.

## 15. మల్లన్నపేట

కరీంనగర్‌కు ఉత్తరమున 62 కి.మీ. దూరములో నున్న మల్లన్నపేట ఒక కుగ్రామము. ఇది తిర్మలాపురం గ్రామము యొక్క హ్యామ్లెట్ (Hamlet) లేదా చిన్నపల్లెటూరు. గొల్లపెల్లి మండలంలో నున్న ఈ గ్రామము జగిత్యాలకు తూర్పున 12 కి.మీ. దూరములో ఉంది. ఇచటి మల్లికార్జున దేవాలయమును స్థానికంగా మల్లన్నగుడి అంటారు. ఈ దేవాలయమందు లింగరూపమున నున్న పరమశివుని గొల్లవారు, కురుమవారు మల్లన్నగా కొలుస్తారు. మల్లన్న గుడి యున్న ఈ ఊరును మల్లన్నపేట అంటారు. చాళుక్య శిల్పకళారీతులలో నున్న ఈ




దేవాలయము పొలవాస రాజులచే పదకొండవ శతాబ్దము లేదా పన్నెండవ శతాబ్దపు ప్రథమార్థకాలమందు నిర్మింపబడి ఉంటుంది. ఆశ్చర్యకరమైన విషయమేమనగా ఇది ఒక అద్భుతమైన అరుదైన ద్వితల లేదా రెండంతస్తుల (Two storeyed) దేవాలయము. పదకొండవ, పన్నెండవ శతాబ్దములలో రాజధానిగా విరాజిల్లిన పొలవాస పట్టణమునకు తూర్పున ఈ గ్రామము కేవలము 5 కి.మీ. దూరంలో ఉంది. పొలవాస రాజుల తరువాత ఈ ప్రాంతము కాకతీయుల అధీనమై 15వ, 16వ శతాబ్దములలో స్థానిక వెలమదొరల వశమైంది. 18వ శతాబ్దములో వెలమలు ఈ దేవాలయమును పొలాసలోని తమ్మడి వారి హస్తగతము జేశారు. ఆనాటి నుండి నేటి వరకు తమ్మడివారే ఈ దేవాలయ పూజారులుగా కొనసాగుచున్నారు. తొలికాలపు శాసనములేవి లభ్యము కాకపోయినను క్రీ.శ. 1753లో వెలమదొర వేయించిన శాసనమొకటి దేవాలయ మందుంది[87]. స్వస్తిశ్రీ శాలివాహన శకవర్షము 1675 భావనామ సంవత్సర మాఘ శుద్ధ విదియ గురువారము రోజున రాజశ్రీ జూపూడి ధర్మారావు దేశముఖ్, పర్గణ పొలాస నివాసియగు తమ్మడి కులమునకు చెందిన వెన్నజియ్యకు పన్నెండు కుంచాల వడ్ల పడుబాటు పొలమును దానముగా ఇచ్చాడు. అందుకుగాను అతడు పూదోటను వేసి నిరంతరం తిర్మలాపురంలోని మల్లన్న దేవునకు పూలతో పూజ చేయవలెననియు, అతని పుత్ర, పౌత్ర పారంపర్యముగా దేవుని పూజ చేయుచు దానమిచ్చిన భూమిలోని పంట ఫలమునుభవించ వలెననియు ఈ శాసనమందు పేర్కొనబడింది. దాదాపు రెండు శతాబ్దముల పూర్వము కూలిపోయిన దేవాలయమంటప ఆగ్నేయభాగమును స్థానికులు ఇటీవల మరమ్మతు చేయించి పూర్వమువలె నిలుపుట ప్రశంసనీయము.

### మల్లన్నదేవాలయము

మల్లన్న లేదా మల్లికార్జున దేవాలయము గర్భగృహము, అంతరాళము, 16 స్తంభముల ముఖమంటపముతో కూడుకొని తూర్పు ముఖమును కలిగిఉంది. అధిష్ఠానము భూమిలో మునిగిపోవుట వలన ఆలయపు భిత్తి మాత్రమే కనబడుతుంది. అసాధారణరీతిలో ఇది ద్వితల లేదా రెండంతస్తుల దేవాలయము. జిల్లాలోనే ఇది అరుదైన కట్టడం. భిత్తిపైనున్న కపోతము అర్థచంద్రగోళాకారములతో శోభిల్లుచున్నది. గర్భగృహము పైన 6' అడుగుల చతురస్రాకారములో ఇంకొక గర్భగృహనిర్మాణముండుట విశేషం. ప్రస్తుతమందులో ఏ దేవతా ప్రతిమలేదు. పై అంతస్తు నందున్న గర్భగృహము చుట్టు ప్రదక్షిణా పథము ఉంది. రెండవ అంతస్తునందు 12 స్తంభములపై నిలిచియున్న లోకప్పు (Ceiling) చదునుగా (Flat) ఉంది. పై అంతస్తులో నున్న గర్భగృహముపై పిరమిడ్ ఆకారపు (Stepped pyramidal form) శిఖరముంది. శిఖరము చివరలో నున్న చతురస్రాకార ఫలకముపై కలశముంది. శిఖరపు నాలుగు వైపుల మధ్యలో ఒక విశాలపట్టి (A wide tapering band) తో చొప్పదండిలో వలె మెట్లన్నియూ కలుపబడినాయి.

ముఖమంటపము 31' అడుగుల చతురస్రాకార నిర్మాణము. దాని చుట్టున్న పిట్టగోడలపై కక్షాసనాలున్నాయి. తూర్పు,ఉత్తర, దక్షిణముల నుండి మంటపములోనికి ప్రవేశింపవచ్చు. మంటపము మధ్యనున్న నాలుగు స్తంభములు 8' అడుగులు ఎత్తు 2'-2" వెడల్పుతో అతి పెద్దగాను లావుగాను ఉండి వాటిపైన వృత్తాకార కుడం, ఫలకములుండుట (Huge circular brackets) విశేషం. మంటపము యొక్క లోకప్పు చదునుగా ఉంది. అంతరాళ ద్వారమున కిరువైపుల ఒకదానికొకటి అడ్డముగా నిలుపుకొనిన కాళ్లతో (Cross-legged) నున్న ద్వారపాలకుల ఎడమచేతిలో గద యుండి నాగసర్పముతో గూడిన దక్షిణ హస్తము అభయముద్రలో ఉంది. వీరికి కొంత దూరములో రెండు వైపుల వేరొక ద్వారపాలకుల జత చతుర్భుజములతో కాళ్లు అడ్డముగా పెట్టి నిలిచియున్నారు. వీరి పైహస్తములందు డమరుకము, త్రిశూలము, క్రింది హస్తములందు గద, నాగసర్పము మలచబడినాయి. వీరి తలలపై నాగ సర్పపడగల గొడుగులున్నాయి.



రెండంతస్తుల మల్లన్న దేవాలయం

అంతరాళము 9'-6" x 11'-6" కొలతలతో నుండి ఉత్తర, దక్షిణములందు దేవకోష్ఠములను (Niches) కలిగి ఉంది. గర్భగృహము 14 అడుగుల చతురస్రాకారములో ఉంది. తొలిచాళుక్యుల కళా సంప్రదాయ రీతులలో ఇచట గర్భగృహము లోపల నాలుగు మూలలందు నాలుగు స్తంభములు నిలిచి ఉన్నాయి. స్తంభములు మరియు గోడల మధ్య నున్న స్థలము ప్రదక్షిణా పథముగా నుపయోగపడుతుంది[88]. గర్భగృహములోపల నాలుగు మూలలందు నాలుగు స్తంభములుండి గర్భగృహము లోపలనే దైవము చుట్టు ప్రదక్షిణ చేయుటకు వీలున్న వ్యవస్థ వేములవాడ, అలంపురం, మహానంది మున్నగు ప్రదేశములందు గల చాళుక్యుల కాలపు దేవాలయములందు చూడవచ్చు. మల్లన్నపేట గర్భగృహద్వారము చాళుక్యుల కళారీతిలో ఉంది. ద్వారపుత్రిశాఖల క్రింది భాగమున నున్న ఫలకములపై శైవద్వారపాలకులు, వీరికిరువైపుల వింజామరలతో నున్న సేవకులు మలచబడినారు.

ఆలయ ప్రాంగణములో ద్విహస్తములతో ఏనుగు తలను బోలిన వినాయకుడు, చతుర్భుజముల గణపతి, నాగిని ప్రతిమలు, వీరగల్లులు, రెండు ముక్కలుగా శిథిలమైన సప్తమాతృకలఫలకము, భైరవుడు, నంది, దేవి మున్నగు విడి శిల్పములు కనబడతాయి.




# 16. చిలువాకోడూరు

కరీంనగర్‌కు ఉత్తరమున 70 కి.మీ. దూరంలోను, జగిత్యాలకు తూర్పున 20 కి.మీ. దూరంలోను జగిత్యాల నుండి పెద్దపల్లికి పోవు రహదారిపై నున్న గ్రామమే చిలువాకోడూరు. ఎల్లకాలము ప్రవహించు ఒకవాగు ఒడ్డున నున్న ఈ గ్రామము గొల్లపెల్లి మండలములో ఉంది. వాగు సమీపమున గల రాతి ప్రాకారములో రామలింగేశ్వరాలయముంది. ఈ ప్రాకారమునకు తూర్పు ఉత్తరదిశల యందు ప్రవేశములున్నాయి.

## రామలింగేశ్వరాలయము


ఈ దేవాలయ అధిష్ఠానము భూమిలో మునిగి ఉంది. దానిపైన $4^1/_2$ అడుగుల ఎత్తు రాతి గోడలున్నాయి. ఈ దేవాలయము ఉత్తరముఖమును కలిగి ఉంది. ముఖమంటపమునకు మూడువైపుల పడమట, దక్షిణ, తూర్పు దిశలలో మూడు గర్భగృహములు, వాటి ముందు అంతరాళములున్నాయి. కాని ఈ మూడు ఆలయముల కొలతలు రాయికల్, వాల్గొండ త్రికూటాలయములలో వలె ఒక్క రీతిలో లేవు. ఇచటి మూడు గర్భగృహములపై వేర్వేరు పరిమాణములలో నాగరరీతి శిఖరములు చాపరేఖాకృతి (Curvilinear Spires) లో నున్నాయి. పడమటి దిశలో శివలింగమున్న గర్భగుడిపై గల శిఖరము మిగిలిన రెండింటికంటే పెద్దగా ఉంది. దేవాలయమునకు ఉత్తరమున పిట్టగోడపై నున్న రెండు అర్ధస్తంభములపై నిలిచియున్న చిన్నమంటపము (Porch) ద్వారా ముఖమంటపములోనికి ప్రవేశింపవచ్చు. ఈ ప్రవేశమంటపముపై నున్న చిన్నగుడిలో (Miniature shrine) నంది విగ్రహముంది. ప్రవేశమునకు ముందు రెండు వైపుల చక్కటి ద్వార పాలకుల ప్రతిమలు చాళుక్యుల కళారీతులలో చెక్కబడిఉన్నాయి. ఈ ద్వారపాలకులు కిరీటము, ఉదరబంధము, అర్థోరుకము, మోచేతి, ముంజేతి, కాలి కడియములు ధరించియున్నారు. వీరి దక్షిణ హస్తములో గద, వామహస్తములో నాగసర్పము చెక్కబడినాయి.




రామలింగేశ్వరాలయము

అన్ని వైపుల గోడలచే మూయబడిన ముఖమంటపము లోనికి ప్రవేశించుటకు $4^{1}/_{2}$ అడుగుల ఎత్తు 3 అడుగుల వెడల్పు గల చిన్నద్వారముంది. ఈ ద్వారము క్రింది భాగమున ఇరువైపుల పూర్ణకుంభములు చెక్కబడినాయి. ముఖమంటపము 20' అడుగుల చతురస్రాకారములో ఉంది. మధ్యనున్న నాలుగు స్తంభముల ఎత్తు కేవలము ఆరు అడుగులు. చదునుగా నున్న మంటప లోకప్పు ఎత్తు ఏడు అడుగులు. ఈ మంటపమునందు గణపతి, దేవి, నంది విగ్రహములున్నాయి.


మంటపము మూడు దిశలందు అసమాన కొలతలతో వేర్వేరు పరిమాణములలో మూడు ఆలయములున్నాయి. మూడు గర్భగృహముల ముందు విభిన్న కొలతలతో అంతరాళములున్నాయి. పడమటనున్నది ప్రధానమైన శివాలయము. దీని ముందున్న అంతరాళపు ద్వారము ఎత్తు 5' అడుగులు, వెడల్పు $2^{1}/_{2}$' అడుగులు దీని క్రింది భాగమున శైవ ద్వారపాలకులు చెక్కబడినారు. ఈ ద్వారపు శాఖలకు ఇరువైపుల పొడువు వరుసలో ఒకదానిపై నొకటి మూడు జాలి రంధ్రములు (Lattice holes) గాలి, వెలుతురుకై చెక్కబడినాయి. గర్భగృహము 9' అడుగుల చతురస్రాకారము. గర్భగృహద్వారపు క్రింది భాగమున పూర్ణకుంభములు చెక్కబడినాయి.



శిఖరములు



నంది స్తంభము



ద్వారపాలకుడు

దక్షిణ గర్భగృహము ఏడు అడుగుల చతురస్రాకారము. దీని ముందున్న అంతరాళము పొడవు వెడల్పులు 5'x7' అడుగులు. వీటి ద్వారముల ఎత్తు 4' అడుగులు, వెడల్పు 2' అడుగులు. ఈ గర్భగృహములో పైకెత్తిన రెండు చేతులలో కమలపు మొగ్గలు గల కాడలను పట్టుకొనియున్న కమలబాంధవుడైన సూర్యుని విగ్రహముంది. ప్రక్కకు ఒక దేవి విగ్రహముంది. తూర్పు గర్భగృహములో వైష్ణవ విగ్రహముంది. గర్భగృహము 6' అడుగుల చతురస్రాకారము. దీని ముందున్న అంతరాళపు కొలతలు 5'x6' అడుగులు. వీటి ద్వారముల ఎత్తు 4' అడుగులు, వెడల్పు 2' అడుగులు. విభిన్న కొలతలతో నున్న ఈ త్రికూటాలయము విస్మయము కలిగించురీతిలో ఉంది.



పొలాస రాజధానిగా పొలవాస రాజులు తమ రాజ్యాధికారమును గోదావరినానుకొని తూర్పున మంత్రకూటమునుదాటి వరంగల్ జిల్లాలోని నర్సంపేట తాలుకా వరకు విస్తరింపజేసినారు. వారు శైవ, వైష్ణవ, సౌర, జైన దేవతల ఆరాధకులు. ఈ ప్రభువులు పొలాస, మల్లన్నపేట, చిలువాకోడూరు, నంది మేడారం, రామగుండం, మంథని మరియు నర్సంపేట ప్రాంతములందు దేవాలయములు నిర్మించారు. చిలువాకోడూరు దేవాలయము గూడా పదకొండవ శతాబ్దపు చివరలో లేదా పన్నెండవ శతాబ్దపు ప్రథమార్థములో నిర్మింపబడి ఉంటుంది. చాళుక్య కళారీతులలో నున్న దీని నిర్మాణము మరియు ఇచటి ప్రతిమా శిల్పములు ఈ విషయమును ధృవపరుస్తున్నాయి.

రాయికల్ మండల కేంద్రములో నున్న త్రికూటాలయములో వలె చిలువాకొడూరులోని మూడు గర్భగృహములందు శివుడు, సూర్యుడు, విష్ణువు ప్రతిష్ఠింపబడినారు. క్రీ.శ. 1163లో కాకతి రుద్రదేవుడు అనుమకొండలో నిర్మించిన వేయిస్తంభాల గుడి లోని మూడు గర్భగృహములు రుద్రేశ్వరుడు, విష్ణువు, సూర్యునకు అంకితము చేయబడిన విషయము జగద్విఖ్యాతము.

### ప్రాంగణములోని ఆలయములు

చిలువాకోడూరు దేవాలయ ప్రాంగణములో పడమటి దిక్కున రెండు వేర్వేరు దేవాలయములున్నవి. మొదటి ఆలయము రెండవదాని కంటే పెద్దగా ఉంది. మొదటి ఆలయ గర్భగృహము 7' అడుగుల చతురస్రము. దాని ముందున్న అర్ధమంటపము కొలతలు 5'x7' అడుగులు. ఈ ఆలయము నందు గణపతి, నంది విగ్రహములున్నాయి. కొంత చిన్నగా నున్న రెండవ ఆలయ ద్వారపు లలాటమున గజలక్ష్మి, శాఖల క్రింది భాగమున వైష్ణవ ద్వారపాలకులు మలచబడినారు. చాళుక్య కళారీతిలో నున్న ఈ ద్వారపు పతంగముపై నున్న తోరణ భాగము శిఖరములు, కలశము, స్త్రీ రూపములతో చెక్కబడింది. ప్రస్తుతమీ ఆలయములో భైరవ, దేవి, నాగిని, శిథిలమైన సప్తమాతృకల ఫలకపు ప్రక్కలు పడిఉన్నాయి. ప్రాంగణమందున్న ఈ రెండు ఆలయములపై నున్న శిఖరములు మెట్లతో గూడిన పిరమిడ్ ఆకృతిలో ఉన్నాయి.

ఇచటి ప్రాంగణమందు నిలిచియున్న 25' అడుగుల ఎత్తు స్తంభముపై గల చిన్నమంటపములో నంది ప్రతిష్ఠింపబడిఉంది. ఈ నంది స్తంభమువలె ఇంకను రెండు స్తంభములు నిలిచిఉన్నాయి. కాని వాటిపై నుండిన చిన్న మంటపములు నేడు లేవు. ఉత్తరమందున్న ప్రవేశమునకు ముందు ప్రాకారము నానుకొని స్తంభములపై నిలిచిన మంటపమున్నది. చిలువాకోడూరులో ఎలాంటి శాసనములు లభ్యము కాలేదు.

## 17. తోటపెల్లి

కరీంనగర్‌కు 30 కి.మీ. దూరమున హైదరాబాద్‌కు పోవు రాజీవ్‌రహదారిపై నున్న తోటపెల్లి గ్రామములో పదకొండవ, పన్నెండవ శతాబ్దములకు చెందిన త్రికూటాలయము దక్షిణ

ముఖమును కలిగిఉంది. ఇచటి దేవాలయము ఏ కారణము చేతనో సంపూర్ణముగా నిర్మాణము కాలేదు. పైకప్పు వరకు గోడలులేచిన నిర్మాణము మధ్యలోనే ఆగిపోయింది. ఈ దేవాలయము తురుష్కులచే ధ్వంసము చేయబడినట్లు అగబడుటలేదు. దండయాత్రల భీతివలననో, ఏ ఇతర కారణముల వలననో నిలిచిపోయిన ఈ కట్టడము యొక్క శిల్పసంపద వర్ణనాతీతము. మధ్యలోనున్న మంటపమునకు తూర్పు, ఉత్తర, పడమటి దిశలందు గర్భగృహములున్నాయి. ఈ గర్భగృహములన్నియు 8' అడుగుల చతురస్రాకారములో నుండి వాటి ముందున్న అర్ధమంటపములు గూడా అదే 8' అడుగుల చతురస్రాకారములో ఉన్నాయి. ఈ దేవాలయ నిర్మాణము, రాయికల్, వాల్గొండ దేవాలయముల నిర్మాణ రీతులలో కనిపిస్తుంది. తోటపెల్లి త్రికూటాలయములోని మూడు గుడుల కొలతలు ఒకే మాదిరిగా ఉన్నాయి. చిలువాకోడూరు దేవాలయములోవలె కొలతల యందు అసమానతలు కనిపించవు. తోటపెల్లి ఆలయపు కుడ్యములపైన పైకప్పులు లేవు, శిఖరములు లేవు.


ద్వారము


స్తంభము

తోటపెల్లి దేవాలయమునకు కాకతీయుల దేవాలయముల వలె ఉపపీఠములేదు. అధిష్ఠానము నందు ఉపానము విశాలపట్టిక, జగతి, వేది భాగములు కనిపిస్తాయి. ఎలాంటి అలంకారము లేని గోడల నిర్మాణము కపోతము వరకు జరిగింది. చాళుక్యుల కళారీతులలో నున్న గర్భగృహద్వారముల త్రిశాఖల క్రింది భాగమున శైవద్వార పాలకుల ప్రతిమలు లలాటములందు గజలక్ష్మి మలచబడినాయి. పతంగమునకు ఊర్ధ్వభాగమున తోరణమందు చిన్న ఆలయ శిఖరాలు (turrets on the architrave) చెక్కబడినాయి. మంటపము మరియు దాని దక్షిణ దిశలో ప్రవేశ సోపానములకై వదలిన స్థలము ఖాళీగా ఉంది. రాయికల్‌లోని త్రికూటాలయమువలె ఇచటి త్రికూటాలయము గూడా దక్షిణ ముఖమును కలిగి యుండుట విశేషం.

చాళుక్యుల కాలపు నందుల వలె మామూలు పరిమాణంలోనున్న, ఆభరణ భారము లేని నంది ఒకటి అచట పడిఉంది. కప్పు పైభాగమున మధ్యలో వాడబడు ఒక చతురస్రాకారపు



పెద్ద శిలాఫలకముపై చెక్కబడిన అందమైన విరబూసిన కమలము చూడముచ్చటగా నుండి ఆవరణలో పడిఉంది. ఈ దేవాలయము ముందు ఒక వీరగల్ ప్రతిమ ఉండగా చెఱువు కట్టపై గూడా ఒక వీరగల్ శిల్పముంది. ఈ దేవాలయము చెఱువునకు కొంత దూరములో ఉంది. అదృష్టవశాత్తు ఈ దేవాలయము పూర్తిగా నిర్మాణమై యుండినచో కరీంనగర్ జిల్లాలోని బహురమ్యమైన ఆలయములలో ఒకటిగా పరిగణింపబడేది. తోటపెల్లి గాంధిగా పేరొందిన స్వాతంత్ర్య సమరయోధుడు బోయినపెల్లి వెంకట రామారావు దీని నిర్మాణము పూర్తి చేయుటకు విఫల ప్రయత్నము చేశారు.


## 18. బెజ్జంకి

కరీంనగర్‌కు నైఋతి దిశలో 35 కి.మీ. దూరంలో నున్న బెజ్జంకి నేడు ఒక మండలకేంద్రం. స్థానికంగా ఎలాంటి శాసనం దొరకక పోయినను సమీపముననే గల శనిగరములో లభ్యమైన కళ్యాణి చక్రవర్తుల కాలపు రెండు శిలాస్తంభశాసనములందు ఈ గ్రామము పేరు బెజవాంకెయగా పేర్కొనబడింది. కళ్యాణి చాళుక్య చక్రవర్తి త్రైలోక్యమల్ల మొదటి సోమేశ్వరుని కాలపు క్రీ.శ. 1053 శనిగరము శాసనములో బెజవాంకెయ(బెజ్జంకి) గ్రామపు కాటెరెడ్డి తదితరుల ఆమోదముతో ఒక మఱ్ఱురు నీరు నేల (Wet land) శనిగరములోని మధుపేశ్వర దేవరకు దానముగా నొసంగబడినట్లు పేర్కొనబడింది[89]. అదే శనిగరములో క్రీ.శ. 1128లో వేయబడిన కళ్యాణి చాళుక్య చక్రవర్తి భూలోకమల్ల మూడవ సోమేశ్వరుని కాలపు శిలాస్తంభశాసనములో రేపోల కుఱువరాజు యొక్క అధికారి ఒకరు బెజవాంకెయ గ్రామములో ఎనిమిది మఱ్ఱుర్ల నేలను శనిగరములోని కొమ్మేశ్వర దేవరకు దానముగా నొసంగినట్లు పేర్కొనబడింది[90]. పై రెండు శాసనములలో ఈ గ్రామనామము బెజవాంకెయ యని పేర్కొనబడుట గమనార్హం. కళ్యాణి చాళుక్య చక్రవర్తుల కాలపు ఐదు శిలాస్తంభ శాసనములు ఒక శనిగరము నందే లభించుటవలన వారికాలములో శనిగరము రాజకీయ ప్రాధాన్యత గల ప్రదేశమై ఉండింది. శనిగరమునకు అతి సమీపముననున్న బెజవాంకెయ గ్రామము గూడా అంతే చారిత్రక ప్రాధాన్యత కలిగి ఉండెనని అచటి పన్నెండవ శతాబ్దపు మధ్యకాలమునకు జెందిన అద్భుతమైన శిల్పసౌందర్యము గల నరసింహ దేవాలయమును బట్టి విశదమగుతుంది. బెజ్జంకిలోని ప్రాచీనకోట ఆనవాళ్లు, శిథిలమైన గోడలు, కూలుచున్న బురుజులు ఒకనాడు ఈ గ్రామముచుట్టూ కోట నిర్మింపబడియుండెనని ధృవపరచుచున్నాయి[91].

### నరసింహ దేవాలయము

బెజ్జంకిలోని నరసింహ దేవాలయము ఒక కళాత్మకమైన కట్టడం. దాదాపు రెండు వందల మెట్లు అధిరోహించినచో ఇచటి గుట్టపై నున్న దేవాలయమును చేరవచ్చు. దేవాలయము దక్షిణ ముఖమును కలిగి ఉంది. గర్భగృహము, అంతరాళము, ముఖమంటపము దేవాలయ

ప్రధానాంగములు. మంటపమునకు దక్షిణ, తూర్పు, పడమరలందు ప్రవేశమంటపాలున్నాయి (Porches). కొండపై నున్న సహజమైన ఒక గుహ (Cave) యే నేడు నిలిచియున్న గర్భగృహాముగా రూపొందింది. ఇది గుట్టపై నున్న దేవాలయము గనుక గర్భగృహామునకు అధిష్ఠానము లేదు. ఒక పెద్దబూయిపై గోడల నిర్మాణము జరిగింది. కాని మంటపము యొక్క అధిష్ఠానమునందు ఉపానము, పట్టిక, జగతి మరియు వేది గలవు. అధిష్ఠానపు కంఠము అనేక విభాగములుగా విభజించబడి (Cut into several compartments) వాటిలో చతుర్దళ పుష్పాకృతులు మలచబడినాయి. ఈ అలంకరణ సాధారణంగా పశ్చిమ చాళుక్యుల దేవాలయములందు అగబడుతుంది. ప్రవేశ మంటపముల (Porches) పిట్టగోడలపై గల కక్షాసనముల వెనుక భాగమందున్న విభాగములలో గజ, సింహ, అశ్వ, హంస, పద్మ శిల్పములు కనిపిస్తాయి. ఒకానొక విభాగము నందు కాళ్లు తెరచి కూర్చొనియున్న మాతృదేవతా (Mother Goddess) రూపముంది. ఆమె జననేంద్రియము స్పష్టముగా చెక్కబడింది. ఇలాంటి రూపములు వేములవాడలోని భీమేశ్వరాలయము ముందున్న వేదిక కంఠభాగములందు చెక్కబడి ఉన్నాయి. గర్భగృహపు గోడలపైన ముందుకు చొచ్చుకొని వచ్చిన వంపుతో గల చూరు (Projected eave cornice is fine and slopy) అందముగా ఉంది. గర్భగృహము పై నున్న సుందరమైన శిఖరము కాదంబుల దేవాలయముల శిఖరములను పోలిఉంది. పదిహేను మెట్ల వరుసలుగా విభజింపబడి పిరమిడ్ ఆకారములో నున్న ఈ శిఖరపు ప్రతి వరున 'అర్ధచంద్రగోళాకృతులతో అలంకరింపబడింది.[92] (The spire consists of fifteen diminishing tiers arranged alternate with recesses to form the pyramid shape. The tiers are decorated with semi-circular stones as seen on the steps of the sikharas of kadamba temples).




నరసింహ దేవాలయము


దేవాలయ ముఖమంటపము చుట్టు గోడలచే మూయబడి (Enclosed by walls) ఉంది. మంటపము మధ్యనున్న నాలుగు స్తంభములు ప్రశస్తమైన అపూర్వ చెక్కడములతో



శోభిల్లుచున్నాయి. స్తంభములపైన అశ్వపాదముల నుండి చివర వరకు సంప్రదాయ పౌరాణిక మరియు లౌకిక, సాంఘిక విషయములను సుందరంగా చెక్కడంలోనే శిల్పి అమితముగా అతని కళానైపుణ్యమును ప్రదర్శించాడు. స్తంభపు అశ్వపాదము నాలుగువైపుల దేవతలతో నిండిన గూడులు (Niches) అందంగా రూపొందించ బడినాయి. స్తంభము యొక్క రెండు ఘనమైన చతురస్రాకారపు భాగముల మధ్యన అలంకార భారముతో గూడిన అష్టభుజాకారపు పట్టికలున్నాయి. ఈ పట్టికలకు ఇరువైపుల మలుపులు, వంపులు (Mouldings and recesses) సూక్ష్మమైన చెక్కడములతో నిండి ఉన్నాయి. స్తంభ ఉపరితలములందు అనేక దేవతలు, సుందరభామాశిల్పములు ఉబ్బుగా (In bold relief) మలచబడినాయి. స్తంభ శీర్షభాగము (The capital of the pillar is marked by a circular part in the form of a vese with sloping top) కలశాకారముతో ఆరంభమై వృత్తాకారపు కుడం (Circular abacus) వరకు అనేక మలుపులను (Mouldings) కలిగి ఉంది. కుడంపైన ఫలికా పద్మము చతురస్రాకారములో (Square abacus) ఉంది. దానిపై నున్న బోదె (Bracket) శిల్పభారముతో మనోహరంగా ఉంది. ఇలాగే నాలుగు స్తంభములకు నాలుగు వైపుల చెక్కబడిన సూక్ష్మమైన అపూర్వమైన శిల్పములు అలంకార శోభితములై పర్యాటకుల దృష్టినాకర్షిస్తాయి. కరీంనగర్ జిల్లాలో ఇచటనున్న సుందర చిత్ర శిల్పము మరెచ్చటను కానరాదు. బెజ్జంకి దేవాలయ మంటపములో మధ్యనున్న నాలుగు చిత్రఖండరూప స్తంభములు పాలంపేట, పిల్లలమర్రి, నాగులపాడు, వరంగల్, హనుమకొండ దేవాలయములలోని సుందరస్తంభములను పోలిఉన్నాయి. బెజ్జంకి స్తంభతలములపై అరుదైన, అద్భుతమైన రీతులలో ఉబ్బుగా (Bold relief) మలచబడిన వివిధ సుందరాంగుల శిల్పముల మాదిరి చెక్కడములు పాలంపేట, హనుమకొండలాంటి ప్రదేశములందు గూడా లేకపోవడం ఇచటి విశేషం.




పట్టభాగము




శీర్షభాగము

స్తంభముల ఉపరితలముపై నున్న అనేక దేవతలు, నాట్యకత్తెలు, మృదంగ, తాళ, వేణువు, వీణాధారిణులు, వేటకత్తెలు మున్నగు వారి శిల్ప సౌందర్యము వర్ణనాతీతం. సహజలావణ్యము ఉట్టిపడు నాట్యకత్తెల, వాద్యకారిణుల, వేటకత్తెల తదితర సుందరాంగుల రూపములలో కళాకౌశలము, శిల్పకళా విన్యాసము చిరస్థాయిగా నిలిచియున్నదనుటలో అతిశయోక్తి లేదు. స్తంభ ఉపరితలముపై భాగవత, భారత, పౌరాణిక గాథలు అనేకములున్నాయి. దేవదానవులు అమృతమునకై చేసిన క్షీరసాగరమథనము నందు ఒక వైపు ముగ్గురు సురులు ఇంకొక వైపు ముగ్గురు అసురులు వాసుకి సర్పమును లాగుచున్నారు. లింగోద్భవ సమయములో ఆద్యంతములు తెలిసికొనుటకై విఫలులైన విష్ణువు ఒక వైపు, బ్రహ్మ మరియొక వైపు చిన్నరూపములలో నుండి వేదికపై నున్న పరమశివుని దర్శించుచున్నారు. ఇలాంటి కథావస్తువు సాధారణంగా కాకతీయుల శిల్పములలో కనిపించదు[93]. నరసింహస్వామికి ఒక వైపు గరుడుడు, రెండవవైపు ఆంజనేయుడు గల ఫలకము కనులకు ఇంపుగా ఉంది.



సముద్ర మథనము




కోలాటము

పౌరాణిక గాథలే కాకుండా అనేక సాధారణ లౌకిక విశేషములను విశదపరచు చిత్ర శిల్పము లెన్నియో స్తంభములపై కనిపిస్తాయి. ఒక అందమైన వేటకత్తె ఎడమచేతిలో ధనుస్సు ధరించి కుడిచేతిలో నున్న బాణముతో ఆమె ఎడమపాదము నందున్న ముల్లును, తీయుటకై యత్నించుచున్న వ్యక్తికి దానిని చూపెడుతుంది. అనుమకొండ నుండి పాలంపేటకు పోవు మార్గముపై నున్న జాకారం గ్రామములోని ఒక ఆలయద్వారపు శాఖల క్రిందనున్న ఫలకమునందు ఇలాంటి వేటకత్తె శిల్పమే దర్శనమిచ్చుట గమనార్హం[94]. వేటకత్తెల శిల్పములు కాకతీయుల కాలపు ద్వారముల క్రింది భాగమున తరచుగా కనిపిస్తాయి. నగ్నముగా నున్న ఇచటి ఒక అందమైన భామ తలపైభాగమున ఆమె చేతులలో పట్టుకొనిన సర్పము వలె నున్న శిల్పఫలకము ఒకటి జాకారము నందు గల వేటకత్తె ప్రక్కనే చూడవచ్చు[95]. బెజ్జంకిలోని రూపములు కుఱుచగా స్థూలముగా (Short and Stout) నుండగా జాకారంలోని రూపములు సన్నగా పొడువుగా నుండుట గమనింపదగిన విషయం. ఇచట గల అందమైన భామ యొక్క చీర చెంగులు లాగుచున్న కోతిశిల్పము సాధారణముగా కాకతీయుల కాలపు శిల్పంలో చూడవచ్చు. రామప్పలోని మదనికా శిల్పము నందు మరియు కర్నూలు జిల్లాలోని త్రిపురాంతకములోను ఇలాంటి శిల్పాలున్నాయి[96].




బెజ్జంకి లోని అందమైన భామల శిల్పములలో ఆభరణభారము, అంగసౌష్ఠవములతో పాటు వయ్యారము, వంపుసొంపులు ఎక్కువ. ధనుర్బాణములతో నున్న భామాశిల్పము, శరీరపు వంపుల వలన జారిపోవు చీరచెంగులను లాగు కోతిని వారించుచున్న సుందరీ శిల్పము, నాగసర్పమును హస్తములతో తలపై పట్టుకొనిన శిల్పము, నాట్యకత్తెల, వాద్యకారిణుల మున్నగు మనోహర శిల్పములు శిల్పి కళా నైపుణ్యమును, శిల్ప ఔన్నత్యాన్ని చాటుతున్నాయి. శతాబ్దముల తరబడి సందర్శకులకు ఈ శిల్పములు నయనానందకరముగా నిలిచినవనుటలో అతిశయోక్తి లేదు.




స్తంభ ఉపరితలములపై చెక్కడములు

సుందరీమణుల శిల్పములందు శిరోజములు ఒక ప్రక్కకు శిఖరూపములో (Arranged into a side knot in the shape of a bun) ముడవబడినాయి. వారు కర్ణకుండలములు, కంఠాభరణములు, హారములు, వడ్డాణములు, మోచేతి, ముంజేతి, కాలికడియములు ధరించి ఉన్నారు. పాదములు, నూపురములచే అలంకరింపబడినాయి. చాలీచాలని వస్త్రధారణలో నున్నను (Scanty dress) వారు అందంగా ఆకర్షణీయంగా ఉన్నారు. కాని వారు కుఱుచగా స్థూలముగా నున్నారు. జైన చిత్రకళాప్రభావము ఈ శిల్పములందు చూడవచ్చు. బెజ్జంకి దేవాలయ శిఖరము,

మంటప అంతర్భాగములో పిట్టగోడలపై నున్న పద్మముల వరుసలు జైన సంప్రదాయమును సూచిస్తున్నాయి. బెజ్జంకి దక్షిణమున నున్న కొల్లిపాక (కొలనుపాక), నైఋతిలో గల పొట్టలకేరె (పటాంచెఱువు)లందు గల జైన శిల్పప్రభావము ఇచట చూడవచ్చు. కళ్యాణి చాళుక్యుల ఏలుబడిలో నుండిన ఈ ప్రాంతములకు కర్ణాటకము నుండి శిల్పులు, కళాకారులు వచ్చి ఉంటారు.



అశ్వపాదము



స్తంభము



ఉపరితల చెక్కడములు



గండశిలపై భైరవుడు



ఈ దేవాలయ మంటపము యొక్క లోకప్పు చదునుగా నుండి మధ్యలో మాత్రము (కదలికాకరణ) లుపవితాన రీతిలో ఉంది. మధ్యనున్న చతురస్రాకారఫలకము అర్ధగోళాకారపు పెద్దగిన్నె బోర్లించిన రీతిలో లోతుగా చెక్కబడి ఒకదానిపై నొకటి మూడు వలయములందు దళములతో విరబూసిన పద్మము నడుమనున్న మొగ్గ క్రింది వైపు చూచుచున్నది. ఇలాంటి (dome shaped) శిల్పములు నగునూరు, కరీంనగర్ దేవాలయములందు కనిపిస్తాయి. ఇచటి మంటప దూలములు పద్మశిల్పములతో అలంకరింప బడినాయి. ఇచటి లోకప్పు త్రికోణపు ఫలకములందు హనుమకొండలోని వేయిస్తంభాల గుడిలో వలె సింహపు తలలు లేదా కీర్తి ముఖాలు మలచబడినాయి.

మంటపమునకు ఉత్తరముననున్న అంతరాళ ద్వారపు శాఖల క్రింద వైష్ణవ ద్వారపాలకులు ఉన్నారు. మంటపమునకు మూడువైపుల నున్న ప్రవేశద్వారములు సాదాగా (Plain) ఉన్నాయి. ప్రవేశ మంటపముల లోకప్పు ముఖమంటప మధ్యభాగపు లోకప్పును పోలిఉంది.

**భైరవుడు** :- నరసింహదేవాలయమునకు పడమట కొంత దూరములో అదే గుట్టపైనున్న పెద్ద గుండ్రాయి పై భైరవవిగ్రహము చతుర్భుజములతో చెక్కబడింది. పై నున్న దక్షిణ హస్తములో డమరుకము, వామ హస్తములో త్రిశూలము క్రింది కుడిచేతిలో మెలికలతో గూడిన ఖడ్గము (Curled Sword) ఎడమచేతిలో ఖండింపబడిన తల మలచబడినాయి. భైరవుని శిరముపై సర్పపు పడగలు ఛత్రమువలెనున్నాయి. అతనికి ఎడమవైపున గల శునకము తల నుండి పడుచున్న రక్తపు చుక్కలను స్వీకరించుటకు నాలుకను చాచుకొని ఉంది.

**బాహ్యకుడ్యముపై నున్న శిల్పములు**

నరసింహదేవాలయపు పడమటి బాహ్య కుడ్యముపై నున్న శృంగార మిథునశిల్పములు విస్మయమును కలిగిస్తాయి. రతి క్రీడలో నున్న ఇలాంటి మిథున శిల్పములు కాకతీయ శిల్పమునందు కానరావు. కాని ఇలాంటి మిథున శిల్పములు తూర్పు గోదావరి జిల్లాలోని బిక్కవోలు నందు గల తూర్పు చాళుక్యుల దేవాలయముల యందు కనబడతాయి[97]. కాని బెజ్జంకిలోని మిథునముల శిల్పములు చాలా స్పష్టముగా లేవు.

1. ఈ మిథున శిల్పమునందు ఒకరికొకరు అభిముఖముగా నిలబడి రతిక్రీడలో నున్నారు.
2. రెండవ మిథున శిల్పములో స్త్రీ విల్లువలె ముందుకు వంగి చేతులు నేలపై మోపగా, వెనుకనిలబడి ఉన్న పురుషుడు రతిక్రీడలో నున్నాడు.
3. మూడవ మిథునశిల్పములో స్త్రీ, పురుషులు ఒకరిపై నొకరు అభిముఖదిశలో పడుకొని మర్మావయవములను చుంబించుచున్నారు.

ఇదే కుడ్యము పైన పైకెత్తిన కుడి చేతిలో ఖడ్గము పట్టుకొని ఎడమ చేత కళ్లెము బూని వెనుకనుండి వచ్చుచున్న గుఱ్ఱపురౌతుపై ముందున్న గజారూఢుడు వెనుకకు తిరిగి అతనిపై ధనుర్బాణములను ఎక్కుబెట్టిన శిల్పము రమ్యంగా ఉంది.

## నరసింహదేవాలయపు వాస్తు శిల్పకళారీతులు

ఈ దేవాలయపు వాస్తు, శిల్పకళారీతులు వింతగా ఉన్నాయి. అలంకారము లేని గోడలు, కాదంబులరీతి శిఖరము, సాధారణ ద్వారములు, జాలి పని గల కిటికీలు లేకుండుట, నాలుగువైపుల గోడలచే మూయబడిన మంటపము, రతిక్రీడలో నున్న మిథునముల శిల్పములు, అధిష్ఠానపు కంఠము నందు మాతృదేవతా శిల్పము, మంటపములోపల బయట గల పద్మశిల్పముల వరుసలు మున్నగు లక్షణములు కాకతీయ దేవాలయము లందు కానరావు. గనుక ఇది కళ్యాణి చాళుక్యుల కాలపు దేవాలయమని భావించు అవకాశము ఉంది. కాని ముఖమంటప మధ్యస్తంభములపై అమితముగా చెక్కబడిన సూక్ష్మమైన శిల్పములు, ధనుర్బాణములు ధరించిన వేటకత్తె, నాగసర్పమును తలపై భాగమున రెండు చేతులలో పట్టుకొనిన స్త్రీ రూపము, భామల చీరల చెంగులు లాగుచున్న మర్కటము, లోకప్పు నందు గల త్రికోణ ఫలకములపై గల సింహముఖ శిల్పములు, లోకప్పు మధ్యన గిన్నె బోర్లించిన ఆకారములో (dome shaped) లోతుగా మూడు వలయములతో చెక్కబడిన పద్మశిల్పము, మున్నగు లక్షణములు కాకతీయుల శిల్పకళారీతులకు దగ్గరగా నుండుట వలన, ఇది ఏకాలమునకు చెందిన దేవాలయమో నిర్ణయించుట కష్టంగా ఉంది. ఎలాంటి శాసనాధారములు లేవు. ఈ దేవాలయములో చాళుక్యుల, కాకతీయుల కళారీతుల మేళవింపు అగబడు తుంది. కనుక దీనిని పన్నెండవ శతాబ్దపు మధ్యకాలపు దేవాలయంగా పరిగణింపవచ్చును. అదే కాలమందు చాళుక్యుల కళారీతులు కొంత వెనుకంజ వేయగా కాకతీయుల నూతన కళారీతులు ఆవిర్భవించి అవి పుంజుకుంటున్న సంధికాలములో ఈ దేవాలయము నిర్మింపబడిఉంటుంది. అదే కాలములో అనగా క్రీ.శ. 1163లో కాకతి రుద్రదేవుడు అనుమకొండలో వేయిస్తంభాల గుడియను రుద్రేశ్వరాలయమును నిర్మించుట గమనార్హం.

బెజ్జంకి గుట్టపైననే శిథిలమైన శివాలయమొకటి ఉంది. గుట్టపైనున్న కోనేరుకు సమీపమున 30' అడుగుల ఎత్తుగల స్తంభము నిలిచి ఉంది. దీనిని ఆండాలు స్తంభమంటారు.

# 19. కోహెడ

కరీంనగరమునకు దక్షిణమున 35 కి.మీ. దూరంలో నున్న కోహెడ ఒక మండలకేంద్రం. కోహెడ నుండి హుస్నాబాద్‌కు పోవు రహదారిపైన ప్రాచీన మల్లన్న దేవాలయముంది.

## మల్లన్న దేవాలయం

తూర్పు ముఖమును కలిగి ఉన్న ఈ మల్లికార్జున దేవాలయము నేడు మల్లన్న గుడిగా



పిలువబడుతుంది. ఈ దేవాలయమందు గర్భగృహము, దాని ముందు బహిరంగ మంటపము (Open Mandapa) మాత్రమే ఉన్నాయి. అంతరాళము కానరాదు. ఆలయ అధిష్ఠానము నేలలో మునిగిపోయింది. శిఖరము నేడు లేదు. ఎలాంటి అలంకారము లేని గోడల (Plain walls) పైన కప్పువేయబడింది. గర్భగృహములోపల మల్లికార్జున స్వామికి నాలుగు మూలలందు నాలుగు స్తంభములున్నాయి. ఈ స్తంభములకు, గోడలకు మధ్యనున్న మూడు అడుగుల స్థలము ప్రదక్షిణాపథము. చాళుక్యుల నిర్మాణ లక్షణమును కలిగియున్న ఇట్టి వ్యవస్థ వేములవాడ, అలంపురము దేవాలయాల్లో చూడవచ్చు[98]. గర్భగృహము ముందు గల బహిరంగ మంటపము మధ్య నుండి స్వామిని చేరుటకు మార్గముంది. ఈ మార్గమునకు ఉత్తరదక్షిణము లందు వేదికలు (raised platforms) ఉన్నాయి. ఉత్తరపు వేదికపై ఒకొక్క వరుసలో మూడుచొప్పున ఆరుస్తంభములు, అదే విధముగా దక్షిణ వేదికపై నున్న ఆరు స్తంభములు, మొత్తము 12 స్తంభములపై మంటప కప్పు నిలిచిఉంది. మంటపములోని స్తంభములు కుఱుచగా (short and crude in form) మోటుగా కేవలము 4' అడుగుల ఎత్తుతో ఉన్నాయి.



మల్లన్న దేవాలయం

## ప్రాంగణ మందున్న రెండు దేవాలయములు

మల్లన్నగుడి పరిసరములలోనే దక్షిణముఖముతో నున్న రెండు చిన్నదేవాలయాలున్నాయి. శివలింగమును కలిగిన పెద్దగుడిద్వారము 4'x2' కొలతలతో ఉంది. దీని క్రింది భాగమున పూర్ణకుంభములు చెక్కబడినాయి. రెండవ చిన్న గుడిలో చతుర్భుజముల భైరవ విగ్రహముంది. పై హస్తము లందు డమరుకము, త్రిశూలము, క్రింది హస్తములందు ఖడ్గము, గిన్నె (Bowl) ఉన్నాయి. డాలు, ఖడ్గము ధరించిన వీరగల్లుల 4' అడుగుల ఎత్తున్న ప్రతిమా శిల్పఫలకములు అచట ఉన్నాయి. ఇవి యుద్ధంలో మరణించిన వారి స్మృతిచిహ్నాలు.

కోహెడ గ్రామము మధ్యలో శివాలయము రామాలయము ఒకదాని ప్రక్కన ఇంకొకటి ఉన్నాయి. ప్రతి ఆలయమందు గర్భగృహము, అంతరాళము, 16 స్తంభముల ముఖ మంటపములున్నాయి. శివాలయము ముందు నంది స్తంభము, రామాలయము ముందు

గరుడస్తంభములున్నాయి. వీటి ఆవరణలో నున్న నాగిని హస్తములందు డాలు, ఖడ్గములున్నాయి. ఈ నాగిని ఊర్ధ్వభాగము స్త్రీ రూపములోను, అధోభాగము పొలాసలో వలె మెలికలు తిరిగిన సర్పరూపములో నుండి ఆమె తలపై సర్పము యొక్క ఏడు పడగల ఛత్రముంది. ఇచటి చారిత్రక శిథిలములను బట్టి కోహెడ చాళుక్యుల, కాకతీయుల కాలములో ప్రాముఖ్యత గల ప్రదేశమై ఉండెనని తెలుస్తుంది.

ఆసఫ్‌జాహీల కాలములో ఆఱవ నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ పాలనలో 1894లో ఉర్దూ మీడియం ఏకోపాధ్యాయ పాఠశాల కోహెడ యందుస్థాపించబడింది. మీర్ ఉస్మాన్‌అలీఖాన్ 1911లో ఏడవ నిజాంగా గద్దె నెక్కాడు. అతని కాలములో ఇచటి పాఠశాల తహతానియా (Primary school) గా మారింది. 1958లో మాధ్యమికపాఠశాల, 1965లో ఉన్నత పాఠశాల ఏర్పడింది. ఏడవనిజాం కాలములోనే ఒక మొహరిల్, జమెదార్, ఆరుగురు జవాన్‌లతో పోలీస్‌నాఖా ఏర్పాటైంది. ఇప్పటికి నిజాం కాలపు భవనములోనే ఠాణా కొనసాగుతుంది[99]. ఏడవ నిజాం నవాబు కాలమందు 1916లో నిర్మించిన చెఱువుకట్ట తూముపై ఒక ఆలయ మంటపముంది.

## 20. కాళేశ్వరం

కరీంనగర్‌కు ఈశాన్యమునందు 130 కి.మీ. దూరంలో దట్టమైన అడవి ప్రాంతంలో గోదావరి, ప్రాణహిత నదుల సంగమస్థానమందున్న మహాక్షేత్రమే కాళేశ్వరం. మహదేవపూర్ మండలములో నున్న ఈ గ్రామము అచటికి 16 కి.మీ. దూరములో ఉంది. కరీంనగర్ నుండి లేదా పెద్దపెల్లి రైల్వేస్టేషన్ నుండి మంథని ద్వారా మరియు వరంగల్ నుండి పరకాల ద్వారా ఈ క్షేత్రమును బస్సు (Bus) ద్వారా జేరవచ్చు. మూడు రాష్ట్రములు మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు కలియుచోట గోదావరి దక్షిణ తటమున ఈ క్షేత్రముండుట విశేషం. గోదావరికి ఉత్తరమున మహారాష్ట్రలోని చాందా జిల్లా, ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ జిల్లా ఈ గ్రామ సరిహద్దులలో ఉన్నాయి.

కరీంనగరము జిల్లా ఆధ్యాత్మిక, చారిత్రక వికాసానికి కాళేశ్వరం తలమానికం. త్రిలింగ దేశమను తెలుగునేల నిర్వచనములో కాళేశ్వరము చోటు చేసికొని ఈ ప్రాంతపు ఘనతను పవిత్రతను చాటింది. ఆంధ్రదేశంలో రాయలసీమ యందున్న కర్నూలు జిల్లాలోని శ్రీశైల మల్లికార్జున దేవాలయం, కోస్తాలోని తూర్పుగోదావరి జిల్లా యందున్న ద్రాక్షారామ భీమేశ్వరాలయం, తెలంగాణంలోని కరీంనగరము జిల్లా యందున్న కాళేశ్వరాలయం త్రిలింగ క్షేత్రాలుగా ప్రసిద్ధికెక్కాయి. శ్రీశైలం, ద్రాక్షారామము, కాళేశ్వరం మహాక్షేత్రములందున్న శివాలయములు ఈ ప్రాంతమును త్రిలింగ దేశమని, ఇచటి ప్రజలు మాట్లాడే భాషను తెలుగు అని అనాది నుండి పిలువడము జరుగుతుంది. త్రిలింగ శబ్దము నుండే తెలుంగు, తెలుగు



పదములు ఆవిర్భవించినాయని పండితుల అభిప్రాయం. దేశంలో వెలసిన అన్ని శివాలయాల కంటే కాళేశ్వరాలయం విభిన్నమైంది. కాలుడు (యమధర్మరాజు) శివుడు ఇరువురు లింగాకారములో ఒకే పానవట్టముపై వెలసియుండుట ఈ దేవాలయ ప్రత్యేకత.

మహారాష్ట్రము నుండి ప్రవహిస్తూ ప్రాణహిత ఉపనది గోదావరినదిలో కాళేశ్వరం వద్ద కలుస్తుంది. స్కాంద పురాణములో గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమప్రదేశములోని కాళేశ్వరాన్ని గురించి ప్రస్తావన ఉంది. గంగా, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమమైన ప్రయాగలో వలె ఇచట గూడా సరస్వతీ నది అంతర్వాహిణిగా నున్నదని అంటారు. కాలుడు శివుడి కోసం తపస్సు చేయగా శివుడు సాక్షాత్కరించి అతని ప్రక్కనే వెలసి పూజలందుకునేలా వరమిచ్చినాడని, అందుకే కాలుడు ముక్తీశ్వరలింగము ప్రక్కనే ఒకే పానవట్టముపై లింగరూపమున అవతరించుటచే ఇది కాళేశ్వరంగా ప్రసిద్ధి చెందింది. కాళేశ్వరుని ముందుగా పూజించి తరువాత ముక్తీశ్వరుని పూజిస్తే ముక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసము. పురాణములలోను సాహితీ గ్రంథములందును కాళేశ్వరము ప్రస్తావన విశేషంగా ఉంది.

కాళేశ్వరంలో పద్మాసనములో నుండి హస్తములను ధ్యానముద్రలో నిలిపిన చిన్న జైన తీర్థంకరుని విగ్రహమొకటి యుండుట వలన ఇది పూర్వము నుండియే జైన, శైవ క్షేత్రంగా విరాజిల్లెనని అవగతమవుతుంది. కరీంనగర్ జిల్లాలో గోదావరినది దక్షిణ తీరమందున్న ధర్మపురి, కోటిలింగాల, మంత్రకూటము (మంథని) కాళేశ్వరములాంటి ప్రదేశములు తొలి శతాబ్దముల నుండియే మహాక్షేత్రములుగా విరాజిల్లినాయి. పవిత్ర గోదావరినది తటమున నుండుటయే ఇందులకు కారణము కావచ్చు. శాతవాహనుల తొలి రాజధానిగా వెలసిన కోటిలింగాలలోని పెక్కు అవశేషాలే దీనికి తార్కాణం. కాళేశ్వరము ప్రక్కనుండి ప్రవహించు గోదావరిలో బ్రహ్మతీర్థం, పిచ్చుకతీర్థం, జ్ఞానతీర్థం, వాయసతీర్థం, సంగమతీర్థం, నరసింహతీర్థం, హన్మత్‌తీర్థం, వ్యాసతీర్థం అనే అష్టతీర్థాలున్నాయి. కాళేశ్వరంలోని ప్రతివీధిలో శిథిలావస్థలో నున్న దేవాలయాలు, నాటి శిల్పాలే దర్శనమిస్తాయి. ఇచట బయల్పడిన వివిధ కాలములకు చెందిన అనేక శిల్పాలు అద్భుతమైన కళతో అలరారుతుంటాయి.

శైవాగమముల సుప్రసిద్ధ పండితుడు రామారణ్య శ్రీపాదుడు లేదా రామేశ్వర దీక్షితుడు గోదావరి తటమున నున్న కాళేశ్వరమందు స్థిరపడెనని తెలుస్తుంది[100]. కాకతీయ రెండవ ప్రోలరాజు మతగురువైన ఇతడు అనేక శివాలయములను, శైవమఠములను నిర్మింపజేశాడు. కాళేశ్వరములోని దేవాలయమును అతడే నిర్మించి ఉంటాడు. సబ్బినాడుకు రాజధానిగా వెలసిన నగరూరు (నగునూరు) పాలకుడు (Governor) నూ కాకతి రుద్రదేవుని మంత్రియైన వెల్లకి గంగాధరుడు క్రీ.శ.1171లో వేయించిన నగునూరు శాసనము ప్రస్తుతము కరీంనగరము జిల్లా కలెక్టర్ నివాసభవనము ఆవరణలో నిలుపబడి ఉంది. గంగాధరుడు కాళేశ్వరమందు, తదితర ప్రదేశములందు దేవాలయములు నిర్మించెనని ఈ శాసనము తెలుపుతుంది[101]. హనుమకొండలోని

క్రొత్త బసుస్టేషన్ (New Bus Stand) దగ్గర నున్న చెఱువు కట్టపై బయల్పడిన మంత్రి వెల్లకి గంగాధరుని శిథిలశాసనమొకటి అచటి పోస్ట్‌గ్రాడ్యువేట్ కేంద్రం (P.G.Centre) లో భద్రపరచబడింది[102]. ఈ శాసనములో గంగాధరుడు గోదావరి, ప్రాణహిత నదుల సంగమస్థానమున అనగా కాళేశ్వరము నందు మురారి, శంకర దైవములను ప్రతిష్ఠించెనని పేర్కొనబడింది.

కాకతి గణపతి దేవచక్రవర్తి మతగురువైన పాశుపత శైవాచార్యుడు విశ్వేశ్వర శివుడు కాళేశ్వరము వద్ద ఉపలమఠమను శైవ మఠమును స్థాపించి దాని నిర్వహణకై తానే రూపొందించిన బ్రాహ్మణుల అగ్రహారమగు పొన్న గ్రామమును దానముగా ఇచ్చాడు[103]. గోళకి మఠమునకు చెందిన ఈ విశ్వేశ్వర శివాచార్యుడు కాళేశ్వరము, మంత్రకూటము, చంద్రవల్లి, కొమ్మూరు, ఏలేశ్వరం, సంగమేశ్వరం మున్నగు ప్రదేశములందు శివాలయములను, మఠములను కట్టించెనని తెలుస్తుంది[104]. కాళేశ్వరమందున్న కాకతి గణపతి దేవుని కాలపు తేది లేని శాసనమునందు విశ్వేశ్వర శివాచార్యుడు, అతని ఆధ్యాత్మిక మానసపుత్రుడు (Spiritual son) ధర్మ శివాచార్యుడు కాళేశ్వరమునందు ఒక శివాలయము నిర్మించి భూదానములొసంగినట్లు తెలుపబడింది. ఈ శాసనమందు మంథనవటి, ఊటుపల్లి, చెన్నూరు గ్రామములు గూడా పేర్కొనబడినాయి[105]. కాకతీయ చక్రవర్తి మహాదేవుని కుమార్తె కుందమాంబ కాళేశ్వరములో అర్ధనారీశ్వరుని దేవాలయము కట్టించెనని వరంగల్ జిల్లాలోని నిడిగొండ (Nidigonda) లో గల క్రీ.శ. 1219 గణపతి దేవ చక్రవర్తి కాలపు శాసనం తెలుపుతుంది[106].

శకసంవత్సరము 1319 ఈశ్వర చైత్రశుద్ధ పాడ్యమి సౌమ్యస్యవారము (Wednesday) నూతన వత్సరాది పర్వదినమున సరియగు తేది క్రీ.శ. 1397 ఫిబ్రవరి 28న గౌతమీ (గోదావరి) తటముననున్న ముక్తీశ్వర దేవరకు విజయ నగరాధీశుడైన రెండవ హరిహరరాయల తనయుడు మొదటి దేవరాయలు తులాపురుష దానమిచ్చాడు[107]. అతడు పొందిన విజయములకు సూచకముగా సంస్కృతము నందు ఈ ఆరు పంక్తుల శాసనము మంటప స్తంభముపై వేయించాడు. హిందూ ధర్మశాస్త్రములు తెలుపునట్లుగా షోడశ మహాదానములలో తులా పురుష దానమొకటి. రాజన్యులు ధనికులు తమ బరువునకు సమామైన బరువు గల సువర్ణదానము చేసేవారు. అదే సంప్రదాయములో సామాన్యులిప్పుడు తమ ఎత్తు బరువు గల ధాన్యమును, బెల్లము లేదా చక్కెరను తులాభారముగా నొసంగు ఆచారముంది.


మంటప స్తంభముపై ఒకానొక భక్తుడు చెక్కించిన తేదీ లేని చిన్న శాసనము (Label inscription) ఉంది. ముక్తీశ్వర భక్తుడైన యల్లాబట్టు పుత్రుడు రామభక్తుడు యువ భాద్రపద శుద్ధ ద్వాదశి గురువారము రోజున వేయించిన శాసనమిది. ఎలాంటి వివరములు ఇందులో లేవు[108]. ఇంకొక చిన్న శాసనము (Label inscription) 16వ, 17వ శతాబ్దపు లిపి లక్షణములతో ధ్వజస్తంభముపై చెక్కబడింది[109]. యువ సంవత్సర చైత్ర శుద్ధ దశమి సోమవారము రోజున




కాళేశ్వరములోని ముక్తీశ్వరునకు వాలడు తిదురోజు కుమారుండైన బాలోజు నందికంభం (Nandi Pillar) ను సమర్పించెనని ఈ శాసనం తెలుపుతుంది.

పైన పేర్కొనిన శాసనాధారములే గాకుండా మట్టికోట గోడలు, రాతితో కట్టిన బురుజులు ఈ ప్రాంతము మధ్యయుగములో ప్రాధాన్యతను వహించెనని తెలుపుచున్నాయి. గోలకొండ సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్‌షా తన రెండవ కూతరును ఔరంగజేబు కుమారుడైన ముహమ్మద్ రాకుమారునకిచ్చి వివాహము చేయు సందర్భములో రామగిరి దుర్గమును దాని పరిసర ప్రాంతములను క్రీ.శ. 1656లో వరకట్నము క్రింద మొగలులకు ధారాదత్తము చేశాడు. తత్ఫలితంగా కాళేశ్వర ప్రాంతంపై గూడా మొగలులకు అధికారము దొరికింది. ఔరంగజేబు ఇచట నివసించిన కాలమున మహదేవ్‌పూర్ తాలుకాలోని కాళేశ్వరము మరియు సోనిపేట్‌లందు మసీదుల నిర్మాణము గావించినట్లు తెలుస్తుంది[110]. కాళేశ్వరములోని ప్రధాన ముక్తీశ్వర దేవాలయమునకు వాయువ్యమున కొంత దూరములో శిథిల దేవాలయ శిలలతో నిర్మింపబడిన మసీదు ఔరంగజేబు కాలముద్దై ఉంటుంది. ఆ తరువాతనే ఆచటి వీధి మసీదుపల్లిగా ఏర్పడింది.

1975 కంటే పూర్వము రోడు రవాణా సౌకర్యములు లేక కీకారణ్యములో నున్న ఈ క్షేత్రము కనీస వసతులు లేక కాలినడకన వాగులు, వంకలు దాటుతూ భక్తులు సాహసయాత్రే చేసేవారు. చాళుక్యుల కాలములోని ఇచటి దేవాలయమును పన్నెండవ శతాబ్దపు ప్రథమార్థములో కాకతీయులు పునరుద్ధరించిన అనంతరం దీని అభివృద్ధికి ఎలాంటి ప్రయత్నము జరుగలేదు. క్రీ.శ. 1976లో అప్పటి అమాత్యులుగా నుండిన కీ.శే. జువ్వాడి చొక్కారావు ఒక కమిటిని ఏర్పరచి జీర్ణోద్ధరణకై నిధులు మంజూరు చేయించాడు. 1982 లో జగద్గురు శంకరాచార్యులు విగ్రహ పునఃప్రతిష్ఠ చేశారు. బి.టి. రోడ్ల నిర్మాణముతో రవాణా సౌకర్యములు పెరిగి యాత్రికులు అధిక సంఖ్యలో ఇచటి ఆలయమును దర్శించుచున్నారు. నాడు ఏడాదికి రూ. 500 మాత్రమే ఆదాయముండిన దేవాలయము నేడు రూ. 20 లక్షల ఆదాయంతో భక్తుల సందడితో కళకళలాడుచున్నది.



దేవాలయము




కాళేశ్వరుడు-ముక్తేశ్వరుడు


కాళేశ్వరములో అనేక శిథిలాలయములున్నాయి. సంగమమందు గల సంగమేశ్వర ఆలయము, అరణ్యములోనున్న ఆదిముక్తీశ్వరాలయము, చంద్రశేఖరాలయము శిథిలమైన దేవాలయములలో ముఖ్యమైనవి. కాళేశ్వర, ముక్తీశ్వర దేవాలయమే ఇచటి ప్రధాన పూజా మందిరం.

## కాళేశ్వర, ముక్తీశ్వర దేవాలయము

ఒకే పానవట్టముపై కాలుడు, శివుడు ఇరువురు రెండు లింగరూపములలో ప్రతిష్ఠింపబడుట ఈ దేవాలయ ప్రత్యేకత. ముక్తీశ్వర లింగమునకు రెండు నాసికారంధ్రము ఉన్నాయి. ఈ రంధ్రాలలో (Nostrils) ఎంత నీరు లేదా పాలు పోసినా బయటకు రాకుండా అంతర్వాహిని గుండా గోదావరిలో కలుస్తాయని ప్రతీతి. అందుకే దీనిని త్రివేణి సంగమమని పిలుస్తారు. లింగము ఉపరితలముపై గల ఈ రెండు నాసికా రంధ్రములలో ఎన్ని పాలు పోసినా, ఎంత నీరు పోసినా అవి పూర్తిగా నిండక పోవడము ఒక విశేషంగా నేడు తిలకింపవచ్చు.



జీర్ణోద్ధరణకు పూర్వము (1975)



జీర్ణోద్ధరణ తరువాత

సనాతన దేవాలయముండిన చోటనే 1976-1982 మధ్యకాలములో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నూతనముగా దేవాలయమును సంపూర్ణముగా పునఃనిర్మాణము గావించింది. ప్రస్తుతమగబడునదంతయు క్రొత్త నిర్మాణమే. గర్భగృహములో ప్రతిష్ఠింపబడిన కాళేశ్వర, ముక్తీశ్వర లింగములు గల పానవట్టము మాత్రము పాతది. ఈ ఆలయము యొక్క జీర్ణోద్ధరణ కార్యక్రమము చేపట్టుటకు పూర్వము తీయబడిన ఫోటో ఒకటి దేవాలయ కార్యాలయమందుంది. దానిని తిలకించినచో తూర్పు ముఖమును కలిగి ఉన్న ఈ దేవాలయపు శిఖరము మెట్లతో గూడిన పిరమిడ్ ఆకారంలో ఉండేది. స్తంభములతో గూడిన మంటపము పైకప్పు (terrace) చదునుగా నుండి చుట్టు నాలుగు వైపుల పిట్టగోడ (Parapet wall) ను కలిగి ఉండేది. శిఖరము ఈ పిట్టగోడల మధ్యన కనబడుతుంది. (The spire appears within the parapeted terrace) ఈ ఆలయము ముందున్న ఎత్తైన స్తంభముపై గల చిన్న మంటపములో (Miniature Mandapa)




నంది ప్రతిష్ఠింపబడింది. పూర్వపు దేవాలయమునకు ఉత్తరమునందుండిన చిన్న దేవాలయములో అన్నపూర్ణ విగ్రహముండెనని, అదే విధముగా దక్షిణమునందుండిన దేవాలయములో ప్రౌఢ సరస్వతి విగ్రహముండేదని తెలుపబడింది. దేవాలయ ప్రాంగణమును ప్రవేశించుటకు సమతలమైన పైకప్పుతో (Flat roofed gateway) గూడిన పెద్ద ప్రవేశద్వారముండేది. ఈ ప్రవేశమున కిరువైపుల నుండిన శిథిలమైన ప్రహారీగోడలు ఫోటోలో కనిపిస్తున్నాయి.

### ప్రతిమాశిల్పములు

ముక్తీశ్వర దేవాలయము బయట దక్షిణ ప్రాకారపు గోడ ప్రక్కకు రెండు వరుసలలో విడి శిల్పములనేకములు పెట్టబడిఉన్నాయి. అనేక అమూల్యమైన చిత్ర శిల్పములలో నర్తకీమణులు, వేటకాళ్లు, ధనుర్ధారులు, గరుడ, మిథున మున్నగు మనోహర చిత్రశిల్పములగబడుతాయి. అర్జునుని మత్స్య యంత్రము, గోపికావస్త్రాపహరణము, మయూరము పై స్వారి చేయు స్కందుడు, తొండమును పైకెత్తిన గజముపై వెనక నుండి లంఘించుచున్న సింహము, అంజలి ఘటించుచున్న స్త్రీ, పురుషుల రూపములు మున్నగునవన్నియు చూడముచ్చటగానున్నాయి. ఊర్ధ్వభాగము మానవాకృతిలో, అధోభాగము సర్పరూపములో నున్న నాగ, నాగినీ విగ్రహములు పొలాసలోని నాగిని రూపములను బోలి ఉన్నాయి. ఇచట పడియున్న శిల్పములన్నియు ఎర్ర ఇసుకరాయితో మలచబడినవి. పదకొండవ, పన్నెండవ శతాబ్దపు ఈ శిల్పములలో కొన్నింటిని ఉదహరించుట ఆవశ్యకము.

### అన్నపూర్ణ

కాశీవిశ్వేశ్వరుని అర్ధాంగి అన్నపూర్ణ ప్రతిమ ద్విహస్తములతో ఉంది. కూర్చొని యున్న దేవి ఒకచేత ప్రసాదపాత్ర లేదా కుండను (Vessel) పట్టుకొని మరియొక చేత తెడ్డు (Ladle) తో అన్నమును బయటకు తీయుచున్నట్లున్నది. ఆమె వజ్ర కిరీటము, విలువైన రాళ్లతో పొదిగిన కర్ణకుండలములు, గ్రైవేయకము ధరించినట్లు చక్కగా మలచబడింది. ఆమె లావైన స్తనములు క్షీరభారముచే క్రిందికి వంగినట్లు అందముగా చెక్కబడినాయి. ఆమె కేయూరములు, కంకణములు, వనమాలను ధరించి ఉంది. శిలాఫలకముపై ఉబ్బుగా (Bold relief) చెక్కబడిన బహుసుందరమైన అర్ధశిల్ప ప్రతిమ ఇది.



అన్నపూర్ణ



చతుర్ముఖలింగము



మత్స్యయంత్రము

**2. అన్నపూర్ణ** :- ఇది మొదటి దాని కంటే చిన్నగా నున్న రూపము. పాలాసలోని అన్నపూర్ణవలె ఇది చతుర్బాహువులతో ఉంది. పై హస్తములందు డమరుకము త్రిశూలములుండగా, క్రింది హస్తములతో కుండను (ప్రసాదపాత్ర) పట్టుకొని తెడ్డుతో అన్నమును బయటకు తీయుచున్నది. ఆమె కిరీటము హొయసలశిల్ప ప్రభావమును చూపుచున్నది.[111]

**3. గణపతి** :- బాగా అతిగిపోయిన ఈ గణపతి విగ్రహము మకుటము లేకుండా ఏనుగు తలతో ద్విహస్తములను కలిగి ఉంది.

**4. గణపతి** :- ఎర్ర ఇసుక రాతితో చెక్కబడిన ఈ విగ్రహము 3' అడుగుల ఎత్తుతో చతుర్బాహువులు కలిగి ఉంది. కరండ మకుటము ధరించిన గణపతికి నాగసర్పము ఉదరబంధంగా ఉంది.

**5. మత్స్యావతారము**

నల్ల గ్రానైట్ రాయితో మలచబడిన పెద్ద చేపరూపము 8' అడుగుల పొడువు 2½ అడుగుల ఎత్తుతో నోటిని తెరచి ఉంది. ప్రహారి గోడనానుకొని లోపలివైపు వరుసగా కట్టబడిన నడవ (Corridor) లో ఇది నిలుపబడింది.

**6. చతుర్ముఖలింగము**

నల్లసరపురాయి (Basalt) తో చేయబడిన లింగమునకు నాలుగువైపుల నాలుగు శివుని తలలున్నాయి. లింగము యొక్క ఉపరితలము చదునుగా ఉంది. ముక్తీశ్వరాలయ ప్రాంగణములో ఇది నిలుపబడింది. నిగనిగలాడే నున్నటి చెక్కడము (Smooth Polish) ను బట్టి ఓరుగల్లు కోటలోని శిథిలమైన స్వయంభూ దేవాలయపు చతుర్ముఖలింగమును ఇది బోలి ఉంది. స్వయంభూ దేవాలయపు చతుర్ముఖ లింగము ప్రస్తుతము శంభుని గుడి ఆవరణలో దర్శనమిస్తుంది. ఇలాంటి చతుర్ముఖ లింగమొకటి కాళహస్తి లోని మానికేశ్వర దేవాలయమందుంది[112].

**7. సూర్యుడు**

ఇది నల్లసరపురాతితో (Basalt) మలచబడిన 4'-6" అడుగుల ఎత్తున్న అందమైన కాకతీయ శిల్పము. నిగనిగలాడే నునుపుతో ప్రశస్తమైన ఆభరణభారము (well polished and exquisitely ornamented) తో నున్న రూపము వెనుక మకరతోరణము, పీఠమున ఏడు అశ్వములు అందముగా చెక్కబడినాయి. సూర్యుడు కిరీటమకుటము, కర్ణకుండలములు, కేయూరములు, ముంజేతి కడియములు, కాలికడియములు, పాదములకు నూపురములు మున్నగు ఆభరణములతో శోభిల్లుచున్నాడు. అతనికి ఉన్న రెండు భుజములు మోచేతి నుండి విరిగి ఉన్నాయి. అర్థోరుకము, వనమాల ధరించిన సూర్యుని కిరువైపుల చామరధారిణులు, విల్లంబులు ధరించిన స్త్రీలు అందముగా మలచబడినారు.

**8. విష్ణువు**

సాధారణ ఆభరణములనన్నింటిని ధరించి మూడు అడుగుల ఎత్తున్న ఈ విగ్రహము



వెనుక మకరతోరణము ఉంది. ఈ దేవరకు కుడివైపున పాదముల వద్ద అంజలి ముద్రలో గరుడశిల్పము బహుసుందరంగా ఉంది.

**9. లింగములు**

దేవాలయ ఆవరణలో బయట వివిధ పరిమాణములలో నున్న అనేక లింగములున్నాయి. కాకతీయుల కాలములో నల్లసరపురాయితో మలచబడిన నునుపైన పెద్ద లింగములు ఎనిమిది అడుగుల చుట్టుకొలతను కలిగి యుండుట విశేషం.

**10. నంది విగ్రహములు** :- చాళుక్యుల, కాకతీయుల కళారీతులలో వివిధ పరిమాణములలో గల అనేక నంది విగ్రహాలున్నాయి.

**11. ద్వారపాలకుడు**

ఎర్ర ఇసుకరాయి (Red Sandstone) తో ఆరు అడుగుల ఎత్తు గల ద్వారపాలక విగ్రహము మలచబడింది. చతుర్బాహువులు గల ఈ ద్వారపాలుని పైకుడి చేతిలో డమరుకము, ఎడమచేతిలో ఖట్వాంగము, క్రింది కుడిహస్తములో గద యుండగా ఎడమహస్తము గద పిడిపై నిలుపబడింది. ద్వారపాలుడు మకుటము, గ్రైవేయకములు, యజ్ఞోపవీతము, మోచేతి, ముంజేతి, కాలి కడియములు, నూపురములు మున్నగు ఆభరణములు ధరించి మెడలో కపాలముల హారము వేసికొని ఉన్నాడు. ఈ హారము వనమాల వలె అగబడుతుంది. ఈ అర్ధశిల్పము ఒక పెద్ద శిలాఫలకముపై ఉబ్బుగా (Bold relief) మలచబడింది. ఇలాంటి మరియొక ద్వారపాలుని విగ్రహము అచటనే నిలిచి ఉంది.

## 21. నగునూరు

కరీంనగర్‌కు ఉత్తరమున 8 కి.మీ. దూరములో నున్న గ్రామమే నగునూరు. శిథిలమైన దేవాలయములు, అంగఛేదములైన విగ్రహములు (Mutilated images) అనేక చిన్న పెద్ద శిలాశాసనములు ఇచటి పూర్వపు ప్రాభవ వైభవములను తెలుపుతాయి. శిలాశాసనములందు ఈ గ్రామము నగరూరు (Nagaruru) అని పేర్కొనబడింది. ఆనాడు రాజధానిగా వెలసిన నగరూరు నేడు నగునూరుగా పిలువబడుతుంది. నగునూరు ఆనాడు ఒక రాజధాని నగరముగా సుప్రసిద్ధము. నేడు ప్రతిమా ఆసుపత్రి కేంద్రంగా సుప్రసిద్ధము. వేములవాడ చాళుక్యుల, కళ్యాణి చాళుక్యుల, కాకతీయుల కాలములో ఎనిమిదవ శతాబ్దము నుండి పన్నెండవ శతాబ్దము మట్టుకు నాలుగు శతాబ్దములు నగునూరు రాజకీయ, ధార్మిక, మతపరమైన వివిధ కార్యక్రమముల కేంద్రంగా విరాజిల్లింది. గ్రామము చుట్టూ ఉండిన పురాతన మట్టికోట గోడల ఆనవాళ్లు అక్కడక్కడ నేటికీ కనిపించటం విశేషం.

క్రీ.శ. 946 నాటి నగునూరు తొలి శిలాశాసనమొకటి కరీంనగర్ మ్యూజియంలో ఉంది.[112] ఈ శాసనమును వేములవాడ రాజ్యపాలకుడగు రెండవ అరికేసరి శకసంవత్సరము

869 పరాభవ కార్తీక బహుళ ఏకాదశి సోమవారము నాడు కౌశిక గోత్రోద్భవుడును, నూతులపాడు గ్రామనివాసియు, విష్ణుభట్టుని పౌత్రుడును, అప్పనయ్య పుత్రుడునునగు ధారపయ్య అను విప్రునకు అరిపినపల్లి గ్రామమున యాభై మఱ్తుల్ల నీరు నేలను దానమిచ్చు సందర్భమున వేయించాడు. ఇది నాలుగువైపుల చెక్కబడిన కన్నడ శిలాశాసనం. శిలాశాసనపు మూడవ ప్రక్కన చెక్కబడిన 20వ పంక్తిలో ఈ గ్రామనామము 'నగరూరు' గా పేర్కొనబడింది.

కళ్యాణి చాళుక్యుల కాలములో గూడా సబ్బినాడులోని వేములవాడ, పొలవాస (Polas), మంత్రకూటము (Manthani) వలె నగరూరు (Nagaruru) రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్న నగరము. నగునూరులోని బీరన్న గుడి వద్ద గల శిలాశాసనము శక సంవత్సరము 1035 నందన పౌష్య శుద్ధ పంచమి సోమవారం సరియగు తేది క్రీ.శ. 1112 డిసెంబర్ 25న నగునూరు మహామండలేశ్వరుడైన పండరసర్ (పండరాజు) రవ్వీశ్వర దేవాలయమును కట్టించి చెఱువు క్రింద సాగుచేయబడు భూములను దాన మొసంగినట్లు తెలుపుతుంది[113]. నగునూరులోని నక్కలగుడి వద్ద పడియున్న వీరగల్లుల అడుగుభాగమున చెక్కబడిన చిన్నశాసనములు (Label inscriptions) కెలన్, నారప్పతి, సంగమ మున్నగు మహాయోధులు దొమ్మరాజు పక్షమున పోరాడి శత్రువులను చంపి గెలుపొందిరని తెలుపుచున్నాయి[114]. ఇంకొక లేబెల్ శాసనము చాళుక్య విక్రమశకములో చెక్కబడింది. కాని వివరములు స్పష్టముగా లేవు. దీనిలో చెక్కబడిన ప్రమాది సంవత్సరము క్రీ.శ. 1159కి సరిపోతుంది. ఈ లేబెల్ శాసనమందు ప్రమాది వైశాఖ బహుళ అమావాస్య శుక్రవారము రోజున మేదరాజు, జగ్గదేవుడు 80 వేల సైన్యముతో పొడిచి గెలిచెయని పేర్కొనబడింది[115]. ఈ లేబెల్ శాసనమును బట్టి తొలిదశలో పొలవాస రెండవ మేదరాజు, అతని కుమారుడు రెండవ జగ్గదేవుడు 80వేల సైన్యముతో శత్రువు నెదిరించి విజయము పొందిరని తెలుస్తుంది. కాని ఆ శత్రువు పేరు శాసనమందులేదు. ఆ శత్రువు కాకతి రుద్రదేవుడు తప్ప అన్యులు కావడానికి ఆస్కారము లేదు. కాని తదనంతరము మహాయోధుడైన కాకతి రుద్రదేవుడు నగునూరు దొమ్మరాజును, పొలవాస రెండవ మేదరాజును, కళ్యాణి సేనాని మైలిగి దేవుని ముగ్గురి మిత్రకూటమిని క్రీ.శ. 1159లో చిత్తుగా ఓడించినట్లు హనుమకొండలోని వేయిస్తంభాల గుడి శాసనములో పేర్కొనబడింది[116]. క్రీ.శ.1159లో విజయము పొందిన కాకతి రుద్రేవుడు సబ్బినాడునంతయు (నేటి కరీంనగరము జిల్లా) నగునూరుతో సహా తన రాజ్యములో కలుపుకొన్నాడు. కాకతి రుద్రదేవుడు తన మంత్రియైన వెల్లకి గంగాధరుని నగనూరు రాజధానియందు సబ్బినాడు పాలకునిగా (Governor) నియమించాడు.

శక సంవత్సరము 1092 వికృతి మాఘశుద్ధ పంచమి బుధవారము సరియగు తేది క్రీ.శ.1171 జనవరి 13న కాకతిరుద్రదేవుని మంత్రి, నగునూరు పాలకుడైన వెల్లకి గంగాధరుడు వేయించిన నగునూరు శిలాస్తంభ తెలుగుశాసనము నేడు కరీంనగర్ జిల్లా కలెక్టర్ బంగ్లాలో ఉంది[117]. వెల్లకి గంగాధరుడు బ్రాహ్మణులకు దిండొంట గ్రామమును అగ్రహారముగా నొసంగినట్లు



మరియు నగునూరులో త్రికూట దేవాలయమును పరమశివునికై కట్టించినట్లు ఈ శాసనంలో ఉంది. ఇతడు అనుమకొండ, హిడింబాచలము, నగరూరు, మంత్రకూటము మొదలగు చోట్ల దేవాలయములు కట్టించినట్లు ఇందులో పేర్కొనబడింది. ఈ శాసనములో సప్తసంతానములు పేర్కొనబడుట విశేషం. తను పెంచిన సంతానము (పెంపుడుకొడుకు) తన సంతానము (స్వంతకొడుకు) కృతి (కావ్యము) అగ్రహారము, వనము, చెఱువు, గుడి జనవినుతములైన సప్త సంతానములుగా ఈ శాసనమందు తెలుపబడినాయి.

నగునూరు గ్రామములో పురావస్తుశాఖ దృష్టికి రాని అముద్రిత శాసనమొకటి రామలింగాల గుడిశాసనముగా స్థానికులచే పేర్కొనబడింది. దాదాపు రెండు దశాబ్దాల పూర్వము నగునూరు దేవాలయములపై పరిశోధన జరుపు సమయమున అచటి పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేయుచుండిన కె. మల్లయ్య గారి నుండి 1983 డిసెంబర్ 24 రోజున సేకరించిన అముద్రిత తెలుగు శాసనము పాఠకుల ప్రయోజనార్థమై ఈ క్రింద పేర్కొనబడింది[118]. ఇది తేది లేని అసంపూర్ణ శాసనము. ఇది కాకతి రుద్రదేవుని లేదా రుద్రమదేవి కాలమునకు చెందినదై ఉంటుంది. పురుషవేషము ధరించి పాలన చేసిన రుద్రమదేవి శాసనములందు రుద్రదేవునిగా పేర్కొనబడిన ఉదంతములున్నాయి. ఈ శాసనమునందు గ్రామనామము నగరూరుగా పేర్కొనబడింది. రామనాథదేవరకు పూలమాలలు తయారు చేయు మాలకారుల జీతములకై నగరూరు గ్రామములోని బ్రాహ్మణగడ్డ వద్ద గల పొలము దానముగా నొసంగబడినట్లు ఈ శాసనమందుంది. ఇందులోని కొన్ని చెఱువుల పేర్లు తెలియుటలేదు.

## రామలింగాలగుడి అముద్రిత శాసనము-నగునూరు


| | |
|---|---|
| స్వస్తిశ్రీ మనుమహా | విలిచి ఇచ్చిన పొలము |
| మండలేశ్వర కాకతి | చింతల చెఱ్వరొంబచే |
| య్య రుద్రదేవ మహా | ల రామేశ్వని పద్దె వారి |
| రాజుల ధర్మము 11 తడా | డి అడ్డ । అండముడ చెర |
| రి రామనాథని పూమం(డి) | గుండలి అడ్డ । ఆండ ఆ |
| సేసె మాలాకారుల జీ | తోట అతిథి వాంగు పొడు |
| తాలకు నగరూరి నగర | గు ........... |
| ము బ్రాహ్మణగడ్డ వ్రిత్తి | బ్రహ్మలదవి చెఱ్న బా . . . |

కాకతి గణపతి దేవుని కాలపు క్రీ.శ. 1228 నగునూరు శాసనమందు నిజరంగాల మల్లిశెట్టి మరియు అతని కుమారుడు వెన్నిశెట్టి సాలీయల పక్షమున సాలేశ్వర, గణపతిదేవ మహారాజు పేరట గణపతీశ్వర, భక్తులందరి పక్షాన సకలేశ్వర దేవాలయములు కట్టించినట్లు తెలుపబడింది.[119] కొన్ని శిలాశాసనస్తంభములు స్థానికముగా గృహనిర్మాణములకై ఉపయోగించుట

దురదృష్టకరము. గణపతి దేవుని కాలపు శాసనమొకటి కె.మల్లయ్య గారి ఇంటికి సమీపమున గల ఒక గృహపు కట్టడములో వినియోగించుట గమనార్హము.

శిలాశాసనములే గాకుండా కాకతీయ గణపతి దేవచక్రవర్తి శక సంవత్సరము పరాభవ పుష్యశుద్ధ షష్ఠి శనివారము సరియగు తేది క్రీ.శ. 1246 డిసెంబర్ 15న వేయించిన తామ్రపత్ర శాసనము (Copper plates) చామన్‌పెల్లి గ్రామపు గొనుగుకాలువ అచటి బ్రాహ్మణులకే చెందునను తీర్మానమును తెలుపుతుంది[120]. ఈ శాసనములో చామన్‌పెల్లి, కుమ్మరికుంట, దేవనపల్లి, కాట్యకోలపల్లి (కాట్నెపెల్లి) గ్రామముల పేర్లున్నాయి. గొనుగుకాలువ గల చామన్‌పెల్లి గ్రామము నగునూరుకు కేవలము 6 కి.మీ. దూరంలో ఉంది. మహారాజా అక్షయ చంద్రదేవుడు ఈ ప్రాంతపు సామంతరాజుగా పేర్కొన బడినాడు. నగునూరు రాజధానిగా గల సబ్బినాడును పదమూడవ శతాబ్దపు మధ్యభాగమున గణపతి దేవుని సామంతుడైన అక్షయ చంద్ర దేవుడు ఏలినట్లు ఈ శాసనమును బట్టి విదితమవుతుంది.

కళ్యాణి చాళుక్యుల, కాకతీయుల కాలములో రాజధానిగా విరాజిల్లిన నగునూరు నేడొక కుగ్రామముగా మిగిలిపోయింది. ఇచట నున్న అనేక సుందరదేవాలయములు, అద్భుత శిల్పములు పూర్వకాలపు వైభవమును చాటుచున్నాయి. మహోన్నత శిల్ప కళారీతులను చాటు ఇచటి దేవాలయములు 12, 13 శతాబ్దములకు చెందిన కాకతీయ కట్టడములు, పది, పదకొండవ శతాబ్దములకు సంబంధించిన దేవాలయముల శిథిలాలు, అవశేషాలు పెక్కు గ్రామమంతటా చూడవచ్చు. నగునూరు ఒక జైన మతకేంద్రమై యుండెననుటకు అచటగల ఒక పెద్ద గుండ్రాయిపై కాయోత్సర్గలో నున్న జైన ప్రతిమయే తార్కాణము. దాదాపు ఇచటి దేవాలయములన్నియు స్థానికంగా లభ్యమగు ఎర్ర ఇసుకరాతితో నిర్మింపబడినవేయని చెప్పవచ్చు. నగునూరు పరిసరములందున్న స్థానిక గుట్టలరాయి చాలా నాణ్యమైంది, అమూల్యమైంది గనుకనే నేడు ఇచటి రాయి కొరియా, జపాన్‌లాంటి దేశములకు అమితంగా ఎగుమతి యగుచున్నది.



ప్రధాన త్రికూటాలయము




గరుడస్తంభము




## 1. ప్రధాన త్రికూటాలయము

ఈ దేవాలయము నక్షత్రాకార పథకమును (Cruciform plan) కలిగి ఉంది. మధ్యనున్న ముఖమంటపమునకు తూర్పు,పడమర,దక్షిణములందు మూడు గర్భగృహములుండి ఉత్తరముఖమును కలిగి ఉంది. ఈ త్రికూటాలయము ఉపపీఠముపై నిలిచి ఉండుట వలన ఎత్తుపై ఉంది. ఉపపీఠము అనేక వర్గములను (Mouldings) అడ్డముగా (horizontally) కలిగి ఉండి దేవాలయము చుట్టూ ప్రదక్షిణా పథముగా తోడ్పడుతుంది. మహాపట్టిక, పట్టిక, పద్మము, త్రిపట్టిక వర్గములోని ప్రధానమలుపులు. ఇలాంటి అమరిక గల వర్గములు అనేకములు ఉపపీఠమునకు శోభతోపాటు ఉన్నతి (height) ని సమకూర్చినాయి. కొన్ని పట్టికలు అర్ధచంద్రాకారగోళములతో అలంకరింపబడినాయి. ఉపపీఠమున నున్న వర్గము (Mouldings) మలుపుల రూపములు అధిష్ఠానము నందు గూడా అగబడుతాయి. కాకతీయుల దేవాలయములలో ఉపపీఠము, అధిష్ఠానము రెండును వర్గములతో (Horizontal Mouldings) అలంకరింపబడుట సర్వసాధారణము. అధిష్ఠానముపైన లేచిన గోడలు పెద్ద చిన్న కుడ్యస్తంభముల (Broad and narrow pilasters) తో అలంకరింపబడినాయి. పెద్ద కుడ్యస్తంభమున కిరువైపుల మడతలు (Broad pilaster with folds on either side) ఉన్నాయి. శిఖరాన్ని మోస్తున్న సన్నని కుడ్యస్తంభములు (Narrow pilasters surmounted by turrets are sculptured in the recesses) వంపులలో అమర్చబడినాయి. కొన్ని సందర్భములలో ఈ సన్నని కుడ్యస్తంభములు కీర్తి ముఖములతో గూడిన ఛత్రము (Arched canopy with a kirtimukha at the top) లతో కలుపబడినాయి. గోడలపై నున్న కపోతము రెండు వరుసలలో ఉంది. మూడు గర్భగృహములపై నుండిన శిఖరములు నేడు లేవు. కాని పైకప్పుకై అమర్చిన పెద్ద పెద్ద పొడుగైన శిలలను ఇప్పటికీ (Large blocks of stone) చూడవచ్చు.



దక్షిణ ఆలయము



గోడల వివరములు

ఉత్తర దిశనుండి ఎనిమిది మెట్లెక్కినచో 24'-4" చతురస్రాకార మంటపమును జేరవచ్చు. ప్రవేశ మంటపము (Porch) పూర్తిగా కూలిపోయింది. మంటప ప్రవేశద్వారము ఐదు లేదా